Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:57 • సంచిక:289 • ఆదివారం 3 ఫిబ్రవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 6.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, పుష్యమాసం;
తిథి: బహుళ చతుర్దశి, రా.11.07 వరకు అనంతరం
అమావాస్య; నక్షత్రం: ఉత్తరాషాఢ రా.2.28 వరకు,
అనంతరం శ్రవణం; అమృతకాలం: రా.7.40 నుండి
9.25 వరకు; వర్జ్యం: ఉ.8.59 నుండి 10:43 వరకు;
దుర్ముహూర్తం: సా.4.24 నుండి 5.12 వరకు;
రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు;
యమగండం: మ.12.00 నుండి 1.30 వరకు



సీబీఐ చీఫ్ శుక్లా

1983 బ్యాచ్ ఐపీఎస్‌కు పట్టం

మధ్యప్రదేశ్ డీజీపీగా సేవలు

ఇటీవలే కమల్‌నాథ్ సర్కార్ వేటు

శుక్లా ఎంపికపై ఖర్గే అభ్యంతరం

11లో

పల్లెల్లో కొత్త పాలన

6340 పంచాయతీల్లో మహిళా రాజ్యం

52 శాతం పైగా పదవులు వారివే

కొలువుదీరిన పాలకవర్గాలు • తొలి గ్రామసభలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు శనివారం నుంచి పాలన ప్రారంభించాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో అధికారులు దగ్గరుండి కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమాలను పూర్తి చేయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాలుగేళ్ల తరువాత కొత్త పంచాయతీరాజ్ వ్యవస్థ నూతన శోభను సంతరించుకుంది. రాష్ట్రమంతటా గ్రామపంచాయతీ పాలక వర్గాలకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పెద్ద ఎత్తున మహిళలు విజయం సాధించారు. ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తమ తమ గ్రామ పంచాయతీకార్యాలయాల్లో శనివారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. పంచాయతీ స్పెషలాఫీసర్లు నూతన సర్పంచ్‌లకు పదవీ బాధ్యతలు అప్పగించారు.. రాష్ట్రంలో అరు నెలలుగా గ్రామపంచాయతీల్లో కొనసాగుతూ వచ్చిన ప్రత్యేక అధికారుల పాలనకు ఇంతటితో ముగింపు పడింది. రాష్ట్రంలో 2వ పేజీలో...



వనపర్తి జిల్లా దొడగుంటపల్లి సర్పంచ్ వరలక్ష్మి ప్రమాణ స్వీకారం



బడ్జెట్ హామీలకు ప్రాధాన్యం
ఓటాన్ అకౌంటే

కీలక పథకాలకు దండిగా నిధులు

పార్లమెంట్ ఎన్నికల తరువాత పూర్తిస్థాయి బడ్జెట్

కేంద్ర సాయం తగ్గినా లోటు రానీయొద్దు

సీఎం కేసీఆర్ సూచన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే దిశగా రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి...వాటికి నిధుల కొరత లేకుండా చూడాలని అన్నారు. వీటికే బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని నిధుల కేటాయింపు ఉండాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్టానికి ఆశించిన మేర నిధుల కేటాయింపులేకపోవడంతో ఓటాన్ అకౌంట్‌లో ప్రాధాన్యతా అంశాలకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆర్థిక శాఖకు అన్ని శాఖలనుంచి బడ్జెట్ ప్రతిపాదనలు అందడంతో ఓటాన్ బడ్జెట్ కూర్పుపై కసరత్తు ముమ్మరం చేసింది. అయితే వచ్చిన ప్రతిపాదనలు, గత కేటాయింపులు, వ్యయాలపై శనివారం సీఎం కేసీఆర్ శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. ప్రధానంగా ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలకు నిధుల కేటాయింపులు ఏడాదికి ప్రతిపాదించాలని సూచించినట్లు సమాచారం. ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రజలకిచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేలా నిధులుండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఈ దఫా రూ. 2 లక్షల కోట్లకు మించనున్నట్లు అధికారులు సీఎంకు నివేదించారు. శాఖల వారీగా వ్యయాలు, కేటాయింపులు, రాబడి శాఖల అంచనాలను కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిసింది. అయితే కొన్ని శాఖల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేసి మార్పులు సూచించినట్లుగా తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ కీలక అంశంమైన సాగునీటి రంగానికి రూ. 26 వేల కోట్లు కావాలని ఇరిగేషన్ శాఖ ప్రతిపాదించింది. అయితే అత్యంత అవశ్యమైన ఈ రంగానికి కోరినన్ని నిధులను ప్రతిపాదించాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడినట్లుగా తెలిసింది. రైతు బంధు సాయానికి రూ. 12 వేల కోట్లు, రుణ మాఫీకి తొలివిడతగా రూ. 6వేల కోట్లు, విద్యుత్ రంగానికి రూ. 5వేల కోట్లు, ఆసరా పింఛన్లకు రూ. 400 కోట్లతో మూడు నెలల కాలపరిమితితో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు సీఎం సుముఖత వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. మిషన్ 3వ పేజీలో...



బ్యాంకాక్ టూ చెన్నై పులికూన

థాయ్‌లాండ్‌లో అరుదైన ఓ చిరుతపులి కూన విమానంలో వస్తే చెన్నయ్ విమానాశ్రయం అధికారులు పట్టుకున్నారు. అందంగా... ముద్దుగా కనిపిస్తున్న ఈ పులికూన ఆకలితో అలమటి స్తూంటే చూసి అధికారులు దానికి సీసాతో పాలు కూడా పట్టారు. ఇంతకీ ఆ పులికూన ఎలా వచ్చిందీ అంటే అసలు కథ చెప్పాల్సిందే. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణీకుడు తన బ్యాగేజీలో గుట్టుగా ఈ పులికూనను ఉంచాడు. విమానాశ్రయంలో అధికారులు దానిని కనిపెట్టి ప్రయాణీకుడికి క్లాస్ పీకారు. అనుమతుల్లేకుండా పులిపిల్లను తీసుకురావడం నేరమంటూ అతడిపై చర్యలు తీసుకున్నారు. ఆ కూనకు పాలుపట్టి తమిళనాడు అటవీశాఖకు చెందిన అరింగర్ అన్నా జూలాజికల్ పార్క్ (చెన్నయ్)కు తరలించారు.

సీఎంవోకు కొత్తరూపు?

• నలుగురు పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శుల నియామకానికి సీఎం కేసీఆర్ యోచన • సహాయ మంత్రుల హోదాతో సీఎంవో పర్యవేక్షణ బాధ్యతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలోనే తొలిసారిగా ముఖ్యమంత్రి కార్యాలయ పర్యవేక్షణా బాధ్యతలను సహాయ మంత్రుల స్థాయిలో నియమించే నలుగురు పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులకు అప్పగించి వారికి ఒక్కో శాఖను కేటాయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మంత్రివర్గ విస్తరణపై తనదైనశైలిలో కసరత్తు చేస్తున్న తెలంగాణ సీఎం కేసీఆర్ పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాలపై చర్చోపచర్చలు సాగిస్తున్నట్టు సమాచారం. పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శుల్లో నలుగురిని తన కార్యాలయంలో నియమించుకోవాలని కేసీఆర్ ప్రతిపాదించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మంత్రివర్గ కూర్పుపై కసరత్తు చేస్తున్న కేసీఆర్ ఈ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటిదాకా ఏ రాష్ట్రంలోనూ ఈ తరహా విధానం 3వ పేజీలో...



రవాణా శాఖలో ప్రమోషన్లకు మోక్షం

ఉమ్మడి రాష్ట్ర సర్వీస్ రూల్స్ సవరణకు ఆదేశాలు జారీ

పదోన్నతులకు తొలగిన అడ్డంకులు

తెలంగాణ ఉద్యోగుల ప్రయోజనాలే లక్ష్యంగా మార్గదర్శకాలు

ఉద్యోగ వర్గాల్లో ఆనందం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎట్టకేలకు రవాణా శాఖలో ఉద్యోగుల ప్రమోషన్ల సమస్యలకు మోక్షం కల్గింది. సుదీర్ఘకాలంగా నిరీక్షిస్తున్న ట్రాన్స్‌పోర్టు సర్వీస్ రూల్స్ (స్పెషల్ రూల్స్) సవరణ ఉత్తర్వులను జారీ చేయడంతో ప్రమోషన్లకు ఉన్న అడ్డంకులు తొలిగి మార్గం సుగమమైంది. ఉమ్మడి రాష్ట్రంలో చోటు చేసుకున్న అక్రమాలను సరిదిద్దేలా సర్కార్ చర్యలు చేపట్టడంతో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ఉద్యోగులకు వరంగా మారింది. అక్రమాలు లేని రీతిలో ఉద్యోగులకు ప్రయోజనం కల్గేలా తెలంగాణ ప్రభుత్వం తాజాగా ఉమ్మడి రాష్ట్ర ఉత్తర్వులను సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో రవాణా శాఖ ఉద్యోగులకు పదోన్నతులు రావడం మరింత సులభతరమైంది.

ఉమ్మడి రాష్ట్రంలో అడ్డగోలు ఆదేశాలు

1994లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన స్పెషల్ రూల్స్‌ను జారీ చేసింది. దీంతోనే అక్రమాలకు తెరలేచింది. ఈ అక్రమాల పరంపర తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కూడా కొనసాగాయి. ఈ జీవోలోని నిబంధనల ప్రకారం ఆర్‌టీఓ (రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారి)గా పదోన్నతి పొందేందుకు రవాణా శాఖలో వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు సచివాలయంలో పనిచేసే ఎస్ఓ (సెక్షన్ ఆఫీసర్లు), పీఎస్‌లు, రవాణా శాఖలో పనిచేసే సూపరింటెండెంట్‌లు, స్టెనోలు కూడా సమాన అర్హులుగా అవకాశం కల్పించారు. నిబంధనల మేరకైతే సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు, రవాణా శాఖలో పనిచేసే ఉద్యోగులు, ప్రమోషన్‌మీద కానీ, బదలీమీదకానీ, జిల్లా కార్యాలయంలో పోస్టింగ్‌కు అనర్హులు. ఈ అంశం అప్పటి రాష్ట్రపతి ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా ఉమ్మడి పాలకులు వారికి మేలు చేకూరేలా ఉత్తర్వులిచ్చారు. అప్పటి జీవో 246ను రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘనగానే పేర్కొనవచ్చు. వీటి ఆధారంగా ఆంధ్ర, రాయలసీమలలో పనిచేసే అనేక మంది ముందుగా సెక్రటేరియట్, కమిషనర్ 7వ పేజీలో...

ఏ క్షణమైనా తీపికబురు!

విస్తరణ ఖాయమే • తేదీపైనే సస్పెన్స్
ముఖ్యులతో సీఎం కేసీఆర్ చర్చలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మంత్రివర్గ విస్తరణ కోసం టిఆర్ఎస్ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. ఫిబ్రవరి 5నుండి మంచిరోజులుండగా, సీఎం ఏతేదీని ముహూర్తంగా ఎంచుకుంటారో, ఏ క్షణాన తీపికబురు అందుతుందోనని కళ్ళల్లో వత్తులతో ఎదురుచూస్తున్నాయి. విస్తరణ రెండువిడతలుగా ఉంటుందని సంకేతాలిచ్చిన సీఎం బడ్జెట్ సమావేశాలకు ముందే విస్తరణ చేపడుతారని పార్టీవర్గాలు బలంగా నమ్ముతున్నాయి. కొందరు సీనియర్ ఎమ్మెల్యేలకు అవకాశాలపై సీఎం సంకేతాలిచ్చారన్న చర్చా సాగుతోంది. విస్తరణపై రకరకాల తేదీలు ప్రచారంలో ఉన్నాయి. మాఘమాస ప్రారంభం మంగళవారం 5 లేదా 7న, లేదా వసంతపంచమి 8వ పేజీలో...

ఔరా..!



దీదీ... ఇక దిగిపోండి

• ఆయుష్మాన్ భారత్‌కు నో చెప్పిన నాడే మీ పతనం మొదలు • పేదల ఆరోగ్య భద్రత మీకు పట్టదు

• మోడీ అంటేనే మీకు భయం • పశ్చిమ బెంగాల్ ఎన్నికల ర్యాలీల్లో మమతపై ప్రధాని ధ్వజం

11

మోడీకి మెంటల్ టెన్షన్
దర్యాప్తు సంస్థలతో బెదిరిస్తున్నారు: మమత



పశ్చిమబెంగాల్‌లో మటువా కుల పెద్దమ్మ బినాపాణి దేవి ఠాకూర్‌కు ప్రధాని మోడీ అభివాదం

శిఖా చౌదరి అరెస్ట్?

ఆస్తి కోసమే హత్య?

చిగురుపాటి హత్యకు అదే కారణమా?

అనుమానాలన్నీ మేనకోడలు శిఖా చౌదరి పైనే • ఆమె పేర ఆస్తులు, డాక్యుమెంట్లు జయరామ్ వద్ద

స్నేహితులతో కలిసి హత్యకు ప్లాన్?

8లో



ఏపీ సీఎం.. ఆటోవాలా

ఆంధ్రప్రదేశ్‌లో ఆటోలపై 'లైఫ్ టాక్స్' రద్దు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆటో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఉండవల్లిలోని సీఎం నివాసం వద్ద చంద్రబాబును ఆటో డ్రైవర్లు కలిశారు. ఈ సం దర్భంగా చంద్రబాబు ఆటో నడిపి డ్రైవర్లలో ఉత్సాహం నింపారు. ''మీరు ఆటోలో ప్రయాణికులను సురక్షితంగా తీసుకెళ్తుంటే తాను రాష్ట్ర పాలనను సురక్షితంగా నడుపుతూ ప్రజలను సంతోషంగా జీవించేలా వ్యవహరిస్తున్నా'' అని ఏపీ సీఎం పేర్కొన్నారు. అందుకే తాను రాష్ట్రానికి మొదటి డ్రైవర్నినని చెబుతూ, అందరూ తన వెంట నడవాలన్నారు.



అలా.. దారి తప్పాను!

బాగోజ్, సిరియా: జర్మనీకి చెందిన 19 ఏళ్ల మార్టిన్ లెక్మే అనే బాలిక నాలుగేళ్ల క్రితం ఉగ్రవాద సంస్థ ఐసిస్‌లో చేరింది. స్వగ్రామానికి ఆనుకుని ఉన్న సరిహద్దు దాటి ఉగ్రవాదుల్లో చేరింది. అమెరికా సారధ్యంలోని సాయుధదళాలు ఆమెను గురువారం సిరియాలో అరెస్ట్ చేశాయి. 15 ఏళ్ల వయసులో తెలిసి తెలియక ఉగ్రవాదుల్లో చేరాను. నాలుగేళ్ల తర్వాత పొరపాటు తెలుసుకున్నా. ఇంటికి వెళ్లాలని, పాత జీవితాన్ని గడపాలని అనుకున్నాను. ఇస్లాం స్వీకరించిన తర్వాత సిరియా వెళ్లి ఉగ్రవాదుల్లో చేరాను. జర్మనీకి చెందిన ఓ ఉగ్రవాదిని పెళ్లి చేసుకుని, ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చాను. ఐఎస్ఐఎస్ ఉగ్రవాదుల స్థావరాలను అమెరికా దళాలు ధ్వంసం చేస్తున్నాయి. ఉగ్రవాదులను వదిలి ఇళ్లకు వెళ్లాలని నాలాంటి వాళ్లం అనుకుంటున్నాము. నన్ను పెళ్లి ఉగ్రవాదికి ముగ్గురు భార్యలున్నారు. ఇంట్లో వంట చేయడమే నా పని . ఉగ్రవాదులు మహిళలను ఏమాత్రం పట్టించుకోరు, ఆహారం లేకపోయినా జాలి చూపరు . ఐసిస్‌లో చేరి పెద్ద చాలా తప్పు చేశాను. నాలా బాధపడుతున్నావారిలో ఎక్కువమంది ఇరాకీయులే అని మార్టిన్ లెక్మే తన దీనగాథను వెల్లడించింది.



చమక్కులు



పంచ్ రహస్యం

కొందరు నాయకులు పంచ్ వేస్తే ప్రత్యర్థికి బాణంలా దిగుతుంది. పంచ్‌లు వేయడంలో.. ప్రాసతో ప్రత్యర్థులను చితక్కొట్టడంలో కొందరు నేతలు సిద్ధహస్తులు. ఎవరో రాసిచ్చినవి చదవడం కాదు.. స్వతహాగా నేతల మాటల్లో ఆ జాణతనం ఉంటే తప్ప అవి పేలవు. లక్ష్యిత నేతలకు బలంగా తాకవు. ఇంతకూ పంచ్ ప్రాసోపఖ్యానం ఎందుకంటే.. ఓ మంత్రిస్థాయి నేత గురించి. రాజకీయ నేతలు ప్రజాసమస్యలు, అధికారిక కార్యక్రమాల్లో ఎపుడూ బిజీగా ఉంటారు. ఇక మంత్రులు, ఆస్థాయి నేతలకైతే ఒత్తిడి మామూలుగా ఉండదు. అయితే తీవ్ర ఒత్తిడిలో ఉన్న ఆనేతలు రాత్రి ఇంటికి చేరాక ఒత్తిడి నుండి ఉపశమనం పొందేందుకు ఏం చేస్తారు? ఎఫ్2 సినిమాలో వెంకీ ఆసనాలు వేసినట్లు, శంకర్‌దాదా ఎంబిబిఎస్‌లో పరేష్‌రావల్ లాఫింగ్‌థెరపీతో నవ్వాసనం వేసినట్లు ఏమైనా చేస్తారా? ఎవరి.. అభిరుచులను బట్టి, పరిస్థితులను బట్టి వారు ఉపశమాశనం వేస్తారు. అయితే హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న ఓ జిల్లాకు చెందిన మంత్రిస్థాయి నేత ఓ ఛానల్‌లో వచ్చే కామెడీ బిట్స్ చూస్తాడట. దీనివల్ల మానసికంగా రిలాక్స్ కావడంతో పాటు కామెడీ కోసం కమెడియన్లు వేసే పంచ్‌లు తర్వాత ప్రత్యర్థులపై విసిరేందుకు, సమయస్ఫూర్తిని పెంచేందుకు దోహద పడుతున్నాయట. దీంతో ఎపుడైనా ప్రయాణంలో ఖాళీగా ఉన్నా.. ఒత్తిడి అనిపించినా మొబైల్‌లో కూడా కామెడీ బిట్స్ చూస్తూ రిలాక్స్ అవుతారట. ఈమధ్య సదరునేత మీ పంచ్ రహస్యమేమిటి భయ్యా.. సినిమాలు చూస్తారా? అని శ్రేయోభిలాషులు అడిగితే అసలువిషయం చెప్పేశారు. అదన్నమాట.



బోల్తాకొట్టిందిలే.. బుల్‌బుల్ పిట్ట

ఒరేయ్.. వీరరాఘవరెడ్డి.. ఇపుడు రారా చూసుకుందాం.. నీపెతాపమేందో.. నాపెతాపమేందో అన్నరేంజ్‌లో ఎన్నికలకు ముందు సవాళ్ళు విసిరాడట. గెలుపు ఖాయమనుకున్నాడట. పక్కా సర్కార్‌మాదేనని బల్లగుద్ది చెప్పాడట. బలమైన ప్రత్యర్థి ఉన్నా.. చాలా లైట్‌గా తీసుకుని దూదిపింజలా ఊదిపాడేస్తున్న అని చెప్పాడట. చరిత్రలో తన ప్రత్యర్థిని ఎన్నడూ.. ఎవరూ తిట్టనంతగా తిట్టాడట. ఆవేశంలో వీరావేశపడ్డాడట. ఆస్థులూ కరిగించుకున్నాడట. సదరునేత దూకుడు చూసి.. వీరావేశ విమర్శలు చూసి.. ఎహే ఈయన గెలుపుఖాయమహే అనుకున్నారట. ఆధీమా.. ఆ మాటలు.. హడావుడి చూసి.. కొందరు అధికారులూ ఆయన గెలిచినట్లేనని అనుకుని పోస్టింగ్‌లూ మాట్లాడుకున్నారట. సార్.. నాకు ఫలానా మండలంలో పోస్టింగ్ కావాలి.. నేను ఆయనకెళ్ళి ఉన్నా.. కానీ మొదటినుండీ మీ మనిషినే.. ఇట్లా ఎన్నికలముందే అనేకమంది పోస్టింగ్‌లకు ఖర్చీఫ్‌లేస్తే, ఇక కొందరిని ఆయనే మార్చాలనుకున్నాడట. అరె.. ఎన్నికలైపోంగనే ఆ స్టేషన్‌కు మనోడిని ట్రాన్స్‌ఫర్ చేస్త. ఈఠాణాకు అక్కడినుండి తెస్తా. అని లెక్కలు వేసుకున్నారట. ఇన్ని లెక్కలువేసుకుని.. ఇన్ని తిప్పలు పడితే.. తీరా ఏం జరిగిందంటే? ఏం జరిగింది.. ఊహించేసి ఉంటారు. రాజకీయమంటే అంతే కదా.. అన్నీ అనుకున్నట్లు జరిగితే అది రాజకీయం ఎందుకు అవ్వద్ది. అంచనాలు తప్పాయి. మళ్ళీ సిట్టింగే గెలిచాడు. అరేయ్.. వీరరాఘవరెడ్డి అంటూ ఆవేశపడ్డా ఓట్లపెట్టెల్లో జాతకం తిరగబడడంతో ఆనేత, ఆయనను చూసి ఆవేశపడ్డనేతలు ఇపుడు పెద్దగా బయటకు రావడంలేదట. ఈ హడావుడి చేసి ముందు ఆందోళన చెందిన సిట్టింగ్ నేత అనుచరులు.. ఇపుడు ప్రతిసవాల్ విసురుతున్నారట. లావులావు మాట్లాడినవు కద.. ఏడబోయినవ్. అంటూ చురకలు వేస్తున్నారట. బోలా కొట్టిందిలే.. బుల్‌బుల్ పిట్ట అని పాటేసుకుంటున్నారట. ఉత్తర తెలంగాణలోని ఓ కీలకనియోజకవర్గంలో ఈ సంఘటన జరిగింది. తెలంగాణభవన్‌లో గెలిచిన నేత అనుచరులు ఈ అంశాన్ని నవ్వుతూ మిత్రులతో పంచుకుంటున్నారు.

- కంది.రామచంద్రారెడ్డి

పల్లెల్లో కొత్త పాలన

(మొదటిపేజీ తరువాయి)

కొత్త సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం సందర్భంగా అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. నూతనంగా ఎన్నికైన వారంతా తమ అనుచరులు అభిమానుల మధ్య అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకారం చేశారు.. అన్ని గ్రామ పంచయాతీల్లో నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకారోత్సవాలకు పంచాయతీ కార్యాయాలను అధికారులు ముందుగానే ముస్తాబు చేసి పెట్టారు. పంచాయతీ పాలక వర్గాల ప్రమాణ స్వీకారం తీరు పరిశీలిస్తే యాదాద్రి భువనగిరిజిల్లా భూదాన్ పోచంపల్లిలో మండలం దంతూరు గ్రామ పంచాయతీలో ఉదయం పదిన్నరకు జనగణమన జాతీయగీతాలాపనతో పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని స్పెషలాఫీసర్ ప్రారంభించారు. తొలుత గ్రామ సర్పంచ్‌గా దోటి కమార్ యాదవ్ ప్రభుత్వ ఫార్మాట్‌లో పేర్కొన విధంగా ప్రమాణం చేసి రికార్డుల్లో అధికారికంగా సంతకం చేశారు. అనంతరం ఉప సర్పంచ్ బోదాస్ శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. చివరగా ఎనిమిది మంది వార్డు సభ్యులతో ప్రమాణం చేయించారు. అనంతరం సర్పంచ్ అధ్యక్షతన తొలిసారి పంచాయతీ పాలక వర్గం కొలువుదీరింది. పాలక వర్గ సభ్యులతో పాటు ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కొత్తముత్యాలు,మాజీ ఉప సర్పంచ్ జమ్ము శంకరయ్యతోపాటు గ్రామ పెద్దలు బోదాసు సత్తెయ్య, ఎంపిటీసీ సుర్వి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి రూపొందించినఅజెండా అంశాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించారు. గ్రామంలో తాగునీరు, పారిశుద్యం , హరితహారం తదితర అంశాలతోపాటు గ్రామ పంచాయతీలో నెలకొన్న పరిస్థితులను చర్చించారు. దంతూరు పంచాయతీ తీరులోనే రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో కొత్త పాలక వర్గాల పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు జరిగాయి. . గ్రామ పంచాయతీలకు కార్యదర్శుల సంఖ్య సరిపడినంతగా లేనందున ఒక్కో కార్యదర్శి రెండు మూడు పంచాయతీలకు ఇంచార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యేక అధికారుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది .అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకే సమయానికి సర్పంచ్ వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగే అవకాశాలు లేకపోవటంతో స్పెషలాఫీసర్లు,



మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలో కొత్త పాలక వర్గం ప్రమాణస్వీకారం

కార్యదర్శుల సౌలభ్యాన్ని బట్టి కొన్ని పంచాయతీల్లో ఉదయం, మరికొన్ని పంచాయతీల్లో మధ్యాహ్నం, కొన్నింటిలో సాయంత్రం పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నిర్వహించాల్సివచ్చింది.

ఆధునిక తెలంగాణకు నేతలు మీరే : సీఎస్ సందేశం

ఆధునిక తెలంగాణ రాష్ట్రానికి కొత్త నాయకత్వం మీద్వారానే (సర్పంచ్‌లద్వారా) లభించిందంటూ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నూతన పాలకవర్గాల పదవీ బాధ్యతల స్వీకారం సందర్భంగా సీఎస్ రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు ప్రత్యేక లేఖలు పంపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి సారి ఎన్నికల్లో ప్రజల మద్దతుతో సర్పంచ్‌లుగా విజయం సాధించారంటూ తన లేఖల ద్వారా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ వ్యవస్థ బలపడాలని, స్వయం సమృద్ధి కావాలన్నారు. భారత రాజ్యాంగంలోని 243వ అధికరణ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టం - 2018ని రూపొందించిందని తెలిపారు. గ్రామాల్లో విద్య, వైద్యం ప్రాధాన్యాన్ని గుర్తించాలని, పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు దోహదపడాలనికోరారు. వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రోత్సహించాలన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలనికోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే బహుమతులు సాధించాలన్నారు. ఉన్న అవకాశాలను సమర్ధవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఉపయోగించుకుని ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందిచాలన్నారు. గ్రామ సహజ వనరులను మెరుగుపరచాలని కోరారు. ప్రజలకు ఉపాధి కల్పించాలన్నారు. పాలనలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. విలువలతో కూడిన వ్యవహార విజ్ఞతతో మార్గదర్శకమైన పరిపాలనను ప్రజలకు అందించాలని కోరారు. గ్రామ సభల్లో ప్రజల భాగస్వామ్యం పెంచాలన్నారు. ప్రజలు చెల్లించాల్సిన పన్నుల పట్ల కూడా ప్రజలను చైతన్యపరచాలన్నారు. పంచాయతీకి చెల్లించిన పన్నులో ప్రతిపైసా నిబద్ధతతో , నిజాయితీతో ప్రజల అభ్యున్నతికి ఉపయోగపడుతుందనే విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు అతి చేరువగా ఉండే ప్రజాస్వామ్య వ్యవస్థ గ్రామపంచాయతీ అని , దీని ద్వారానే ప్రజల అభివృద్ధికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీలు గ్రామాభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాలని ,వివిధ శాఖల సమన్వయం ద్వారా ఇది సాధ్యపడుతుందని వివరించారు.పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన కలిగివుండటం అవసరం అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రణాళికాబద్ధంగా ప్రజలతో కలిసి మెలిసి సుపరిపాలన అందిస్తూ గ్రామ పంచాయతీలను సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి సర్పంచ్‌లందరికీ శుభాకాంక్షలు తన లేఖ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

దంతూర్‌లో..



ఉమ్మడి ఖమ్మంలో సర్పంచ్‌ల కోలాహలం

ఖమ్మం/ భద్రాద్రి కొత్తగూడెం, ప్రభన్యూస్: ప్రభుత్వం నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన పాలకవర్గ సభ్యులు శనివారం ప్రత్యేక అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. జిల్లాలో 583 గ్రామాలకు ఈ ఎన్నికలు నిర్వహించిన విషయం విధితమే. దీనిలో నూతనంగా ఏర్పడిన 167 (తండాలు) గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో రిజర్వేషన్ల ప్రకారం ఎస్టీలకే కేటాయించారు. దీంతో ప్రమాణ స్వీకారోత్సవానికి గిరిజనులు వారి సాంప్రదాయాల ప్రకారం నృత్యాలు చేసుకుంటూ ఆనందోత్సవాల నడుమ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న మేజర్ గ్రామపంచాయతీల్లో జరుగుతున్న ప్రమాణ స్వీకారనికి శాసనసభ్యులతోపాటు ఇతర మండల ముఖ్యనాయకులు హాజరై శుభాకాంక్షలు తెలియపరిచారు. భద్రాద్రి జిల్లాలోని నూతన గ్రామ పంచాయతీలకు ఎన్నికైన సర్పంచ్‌లు , ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం శనివారం జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా జరిగింది. జిల్లాలోని 477 గ్రామ పంచాయతీలు, 4232 వార్డులకు ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ప్రత్యేక అధికారులు ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు గ్రామస్థాయి నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలదే అధికారం

రాష్ట్రంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మహిళలే అధికశాతం ఎంపికయ్యారు. మొత్తం 12680 పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా అందులో 50శాతం మహిళా రిజర్వేషన్ కోటా కింద 6340మంది మహిళలు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. అంతేకాకుండా 112460 వార్డు స్థానాల్లో కూడా రిజర్వేషన్ కోటా కింద 56230 మంది వార్డు సభ్యులుగా మహిళలే ఎన్నికయ్యారు. కొన్ని పంచాయతీల్లో జనరల్ స్థానాల్లో కూడా పోటీ చేసి మహళలు సర్పంచ్ పదవులు కౌవసం చేసుకున్నారు. మరో నాలుగువేలకు పైగా వార్డు స్థానాల్లో కూడా మహిళలే విజయం సాధించారు. దీంతో ఇటు పంచాయతీ సర్పంచ్ పదవుల్లోనూ అటు వార్డు సభ్యులుగాను మొత్తం స్థానాల్లో మహిళలు 52శాతం పైగానే ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో కూడా మహిళలే పురుషులకంటే 1.29శాతం అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఖ్యలో మహిళలు ఓటింగ్‌లో పాల్గనటమే కాకుండా గ్రామ పంచాయతీ పదవులు దక్కించుకోవటంలో కూడా సరికొత్త రికార్డును సృష్టించారు. కొత్తగా ఎన్నికై పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచ్‌లకు, ఉప సర్పంచ్‌లకు వార్డు సభ్యులకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి,కార్యదర్శి అశోక్ కుమారమ్ , పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ , కమీషనర్ నీతూ కూమారి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదిలాబాద్‌లో...

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : కొత్త పంచాయతీ కార్యవర్గాలు కొలువుదీరాయి. పల్లెలు పులకరించాయి. శనివారం పల్లెలో సర్పంచుల, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాలు పండగను తలపించాయి. ఊరంతా ఒకటై పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. నూతనంగా గెలిచి బాధ్యతలు చేపట్టిన గ్రామ ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచులచేత పంచాయతీ ప్రత్యేకాధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1493 గ్రామపంచాయతీలు కొలువుదీరాయి. ఆదిలాబాద్ జిల్లాలో 459, నిర్మల్ జిల్లాలో 396, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 331, మంచిర్యాల జిల్లాలో 305 పంచాయతీల్లో పంచాయతీల సర్పంచులు ప్రమాణ స్వీకారం చేసి తొలి సంతకాలు చేశారు. శాసన సభ ఎన్నికలలాగానే గ్రామపంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సత్తా చాటింది. గ్రామ పంచాయతీల్లో గులాబి జెండాను ఎగురవేసింది. ప్రతిపక్ష పార్టీలను కోలుకోలేని దెబ్బకొట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1493 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగగా 955 గ్రామపంచాయతీల్లో టిఆర్ఎస్ మద్దతు దారులు గెలిచారు. కాంగ్రెస్ పార్టీ కేవలం 281 స్థానాలకే పరిమితమైంది. ఈ ఎన్నికల్లో స్వతంత్రులు సత్తాను చాటారు. 247 గ్రామ పంచాయతీలను స్వతంత్రులు దక్కించుకున్నారు. తెలంగాణ జన సమితి కూడ ఈసారి గ్రామపంచాయతీల్లో ఖాతాతెరిచింది. నాలుగు గ్రామపంచాయతీలను గెలుచుకుంది. బిజెపి వామపక్ష పార్టీలు అంతగా ప్రభావం చూపలేకపోయాయి. బిజెపి 13 పంచాయతీల్లో, వామపక్షాలు రెండు పంచాయతీల్లో , నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ రెండు పంచాయతీల్లో విజయం సాధించింది. ఆదిలాబాద్ జిల్లాలో 459 పంచాయతీలకు ఎన్నికలు జరుగగా టిఆర్ఎస్ 292, కాంగ్రెస్ 65, బిజెపి 8, ఇతరులు 92 పంచాయతీల్లో గెలిచారు. నిర్మల్ జిల్లాలో 396 పంచాయతీలకు ఎన్నికలు జరుగగా టిఆర్ఎస్ 249, కాంగ్రెస్ 82త, బిజెపి 4, ఎన్‌సిపి 2, సిపిఎం 1 పంచాయతీలు గెలుచుకోగా ఇతరులు 57 గ్రామపంచాయతీల్లో విజయం సాధించారు. కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 331 పంచాయతీలకు ఎన్నికలు జరుగగా 224 టిఆర్ఎస్ , 81 కాంగ్రెస్, బిజెపి 1, తెలంగాణజనసమితి 4 పంచాయతీల్లో విజయం సాధించాయి. 23 పంచాయతీల్లో ఇతరులు గెలిచారు. మంచిర్యాల జిల్లాలో 305 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగగా టిఆర్ఎస్ 190 పంచాయతీల్లో కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ 53, 62 గ్రామపంచాయతీలు ఇతరులు గెలుచుకున్నారు. ఎన్నికలు పూర్తి కావడంతో శనివారం నుంచి గ్రామపాలన ప్రారంభం కాబోతుంది. సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో శనివారం ప్రమాణస్వీకారం చేసి పాలనకు శ్రీకారం చుట్టనున్నారు. పంచాయతీ కార్యవర్గాల ప్రమాణ స్వీకారానికి అధికార వర్గాలు ఏర్పాట్లు చేశాయి.

కరీంనగర్‌లో..



కరీంనగర్ మండలంలో సర్పంచుల ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : రాష్ట్రంతోపాటు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిశాయి, గ్రామాల్లో కొత్త పాలకమండళ్లు శనివారం కొలువు తీరాయి. సర్పంచులు, ఉప సర్పంచులు ప్రమాణ స్వీకారం చేశారు. పలు చోట్ల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయా నియోజవర్గాల ఎమ్మెల్యేలు హాజరైనారు, పండుగ వాతావరణంలో ప్రమాణ స్వీకారోత్సవాలు జరిగాయి. ఫిబ్రవరి 2న తొలిసమావేశాన్ని నిర్వహించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమీషనర్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో శనివారం నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకాం చేసి బాధ్యతలు చేపట్టారు. మాజీ మంత్రి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆదివారం జమ్మికుంటలో హుజురాబాద్ నియోజవర్గంలో గెలుపొందిన సర్పంచులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులను స్వయంగా సన్మానించనున్నారు. నాలుగు జిల్లాల్లో 1211 పచాయతీలు ఉండగా రెండు పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు, అధికార టీఆర్ఎస్ పార్టీకి చెందిన మద్దతు ధారులు అత్యధిక స్థానాల్లో విజయం సాదించారు. 790 పంచాయతీల్లో టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందగా, 230 పంచాయతీల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు, 30 చోట్ల బీజేపీ, టీడీపీ, సీపీఐ ఐదేసి చొప్పున, బహుజన సమాజ్ పార్టీ బలపరిచిన వ్యక్తి ఒక చోట . స్వతంత్రులుగా 148 చోట్ల సర్పంచులుగా గెలుపొందారు. వీరంతా బాధ్యతలు చేపట్టడంతో పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన ముగిసి సర్పంచుల పాలన మొదలైంది.

ఇందూరులో..

నిజామాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : నూతనంగా ఏర్పడిన పంచాయతీ పాలక వర్గాలు కొలువుదీరడంతో పల్లెలు పులకరించాయి. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో శనివారం పల్లెలో సర్పంచుల, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాలు పండగను తలపించాయి. ఊరంతా ఒకటై పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. నూతనంగా గెలిచి బాధ్యతలు చేపట్టిన గ్రామ ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచులచేత పంచాయతీ ప్రత్యేకాధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. పంచాయతీ పాలకవర్గాల ప్రమాణ స్వీకారంతో గ్రామాల్లో సందడి నెలకొంది. టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కొన్ని పంచాయతీల్లో ప్రమాణ స్వీకారం అనంతరం తాము చేయబోయే అభివృద్ధి పనులపై వార్డు సభ్యులతో కలిసి ఉల్లాసంగా చర్చించుకున్నారు. తమతమ నియోజకవర్గాల్లో ఎన్నికైన నూతన సర్పంచులు, వార్డు సభ్యులకు స్థానిక ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు. శాసన సభ ఎన్నికలలాగానే గ్రామపంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సత్తా చాటింది. గ్రామపంచాయతీల్లో గులాబీ జెండాను ఎగురవేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1056 గ్రామపంచాయతీలకు గాను మూడు పంచాయతీలను గ్రామస్థులు బహిష్కరించడంతో 1053 పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. వీటిలో 814 గ్రామపంచాయతీల్లో టిఆర్ఎస్ మద్దతు దారులు గెలిచారు. కాంగ్రెస్ పార్టీ కేవలం 132 స్థానాలకే పరిమితమైంది. బీజేపీ 08 స్థానాలు మాత్రమే దక్కించుకుంది. టిడిపికి కేవలం 4 స్థానాలు మాత్రమే లభించాయి. ఇతరులు 95 స్థానాల్లో గెలుపొందారు. సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రమాణ స్వీకారం చేసి పాలనకు శ్రీకారం చుట్టారు.

సర్పంచ్ పదవి కత్తిమీద సామే

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై దృష్టి పెట్టిన ప్రథమ పౌరులు

- విజయం కోసం భారీగా వ్యక్తిగత హామీలు
- వాటిని నెరవేర్చే మార్గాలపై అన్వేషణ ప్రారంభం
- స్థానిక వనరుల సద్వినియోగంపై దృష్టి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రామ రాజకీయాలపై ప్రత్యేక ఆసక్తి, ప్రజా ప్రతినిధులుగా ఏదో సాధించి తీరాలన్న బలమైన ఆకాంక్షతో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు తమ ముందున్న సవాళ్ళను అధిగమించేందుకు దృష్టి పెట్టబోతున్నారు. మూడు విడతలుగా జరిగిన ఎన్నికల అనంతరం ఎన్నికల సంఘం జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం శనివారం నుంచి బాధ్యతలు స్వీకరించిన వారంతా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఏ విధంగా నెరవేర్చాలన్న అంశంపై దృష్టి పెట్టబోతున్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా ఇచ్చిన హామీలు భారీ నిధులతో ముడిపెట్టుకుని ఉన్నాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో లక్ష్యం పూర్తిచేసే దిశగా సర్పంచ్‌లు కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటున్నారు. బలమైన త్రిముఖ పోటీ నెలకొని ఉన్న అనేక గ్రామాల్లో బరిలో దిగిన అభ్యర్థులుగా ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వాగ్దానాల వర్షం కురిపించారు. గెలిచిన వారిలో ఆర్థికంగా స్థిరపడిన కొంతమంది తమ సొంత డబ్బులతో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలనుకుంటున్నారు. మరికొంత మంది సర్పంచ్‌లు స్థానికంగా ఉన్న పరిశ్రమలు, ఇతర ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యంతో నిధులు సమీకరించి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలనుకుంటున్నారు.ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా నెలకొన్న పోటీ మధ్య విజయం సాధించిన కొంతమంది సర్పంచ్‌లకు వాగ్దానాల అమలు కత్తిమీద సాముగానే కనిపిస్తోంది. మాట నిలబెట్టుకోకుంటే ప్రజల్లో తిరగలేమన్న భావన ఇప్పటి నుంచే వారిని వెంటాడుతోంది. దీంతో స్థానిక ఎమ్మెల్యే అవసరం వారికి తప్పనిసరి అవుతోంది. రాజకీయ పలుకుబడి కలిగి ఉన్న కొంతమంది సర్పంచ్‌లు నేరుగా ప్రభుత్వ పెద్దలను సంప్రదించి నిధులు తెచ్చుకుంటామన్న ధీమాతో ఉన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి స్థాయిలోనూ పైరవీలు చేసేవారు కూడా ఉన్నారు. కానీ అధికార పార్టీ అభ్యర్థిని అధిగమించి పట్టుదలతో విజయం సాధించిన ప్రతిపక్ష పార్టీలు బలపరిచిన సర్పంచ్‌లలో మాత్రం ఆందోళన కనిపిస్తోంది. ఏదో రకమైన మార్గాన్ని అన్వేషించి గ్రామ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాలన్న సంకల్పం వారిలో బలంగా ఉన్నప్పటికీ అర్థబలం, అంగబలం లేనివారు తప్పనిసరి పరిస్థితుల్లో అధికార పార్టీకి వత్తాసు పలికేందుకే మొగ్గు చూపుతున్నారు. బలపరిచిన పార్టీ ఏదైతేనేమీ మాట నిలబెట్టుకోవడమే లక్ష్యమన్న ఆలోచన వారిలో బలపడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాజ్యాంగబద్ధంగా గ్రామ పంచాయితీలకు రావలసిన నిధులతో కొంతమేరకు అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవచ్చునని మరి కొంతమంది సర్పంచ్‌లు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్యేలకు ఉండే నియోజకవర్గ అభివృద్ధి నిధులను ఒప్పించి, మెప్పించి సాధించుకుంటామని నమ్మకంతో ఉన్నారు. అలాగే ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి లోక్‌సభ, రాజ్యసభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీల ఫండ్‌పైనా సర్పంచ్‌లు ఆశలు పెట్టుకున్నారు. ఏదైతైనేమీ, ఎలాగోలా నిధులు సమీకరించుకుని గ్రామాల్లో అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లంతా ముందుకు సాగుతున్నారు. మనసులో ఆశలు, ఆకాంక్షలు, ఆందోళన వారిలో ఉన్నప్పటికీ రాజ్యాంగబద్ధంగా శనివారం అధికార బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చే శిక్షణలో ఎలాంటి భరోసా వస్తుందోనని కొంతమంది ఎదురు చూస్తున్నారు.

దుర్గమ్మసేవలో సుప్రీం చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్



ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన ఈవో కోటేశ్వరమ్మ

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక హైకోర్టు ప్రారంభోత్సవానికి విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గోగొయ్, అత్యున్నత న్యాయస్థానం న్యాయమూర్తులు సుభాష్‌రెడ్డి, ఎన్.వి.రమణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సి.ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి శివ శంకర్ తదితర న్యాయమూర్తుల బృందం శనివారం ఇంద్రకీలాద్రికి వచ్చి దుర్గమ్మ సేవలో తరించింది. ఆలయ ఈవో కోటేశ్వరమ్మ,పాలక మండలి సభ్యులు, వేద పండితులు వారికి స్వాగతం పలికి, పూజలకు సహకరించారు. పండితులు వేద మంత్రోచ్ఛారణతో రంజన్ గోగొయ్ కుటుంబ సభ్యులను, న్యాయమూర్తులను ఆశీర్వదించారు. ప్రధాన న్యాయమూర్తికి ఈవో కోటేశ్వరమ్మ అమ్మ వారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ కుటుంబ సభ్యులు ,న్యాయమూర్తులు కొద్దిసేపు ఆలయంలో గడిపారు.ఆలయ విశిష్టతను ఈవో వారికి వివరించారు.రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కూడా న్యాయమూర్తుల వెంట ఉన్నారు.

త్వరలో స్వామి నిజదర్శనం

నేడు యాదాద్రికి కేసీఆర్

- శోభాయమానంగా నిర్మాణాలు
- 90శాతం పనులు పూర్తి
- పెండింగ్ పనుల పూర్తికి దిశానిర్దేశం
- 14మాసాల తర్వాత యాదాద్రికి సీఎం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆదివారం యాదాద్రికి వెళ్ళనున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని యాదాద్రి అభివృద్ధి పనులపై సమీక్ష జరుపుతారు. కొండపై జరుగుతున్న ఆలయ విస్తరణ పనులను పరిశీలించనున్నారు. ఇప్పటికే చాలాసార్లు యాదాద్రికి విచ్చేసి అభివృద్ధి పనులను సమీక్షించిన ముఖ్యమంత్రి మరోసారి ఆలయ పనులపై దిశానిర్దేశం చేయనున్నారు. సుమారు మూడువేలమంది వివిధ పనుల్లో పాల్గొంటుండడం, పునర్నిర్మాణపనులు చివరిదశకు చేరుకోవడంతో యాదాద్రి శోభాయమానంగా మారగా.. త్వరలో నూతన ఆలయంలో స్వామి నిజదర్శనభాగ్యం కలగనున్నది. తూర్పు, ఉత్తర, దక్షిణ, ఈశాన్య, పశ్చిమ దివ్యవిమాన గోపురం, స్వాగతగోపురం, రాజగోపురాల నిర్మాణపనులు శిల్పకళా వైభవంతో విరాజిల్లుతున్నాయి. ఆర్కిటెక్ట్ ఆనందసాయి, ఈఎన్‌సి రవీందర్‌రావు, స్థపతులు సుందరరాజన్, డాక్టర్ ఆనందాచారివేలు ఎప్పటికపుడు పనులను పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తిచేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 90శాతం పనులు పూర్తికాగా, 2017నవంబర్ 24 తర్వాత సీఎం కేసీఆర్ మళ్లీ యాదాద్రి ఆలయాన్ని సందర్శిస్తున్నారు.

సిద్ధమైన ధ్వజస్తంభం

యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ప్రధానాలయ పునర్నిర్మాణంలో భాగంగా ధ్వజస్తంభం దాదాపు సిద్ధమైంది. ఈ ధ్వజస్తంభంలోనే సమస్తశక్తులు ఇమిడి ఉంటాయనేది పురాణాలు చెబుతున్నాయి. దీనిని ప్రత్యేకశ్రద్ధతో తయారుచేస్తారు. యాదాద్రి ధ్వజస్తంభాన్ని నారవేప కర్రతో తయారుచేస్తున్నారు. మరో 15రోజుల్లో ఇది పూర్తికానుంది., ప్రధానాలయం మొత్తం ఎత్తు 50నుండి 60అడుగుల మధ్యలో ఉండడంతో ధ్వజస్థంభానికి 40అడుగుల కర్రను వాడుతున్నారు. ఇంతకుముందు ఆలయంపై ధ్వజారోహణ చేసేవారు. ఇపుడు ఆలయం లోపలే స్థంభం రావడంతో ప్రతి కార్యక్రమం ఆలయం లోపలే చేయాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం దీనిని కూడా పరిశీలించనున్నారు.

అందంగా సాలహారం

యాదాద్రి క్షేత్రానికి సాలహారం అద్భుత అందాన్ని తీసుకువస్తోంది. ప్రతి ఆలయానికి సాలహారం పనులే ఆకర్షణను ఇస్తాయని స్థపతులు చెబుతున్నారు. ప్రస్తుతం యాదాద్రి క్షేత్రానికి చుట్టూ ఉన్న ఆలయప్రాకారాలకు సాలహారం పనులు జరుగుతుండగా, దాదాపుగా పూర్తయ్యాయి. ఆలయ ప్రాకారగోడలకు దండ మాదిరిగా చేసే శిల్పాకృతపనులే సాలహారం. ఆలయానికి రానున్న సప్తరాజగోపురాల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఆరు రాజగోపురాల పనులు కూడా పూర్తయ్యాయి. వీటన్నింటినీ పరిశీలించనున్న సీఎం కేసీఆర్ పెండింగ్ పనుల పూర్తికి ఆదేశాలు ఇవ్వడంతో అధికారులతో సమీక్షించి ఆలయ ప్రారంభానికి కూడా ముహూర్తాన్ని ఖరారుచేసే అవకాశం ఉంది.

సర్పంచ్‌లకు సాధికారత

- గ్రామ స్వరాజ్యం దిశగా కేసీఆర్ వ్యూహం
- అభివృద్ధిలో సర్పంచ్‌లకు కీలక బాధ్యతలు, అధికారాలు
- ప్రథమ పౌరులుగా ప్రభుత్వంలో వారి భాగస్వామ్యంపై దృష్టి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు, ఆర్థిక వృద్ధిరేటుకు మూల బిందువైన గ్రామీణ ప్రాంతాలను సర్వతోముఖాభివృద్ధితో ముందుకు నడిపించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంసిద్ధమయ్యారు. తనకున్న ముందుచూపు ఆలోచనలతో ఆవిష్కరించిన నూతన పంచాయితీరాజ్ చట్టాన్ని పకడ్బందీ అమలు చేయాలని నిర్ణయించారు. అందుకు ప్రథమ పౌరులైన గ్రామ సర్పంచ్‌లను కీలక భాగస్వాములను చేయబోతున్నారు. కొత్త చట్టం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సర్పంచ్‌ల అధికారాలు, బాధ్యతలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వారి పర్యవేక్షణ, ఆదాయ వనరుల పెంపు, నిధుల సద్వినియోగం, పేద వర్గాల అభ్యున్నతి, ముఖ్యంగా రైతు సంక్షేమం, వివిధ పథకాల ద్వారా గ్రామీణ ప్రజలు లబ్ధి పొందాల్సిన విధానంపై అవగాహన తదితర అంశాలను గురించి వారికి నూరిపోయాలని సంకల్పించారు. స్థానిక సహజ వనరులను వందశాతం సద్వినియోగం చేసుకోవడం ద్వారా అభివృద్ధి లక్ష్యాలను చేరుకునే విధానాన్ని తెలియజెప్పాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అందుకోసం సర్పంచ్‌లకు ప్రత్యేక శిక్షణనిచ్చి వారిద్వారా గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించనున్నారు. సోమవారం నుంచి తెలంగాణ రూరల్ డెవలప్‌మెంట్ అకాడమీలో విజ్ఞానవంతులు, విద్యావంతులైన ఐదారు వందల మంది సర్పంచ్‌లకు తానే స్వయంగా శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం వారిద్వారా విడతల వారీగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి శిక్షణా కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ఇటీవల మూడు విడతలుగా జరిగిన పంచాయితీరాజ్ ఎన్నికల్లో విజయం సాధించిన వారందరికీ ప్రభుత్వ లక్ష్యాలను ఈ సందర్భంగా సీఎం వెల్లడించనున్నారు. ఈ శిక్షణకు సంబంధించి సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామాల నుంచి తరలివచ్చే సర్పంచ్‌లకు అవసరమైన భోజన సదుపాయాలు కూడా చేస్తున్నారు.

చట్టం అమలుపైనే ప్రభుత్వం దృష్టి

గ్రామానికి స్థానిక సర్పంచే ప్రథమ పౌరుడన్న రాజ్యాంగంలోని

మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయబోతోంది. గ్రామ పరిపాలనకు సంబంధించి విశిష్ట అధికారాలు కల్పిస్తూ ఈ ఏడాది ప్రారంభంలో అసెంబ్లీలో చట్ట సవరణ చేసిన విషయం తెలిసిందే.

గ్రామ పంచాయతీలకు కీలక అధికారాలు, బాధ్యతలు అప్పగించినప్పటికీ ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నందున ఫలితాలు కనిపించలేదు. కానీ త్వరలో జరగనున్న పంచాయతీరాజ్ ఎన్నికల తర్వాత సవరించిన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రి పదవిని అధిష్టించిన తర్వాత గ్రామ పంచాయతీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. క్షేత్రస్థాయి స్థితిగతులు, అంతర్గత వ్యవహారాలు, గ్రామ పరిపాలన, లోటుపాట్లు, లొసుగులపై గట్టి పట్టున్న కేసీఆర్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలన్న వ్యూహంతో ముందుకు సాగుతున్నారు.

గ్రామ అభివృద్ధి అంశాలపై తీసుకునే కీలక నిర్ణయాల్లో సర్పంచ్‌దే ప్రధాన భూమిక కానుంది. వ్యవసాయ రంగ అభివృద్ధికి, కుల వృత్తుల ప్రోత్సాహకానికి అమలు చేస్తున్న కార్యక్రమాల్లో స్థానిక సంస్థలకు మరిన్ని అధికారాలు, బాధ్యతలు అప్పగించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. గ్రామీణాభివృద్ధి లక్ష్యాల సాధనలో స్థానిక సంస్థలు అత్యంత క్రియాశీలంగా పని చేసేవిధంగా, విధి నిర్వహణలో విఫలమైన వారిపై చర్యలు తీసుకోవడానికి అవకాశం కల్పించే విధంగా ముందుచూపుతో కొత్త పంచాయితీరాజ్ రూపొందించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు పంచాయితీరాజ్ వ్యవస్థపై అవగాహన కోసం బడ్జెట్ సమావేశాలకు ముందుగానే శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి పాల్గొని ప్రభుత్వ పథకాల అమలులో సర్పంచ్‌ల పాత్రను వెల్లడించానున్నారు. ప్రజలకు మరింత జవాబుదారీగా, మరింత క్రియాశీలకంగా తమ కార్యకలాపాలు నిర్వహించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై తనకున్న క్షేత్రస్థాయి అనుభవాలను, అభిప్రాయాలను, భవిష్యత్తు ఆలోచన విధానాన్ని జోడించి వారికి మార్గనిర్దేశం చేయనున్నారు.

అభివృద్ధిలో సర్పంచ్‌లది ప్రధాన భూమిక

గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు



''కేవలం విధులు, బాధ్యతలు అప్పగించి దులుపుకుంటే గ్రామ పంచాయితీలు ఏ పనీ చేయలేవన్న విషయాన్ని సీఎం కేసీఆర్ గుర్తించారు. వాటికి కావాల్సిన నిధులు కూడా ప్రతిచేటా బడ్జెట్‌లోనే కేటాయిస్తున్నారు. 2019-20 వార్షిక కేటాయింపులతోనే ఆ ప్రక్రియ మొదలుపెట్టారు. బడ్జెట్‌లో నేరుగా గ్రామ పంచాయితీలకు జనాభా ఆధారంగా నిధులు కేటాయిస్తున్నారు. ఒక్కో గ్రామ పంచాయితీకి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు నిధులు సమకూరుస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత కేంద్ర నిధులు, కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ కింద లభ్యమయ్యే డబ్బులు, ఫైనాన్స్ కమీషన్ ద్వారా వచ్చే నిధులు, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సమకూరే డబ్బులు అన్నీ జమచేసి గ్రామ పంచాయితీ అప్పగించాలన్న ధృడసంకల్పంతో ఉన్నారు. గ్రామస్తుల్లో కూడా శ్రమదానం ద్వారా పనులు చేసుకునే ధోరణిని అలవాటు చేయాలనుకుంటున్నారు. గ్రామ పంచాయితీకి విధులు, బాధ్యతలతో పాటు కావాల్సిన నిధులు, ప్రజల భాగస్వామ్యం, నిరంతర పర్యవేక్షణ ఉంటేనే సమర్థవంతంగా పనిచేస్తారనన్ది కేసీఆర్ అభిప్రాయం. అన్ని విధాలా సహకారం అందించినా సరే, నిధుల నిర్వహణలో వైఫల్యం చెందినచోట క్రమశిక్షణ చర్యలు తీసుకునే వెసులుబాటు ప్రభుత్వానికి ఉంటుంది.

బడ్జెట్‌లో హామీలకు ప్రాధాన్యం... ఓటాన్ అకౌంటే

(మొదటిపేజీ తరువాయి)

భగీరథ పథకానికి రూ. 19,205 కోట్లు, చెరువుల పునరుద్ధరణకు రూ. 5వేల కోట్లు, లేదంటే ప్రాజెక్టుల పూర్తికి కనీసంగా రూ. 10వేల కోట్లైనా కావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించింది. అయితే కేంద్రం దీనిపై ఎటువంటి సానుకూల వైఖరిని చూపకుండా బడ్జెట్‌లో నిధులేమీ కేటాయించలేదు. దీంతో ఆయా ప్రాజెక్టులను ప్రత్యేక కార్పొరేషన్ల సహకారంతో రుణ సేకరణ చేసి పూర్తిచేయాలని, ఇందుకు నిధులను కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఏర్పడే కేంద్ర ప్రభుత్వం, ఆ తర్వాత కేంద్రం ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్ వంటి పరిస్థితులను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర బడ్జెట్ కాలపరిమితిని పొడిగించడమా, పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడమా నిర్ణయించాలనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఆర్థిక శాఖకు అందిన 32 శాఖల అంచనాలు, ప్రతిపాదనల ఆధారంగా బడ్జెట్‌కు తుదిరూపి దిశగా ప్రభుత్వం సన్నద్ధమవుతున్నది. అయితే ఇందులో ప్రాధాన్యతా రంగాలు, అప్రాధాన్యత రంగాలను నిర్దేశించుకుని కేటాయింపులు చేసేలా కార్యచరణ మొదలవనుంది. ఆయా శాఖల ప్రతిపాదలను, రాష్ట్ర రాబడుల అంచనాల ఆధారంగా రూపొందుతున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మూడు లేదా ఆరు నెలల పరిమిత కాలనికైనా 12 నెలల ఆధారంగానే పూర్తిస్థాయి బడ్జెట్ వ్యయ అంచనాలను ప్రతిబింబించాలని ఆదేశించారు.

సీఎంవోకు కొత్తరూపు?

(మొదటిపేజీ తరువాయి)

అమల్లో లేదు. కేవలం జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి కార్యాలయంలో వ్యక్తిగత, పాలనాపరమైన పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఓ మంత్రిని నియమిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్ సాధారణ పరిపాలనాశాఖతో పాటు కీలకమైన సాగునీటి పారుదలశాఖ, సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, వాణిజ్య పన్నులశాఖలను ఇతర మంత్రులకు కేటాయించకుండా తానే స్వయంగా నిర్వహిస్తానని నిర్ణయించారు. ఈ మేరకు ఆయన సంకేతాలు కూడా ఇచ్చారు. సీఎంగా ఇటు ప్రభుత్వం, అటు పార్టీని నడిపించడంతో పాటు జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేసి క్రియాశీలక పాత్ర పోషించాలని నిర్ణయించిన నేపథ్యంలో తన కార్యాలయంలో నలుగురు పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులను నియమించి వారికి ఒక్కో శాఖను అప్పగించాలన్న ప్రతిపాదనకు వచ్చినట్టు ప్రగతి భవన్ వర్గాలు చెబుతున్నాయి. మంత్రులకు, సీఎం కార్యాలయంలో పనిచేసే ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రి నడుమ ఈ నలుగురు అనుసంధానకర్తలుగా పనిచేస్తారని తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ పూర్తయ్యాక 15 నుంచి 18 మంది పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులను నియమించాలని ఇప్పటికే ఒకనిర్ణయానికి వచ్చిన కేసీఆర్ ఇందులో నలుగురిని తన కార్యాలయంలో నియమించుకోవాలని నిర్ణయించారు. తనతో కలిపి కేవలం 17 మందిని మాత్రమే మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉన్నందున ఈ దఫా కొత్తగా పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులను నియమించాలని కేసీఆర్ ప్రతిపాదిస్తున్న సంగతి తెలిసిందే. ఈ దిశగా ఇప్పటికే కరీంనగర్ లోక్‌సభసభ్యుడు వినోద్ కుమార్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ కసరత్తు చేసి కేసీఆర్‌కు నివేదిక అందజేసినట్టు తెలుస్తోంది.

ఆ మూడు రాష్ట్రాల్లో...

ఇతర రాష్ట్రాల్లోనూ పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శుల వ్యవస్థ పని చేస్తోందని ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాల్లో ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పార్లమెంటరీ కార్యదర్శులను నియమించుకుని వారితో పని చేయించుకుంటున్నారని ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని నివేదికలో పొందుపరిచినట్టు చెబుతున్నారు. జిల్లాలు, సామాజిక వర్గాలు తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్ర, గతంలో నిర్వహించిన పదవులు, ప్రజా జీవితంలో వారికున్న అనుభవం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులను ఎంపిక చేయాలన్న నిర్ణయానికి కేసీఆర్ ఇప్పటికే వచ్చారు. మంత్రివర్గ విస్తరణ పూర్తయిన వెంటనే ఈ నియామకాలకు సంబంధించి ఆర్డినెన్స్‌ను తీసుకురావడమో లేక శాసనసభలో చట్టాన్ని తీసుకువచ్చి ఆమోదింపజేయడమో చేయాలని ప్రతిపాదించారు. గత ప్రభుత్వాల్లో మంత్రులకు తోడుగా సహాయ మంత్రులు ఉండేవారు. వీరికి మంత్రిమండలి సమావేశాల్లో పాల్గొనే అవకాశం ఉండేది కాదు. ఆ తరహాలోనే పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులను నియమించి వారితో ప్రభుత్వ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెప్పించడం, ఆ సమాచారాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరవేయడం వంటి కార్యక్రమాలను అప్పగించాలని ప్రతిపాదించారు.

మంత్రుల కోసం పార్లమెంటరీ కార్యదర్శులు

మంత్రులకు సహాయకులుగా ఒక్కో మంత్రికి ఒక్కో పార్లమెంటరీ కార్యదర్శిని నియమించాలని వీరికి సచివాలయంలో లేదా శాసనసభ ఆవరణలో కార్యాలయాలను ఏర్పాటుచేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. మంత్రులకు కల్పించే అన్ని ప్రోటోకాల్ విధానాన్ని పార్లమెంటరీ కార్యదర్శులకు కూడా కల్పించాలని జీతభత్యాలు, వసతి సౌకర్యాలను కూడా మంత్రులకు సమానంగానే ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. గతంలో ఈ తరహా కార్యదర్శులను నియమించినప్పటికీ కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు బట్టింది. అప్పట్లో నియమితులైన ఆరుగురు పార్లమెంటరీ కార్యదర్శులు తమ పదవులను కోల్పోవలసి వచ్చింది. ఈ దఫా న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని కేసీఆర్ న్యాయశాఖ, సాధారణ పరిపాలనాశాఖ అధికారులను ఆదేశించారు. అందరి సమన్వయంతో ఆర్డినెన్స్‌కు సంబంధించి ముసాయిదాను సిద్ధంచేసినట్టు తెలుస్తోంది. శాసనసభ సమావేశాలలోపు పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాలకు సంబంధించి నిర్ణయం తీసుకుంటే ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని లేనిపక్షంలో శాసనసభలో బిల్లు రూపంలో సభ ముందుకు తేవాలని నిర్ణయించినట్టు సమాచారం. పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాలకు సంబంధించి కేసీఆర్ ఇప్పటికే గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ దృష్టికి తీసుకువెళ్ళి ఈ పదవులకు ఉన్న ప్రాధాన్యతలను వివరించారని సీఎం కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. అవినీతిరహిత పాలనను అందిస్తామని ఇప్పటికే ఎన్నికల ప్రచార సభల్లో, పార్టీ కార్యక్రమాల్లో తరచూ ప్రకటించిన కేసీఆర్ తన కార్యాలయంలో పార్లమెంటరీ కార్యదర్శులను నియమించడం ద్వారా ఆయా శాఖలకు సంబంధించిన దస్త్రాలను త్వరితగతిన పరిశీలించి ఆమోదముద్ర వేసేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ కార్యదర్శుల నియామకంతో తన కార్యాలయానికి వచ్చే ఫైళ్ళను కూడా పరుగులు పెట్టించవచ్చని తద్వారా ప్రభుత్వం తరపున జరిగే నిర్ణయాలకు త్వరితగతిన అమలయ్యే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నియామకాలతో జాతీయ స్థాయిలో తాను ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్ కూడా విస్తృతపరిచే అవకాశాలు ఉంటాయని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ఇక్కడి నుంచే కిసాన్ సమ్మాన్?



- కేంద్ర ప్రభుత్వ కొత్త పథకం తక్షణ అమలుకు సిద్ధంగా ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- ఇప్పటికిప్పుడు ఇవ్వగలిగేలా రైతుల పూర్తిస్థాయి సమాచారం
- తొలివిడత నిధులకోసం సిద్ధంగా నివేదిక
- 47 లక్షల రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాలు, ఆధార్ నంబర్లు సిద్ధం
- జిల్లాలు, గ్రామాలవారీగా ఆర్థికశాఖ వద్ద నివేదికలు
- కేంద్రం ఎప్పుడు కోరినా క్షణాల్లో అందించేందుకు రెడీ
- కేంద్ర ప్రాయోజిత పథకాల అమల్లో నంబర్‌వన్‌గా నిలిచే అవకాశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి రైతుసంక్షేమం కోసం వినూత్న కార్యక్రమాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలిచిన తెలంగాణ మరో ఘనతను సొంతం చేసుకోబోతోంది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన కిసాన్ సమ్మాన్ యోజన పథకం వెనువెంటనే అమలు చేయాలంటే అందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణాయే కావడం విశేషం.

అమలుకు అవసరమైన పూర్తిస్థాయి వన రులు కలిగి ఉన్నది కూడా తెలంగాణ ఒక్కటే. ఆర్థిక, మేధావి వర్గా లను ఆలోచింపజేసే విధంగా ఇక్కడ ప్రవేశపెట్టిన రైతుబంధు పంట పెట్టుబడి పథకానికి ముందు మూడు నెలలపాటు జరిగిన కసరత్తు, సిద్ధం చేసిన నివేదికలు ఇప్పుడు దేశానికే తలమానికంగా మారుతు న్నాయి. 2018, డిసెంబర్ 1 నుంచే అమల్లోకి తెచ్చిన కిసాన్ సమ్మాన్ పథకం అమలుకు ఇప్పటికిప్పుడు ఏ రాష్ట్రంలోనూ రైతుల సంక్షిప్త సమాచారం అందుబాటులో లేదు. కమతాల వారీగా రైతులు, వారి కుటుంబాల వివరాలు, ఆధార్‌కార్డు లింకేజీతో బ్యాంకు అకౌంట్ల వివరాలన్నీ పకడ్బందీగా ఉన్నాయి. కేంద్రం అడిగిందే తడవుగా ఈ నివేదికలు పంపేందుకు సిద్ధమని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథితెలిపారు. వందశాతం పారదర్శకతతో సమ్మాన్ యోజన అమలుకు కావలసిన లెక్కలన్నీ మనవద్ద ఉన్నాయన్నారు.

రాష్ట్ర నివేదిక...కలెక్టర్లు కీలకం?

రాష్ట్ర ప్రభుత్వం పంపిన నివేదికల ప్రకారం రైతుల సంఖ్య, అందుకు సమానమైన నిధుల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లోకి బదిలీ చేసినప్పటికీ జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఆ నిధులు రైతుల ఖాతాల్లోకి బదిలీ చేయబడతాయి. ఇదివరకున్న కేంద్ర ప్రతిపాదిత పథకాల అమలుకు ఏటా రాష్ట్రానికి వచ్చే నిధులకన్నా ప్రస్తుతం దాదాపు రూ.13వేల కోట్లు ఎక్కువగా వస్తాయని ఆర్థిక నిపుణులు అంచనా.

గత ఏడాది రూ.3.04 లక్షల కోట్లు వివిధ దశల్లో రాష్ట్రానికి విడుదల కాగా, 2019-20 ఆర్థిక సంవత్సరానికిగానూ కేంద్ర పథకాల అమలుకు రూ.3.27 లక్షల కోట్లు వస్తాయని చెబుతున్నారు.

రాష్ట్రానికి రూ.2825 కోట్లు సమ్మాన్ నిధులు?

తెలంగాణలో రైతుల వివరాల మేరకు కిసాన్ సమ్మాన్ యోజన వర్తింప చేస్తే కేంద్రం నుంచి మూడు విడతలుగా రాష్ట్రానికి రూ. 2,825 కోట్లు రానున్నాయి. ఈ నెలాఖరికి మొదటి విడత నిధులు రూ. 942 కోట్లు విడుదలవుతాయి. దేశవ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం 14.57 కోట్ల చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు ఉం డగా, సమ్మాన్ యోజన ద్వారా 12.56 కోట్ల మంది రైతులకు నేరుగా లబ్ధి చేకూరనుంది. జాతీయ స్థాయిలో సరాసరిగా 86 శాతం రైతు కుటుంబాలకు లబ్ధి చేకూర్చే ఈ పథకంతో రాష్ట్రంలో 98 శాతం రైతులకు మేలు జరగనుంది.

అయితే ఇప్పటికిప్పుడు ఈ పథకాన్ని అమలు చేసేందుకు అన్ని రకాల వనరులున్న రాష్ట్రం తెలంగాణ ఒక్క టే కావడంతో సమ్మాన్ యోజన అమల్లోనూ మొదటి స్థానం కానుంది. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, గుజరాత్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాల వద్ద రైతుల సంక్షిప్త సమాచారం ఉన్నప్పటికీ బ్యాంకు ఖాతాలు, నిర్దేశిత భూ గరిష్ఠ పరిమితికి లోబడిన వివరాలతో జాబితాలు రూపొందించాలంటే ఎంత లేదన్నా నెల రోజుల సమయం పడుతుంది. మిగతా అ నేక రాష్ట్రాల్లో పాక్షిక గణాంకాలు కూడా లేనందున సమ్మాన్ యోజన అమలుకు మూడు నెలలకు సమయం అవసరమవుతుందన్నారు.

కేంద్రం ప్రవేశపెట్టిన కిసాన్ సమ్మాన్ యోజన పథకం అమలుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అధికారులు లెక్కలు సిద్ధంచేశారు. మొదటి విడతగా ప్రతి కుటుంబానికి రూ.2వేల చొప్పు జమ చేసేందుకు అవసరమైన నివేదికను త్వరలోనే పంపనున్నారు. ఒకటి నుంచి ఐదెకరాలలోపు భూమి కలిగి ఉన్న రైతుల వివరాలను కేటగిరి వారీగా విభజించారు.

ఒక ఎకరంలోపు భూమి ఉన్న రైతులు 14.86 లక్షల మంది ఉండగా, మొదటి విడతకు రూ.297.16 కోట్ల నిధులు అవసరమవుతున్నాయి. అలాగే రెండెకరాల్లోపు భూమి ఉన్న రైతులు 13.37 లక్షల మంది ఉండగా, రూ.267.47 కోట్లు, మూడెకరాల్లోపు భూమి ఉన్న రైతులు 8.96 లక్షల మంది ఉండగా, రూ.179.23 కోట్లు, మూడు నుంచి నాలుగు ఎకరాల భూమి ఉన్న రైతుల సంఖ్య 5.75 లక్షలు ఉండగా, అందుకు రూ.115.02 కోట్లు, 4 నుంచి 5 ఎకరాల భూమి ఉన్న రైతులు 4.13 లక్షలు ఉండగా, రూ. 82.65 కోట్ల నిధులు అవసరమవుతాయి. ఆ ప్రకారం జిల్లాలు, గ్రామాల వారీగా రైతులు, వారి బ్యాంకు ఖాతాలు, ఆధార్ నెంబర్లతో కూడిన జాబితాలు ఆర్థిక శాఖ వద్ద సిద్ధంగా ఉన్నాయి. ఏ క్షణంలో కేంద్రం నుంచి పిలుపు వచ్చినా తక్షణమే లెక్కలు పంపేందుకు అన్ని గణాంకాలు కలిగి ఉన్న తెలంగాణ రాష్ట్రం సమ్మాన్ యోజన అమల్లోనూ ప్రశంసలు అందుకోనుంది.


ఇప్పటి వరకున్న సమాచారం మేరకు కిసాన్‌సమ్మాన్ యోజన పథకం ద్వారా రైతులకు అందించాల్సిన మొత్తాన్ని నేరుగా వారి ఖా తాల్లోనే జమ చేయనున్నారు. ఇందుకు సంబంధించి కేంద్రం ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వకపోయినప్పటికీ త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వ్యూహాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ఘనతను రాష్ట్రాలకు దక్కకుండా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టను దేశం నలుమూలలకు చాటేందుకే ప్రధాని మొగ్గు చూపుతారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే అమల్లో ఉన్న గ్రామీణ సడయ్ యోజన, నేషనల్ ఎడ్యుకేషన్ మిషన్, నేషనల్ లైవ్‌లీ హుడ్ మిషన్ తదితర కార్యక్రమాల అమలు బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించిన కేంద్రం సమ్మాన్ యోజన పథకాన్ని మాత్రం నేరుగా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోనే అమలు చేసేందుకు సిద్ధమవుతోంది.

కేంద్రం పర్యవేక్షణలోనే కిసాన్ సమ్మాన్?

అనితరసాధ్యుడు కేసీఆర్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కొత్త పథకం అమలుకు గరిష్టంగా ఐదు ఎకరాల్లోపు వ్యవసాయ భూమి కలిగి ఉన్న వా రంతా అర్హులే. రాష్ట్రంలో దాదాపు 47 లక్షల మంది అర్హత కలిగిన రైతులు ఉన్నారు. రైతుబంధు పెట్టుబడి, జీవిత బీమా పథకాలు ఆదర్శవంతమని రాజకీయ మేధావులు చెబుతున్నప్పటికీ అమల్లో కొన్ని రాష్ట్రాలకే సాధ్యమవుతోంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ముడి పెట్టుకుని ఉన్న ఈ పథకాలపై ఇప్పటికే ఆరు రాష్ట్రాలు అధ్యయనం చేసి వెళ్ళినప్పటికీ ఒకటి, రెండు రాష్ట్రాలు స్వల్ప ప్రయోజనాలతో అమలు చేస్తున్నాయి. అదే తరహాలో కేంద్రం రైతు ప్రాయోజిత పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ రాష్ట్రం ఇస్తున్న మేరకు రైతులకు లబ్ధి కలిగే అవకాశం లేదు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం అయినప్పటికీ తెలంగాణ లో అనతికాలంలోనే ఆర్థిక పరిపుష్టి సాధించి అనేక సంక్షేమ పథకాల ద్వారా సంపదను పేద, మధ్య తరగతి కుటుంబాలకు పంచుతున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కింది.

మోడీ మైండ్ గేమ్



శుక్రవారం లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ పలికిన పలుకులు వింటుంటే చిలకపలుకుల్లానే అనిపించాయి. పీయూష్ గోయల్‌ది నిజానికి ఇందులో అతిథి పాత్రే. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అనారోగ్యంతో న్యూయార్క్‌లో ఆసుపత్రిలో ఉండటంతో గోయల్ ఆయన పాత్ర పోషించాల్సివచ్చింది. గోయల్ జైట్లీ పాత్రను సమర్థంగానే పోషించారు. ఇంకా చెప్పాలంటే ఆయనకన్నా చాలా ఎక్కువగానే పోషించారు. ప్రధాని మోడీ గోయల్‌నే ఎందుకు ఎంచుకున్నారో టీవీ ప్రత్యక్ష ప్రసారంలో బడ్జెట్ ప్రసంగం చూస్తున్నంతసేపూ తెలిసిపోయింది. అరుణ్ జైట్లీ ప్రదర్శించలేని హావభావాలన్నింటినీ గోయల్ చూపెట్టారు. ఇంకా చెప్పాలంటే అచ్చం మోడీని అచ్చు గుద్దినట్టే చేశారు. మాటల్లో స్పష్టత..ముక్కుసూటిగా నొక్కివక్కాణించి చెబుతుంటే..సభలో అధికారపక్ష సభ్యులు..ముఖ్యంగా కమలనాథులు బల్లలు చరుస్తుంటే..గోయల్ మరింత ఉత్సాహంతో రెచ్చిపోతుంటే..ప్రధాని మోడీ నవ్వులు చిందిస్తూ..గట్టిగా బల్ల చరుస్తూ వత్తాసు పలుకుతుంటే..ఆ దృశ్యం యావత్తూ ఒక సమర శంఖారావం పూరించిన వైనాన్ని ప్రస్ఫుటం చేసింది. ప్రధానమంత్రి మోడీ ఢంకా మోగించడాన్ని అనేకసార్లు చూశాం. లోక్‌సభలో ఆయన తన సీటులో కూచుని ఎడమ చేయి ఆకాశంలోకి ఎత్తి..గట్టిగా బల్లమీద చరుస్తుంటే..పెద్ద ఢంకాని మోగిస్తున్న సందర్భాలు గుర్తుకొచ్చాయి. సభలో అంత గట్టిగా ఆయన బల్ల చరచడంలోని ఆంతర్యమే ఇక్కడ చర్చనీయాంశం. అదీ ఒకసారి కాదు. అనేకసార్లు. ఆయనకి వంతపాడుతూ బీజేపీ సభ్యులందరూ ముక్తకంఠంతో మోడీ జై అంటూ నినదిస్తుంటే..ప్రతిపక్ష సభ్యులు విస్తుపోయి చూస్తూండిపోవడం మినహా మరేమీ చేయలేకపోయారు. అయిదేళ్ల పదవీకాలంలో తమ ప్రభుత్వ విజయాలతో గోయల్ తన ప్రసంగాన్ని ప్రారంభించి మెల్లగా బడ్జెట్ వివరాల్లోకి వెళ్లారు. మొదటి అరగంటసేపూ ఈ చప్పట్ల పర్వం నిరాఘాటంగా నడిచింది. ఆతర్వాత కూడా ప్రతి ఒక్క ప్రతిపాదనకీ కమలనాథులు తమ గళాలు కలిపారు. సభ్యులు స్పందించడాన్ని అర్థం చేసుకోవచ్చు. సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అడుగడుక్కీ అలా స్పందించడం వ్యూహాత్మకంగానే భావించాలి. కేవలం విజయాలనే ప్రస్తావించడం ద్వారా ఫీల్‌గుడ్ భావాన్ని వ్యాప్తిచేసే ప్రయత్నంలో భాగంగా అందరూ కూడబలుక్కున్నట్టు బల్లలు చరుస్తూ నినాదాలు చేస్తూ గోయల్ ప్రసంగాన్ని మరింత రక్తి కట్టించారు. ఇది ప్రతిపక్షం మీద మానసిక యుద్ధం. ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలోకి నెట్టడం ద్వారా ఆధిపత్యస్థానాన్ని పరిరక్షించుకునే వ్యూహం ఇందులో కనిపిస్తుంది. అంతేకాదు. అటు ప్రజల మనస్సుల్లోనూ గుడ్‌విల్ కారకాన్ని నాటే ప్రయత్నంగా దీన్ని భావించాలి. ఒకవంక సర్జికల్ స్ట్రయిక్స్, డీమోనిటైజేషన్ వంటి నిర్ణయాల మీద ప్రజల్లో భిన్నాభిప్రాయలుండగా..వాటినన్నింటినీ విజయాలుగా అభివర్ణించి..ప్రజల ముందు అంగరంగ వైభోగపు దృశ్యాలను ఆవిష్కరించడానికి ఇలాంటి అదనపు హంగులు అవసరమవుతాయి. ప్రధాని మోడీకి ఇలాంటి తరుణోపాయాలు బాగా తెలుసు కాబట్టే...చట్టసభలో బడ్జెట్ సమర్పించే తొలిదశనుంచే ప్రజల ముందుకి మహత్తర బడ్జెట్ వస్తున్నదన్న సంకేతాలను అలా ఇచ్చారు. ఇదంతా ఎన్నికల ముందు బడ్జెట్ అన్న స్పృహతోనే పాలకపక్షం వ్యూహాత్మకంగానే ఇలా వ్యవహరించిందని చెప్పుకోవచ్చు. బడ్జెట్‌లో ఏమేమి ప్రతిపాదించారన్నది ముఖ్యమే. అయితే అంతకన్నా ముందు..ఎలా

ప్రతిపాదించారు..ఎలాంటి వాతావరణంలో ప్రతిపాదించారన్నది ఆధునిక ఎన్నికల వ్యూహరచనా చమత్కృతుల్లో ఒకటి. ప్రధాని మోడీ..ఆపత్కాలపు ఆర్థికమంత్రి గోయల్..కమలనాథులు ఈ వ్యవహారాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. దీన్నుంచి యావత్ రాజకీయ పార్టీలు కొత్త పాఠాన్ని నేర్చుకున్నాయి. ఎన్నికలవేళ బడ్జెట్‌లో ఏస్థాయి తాయిలాలు ప్రకటించాలనే అన్ని పార్టీలు ఆలోచిస్తుంటాయి. అది ముఖ్యమే అయినా..ఆ తాయిలాల్లోని తిరుగుల్లు మరుగుల్లు పరమార్థం తెలీకుండా జనాన్ని ముందస్తుగా సమ్మోహనంలో ఎలా పడేయాలో మొన్నటి బడ్జెట్ సమర్పణ సన్నివేశం నుంచి నేర్చుకోవచ్చు.

ఇదంతా ఒక ఎత్తయితే..మోడీ ఎన్నికల బడ్జెట్ జనరంజకంగా ఉంటుందా? ఉంటే ఏస్థాయిలో ఉంటుంది? ఇలాంటి ప్రశ్నలు వారాల తరబడి చక్కర్లు కొట్టాయి. అందులో ముఖ్యమైనది రైతులకు ఏడాదికి ఆరువేల రూపాయల పెట్టుబడి పథకం. ఒకవంక కొన్ని రాష్ట్రాలు ఇలాంటి పథకాలను అమల్లోకి తెచ్చిన తరుణంలో మోడీ అదే పథకాన్ని ఆశ్రయించారు. అయితే రాష్ట్రాల పథకాల కన్నా పదునైన పథకంగా దీన్ని తీర్చిదిద్దటంలో శ్రద్ధ పెట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పథకాలకు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆద్యురాలిగా చెప్పుకోవాలి. తెలంగాణ సీఎం కేసీఆర్ మానసపుత్రికగా వెలుగులోకి వచ్చిన రైతుబంధు పథకంలో రెండు సీజన్లకు రెండుసార్లుగా ఎకరానికి ఐదేసి వేల రూపాయలు రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. తొలి విడతలో నాలుగేసి వేలు ఇచ్చారు. తాజాగా దాన్ని ఐదేసి వేలు చేశారు. అంటే మొత్తం మీద ఏడాదికి ఎకరానికి పదివేలు రైతులకు ముడుతున్నాయి. ఎన్ని ఎకరాలుంటే అన్ని పది వేలు వస్తాయి. నిజానికి ఇది తిరుగులేని పథకం. అత్యంత ఖరీదైన పథకం కూడా. అయిదెకరాలుంటే యాభయ్ వేలు వస్తాయి. అయితే ఐదెకరాల్లోపు ఉన్నవారికే కేంద్ర పథకం వర్తిస్తుంది. నాలుగెకరాలున్నా ఆరువేలే వస్తాయి. అదీ మూడు విడతలుగా ఇస్తారు. దేశవ్యాప్తంగా ఇలాంటి భారీ పథకాలను అమలుచేయడం కష్టతరమే అయినా..సామాన్య జనంలోకి వచ్చేసరికి ఇది నీటిబొట్టు చందమవుతుంది. పథకమేదైనా ఓటర్లకు సాధికారికంగా నేరుగా నగదు బదిలీకి శ్రీకారం చుట్టినట్టయింది. దీనిలోని మంచిచెడ్డల మాటెలా ఉన్నా..ప్రధాని మోడీ మాత్రం లోక్‌సభ ఎన్నికలకు రంగస్థలాన్ని బడ్జెట్‌లోనే ఎంచుకున్నట్టు అర్థమవుతున్నది. ఇందులో పరమార్థం ఏమిటి? ఈసారి ఎన్నికలు దేని ప్రాతిపదికగా జరగబోతున్నాయి? అంశాలవారీగా తీర్పు కోరే అవకాశాన్ని వినియోగించుకోవడానికి పాలకపక్షం సిద్ధంగా ఉందా? దీనికన్నా అతి సులువైన మార్గాన్ని మోడీ బృందం ఆశ్రయిస్తున్నది. అదే మానసిక యుద్ధం...సెంటిమెంట్‌తో పెనవేసిన మానసిక యుద్ధం. ఒక్కసారి దీన్ని గనక ప్రేరేపించి వదిలితే..ఇక వైఫల్యాల ఊసే రాదు. సమస్యల ప్రాతిపదికనో అంశాలవారీగానో ఎన్నికల పోరాటం చేయడం కన్నా మానసిక యుద్ధమే తేలికైన పని అని మోడీకి తెలుసు. అవతల ప్రతిపక్షం ఇంకా అస్త్రశస్త్రాలను కూడగట్టుకునే పనిలోనే ఉంది. చుట్టరికాలింకా ఖరారు కాలేదు. ఎవరు ఎవరితో కలవాలనేదింకా అస్పష్టంగా ఉంది. ప్రధాన కూటమిగా ఉన్న యూపీయే కూడా ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకునే పనిలో ఉంది. ప్రధానంగా దాని సారథి కాంగ్రెస్ పార్టీ నాలుగు రోడ్ల కూడలిలో ఉంది. అందరితో కరచాలనానికి అది సిద్ధంగా ఉన్నా దగ్గరగా ఉంటున్నట్టు ఉంటూనే దూరం జరిగి కూచునేందుకే అనేక పార్టీలు ఇష్టపడుతున్నాయి. ఈనేపథ్యంలో వచ్చే రెండు మూడు వారాల్లో ఎలాంటి రాజకీయ సమీకరణాలు ఖరారవుతాయన్నది ఆసక్తికరమే. గత కొన్నేళ్లలో లేని విధంగా ఈసారి కూటముల కుంపట్ల హడావిడి ఎక్కువైంది. ఒకటి కన్నా ఎక్కువ కూటములకు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది నిస్సందేహంగా ఎన్డీయేకి సానుకూలమైన అంశంగా మారవచ్చు. మోడీకి ఇదే అదనపు బలంగా పరిణమించే అవకాశాలున్నాయి. మోడీ ధీమా కూడా ఇదే. ప్రతిపక్షాల్లో అనైక్యతకు తోడు మానసిక యుద్ధంతో మరింతగా కుంగదీయాలన్నది ఆయన ఉద్దేశంగా ఆయన అడుగుల ద్వారా స్పష్టమవుతున్నది. అంతేకాదు.

మోడీ ధైర్యానికి మరో కారణం కూడా ఉంది. ఎన్ని కూటములు కట్టినా చివరకు ఫలితాలొచ్చాక వాటిల్లో ఏ ఒకటి రెండైనా తనవైపు రాకతప్పదని మోడీ లెక్కలు వేస్తున్నారు. కూటముల ఊసుల్లో మునిగితేలుతున్న పార్టీల్లో కొన్నింటిని తమ అదృశ్యమిత్రులుగా ఆయన భావిస్తున్నారు. ఎన్డీయేకి ఈసారి సీట్లు తగ్గవచ్చునన్న ప్రచారాన్ని మోడీ సీరియస్‌గా తీసుకుంటున్నారు గాని..అది ప్రచారమైనా అంశంగా మాత్రం భావించడం లేదు. తమను విజయతీరాలకు చేర్చడంలో తాజా బడ్జెట్ చాలావరకు ఉపకరిస్తుందని ఆయన నమ్ముతున్నారు. ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని బడ్జెట్ అయ్యాక ఆయన చేసిన వ్యాఖ్యల్లో పరమార్థం ఇదే. ఇంకా మరికొన్ని తాయిలాలను ప్రకటించే పనిలో ఉన్నట్టు చెప్పకనే చెప్పారు. దీనికితోడు 1999 తర్వాత పుట్టిన కొత్త ఓటర్లు ఈసారి ఎన్నికల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశాలున్నాయి. వాళ్లసంఖ్య పదమూడు కోట్ల దాకా ఉంది. తన పాలన పట్ల వారు ఆకర్షితులై ఉండటమే కాకుండా ఇంకా ఆశావహ దృక్పథంతో ఉన్నారని తన సొంత అనుచరగణం సేకరించిన విశ్వసనీయ సమాచారంతో మోడీ తృప్తి చెందారని వినికిడి. ఈసారి ఎన్నికల వరకు సమరాంగణంలో ఓటర్ల ముందు తానే నిశ్చల సుస్థిర ఏకైక మార్గాన్వేషిగా నిలుస్తున్నట్టు మోడీకి ఖచ్చితమైన సమాచారం ఉందని ఆయన అనుచరగణం ప్రచారం చేస్తున్నది. ఇవన్నీ మోడీ అనుకుంటున్న మానసిక యుద్ధతంత్రంలోని మెళుకువలుగానే స్వీకరించాల్సి ఉంటుంది.

ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తన సోదరి ప్రియాంక గాంధీని తెరమీదికి తెచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచారు. నిజానికి కమలనాథులు కూడా దీన్ని ఊహించినట్టు లేరని తర్వాతి పరిణామాల ద్వారా వెల్లడైంది. ఎన్నికల బరిలోకి ప్రియాంకగాంధీ రంగప్రవేశంతో బీజేపీ తన వ్యూహాలను పునర్నిర్వచించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. ఆమెను కేవలం ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు భాగానికి మాత్రమే పరిమితం చేస్తున్నట్టు నియామకపత్రంలో ఉదహరించడం కేవలం వ్యూహాత్మక అడుగుగానే కమలనాథులు భావిస్తున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ ఆమె పాత్ర మరింత విస్తృతమయ్యే అవకాశాలే మెండుగా ఉన్నాయి.

కాలు మోపడం వరకే ఆచితూచి ఆలోచించడం..ఒక్కసారి అడుగేశాక ఇక ఎంతదాకా వెళ్లాల్సిఉంటే అంతదాకా వెళ్లడానికి సిద్ధం కావడమే యుద్ధతంత్రం. ప్రియాంకగాంధీ దీనికి సన్నద్ధమయ్యే బరిలోకి దిగిఉంటారని వేరే చెప్పనక్కర్లేదు. ప్రియాంకకు సమఉజ్జీని వెతికే పనిలో బీజేపీ తలమునకలై ఉంది. రాహుల్ ముమ్ముందు మరెంత ప్రభావం చూపగలరన్నది అటుంచితే..ప్రియాంకగాంధీ మీద కాంగ్రెస్ పార్టీ బోలెడు ఆశలు పెట్టుకున్నది. అయితే ఆమె పాత్ర కేవలం ప్రచారానికి, ప్రభావం చూపడానికి మాత్రమే పరిమితమవుతుందా లేక మరికొన్ని అడుగులు ముందుకు పడతాయా అన్నది ఒక సందేహంగా మారింది. రాహుల్ రాజీబాటలో పయనిస్తున్నందున ఆ సందేహం మరింత తీవ్రమవుతున్నది. మోడీని గద్దెదింపాలంటే ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలన్న ఒకేఒక లక్ష్యంతో అందలానికి దూరంగా ఉండేందుకైనా సిద్ధపడ్డ రాహుల్‌గాంధీ మరిన్ని త్యాగాలకు సిద్ధం కావాల్సివచ్చినా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ప్రతిపక్షపార్టీల్లో అనేకం రాహుల్ నాయకత్వం పట్ల మౌనంగానే విముఖత చూపుతున్నారు. ఈనేపథ్యంలో రాహుల్ చాటు ప్రియాంకలా కాకుండా కేవలం ప్రియాంకలా ప్రజల ముందుకు పంపితే మొత్తంగా రాజకీయ సన్నివేశం మారవచ్చన్న చర్చలు ఒకవంక సాగుతున్నాయి. ఇదే జరిగితే కాంగ్రెస్ పార్టీలో పెను సంచలనాత్మక పరిణామమే అవుతుంది. కాంగ్రెస్ శ్రేణులు సైతం దీన్ని వ్యతిరేకించకపోవచ్చు. అయితే ఇలాంటి పరిణామాలకు అవకాశాలు బహుదూరంలో ఉంటాయి. రాజకీయాలు త్వరితగతిన మారుతుంటాయని తెలిసిందే. ఏ పరిణామాన్నీ

ఇదమిద్ధంగా కొట్టేయడానికి రాజకీయాల్లో ఆస్కారముండదు. అందుకే ప్రధాని మోడీ ఇప్పుడు రాహుల్‌గాంధీ గురించి కాకుండా ప్రియాంక ప్రభావం గురించి ఆలోచిస్తుంటారని కాంగ్రెస్ నేతలు ప్రయివేటు సంభాషణల్లో అంటుంటారు. రాహుల్‌గాంధీ కిందటి ఎన్నికలకన్నా గణనీయంగా తన గ్రాఫ్‌ని మెరుగుపరుచుకున్నారు. ముఖ్యంగా గత రెండేళ్లకాలంలో ఆయన తన వాణిని జనం బాణీలో చెప్పగలగడం ద్వారా తన గుర్తింపుకి మరింత వన్నె తెచ్చుకున్నారు. ఇది ప్రధాని మోడీ గమనించకపోలేదు. రాహుల్ ప్రభావంతో పాటు మాయా-అఖిలేష్ కూటమి ప్రభావం ఉత్తరప్రదేశ్‌లో ఈసారి తమ ప్రాభవానికి గండికొట్టే ప్రమాదం ఉందన్న విషయాన్ని మోడీ గ్రహించారు. అందువల్లే రాహుల్ ప్రభావం విషయంలో ఆయనకు స్పష్టత ఉంది. ప్రియాంక ప్రభావాన్ని అంచనా వేయడాన్ని బట్టే దాన్ని ఎదుర్కొనే వ్యూహానికి రంగం సిద్ధం చేయాల్సిఉంటుంది. ఇందుకోసం మోడీ కేవలం ఉత్తరప్రదేశ్ సీఎం యోగా ఆదిత్యానాథ్ మీదే ఆధారపడిలేరు. యోగి మీద ఆయనకు నమ్మకం ఉన్నా తన టీం ద్వారా అధ్యయనం చేయిస్తున్నట్టు చెబుతున్నారు. అందుకే ఈసారి ఎన్నికల ప్రచారంలో మోడీకి ఇద్దరు ప్రత్యర్థులుంటారన్న ప్రచారం మొదలైంది.

అందులో ఒకరు రాహుల్ అయితే మరొకరు ప్రియాంకగాంధీ. అయితే రాహుల్ విషయంలో మోడీ ఎంతవరకైనా చొరవ తీసుకుని విమర్శలకు వెళ్లొచ్చుగాని ప్రియాంక విషయంలో ఆయన కొంత పరిమితిలో ఉండక తప్పదు. ఇందుకే బీజేపీ నుంచి వాగ్ధాటి ఉన్న మహిళా నేతల్ని రంగంలోకి దింపాలన్న ఆలోచన ఉంది. బీజేపీలో వాగ్ధాటి ఉన్న మహిళా నేతలకు కొదువేమీ లేదు. అలాగని వారికున్న గుర్తింపునీ తక్కువ చేయలేము. కాని ప్రియాంకకు ఉన్న గుర్తింపు వేరు. గుర్తింపుతో పాటు కుటుంబ నేపథ్యం వేరు. ఆకర్షణ వేరు. ఆ వేగం వేరు. ఆమె ఆహార్యం వేరు. ఆమే ఒక సెంటిమెంటుకి ప్రతిరూపంగా స్థిరపడిపోయారు. ఇన్ని అంశాల సమాహారమైన ప్రియాంక ఎన్నికల వేడిలో మోడీ చేసే మానసిక యుద్ధంలో ఏ స్థాయిలో తలపడతారన్నది అందరికీ ఆసక్తికరంగా మారింది. ప్రధాని మోడీ ఆకర్షణ గల నాయకుడనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయనతో యువనేతగా ముద్రపడ్డ రాహుల్ తలపడటం కొత్త పరిణామమేమీ కాదు.

ప్రియాంకగాంధీకి ఉన్న ఆకర్షణ గురించి వేరే చెప్పనక్కర్లేదు. రానున్న ఎన్నికల్లో ఇద్దరు ఆకర్షణగల నాయకులు తలపడనున్న సన్నివేశం ఆవిష్కృతం కాబోతున్నది. ఎదురీతలో రాటుదేలిన అనుభవజ్ఞుడైన ఆకర్షణీయమైన నాయకుడా..యువరక్తంతో కొత్తశక్తిగా రంగప్రవేశం చేసిన ఆకర్షణీయమైన నాయకురాలా.. ఓటర్లు ఎవరివైపు మొగ్గుతారు? మోడీ చేసే మానసిక యుద్ధంలో ఓటర్లు ఎటువైపు ఉంటారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కునే పనిలోనే ప్రస్తుతం ఓటర్లు ఉన్నారు!!

- వయ్యస్సారెస్

> దేశం మళ్లీ పట్టాలెక్కి.. ప్రగతిపథం వైపు పరుగులు తీస్తున్నదని నేను సగర్వంగా చెప్పగలను. సుస్థిర అభివృద్ధికి మంచి పునాది వేశాం. ప్రజలందరూ నాణ్యతా ప్రమాణాలు కలిగిన మంచి జీవనం గడిపేందుకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించాం. 2022కల్లా సరికొత్త భారతదేశ ఆవిష్కరణకు అడుగులు వేస్తున్నాం. మన దార్శనిక ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో నిర్ణయాత్మక, సుస్థిర, స్వచ్ఛ ప్రభుత్వాన్ని అందించాం. దేశ పరువు ప్రతిష్ఠలకు ప్రాణప్రతిష్ఠ చేశాం. యావద్దేశం మైండ్‌సెట్ మార్చగలిగాం. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించగలిగాం!
>
> - బడ్జెట్ ప్రసంగంలో పీయూష్ గోయల్

మహాభారతంలో...
దమయంతి

తమను చూడ చనుదెంచిన బృహదత్వుడను మహామునితో ధర్మజుడు మామాదిరి ఇడుములు పడిన నృపులు ఇంతకు ముందున్నారా అని అడిగాడు. నీకు తమ్ములు, భార్య, బ్రాహ్మణులు తోడున్నారు. పూర్వం నలుడనే నరేంద్రుడు పుష్కరుడితో జూదమాడి ఓడి ఒంటరిగా అరణ్యంలో, రూపుమారి ఎన్నో కష్టాలు పడలేదా? అన్నాడు ఆ ఋషి. అది ఎట్లో చెప్పమన్నాడు ధర్మజుడు.

నిషధరాజైన వీరసేనుడి కుమారుడు నలుడు మహావీరుడు. అనవరతాక్షప్రియుడు. విదర్భరాజు భీముడి పుత్రిక దమయంతి. ఇద్దరూ పరుల వలన ఒకరి గుణగణాలు మరొకరు విని మెచ్చి ప్రేమ మగ్నమానసులయ్యారు. దీనికి తోడు నలుడివల్ల ప్రాణం నిలుపుకున్న ఒక హంస రాయబారం నడిపి ప్రేమ పెంచింది. దమయంతి నలుణ్ణి ప్రేమిస్తున్న విషయం తెలిసి తండ్రి భీముడు స్వయంవరం చాటాడు. దమయంతీ సౌందర్యం తెలిసిన ఇంద్రుడు అగ్ని మొదలైన లోకపాలకులు స్వయం వరానికి వెళ్లి ఆమెను వారిలో ఎవరో ఒకరు పొందాలని నిశ్చయించుకున్నారు. విదర్భకు వస్తూ అక్కడికే వెళుతున్న నలుణ్ణి దమయంతి దగ్గరకు దూతగా తమను వరించమని చెప్పమని పంపారు, నలదమయంతులు ప్రేమించుకుంటున్నారని తెలిసి కూడా. ఇచ్చిన మాట కాదనలేక నలుడు దమయంతిని కలిసి ఇంద్రాదుల్లో ఒకరిని వరించమని చెప్పడానికి వెళ్లాడు. అప్పుడు దమయంతి ఆతడి సౌందర్యానికి ముగ్ధురాలై కూడా నిర్భయంగా ఇలా పలికింది. నీవు ఎవ్వడవు. ఏ కారణంగా ఇచ్చటకు వచ్చావు. ఇది దుర్భేద్యంబైన అంతిపురి. పైగా నాకు మనో వికారకారకుడవు కూడా అయ్యావు. నిజం చెప్పు అన్నది. అపుడు ఆతడు తాను నలుణ్ణని, దేవదూతనై వచ్చానని ఇంద్రాదుల్లో ఒకరిని వరించమని, వారి ప్రభావంతో ఇలా ఎవ్వరూ గుర్తింపకుండా రాగలిగా నన్నాడు. ఆ మాటలకు దమయంతి దుఃఖిస్తూ



ఏనేడ? ఇంద్రాదులేడ? వారలకు/ నెప్పుడు మ్రొక్కుదు, నేను నీ ధనమ

అన్నది. కానిచో ప్రాణాలు విడుస్తానన్నది. దేవతలకు అప్రియం చేయడం మంచిది కాదన్నాడు నలుడు. వాళ్లూ, నీవూ స్వయం వరానికి వస్తారు గదా! వారి సమక్షంలోనే నిన్ను వరిస్తాను. ఇందు నీదోషం ఏమి ఉండదన్నది. నలుడు దౌత్యం సిద్ధించలేదని ఇంద్రాదులకు చెప్పాడు. దాంతో వారు నలుడి రూపంలో స్వయంవరానికి వచ్చారు. దమయంతి వారినే మనసులో ప్రార్థించింది. నలుణ్ణి తెలిసే విధం చూపమన్నది. అపుడు వారు అని మేషులై, స్వేదరహిత శరీరులై, భూమిని సోకని పాదాలు గలవారై కన్పించారు. దాంతో నలుణ్ణి గుర్తించి దమయంతి వరించింది. నలదమయంతుల వివాహం మహావైభవంగా జరిగింది. ఇంద్రాదులు నలదమయంతులకు అశీస్సులిచ్చి తిరిగి వెళుతుండగా ద్వాపరుడితో కలిసి కలి దమయంతీ స్వయంవరానికి వస్తూ కన్పించి దమయంతి నలుడిని వరించి వివాహమాడిన విషయం తెలిసి పగ పట్టాడు. దంపతుల్ని విడదీసి, రాజ్యాన్ని పరిత్యజింప జేస్తానని పలికి, నలుడు అక్షరతుడని తెలిసి ద్వాపరుణ్ణి అక్షగతుణ్ణి చేసి, తాను నలుడిలో ప్రవేశించడానికి తగిన సమయానికై నిరీక్షిస్తూ ఒకనాడు మూత్రవిసర్జనానంతరం పాదప్రక్షాళనం చేయక సంధ్యావందనం చేస్తున్న సమయంలో కలి నలుడిలో ప్రవేశించాడు. పుష్కరుడికి సహాయపడి సర్వసంపదల్ని రాజ్యాన్ని జూదంతో దూరం చేశాడు. ఎంత వారించినా వినకుండా నలుడు అనేక మాసాలు కలి ప్రభావంతో జూదమాడాడు.

ఎంత యోటు వడిన నంతియ జూదంబు/ నందు దగులు చలము నతిశయిల్లు

దమయంతి కుమారుడు ఇంద్రసేనుణ్ణి, కుమార్తె ఇంద్రసేనను విదర్భకు పంపింది.

భార్యాభర్తలిద్దరూ పురాన్ని వీడి ఎవ్వరి మన్నన లేక ఆకలి దప్పికలతో బాధింపబడ్డారు. తమ దగ్గరే తిరుగుతున్న బంగారు రెక్కలు గల పక్షులను పట్టి తినదలచి వాటిపై తన అంగవస్త్రాన్ని విసరగా అవి ఆ వస్త్రంతో ఆకాశానికి ఎగిరి విగతవస్త్రుడైన నలుడితో ఇలా అన్నాయి. మేము పాచికలం. నీ వస్త్రాల్ని అపహరింప ఇలా పక్షులమై వచ్చామని. తర్వాత నలుడు దమయంతి కట్టిన పుట్టంయొక్క అంచును చించుకుని కట్టుకున్నాడు. అయితే దమయంతి ఇద్దరమూ విదర్భకు వెళ్లి సుఖంగా ఉందామన్నది. దానికి ఆతడు అంగీకరించలేదు. అయితేనేనూ నీతోనే వస్తానన్నది. దుఃఖరోగగ్రస్తుడికి సరిఅయిన మందు భార్యేనట! భార్యతో కలిసి ఉన్న వాడికి కష్టాలు లెక్కలోనివి కావుట! ఆపదకాలంలో అన్నీ తానే అయి భర్తను రక్షిస్తుంది భార్య. కావున నన్ను విడవవద్దన్నది. ఆతడు ప్రాణసమానమైన నిన్ను విడవనన్నాడు. తర్వాత కొంతదూరం అరణ్యంలో పయనించి అలసి సొలసి నిద్రిస్తున్న భార్యను వదలలేక వదలి పోయాడు. ఆమె తనను గానక తండ్రి దగ్గరకు చేరుతుందనే నమ్మికతో మరల కొద్ది వస్త్రాన్ని చించుకుని వెళ్లాడు.

దమయంతి మిక్కిలి దుఃఖించింది. విడువనని పలికి విడుచుట నీవంటి ధర్మపరులకు తగునా అని విలపించింది. సత్యానికి ఏదీ సమానమైనది లేదు గదా! అరణ్యంలో వెతుకుతూ తిరుగుతున్నది. ఇంతలో ఒక సర్పం ఆమెను పట్టుకున్నది. రక్షించమని భర్తను పిలుస్తున్న ఆ ధ్వని విని ఒక ఎఱుకలవాడు వచ్చి ఆ సర్పాన్ని చంపి ఆమెను రక్షించి, ఆమె వృత్తాంతం తెలిసి మన్మథబాణతాడితుడైనాడు. మన్మథుడొక తుంటరి. సమయం సందర్భం లేకుండానే బాణాలు వదులుతాడు. దాంతో ఆమె కోపగించి నేను పతివ్రతనైతే ఈతడిప్పుడే మృతి చెందుతాడన్నది.

వెంటనే వాడు మరణించాడు. తదుపరి దమయంతి తన పతిజాడకై చెట్లను పుట్టలను ప్రార్థించింది. పర్వతాల గుహలలో తొంగి తొంగి చూచింది. ఇంతలో ఒకచోట మున్యాశ్రమం కన్పించింది. మునుల్ని నలుడి విషయం కనుగొని చెప్పమన్నది. వాళ్లు కొద్దిరోజులలో నీభర్తను చూడగలవని, కలియగలవని పలికి అదృశ్యులయ్యారు.

మరికొంతదూరం ప్రయాణించగా ఒక బాటసారి బృందం కన్పించింది. వారు దమయంతిని చూచి తలా ఒక విధంగా భావించారు. కొందరు పిశాచం అన్నారు. కొందరు భయపడ్డారు. ఇంకొందరు బిగ్గరగా నవ్వారు. కొందరు అరణ్యంలో ఏమి వెతుకుతున్నావన్నారు. కొందరు దేవతవని నమస్కరించారు. దమయంతి స్వవిషయం విన్నవించింది. వారితో కలిసి చేదిపతియైన సుబాహుపురానికి వెళ్లింది. మధ్యలో ఒకనాటి రాత్రి ఒక సరోవరం చెంత నిద్రిస్తున్న ఆ బృందంలో కొందర్ని గజసమూహం సంహరించింది. ఎటులో బ్రతికిన ఆమె ఇలా అన్నది.


జీవితార్థులైన జీవులు, సుఖసుప్తు/ లైనవారి చంపెనఅవ నఱవ

మరణ కాంక్షనున్న మగువ చంపక నను/ మఱచె విధి కరంబు మందబుద్ధి

దమయంతిని సుబాహుపుర రాజమాత చూసి పిలిపించి నీవు ఎవ్వెతవని ప్రశ్నింపగా దమయంతినని చెప్పక మిగిలిన తన విషయాన్ని చెప్పగా నీవు నాదగ్గరే ఉండు, నీపతిని వెదకడానికై బ్రాహ్మణుల్ని పంపుతానన్నది. నేను సైరంధ్రిని అయి కూడా ఎంగిలితినను. పర పురుషులతో పలుకను. నాభర్తను అన్వేషించే బ్రాహ్మణులతో మాట్లాడతాను. ఈ విధమైతేనే నీదగ్గర ఉంటానన్నది. అందుకా రాజమాత అంగీకరించింది. తన కూతురు సునందకు అప్పగించింది. అక్కడే పుణ్యవ్రతాచరణతో పతివియోగతాప మానస అయి నిలిచింది. తర్వాత కొంతకాలానికి భీమ మహారాజు నలదమయంతుల్ని వెదకడానికి పంపిన సుదేవుడనే బ్రాహ్మణుడు దమయంతిని గుర్తించగా ఆమె తన పుట్టినింటికి చేరింది.


నలుడు పలువిధాల కష్టనష్టాల్ని భరించి సర్పదష్టుడై రూపుమారి ఋతుపర్ణుడనే రాజును ఆశ్రయించి బాహుకుడనే పేరుతో అశ్వశిక్షకుడుగా కాలం గడుపుతున్నాడు. మరల విదర్భపతి నలుణ్ణి వెదకటానికి బ్రాహ్మణుల్ని పంపాడు. ఋతుపర్ణుడి సభలో నలుడున్నట్లు అనుమానం కలిగింది. వస్త్రాన్ని చించుకొని వెళ్లుట తగునా అనే మాటకు ఆతడు ప్రతిస్పందించుట వలన తర్వాత దమయంతికి ద్వితీయ స్వయంవరం ప్రకటించడం ఋతుపర్ణుణ్ణి అతివేగంగా బాహుకుడు విదర్భకు తీసుకు రావడం ఆతడి రథ వేగాన్ని పాకనైపుణ్యాన్ని గ్రహించి ఆతడే నలుడనే గుర్తించడం జరిగింది.

ఆతడు నలుడేనని నిశ్చయించి దమయంతికి తండ్రికి చెప్పగా బాహుకరూపుడైన నలుణ్ణి దమయంతి దగ్గరకు రప్పించాడు. దమయంతి నలుడు తనను విడిచిపోయిన విధాన్ని వివరిస్తూ దెప్పి పొడిచింది. నిన్ను విడవను. ఓడి కుండుమని పలికిన యప్పలుకు వేల మఱచెనో అని దుఃఖించింది. అపుడు నలుడు తననెరిగించి కలి చేసిన వికృతమది. అపకృతమది ఇపుడు కలినన్ను విడిచిపోయాడు. నీవు పునః స్వయంవరానికి సిద్ధపడ్డావు. ఇది కులస్త్రీ ధర్మమా? అన్నాడు. అపుడామె అంజలి ఘటించి ఇట్లన్నది. నిన్ను ఇటకు రప్పించడానికే స్వయంవరం చాటాం. పర్ణాదుడు నిన్ను గుర్తించాడు. నిన్ను రప్పించడానికే స్వయంవర నాటకం అన్నది. నేను పతివ్రతను. అనన్య భావనను. అన్యభావననైనచో ఈ పంచభూతాలు వెంటనే నన్ను చంపుతాయి అన్నది. అప్పుడే వాయుదేవుడు ఆకాశం నుండి అందరూ వినగా ఇలా పలికాడు. ఆమె మహాపతివ్రత. అమలచరిత్ర. నేను, సూర్యచంద్రులు ఇంతవరకూ రక్షించాం. నీవు ఈమెను పరిగ్రహించు. అని. దేవతలు దుందుభులు మ్రోగించారు. పుష్పవర్షం కురిపించారు. మందమారుతం వీచింది. నలుడు కర్కోటకుణ్ణి మనసున తలచాడు. వస్త్రం వచ్చింది. దానిని ధరింపగా నిజరూపం సిద్ధించింది. దమయంతిని స్వీకరించాడు. తర్వాత నిజనిషధపురానికి వెళ్లి పుష్కరుడితో జూదమాడి సర్వసంపదల్ని రాజ్యాన్ని గెలిచాడు. పందెం కూడా విచిత్రమైనది. నేను ఓడితే దమయంతి నీది. నీవు ఓడితే రాజ్యం నాది. దమయంతి సచ్చరిత్ర ఆతణ్ణి గెలిపించింది. పుష్కరుడి అక్షాలలో అపుడు ద్వాపరుడు లేడు. నలుడి దేహంలో కలిలేడు. పైగా నలుడిప్పుడు అక్షరతుడే గాక అక్షహృదయం తెలిసినవాడు. గెలుపు సాధ్యమే. ఏమైనా భార్యను ఒడ్డడం ప్రమాదమే. అపుడు నలుడి దగ్గర ఏ విధమైన ధనం లేదు. భార్యాధనం తప్ప. సంతానధనముంది. దాన్ని పందెంలో పెట్టితే బాగుండేది. లేకుంటే యుద్ధానికి ఆహ్వానిస్తే తగిన విధంగా ఉండేది. పుష్కరుడు యుద్ధంలో గెలవలేడు. అందుకు సిద్ధపడడు. దాంతో జూదమైనా సరేనన్నాడు. అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ స్త్రీ పురుషుడి ధనంగానే భావించబడుతున్నది. అది బంగారం కావచ్చు. వజ్రం కావచ్చు. ఒక వస్తువుగా ఉపయోగపడుతున్నది. ఇది మారాలి. ఆ దిశగా గట్టి ప్రయత్నం జరగాలి.



కళారత్న (హంస)
డా. సి హెచ్. బాబావలిరావు
హైదరాబాద్, 9989792247

మగజాతి జులుంపై యువకుని పంజా



తోటపల్లి సాయినాథ్,
9394449777

ఒక రోజు నేను మద్రాస్‌లోని ప్రకాష్‌రాజ్ ఆఫీసులో ఓ గదిలో కూర్చుని సినిమా స్క్రిప్టు రాసుకుంటున్నాను. ఇంతలో . లోపలికి వచ్చిన వ్యక్తి,. నాపేరు కృష్ణవంశీ..డైరెక్టర్‌ను అని అన్నాడు. నేను వెంటనే లేచి ఆయనకు కుర్చీ చూపించాను. మనం ఆర్.కె.భగవాన్ ద్వారా హైదరాబాద్‌లో కలిసాము అన్నాను. , నేను రాత్రి ఇక్కడే స్వర్ణకమలం చూశాను. అంతకు ముందు సిరివెన్నెల కూడా చూశాను. ఈ రెండు సినిమాలు నాకు బాగా నచ్చాయి. సార్ నేను జూనియర్ ఎన్.టి.ఆర్.తో ఓ సినిమా చేస్తున్నాను. గోపాల్‌రెడ్డి, కె.ఎల్.నారాయణ నిర్మాతలు. మీరు ఈ సినిమాకు స్క్రిప్టుసైడ్ ఓ వెర్షన్ రాయాలి అని వంశి నన్ను అడిగాడు. ఇంకా ఎవరెవరు రాస్తున్నారు.. అని అడిగాను. మూల కథ రాధాకృష్ణ అనే ఆయన ఇచ్చారు. ఎం.రత్నం, అజయ్‌శాస్త్రి శాస్త్ర సహకారం చేస్తున్నారు. ఎం.ఎస్.విశ్వనాథ్ గారు, మీరు స్క్రిప్టు విషయంలో సహాయం చేయాలి. అర్ధరాత్రి వరకు మేల్కొని స్క్రిప్టు రాస్తున్న నాకు తృప్తిగా ఉండాలి అని వివరించాను. నా పద్ధతి తనకు నచ్చిందని వంశి చెప్పాడు.

చెన్నై నుంచి హైదరాబాద్ రాగానే నేను కృష్ణవంశిని కలిశాను. గోపాల్‌రెడ్డి, కె.ఎల్.నారాయణ ఇద్దరిని కలిసి తర్వాత గెస్ట్‌హౌస్‌కు వెళ్లాను. అక్కడే రాఖీ కథ విన్నాను. ఇప్పటి సినిమాలో ఉన్న కథలో అప్పటికి సగం మాత్రమే ఉంది. కొత్తగా చేర్చిన వాటిలో రెండు ముఖ్యమైనవి. ఒకటి రైల్వే బ్యాక్‌డ్రాప్.. ఇందులో కోట శ్రీనివాసరావు లైసెన్స్‌డ్ రైల్వే కూలీ, చంద్రమోహన్ స్టేషన్ మాస్టర్, ధర్మవరపు సుబ్రమణ్యం అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్. హీరోగా నటించిన జూనియర్ ఎన్‌టిఆర్ గార్డు ట్రైనింగ్‌కు వెళ్లాలని అనుకుంటున్న యువకుడు. ఎన్‌టిఆర్ ఓ ఛానెల్‌లో పనిచేస్తుంటాడు. హీరోయిన్ ఇలియానా అదే ఛానల్‌లో పనిచేస్తుంది. ఆమె తండ్రి రైల్వేలో ఇంజిన్ డ్రైవర్. ఈ విధంగా హీరో, హీరోయిన్ ఇద్దరు రైల్వే కాలనీలో నివసిస్తూ ఉంటారు. ఇద్దరు మంచి ఫ్రెండ్సు కూడా. ఈ బ్యాక్‌డ్రాప్ వాతావరణం నాకు బాగా నచ్చింది. మా నాన్న రైల్వేలో స్టేషన్ మాస్టర్‌గా పనిచేశారు. నాకు చాలా బాగా పరిచయం.. నా సినిమాలలో కూడా ఈ సీన్లు ఉంటాయి. నా మొదటి సినిమా సితారలో కూడా హీరోను రైల్వే ట్రాక్‌పైకి



తీసుకు వెళ్లామని అనుకున్నాను. నా మొదటి నాటిక కోణార్క్ వస్తుంది.. కూడా రైల్వే కథాంశంతో రాసిందే. రైల్వే బ్యాక్‌డ్రాప్ పెట్టాలనే నా కోరిక రాఖీ సినిమాలో ఫలించింది. అందుకే నాకు రాఖీ సినిమా అంటే చాలా ఇష్టం. అందుకే కృష్ణవంశి నాకు రైల్వే బ్యాక్ డ్రాప్ గురించి చెప్పగానే ఎన్నో అనుభవాలను బయటకు తీసి ఆ స్క్రిప్టులో రకరకాలుగా ఉపయోగించుకున్నాను. అదే విధంగా రైల్వేస్టేషన్‌లో కూలీలు, ఇతరులు మాట్లాడుకునే కొన్ని వాడుక పదాలు, రైల్వే భాష విరివిగా వాడాను. ఈ సినిమాలో నాకు బాగానచ్చింది... రైల్వే కూలీల సమ్మె... అక్కడ ఎన్‌టిఆర్ మాట్లాడే డైలాగులు. అదే విధంగా చివరలో కోర్టు సీనులో ఎన్‌టిఆర్ మాట్లాడే మాటలు. ఈ రెండింటిని కృష్ణవంశి హైలెట్‌గా తెరకెక్కించారు. ఆయన సబ్జెక్టుకు సంబంధించిన కొన్ని భాగాలను ఆయన తీసుకొని డెవలప్ చేశారు. దీంతో ఫైనల్ అవుట్‌పుట్ చాలా బాగా కుదిరింది. నాతో పాటు హరనాథరావు, అజయ్ శాస్త్రి, ఎం.రత్నం, రాధాకృష్ణ అందరం కలిసి ఈ సినిమాకోసం పనిచేశాము. ఫస్టు వెర్షన్ పూర్తి అయిన పది రోజుల తర్వాత కృష్ణవంశి నన్ను పిలిచారు. నేను కలవగానే.. సార్, మీరు షూటింగ్‌కు మొత్తం రాగలరా అని నన్ను అడిగారు. అందుకు నేను ప్రస్తుతం లగడపాటి శ్రీధర్ సినిమా వియ్యాలవారి కయ్యాలుకు కమిట్ అయ్యాను అని చెప్పాను. అందుకు కృష్ణవంశి సార్, నాకు ఈ సినిమా కథకు రెండో వెర్షన్ రాసి ఇవ్వండి అని అడిగాడు. ఈ రెండో వెర్షన్ రాసేటప్పుడు ఒక మగ పోలీసు ఇన్‌స్పెక్టర్‌కు బదులుగా మహిళా పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా మార్చుదామని నేను ఆలోచించాను. ఈ ఆలోచన చెప్పగానే ఆయనకు బాగా నచ్చింది. ఆమెను తమిళియన్ చేయండి అని ఆయన సలహా ఇచ్చాడు. సుబ్రమణ్యస్వామి ఆలయంలో అభిషేకం చేసే సీన్‌తో ఆమెను ఇంట్రడ్యూస్ చేద్దామని ఆయన అన్నాడు. ఆ సీన్ అద్భుతంగా వచ్చింది.

హీరో ఎన్‌టిఆర్ ఈ రాఖీ సినిమాలో అద్భుతంగా నటించి అదరకొట్టేశాడు. ప్రతి సీన్‌లో గొప్ప నటనను కనబరిచాడు. హీరోయిన్ ఇలియానా కూడా చాలా బాగా నటించింది. ఈ రాఖీ సినిమాలో జూనియర్ ఎన్‌టిఆర్‌లో నేను ఆయనను చూశాను. జూనియర్ ఎన్‌టిఆర్‌లో మంచి నటుడు ఉన్నాడు, తర్వాత పది ఏళ్లలో నేను అనుకున్నది రుజువు అయింది. కోర్టు సీన్లలో ఎన్‌టిఆర్ నటన అద్భుతం అని చెప్పాలి. కృష్ణవంశిలో ఎంత గొప్ప క్రియేటివ్ డైరెక్టర్, రైటర్ ఉన్నాడో.. అంతే పట్టుదల, మొండితనం ఉన్న కష్టజీవి ఉన్నాడు. సినిమాలో ప్రతి సీను పట్ల ఆయన చూపిన శ్రద్ధ, తపన, తీసుకున్న జాగ్రత్తలు నాకు చాలా బాగా నచ్చాయి. ఆయన కష్టానికి ప్రతిఫలమే రాఖీ సినిమా సక్సెస్. ఈ సినిమా సక్సెస్‌లో మరో ముఖ్యమైన వ్యక్తి దేవిశ్రీ ప్రసాద్. ఆయన సినిమాలోని అన్ని పాటలకు అద్భుతమైన సంగీతం అందించాడు. జరా జరా, రాఖీ.. రాఖీ.. నువ్వే నా కవాసాకీ వంటి పాటలకు డిఎస్‌పి సంగీతానికి తోడుగా కృష్ణవంశి ఆయా పాటలను అద్భుతంగా చిత్రీకరించాడు. సీతారామశాస్త్రి ఈ సినిమాకు చక్కటి పాటలు అందించారు. ఈ పాటలు అందరి మనసుల్లో ప్రింటు అయినట్లు అయిపోయాయి. రాఖీ సినిమా అనగానే గుర్తుకు వచ్చేవి.. రైల్వే బ్యాక్ డ్రాప్, సిస్టర్ సెంటిమెంటు, కోర్టు సీన్లు, మహిళా పోలీసు ఆఫీసర్‌గా సుహాసిని, గోపాల్‌రెడ్డి కెమెరా, కృష్ణవంశి డైరెక్షన్, డిఎస్‌పి సంగీతం.. వాటితో పోటీపడే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్.. ఇవన్నీ అద్భుతంగా గుర్తుండిపోతాయి. ఇవన్నీ కలిసి రాఖీ సినిమాను అనూహ్యంగా గొప్ప హిట్ చేశాయి. క్రిటిక్స్ ఎంతో మెచ్చుకున్న సినిమా ఇది. హీరోయిన్లను అద్భుతంగా చూపించడంలో కృష్ణవంశికి ఒక స్టైల్ ఉంది. ఈ సినిమాలో హీరోయిన్లు ఇలియానా, ఛార్మి ఇద్దరిని ఆయన గొప్పగా ప్రెజెంట్ చేశారు.

ప్రతి స్త్రీలో తన తల్లిని, అక్కను, చెల్లిని, కూతురిని చూసుకోవాలని, రాఖీ చిత్రంలో ఉంది. ప్రపంచంలో మహిళలపై మగజాతి జులుం పైన ఓ యువకుడు విసిరిన పంజా ఈ రాఖీ చిత్రం. స్త్రీ పక్షపాత చిత్రం ఇది.



క్లాస్‌మేట్‌ను చంపి రక్తం తాగాడు

మాస్కో: క్లాస్‌మేట్‌కు మత్తు మందు ఇచ్చాడు. మత్తులోకి జారుకున్న అతడిని హత్య చేశాడు. అనంతరం రక్తం తాగాడు. వినడానికి ఒకింత భయం కలిగించే ఈ ఘటన రష్యాలోని యురల్స్ నగరంలో జరిగింది. బోరిస్ కొంద్రా షిన్ అనే 36 ఏళ్ల వ్యక్తి నకిలీ సర్టిఫికెట్లతో ఓ హాస్పిటల్‌లో డాక్టర్‌గా ఉద్యోగం సంపాదించాడు. గత నవంబర్‌లోనే విధుల్లో చేరాడు. అయితే నకిలీ డాక్టర్ అని హాస్పిటల్ యజమాన్యం గుర్తించింది.

అతడి సర్టిఫికేట్‌లను పరిశీలించి నిర్ధారించింది. నిందితుడిని పోలీసులకు అప్పగించింది. నిందితుడికి సంబంధించిన గత నేర చరిత్ర వివరాలను అధికారులు వెల్లడించడంతో అందరూ షాక్‌కు గురవుతున్నారు. నిందితుడు బోరిస్ కొంద్రాషిన్ 16 ఏళ్ల వయసులో తన క్లాస్‌మేట్‌ను హత్య చేసి రక్తం తాగాడని వెల్లడించారు. పుణ్యం కోసం బలిచ్చి రక్తం తాగాడు. నిందితుడు 1998లో ఈ హత్యకు పాల్పడ్డాడు. 2000 సంవత్సరం నుంచి పదేళ్లపాటు మానసిక వైద్యుడి పర్యవేక్షణలో ఉండేలా జైలుశిక్ష పడింది. తీవ్రమైన నేరానికి పాల్పడడంతో ఈ శిక్ష విధించారు.

హోమిసైడల్ షిజోఫ్రెనియాతో బోరిస్ బాధపడ్డాడని మానసిక వైద్యులు తేల్చారు. దశాబ్దం తర్వాత జైలు నుంచి బయటకు వచ్చినా అతడి నేర ప్రవృతి మారలేదు. నకిలీ సర్టిఫికేట్లతో డాక్టర్ ఉద్యోగంలో చేరి, పట్టుబడడంతో తన నేర చరిత్ర వెలుగులోకి వచ్చింది. కొంద్రాషిన్ తనను తాను పిశాచిగా పరిగణించుకుంటాడని ఓ వార్త సంస్థ వెల్లడించింది.

దేశం మెచ్చేలా మిషన్ భగీరథ

• ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం నిర్మాణంలోనే కాకుండా నిర్వహణలో కూడా దేశం మెచ్చేలా ఉంటుందని ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి అన్నారు. మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి మిషన్ భగీరథ వర్క్‌షాప్ ముగింపు సందర్భంగా శనివారం ఇస్కీలో జరిగిన కార్యక్రమంలో ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ భగీరథ నీటిని అంతరాయాలు లేకుండా సరఫరా చేసేందుకు అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తామన్నారు. ఇంటింటికి శుద్ధి చేసిన మంచినీటిని అందించే బాధ్యత తమ ఇంజనీర్లదే అన్నారు. ఆర్వోనీళ్లు, క్యాన్ వాటర్‌తో కలిగే దుష్పరిణామాలపై ప్రజలను చైతన్యపరుస్తామన్నారు. తెలంగాణ ప్రజలకు తాగునీటి కష్టాలు ఉండొద్దన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ ప్రాజెక్టును చేపట్టారన్నారు. సీఎం లక్ష్యాలు నెరవేరాలంటే నిరంతరాయంగా ప్రజలకు తాగునీటి సరఫరా కావాలన్నారు. ఇందుకోసం ఉత్తమమైన వ్యవస్థను తయారు చేస్తున్నామన్నారు. ఇదే లక్ష్యంతో మూడు రోజులుగా నిర్వహించిన సమావేశాల్లో ఈ రంగంలోని నిష్ణాతులతో చర్చించామన్నారు. ఎన్నో కొత్తవిషయాలు తెలుసుకున్నామన్నారు. రిటైర్డ్ ఇంజనీర్లు, ప్రతిష్టాత్మక సంస్థల నుంచి విలువైన సలహాలు, సూచనలు వచ్చాయని వాటన్నింటినీ క్రోడీకరించి మంచి ఆపరేషన్ మెయింటెనెన్స్ పాలసీని రూపొందిస్తామని కృపాకర్ రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, సీఈలు జగన్మోహన్ రెడ్డి, విజయపాల్ రెడ్డి, విజయప్రకాశ్, నినోబాదేవి, చిన్నారెడ్డి,శ్రీనివాసరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థిని మృతి

• తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళన



సూర్యాపేట, ప్రభ న్యూస్ : విద్యార్థిని అనారోగ్యంతో కళాశాల హాస్టల్‌లో మృతిచెందిన సంఘటన శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం ఆత్మకూర్ (ఎస్) మండలం ఏపూర్ గ్రామానికి చెందిన షేక్ షమీన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీనిధి జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం షమీనకు అనారోగ్యంగా ఉందని కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా అందుబాటులో లేకపోవడంతో కళాశాల యాజమాన్యాన్ని ఆసుపత్రిలో చూపించాలని కోరినట్లు తెలిపారు. శనివారం ఉదయం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే షమీన మృతిచెందినట్లు తెలిపారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే షమీన మృతి చెందిందని ఆరోపిస్తూ షమీన బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు శనివారం కళాశాల ముందు ఆందోళన చేపట్టారు. శ్రీనిధి కళాశాలలో మృతిచెందిన షమీన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధనియాకుల శ్రీకాంత్, వీరబోయిన లింగయ్య, సానబోయిన ఉపేందర్‌లు కళాశాల ముందు ధర్నా నిర్వహించారు.

లోకాయుక్త, ఉప లోకాయుక్త ఖాళీలను భర్తీచేయాలి

• హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త సంస్థలో ఖాళీగా ఉన్న లోకాయుక్త, ఉప లోకాయుక్త పదవులను భర్తీ చేసేందుకు వెంటనే తగు చర్యలు చేపట్టేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. విశ్రాంత న్యాయమూర్తులతో లోకాయుక్త, ఉపలోకాయుక్త పదవులను భర్తీ చేయాలంటూ తామిచ్చిన విన్నపాన్ని వెంటనే పరిష్కరించేలా ఆదేశించాలని అభ్యర్థిస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే స్వచ్ఛంధ సంస్థ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. లోకాయుక్తగా విధులు నిర్వర్తించిన జస్టిస్ సుభాషణ్ రెడ్డి డిసెంబర్, 2017లో పదవీ విరమణ చేశారు. దీంతో ఆ సంస్థకు అధిపతి లేకపోవడంతో లోకాయుక్త సంస్థ పనిచేయడం లేదు. ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేస్తున్న అధికారులపై వచ్చే అవినీతి ఆరోపణలు, అక్రమాలపై విచారణ చేపట్టేందుకు చట్టబద్ధమైన లోకాయుక్త సంస్థను ఏర్పాటు చేశారు. 29-12-2018 నాటికి 5550 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంలో ప్రతివాదిగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని చేర్చారు. హైకోర్టు ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది.


అదిలాబాద్ పంచాయతీ రిజర్వేషన్లపై కౌంటర్

• రాష్ట్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆదిలాబాద్ జిల్లా, ఉట్నూరు రెవెన్యూ డివిజన్‌కు చెందిన ఉట్నూరు, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల్లోని గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల పదవులను కేవలం ఎస్టీలకు మాత్రమే కేటాయించిన వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

ఫేస్ రికగ్నిషన్‌తో సత్ఫలితాలు

• సాంకేతికతతో అదృశ్యమైన చిన్నారుల గుర్తింపు తేలిక
• తాజాగా 18 మంది బాలలను రక్షించిన పోలీసులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే బాల కార్మికులను రక్షించడంలోను, అదృశ్యమైన బాలలను గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించడంలోనూ అత్యాధునిక ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికత అద్భుతంగా ఉపయోగపడుతోంది. బాలబాలికల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఈ విధానం ఉపకరిస్తోంది. బాలకార్మికులను రక్షించేందుకు పోలీసు శాఖ ప్రతి ఏటా జనవరి, జూలై నెలల్లో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌ను నిర్వర్తిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి సబ్ డివిజన్ నుంచి ఒక ఎస్ఐ, నలుగురు పోలీసు కానిస్టేబుళ్లు మొత్తంగా 530 మంది పోలీసు సిబ్బంది మిగతా సంబంధిత డిపార్ట్‌మెంట్లతో కలిసి ఈ ఆపరేషన్లు నిర్వర్తిస్తున్నారు. ఇందుకుగాను ఈ నెల జనవరి 7వ తేదీన ఒక సదస్సుని నిర్వహించారు. సదస్సులో టెక్నికల్ యాప్స్ ఫేషియల్ రికగ్నిషన్ ఫ్యూచర్స్ ఆన్ టీఎస్ కాప్ యాప్, దర్పణ్, చైల్డ్ ట్రాక్ పోర్టల్ వినియోగం తదితరాంశాలపై అవగాహన కల్పించారు. ఈ ప్రోగ్రాం ప్రారంభమైనప్పట్నించీ ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లు, ట్రాఫిక్ జంక్షన్లు, ఫుట్‌పాత్‌లు, రెలిజియస్ ప్లేస్‌లలో ఉన్న పిల్లలను గుర్తించి రక్షించారు. ఈ విధంగా అదృశ్యమైన పిల్లలను ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా గుర్తించి పలువురు చిన్నారులను రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా 18 మందిని రక్షించామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ నిర్వహణతో పాటు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం ద్వారా బాలలను గుర్తిస్తున్నారు. జనవరి 11వ తేదీన మంచిర్యాల సబ్ డివిజన్ ఆపరేషన్ స్మైల్ టీం 17 ఏళ్ల అంధబాలుడిని మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి తీసుకొచ్చారు. అతడి ఫోటోగ్రాఫ్‌ను ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం ద్వారా దేశవ్యాప్తంగా పంపి తనిఖీలు చేసిన సమయంలో ఆ బాలుడు యూపీకి చెందిన వాడిగా గుర్తించడం జరిగింది. నాగర్ కర్నూల్ ఆపరేషన్ స్మైల్ టీమ్ కాటన్ మిల్లుపై దాడి చేసి ఏడుగురు బాల కార్మికులను రక్షించింది. వారంతా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వారని గుర్తించింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలో వెల్డింగ్‌షాప్స్, టైర్ షాపులు, టింబర్ డిపోలు, సెంట్ షాపులు, స్వీట్ షాప్స్, షాపింగ్‌మాల్స్‌లో 29 మంది బాలలను రక్షించగా.. వారిలో బాలురు 12, బాలికలు 17 మంది ఉన్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్, అస్సాం, బీహార్, రాజస్థాన్‌లకు చెందిన వారు. రాష్ట్రవ్యాప్తంగా 2119 మంది బాలలను రక్షించగా వారిలో బాలురు 1653, బాలికలు 466 మంది ఉన్నారు. రక్షించిన 1303 మందిని వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వారిలో బాలురు-1029, బాలికలు -274. వారిలో బాలురు-624, బాలికలు 192. 535 మంది వీధి బాలలను రక్షించారు. బాండెడ్ లేబర్‌గా పనిచేస్తున్న 340, బ్రిక్ వర్కర్స్‌గా పనిచేస్తున్న 119 మంది బాలురను రక్షించా మని రాష్ట్ర ఐజీపీ(లా అండ్ ఆర్డర్), ఉమెన్ సేఫ్టీ వింగ్ అధినేత స్వాతిలక్రా తెలిపారు.

'సమీకృత లక్ష్యాలు సాధించాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సమీకృత అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ) పర్యవేక్షణ, అమలు కార్యక్రమంపై శనివారం ఎంసీహెచ్‌ఆర్డీలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర డీఓసీటీ నేతృత్వంలో ఈ శిక్షణ కార్యక్రమంజరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు, రక్షణ శాఖ, కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, కేంద్ర ఆర్థిక, హోం శాఖలకు చెందిన సీనియర్ అధికారులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సంజయ్ చోప్రా మాట్లాడుతూ రైతులకు సమస్యల నివారణలో స్పష్టమైన ప్రణాళికలు, ముందు చూపు పాలకులు, అధికారులకు ఉండాలన్నారు. సంస్థ డైరెక్టర్ బీపి ఆచార్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైకాపా వల్లే 'హోదా' సజీవం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏపీ ప్రతిపక్షనేత జగన్‌పై జరిగిన కత్తిదాడి కేసులో చంద్రబాబు ప్రభుత్వం నిస్సిగ్గుగా వ్యవహరిస్తోందని మాజీ ఐపీఎస్ అధికారి వైసీపీ నేత మహ్మద్ ఇక్బాల్ అన్నారు. శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఇక్బాల్ మాట్లాడుతూ ఇన్ని అపద్దాలు చెబుతున్న చంద్రబాబుకు మెడకాయ మీద తలకాయ ఉందా, ఆ తలకాయలో మెదడు ఉందా అని ప్రశ్నించారు. పరిటాల రవి హత్యకేసులో చంద్రబాబు డిమాండ్ చేస్తే ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేసు సీబీఐకి అప్పగించారన్నారు. ప్రతిపక్షనేత జగన్‌పై హత్యాయత్నం జరిగినప్పుడు కనీస బాధ్యత లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. కేసును కోడికత్తికేసు అంటూ ఎగతాళిచేస్తూ చంద్రబాబు, డీజీపి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు.డీజీపీప్రకటనతోగరుడ ఫ్లెక్సీ, మడతలు లేని లెటర్ సృష్టించారు కాబట్టే పోలీసు దర్యాప్తులో నిజాలు నిగ్గుతేలవని హైకోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. సివిల్ ఏవియేషన్ యాక్టు ప్రకారం ఎయిర్ పోర్టులో జరిగిన హత్యాయత్నం కేసు ఎన్ఐఏకి అప్పగించవచ్చని తెలిసినా సీఎం చంద్రబాబు ఎన్నోఅడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు.

రేపటి నుంచి ఉన్నత విద్యపై సదస్సు

• రెండు రోజులు నిర్వహణ: నవీన్ మిత్తల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉన్నత విద్యా రంగంపై రెండు రోజుల పాటు ఉన్నతస్థాయి అంతరంగిక సమావేశం(కాన్‌క్లేవ్)ను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ తెలిపారు. కాన్‌క్లేవ్‌ను నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, కళాశాల విద్య ఏజీవో బాలభాస్కర్, సాంకేతిక విద్య శాఖ ఉన్నతాధికారి మూర్తితో కలిసి శనివారం మీడియాకు తెలిపారు. పరిశ్రమలకు అవసరం అయిన సిలబస్ కోసం పరిశ్రమలు, విద్య రంగం సంయుక్తంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అందులో భాగంగానే ఇటువంటి అంతరంగిక సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్టు నవీన్ మిత్తల్ తెలిపారు. సోమ, మంగళవారం రెండు రోజులపాటు కాన్‌క్లేవ్‌ను నిర్వహిసున్నట్టు తెలిపారు. కాన్‌క్లేవ్‌ను ఇంటర్ విద్య, సాంకేతిక విద్య, ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల వారు అవలంభిస్తున్న విధానాలను తెలుసుకోనున్నట్టు చెప్పారు. సమావేశం ముఖ్య ఉద్దేశం ఉపాధి అవకాశాలు పెరగడం కోసం పరిశ్రమలు, విద్యారంగం సంయుక్తంగా చేపట్టాల్సిన విషయాలపై ప్రధానంగా చర్చించనున్నట్టు తెలిపారు.

ఎంసెట్ మాదిరిగానే.. డోస్టు ప్రవేశాలు

ఎంసెట్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ఎలా ఉంటుందో వచ్చే ఏడాది 2019-20 సంవత్సరంలో చేపట్టబోయే డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు అలానే చేపట్టాలని నిర్ణయించినట్టు కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ తెలిపారు. డోస్టులో చేపట్టబోయే సంస్కరణలు ఇతర అంశాలపై ఈ నెల 6న మొదటి సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇకపై డోస్టు ద్వారా సీటు పొందిన విద్యార్థులు కాలేజీకి వెళ్లి జాయిన్ కావల్సిన అవసరం ఉండబోదని.. ఆన్‌లైన్‌లోనే అంగీకారం తెలిపితే సరిపోతుందని తెలిపారు. ఇదే విధానాన్ని గత ఏడాది అమలు చేయాలనుకున్నప్పటికీ అడ్మిషన్ల ప్రక్రియ మధ్యలో ప్రారంభిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడతారని ప్రారంభించలేదన్నారు. వచ్చే ఏడాది నుంచి ఎంసెట్‌లో మాదిరిగానే డోస్టు అడ్మిషన్ల ప్రక్రియ ఉండబోతుందని తెలిపారు. 6న జరిగే సమావేశంలో మరికొన్ని నిర్ణయాలు తీసుకోనున్నామని.. అడ్మిషన్లకు సంబంధించిన నోటిఫికేషన్‌పై కూడా నిర్ణయం తీసుకుంటామన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కేంద్రంపై మండిపడింది. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. రూ. 27 లక్షల కేంద్ర బడ్జెట్‌లో 60 శాతం ఉన్న 70 కోట్ల మంది బీసీల సంక్షేమానికి కేవలం రూ.1270 కోట్లు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. సాధారణ ఎన్నికలు ఉన్నప్పటికీ బీసీలకు ఒక్క కొత్త పథకం కూడా ప్రవేశ పెట్టకపోవడం దారుణమన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లకు పార్లమెంటులో బిల్లు ఆమోదింప చేసిన కేంద్రం బీసీల కోసం ఒక్క పథకం ప్రవేశ పెట్టడం గానీ నిధులు పెంచడం గానీ చేయకపోవడం బీసీలను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. బీసీలకు కేటాయిస్తున్న నిధులతో మరో 1000 ఏళ్లు అయినా అభివృద్ధి జరగదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంధన పొదుపులో ఆర్టీసీదే మెరుగైన స్థానం



డ్రైవర్లకు అవార్డులు అందిస్తున్న ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ

హైదరాబాద్, ప్రభన్యూస్: ఇందన పొదుపులో టీఎస్‌ఆర్‌టీసీ మెరుగైన స్థానంలో ఉండడం డ్రైవర్ల కృషి ఫలితమేనని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన ఇంధన సంరక్షణ క్షమతా మహోత్సవ కార్యక్రమంలో ఎండీ ఉత్తమ డ్రైవర్లకు పురస్కారాలు అందజేసి అభినందించారు. రాష్ట్ర, రీజియన్ స్థాయిల్లో అత్యుత్తమ కేపీఎంఎల్ సాధించిన డ్రైవర్లకు, ఉత్తమ మెయింటెనెన్స్ ద్వారా ఇంధన పొదుపునకు దోహదం చేసిన మెకానిక్‌లకు అవార్డులు- రివార్డులు అందజేశారు. పది వేలకు పైగా బస్సులు నడుపుతున్న టీఎస్ ఆర్టీసీ సాలీనా 22.66 కోట్ల లీటర్ల డీజిల్ వినియోగిస్తోందని, ఇది మొత్తం వ్యయంలో 22.62 శాతంగా ఉందన్నారు. 1980-81లో కేవలం 4.09ఉన్న కే.ఎం.పీ.ఎల్ టార్గెట్ లక్ష్యం 2017-18 సంవత్సరంలో 5.14కి పెరగటం చెప్పుకోదగ్గ విషయమని, సిబ్బంది కృషి ఫలితంతోనే సాధ్యమైందన్నారు. ఈ లక్ష్యాన్ని 5.30 కే,ఎం,పీ,ఎల్ సాధించిగలిగితే సంవత్సరానికి సంస్థకు రూ. 43 కోట్లు ఆదా అవుతుందన్నారు. మెఫిసిల్ కేటగిరిలో 4001-10,000 బస్సుల రవాణాకు సంబంధించి 5.46 కేఎంపీఎల్ గాను అవార్డు 2014-15, 2015-16, 2016-17 వరుసగా మూడు సంవత్సరంలోనూ అత్యధిక కేఎంపీఎల్ అవార్డులు సంస్థకు దక్కడం గర్వకారణమన్నారు. 6.00 కేఎంపీఎల్ సాధించిన 1468 మంది డ్రైవర్లను స్ఫూర్తిగా తీసుకుని తోటి డ్రైవర్లు కూడా ఇందన పొదుపు లక్ష్యాన్ని సాధించాలని కోరారు. ఇంధనాన్ని ఆదా చేయడం ద్వారా కాలుష్యం కొంత తగ్గుతుందని, ఇంధన వనరులు అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రవాణా సంస్థ బస్సుల్లో ప్రత్యా మ్నాయ ఇంధన వినియోగంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు చెప్పారు. ఇంధన పొదుపు డ్రైవర్లను ప్రోత్సహించేందుకు అన్ని డిపోలు, రీజియన్‌లలో ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

టీఎస్‌పీఎస్సీ వెయిటేజీలో ఐకేపీ ఉద్యోగులకు అన్యాయం

హైదరాబాద్, ప్రభ న్యూస్ : ఇటీవల తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఫిజియోథెరపీ ఉద్యోగ నియామకాల్లో వెయిటే జీలో ఐకేపీ ఉద్యోగులు తీవ్ర అన్యాయం జరుగుతోందని, నిరంతరం ప్రజా సేవ చేస్తున్న వీరి సీనియారిటీని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీఎస్‌పిఎస్సీ నిర్వహించిన ఉద్యోగ నియామకాలలో ఐకేపీలో పని చేస్తున్న ఫిజియోథెరపీ వైద్యులకు న్యాయం జర గడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు.

2017 టిఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతిన గాని, ఔట్ సోర్సింగ్ విధానంలో గాని పని చేస్తున్న ఉద్యోగులకు సీనియారిటీ పద్ధతిలో 30శాతం వరకు మార్కులు జత పరిచి నియామకాలు చేపట్టాలి. కాని ఇదివరకు నిర్వహించిన పరీక్షలకు సంబంధించి వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకే షన్(డిఎంఇ), ఫ్యామిలీ వెల్ఫేర్ ఈ మూడు విభాగాలను మాత్రమే పరిగణలోకి తీసుకున్నారు. చివరకు నిమ్స్ తాత్కాలిక ఉద్యోగులకు కూడా వెయిటేజీ ఇచ్చారు. కాని గత 12 సంవత్సరాల నుంచి ఐకేపీలో పని చేస్తున్న ఫిజియోథెరపీ ఉద్యోగులను మాత్రం వెయిటేజీలో విస్మరించారు.


నిరంతరం ప్రజలకు నేరుగా సేవలు అందిస్తున్న ఐకేపీ ఉద్యోగులను విస్మరించడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతోంది. రాష్ట్ర వ్యా ప్తంగా ఐకేపీలో కేవలం 8మంది మాత్రమే ఫిజియోథెరపిస్టులు ఉండ టంతో నిరసన తీవ్రతరం చేయలేకపోతున్నామని, ప్రభుత్వం తమకు వెయిటేజీ అవకాశం కల్పించి తగు న్యాయం చేయాలని ఫిజియో థెపిస్టుల సంఘం సభ్యులు డాక్టర్ నవీన్ కోరుతున్నారు.

ఆపద్బంధు పెండింగ్ నిధుల విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆపద్బంధు పథకం పెండింగ్ నిధులు రూ. 2.89 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017లో అన్ని జిల్లాలకు చెందిన కలెక్టర్లకు ఈ పథకం కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2018 వరకు అందిన ప్రతిపాదనలు పరిశీలించిన ప్రభుత్వం జిల్లాల వారీగా బకాయి నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఏసీబీ వలలో మున్సిపల్ అధికారి

• ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం రూ.80 వేలు లంచం



హైదరాబాద్ (మల్కాజిగిరి, ప్రభ న్యూస్ : మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో శనివారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న నరేష్, శ్రీనివాస్ లంచం తీసుకుంటూ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీసీపీ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి సర్కిల్ నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్ స్వర్ణాంధ్రకాలనీలో నివాసముంటున్న ప్రదీప్‌కుమార్ 200 చదరపు అడుగుల స్థలంలో జీప్లస్‌వన్ అనుమతులతో నిర్మాణం చేపట్టారు. వృత్తిరీత్య ప్రదీప్‌కుమార్ న్యాయవాధి అయితే తన ఇంటికి సంబంధించి అక్యూపేన్సీ సర్టిఫికేట్ కోసం పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీఎస్‌గా పనిచేస్తున్న నరేష్‌ను సంప్రదించాడు. దీంతో నరేష్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం ఉందనీ, కూల్చివేతలు చేపట్టాల్సి వస్తోందన్నారు. ఇందుకు సదరు నిర్మాణదారులు ప్రదీప్‌కుమార్ ఏలాగైన తనకు ఓసీ ఇప్పించాలని కోరారు. ఇందుకు నరేష్ రూ.80 వేల రూపాయలు ఇవ్వాల్సి వస్తోందని చెప్పడంతో ప్రదీప్‌కుమార్ గత నెల 29న పిర్యాదు చేశాడు. ఈమేరకు అధికారులు ప్లాన్ ప్రకారం ప్రదీప్‌కుమార్ ద్వార నరేష్ అడిగిన డబ్బు రూ.80 వేల నగదును ఇప్పించారు. నరేష్ ఈ మొత్తాన్ని తాను తీసుకోకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శ్రీనివాస్ అలియాస్ యోగేశ్వర్ ద్వార తీసుకున్నాడు. వెంటనే ఏసీబీ అధికారులు మున్సిపల్ కార్యాలయంలో దాడులు నిర్వహించి డబ్బులు తీసుకున్న యోగేశ్వర్, టీపీఎస్ నరేష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్‌పీ సూర్యనారాయణ తెలిపారు.

అంతరిస్తున్న కవ్వాల్ పులులు

• రక్షణ చర్యలకు ఆదేశించాలంటూ పిల్




హైదరాబాద్, ఆంధ్రప్రభ : అడవుల్లో సంచరించే పులుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. వాటి సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. వేటగాళ్లు విద్యుత్ కంచెలు, ఉచ్చులతో వన్య మృగాల ప్రాణాలను హరిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా, కవ్వాల్ అభయారణ్యం టైగర్ జోన్‌లో రోజు రోజుకీ అంతరించిపోతున్న పులుల సంఖ్యను పరిరక్షించేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలి అని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది.

హైదరాబాద్ బండ్లగుడకు చెందిన వన్యప్రాణుల సంరక్షకుడు దియాసుర్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా, కవ్వాల్ టైగర్ జోన్‌లో వేటగాళ్లు విద్యుత్ వైర్లను కంచెగా బిగించి జనవరి 23, 2019న పులిని వధించారని పిటిషనర్ తెలిపారు. అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చర్మాల కోసం పులుల ప్రాణాలతో వేటగాళ్లు చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. పులుల చర్మాలకు మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉండటంతో వేటగాళ్లు బరితెగించి బలవంతంగా ప్రవేశించి పులులను చంపుతున్నారు. టైగర్ కన్సర్వేషన్ ప్లాన్ అండ్ ద వైల్డ్ లైఫ్ యాక్ట్ ప్రకారం అభయారణ్యంలో ఉన్న టైగర్ జోన్‌లోకి మానవుల ప్రవేశం నిషిద్ధం. అయినప్పటికీ వేటగాళ్లు అనర్హులైన వ్యక్తులు అభయారణ్యంలోకి బలవంతంగా చొరబడి పులులను వధిస్తున్నారని తెలిపారు. అందువల్ల కవ్వాల్ టైగర్ జోన్‌లోని పులులను సంరక్షించేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ అభ్యర్థించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది. అభయారణ్యంలోని టైగర్ జోన్ ప్రాంతంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి పులులు, చిరుతల సంచారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. 2012 ఏప్రిల్ 10న కవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్ జోన్‌గా ప్రకటించిన తర్వాత తడోబా అడవుల నుంచి అప్పుడప్పుడు కొన్ని పులులు ఇక్కడికి వస్తున్నాయి. కానీ ఆ తర్వాత కొన్ని రోజులకే అవి మాయమైపోతున్నాయని పలువురు జంతు ప్రేమికులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు ముఖ్యంగా బీట్ అధికారులు, సెక్షన్ అధికారులు, బేస్ క్యాంపు వాచర్లు విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడం కారణంగానే పులులు అంతరించిపోయే అంచుకు చేరాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అట్టహాసంగా జాతీయస్థాయి మహిళా టి-20 క్రికెట్

• పోటీలను ప్రారంభించిన కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్





ఖమ్మం స్పోర్ట్స్, ప్రభ న్యూస్ : జిల్లా కేంద్రం ఖమ్మం నగరం జాతీయస్థాయి క్రీడా పోటీలకు వేదికైంది. వందలాది మంది మహిళా క్రీడాకారులతో ఖమ్మం క్రీడా సంబురాన్ని సంతరించుకుంది. తొలిసారిగా శనివారం ఈ పోటీలు ఖమ్మంలో ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 5 వరకు సర్ధార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న 5వ ఆల్‌ఇండియా మహిళా-టి-20 క్రికెట్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ పోటీలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ నగరంలోని స్థానిక సర్ధార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలను ప్రారంభించారు.

ఎనిమిది రాష్ట్రాల మహిళా టీమ్‌లు పాల్గొంటున్న చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యాన జట్లు పాల్గొంటున్నాయి. క్రికెట్ పోటీల ప్రారంభం సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో తొలిసారి జాతీయ స్థాయి మహిళా టి20 క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ నిర్వహణకు జిల్లా యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లాలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులను, స్పాన్సర్లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పోటీలలో గెలుపు ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో పోటీలో పాల్గొనాలని కలెక్టర్ అన్నారు.

ఈనెల 2 నుండి 5 వరకు జరుగుతున్న టి-20 మహిళా ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌ను జిల్లా మహిళా క్రికెట్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ యండి మతీన్, ఛైర్మన్ కె. మహేంద్రకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె ప్రదీప్, క్రికెట్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సభ్యులు జె సునీల్‌కుమార్, డాక్టర్‌కరీమ్ ముఖ్య సలహాదారులుగా ఇంటిలిజెన్సీ ఏసిపి పింగళి నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మహిళా టి20 క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యం పరందామరెడ్డి, నగర ఏసిపి జి వెంకట్రావ్, మహిళా పోలీసుస్టేషన్ సిఐ అంజలి, ఫిజికల్ డైరెక్టర్స్ మూర్తి, శ్రీనివాసరావు, దయాకర్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్ యండి గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

జనవరి జీఎస్టీ వసూళ్లు... రూ.1,02,503 కోట్లు

న్యూఢిల్లీ: 2019లో తొలి ఏడాదిలో జీఎస్‌టీ వసూళ్లు లక్ష కోట్లు దాటాయి. ఏప్రిల్ తరువాత వసూళ్లు లక్ష కోట్లు దాటడం రెండోసారి అని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 2018, డిసెంబర్‌లో రూ.94,725 కోట్లు జీఎస్‌టీ ద్వారా కేంద్రానికి వచ్చినట్టు తెలిపింది. 2018లో జనవరి నెల్లో రూ.89,825 కోట్ల జీఎస్‌టీ వసూలైంది. అంటే గతేడాది కంటే ఈ ఏడాది జనవరిలో 14 శాతం కలెక్షన్ ఎక్కువైందని వివరించింది. డిసెంబర్ నుంచి జనవరి 31 వరకు జీఎస్టీఆర్-3బీ రిటర్న్స్ దాఖలు చేసిన వారి సంఖ్య 73.3 లక్షలకు చేరింది. 2019 జనవరిలో జీఎస్టీ వసూళ్లు రూ.1,02,503 కోట్లు అని, ఇందులో కేంద్ర జీఎస్టీ రూ.17,763 అని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. రాష్ట్ర జీఎస్టీ రూ.24,826 కోట్లుగా తేలింది. ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ.51,225 కోట్లు కాగా, సెస్ జీఎస్‌టీ రూ.8,690 కోట్లుగా నిర్ధారించబడింది. 2017, జులై 1న జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తరువాత జీఎస్టీ వసూళ్లు రూ.1లక్ష కోట్లు దాటడం మూడోసారి అని వివరించింది. 2018 ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.03 లక్షలు కాగా, అక్టోబర్‌లో రూ.1,00,710 కోట్లు జీఎస్టీ కింద వసూలయ్యాయి. కాగా ఏప్రిల్ తర్వాత అత్యధిక జీఎస్టీ వసూలు కావడం మాత్రం ఇప్పుడే అని ఆర్థిక శాఖ వివరించింది. డిసెంబర్, 2018 నాటికి సెంట్రల్ జీఎస్టీ ఆదాయం రూ.36,107 కోట్లు కాగా, స్టేట్ జీఎస్టీ రూ.39,503 కోట్లుగా ఉంది. ఏప్రిల్‌లో రూ.1.03 లక్షల కోట్లు, మేలో రూ.94,016 కోట్లు, జూన్‌లో రూ.95,610 కోట్లు, జులైలో రూ.96,483 కోట్లు, ఆగస్టులో రూ.93,960 కోట్లు, సెప్టెంబర్‌లో రూ.94,442 కోట్లు, అక్టో బర్‌లో రూ.1,00,710 కోట్లు, నవంబర్‌లో రూ.97,637 కోట్లు, డిసెంబర్‌లో రూ.94,725 కోట్లు వసూలయ్యాయి.

పెట్టుబడుల జోరు! ఉపాధి బేజారు!!

మోడీ ప్రోగ్రెస్ రిపోర్ట్



మోడీ హయాంలో రుణాలు మాత్రం చాలా తక్కువ వడ్డీకి లభ్యం అయ్యాయి. యూపీఏ హయాంలో ఫోన్ ద్వారా రుణాలు మంజూరు చేశారు. బ్యాంకులపై అజమాయిషీ పెరగడంతో మొండి బకాయిలు భారీగా పెరిగాయి. అదేవిధంగా ద్రవ్యోల్బణం స్థిరంగా ఉంటూ తగ్గుతూ పోవడంతో ఆర్‌బీఐ కూడా వడ్డీల విషయంలో సానుకూలంగా స్పందించింది. ద్రవ్యలోటు కూడా పడిపోతూ రావడంతో ఆర్‌బీఐకి కలిసి వచ్చింది. ఈ పరిణామాలు ఆర్‌బీఐ 1 శాతం కంటే ఎక్కువ వడ్డీ తగ్గించడానికి దోహదపడ్డాయని చెప్పుకోవచ్చు. ఆర్‌బీఐపై ఒత్తిడి తీసుకురావడంలో మోడీ విజయం సాధించారు.

• సంస్కరణలతో మిశ్రమ ఫలితాలు • పరివర్తన భారతం దిశగా అడుగులు • సంక్లిష్ట నిర్ణయాలు.. ఆటుపోట్లు • అదుపు తప్పిన రూపీ... నియంత్రణలో ద్రవ్యోల్బణం • విదేశీ పెట్టుబడులు ఫుల్.. ఉద్యోగాలు నిల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల సమీపిస్తున్న సమయంలో గత ఐదేళ్ల మోడీ పాలనపై కొందరు ప్రశంసల జల్లులు కురిపిస్తుంటే.. మరికొందరు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. శుక్రవారం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌ను ప్రతిపక్షాలు ఎన్నికల మేనిఫెస్టోగా అభివర్ణించారు. గత ఐదేళ్ల మోడీ పాలనపై కన్నేస్తే... అన్ని రంగాల్లో సంస్కరణలు చేపడుతూ తనదైన ముద్ర వేసుకున్నారు. సంచలన నిర్ణయాలు తీసుకుంటూ అవినీతిపరులకు కునుకు లేకుండా చేశారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన అభివృద్ధిని సాధించి ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన జీడీపీ వృద్ధి రేటును చూపించారు. ద్రవ్యోల్బణంపై యుద్ధం ప్రకటించారు. సబ్సిడీలు, అప్పులు, ధరలు ఇలా అన్ని రంగాల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో తనకంటూ సాటి ఎవరూ లేరని నిరూపించుకున్నారు. కానీ పరిశ్రమల్లో ప్రయివేటు దేశీయ పెట్టుబడులు పునరుద్ధరించడానికి చాలా కష్టపడ్డారని చెప్పుకోవచ్చు. ఐదేళ్ల కాలంలో మోడీ చేసిన అభివృద్ధి, తీసుకున్న సంచలన నిర్ణయాలను పరిశీలిస్తే...

డాలర్‌తో పోలిస్తే...:




డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పెద్ద ఎత్తున పతనమైందని చెప్పుకోవాలి. రూపాయి విలువ విషయంలో బీజేపీ నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వయస్సుతో పోలుస్తూ ఎద్దేవా చేశారు. యూపీఏ హయాంలో కూడా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోయింది. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాన్ని నిరోధించలేకపోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 18 శాతం పడిపోయింది. 2014లో డాలర్‌తో రూపాయి విలువ 61.03 పోటీ పడింది. 2019 ఫిబ్రవరి 1 నాటికి చూస్తే రూపాయి విలువ 17 పైసలు తగ్గింది. డాలర్ 71.26 వద్ద నిలిచింది. ఒకానొక స్థాయిలో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 80కి పైగా పలికింది. ఫలితంగా ఇంధన ధరలు చుక్కలనంటాయి. దీనిపై దేశ వ్యాప్తంగా ప్రతిపక్షాలు ఆందోళన కూడా చేపట్టాయి.

సబ్సిడీలు దిగొచ్చాయని చెప్పుకోవచ్చు. 2012-13లో 18.2 శాతం సబ్సిడీ నమోదైంది. 2016-17 నాటికి ఇది 11.8 శాతానికి దిగొచ్చింది. 2017-18 నాటికి మొత్తం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.

వ్యవసాయ రంగం:

జీడీపీలో వ్యవసా య రంగం వాటా 2017-18 ఆర్థిక సంవత్సరంలో 15 శాతానికి పడిపోయింది. ఇలాంటి ఒడిదుడుకులు కొనసాగుతూనే వచ్చాయి. గ్రామీణ ప్రాంతంలో ఆర్థిక వ్యవస్థ దీర్ఘ కాల సంక్షోభం ఎదుర్కొందనే చెప్పుకోవచ్చు. దేశ వ్యాప్తంగా వ్యవసాయం రంగంలో మోడీకి ఎదురుగాలి వీచిందనే చెప్పుకోవాలి. ఐదేళ్ల పాలనలో అన్ని రాష్ట్రాల నుంచి రైతులు ఢిల్లీ బాట పట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ విద్యకు మోడీ బాటలు వేశారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్ దీన్ని ప్రారంభించారు. 2019-2020 తాత్కాలికబడ్జెట్‌లో ప్రధాన్‌మంత్రి కిసాన్‌సమ్మాన్ నిధి పథకాన్ని తీసుకొచ్చారు. 5 ఎకరాలు ఉన్న రైతుకు ఏడాదికి రూ.6వేలు (మూడు వాయిదాల్లో) అందించి మచ్చిక చేసుకునేందుకు యత్నించారు.






జీడీపీ.. ప్రపంచ దేశాల సరసన భారత్:

2016-18లో జరిగిన అభివృద్ధి, వివిధ అంశాలపై గురువారం నీతి ఆయోగ్ సమీక్ష నిర్వహించింది. యూపీఏ హయాంలో జరిగిన అభివృద్ధిపై ప్యానెల్ పెదవి విరిచింది. మోడీ ఐదేళ్ల పాలనలో రికార్డు స్థాయిలో సగటున 7.6 శాతం జీడీపీ వృద్ధి రేటును నమోదు చేసింది. యూపీఏ 6.7 శాతంతో ముందుకు వెళ్లింది. ఈ శతాబ్దంలో వేగవంతమైన జీడీపీ వృద్ధి రేటు యూపీఏ హయాంలో (2011-11లో 8.5 శాతం) నమోదైంది. ఆర్థిక అభివృద్ధిలో ఫ్రాన్స్‌ను భారత్‌వెనక్కి నెట్టేసింది. 2018లో ప్రపచంలో 6వ స్థానంలో నిలిచింది. 2020 కల్లా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను రూపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. 5వ స్థానంలో ఉన్న యూకేను వెనక్కి నెట్టేసేందుకు శరవేగంగా అడుగులు వేస్తోంది. 2000 నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ వాటా 1.5 శాతం నుంచి 3.2 శాతానికి చేరి రెట్టింపు వృద్ధిని నమోదు చేసుకుంది. చైనా ఐదు రెట్లు (3.6 శాతం నుంచి 15 శాతం) పెరిగింది. భారత్ తలసరి ఆదాయం సుమారు 2000 డాలర్లు ఉంది. పదేళ్లలో రెట్టింపు అయ్యింది. చైనా 2006లో 2000 డాలర్లు ఉండగా, ప్రస్తుతం 9000 డాలర్లకు చేరుకుని టాప్‌లో ఉంది.




భారీగా విదేశీ పెట్టుబడులు:




విదేశీ పెట్టుబడులు భారీగా పెరిగాయి. మోడీ, మొదటి నాలుగేళ్ల కాలంలో తారా స్థాయికి చేరుకున్నాయి. విచ్చలవిడిగా ఈకామర్స్ సంస్థలు భారత్‌లో వాలాయి. 2017-18లో విదేశీ పెట్టుబడులు 61 బిలియన్ డాలర్లకు చేరింది. ఫలితంగా కొన్ని దేశీయ కంపెనీలు నష్టపోయాయి. మేక్ ఇన్ ఇండియా ద్వారా మళ్లీ స్వదేశీ ఉత్పత్తులకు ఊతం ఇచ్చారు.

తగ్గిన వడ్డీ రేట్లు:



వడ్డీ రేట్లు తగ్గినా ప్రయివేటు పెట్టుబడులను పెంచలేకపోయా రు. స్థూల స్థిర మూలధన నిర్మాణం (జీఎఫ్‌సీఎఫ్) పెరుగుదలతో 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఉన్న 1.6 శాతం పెట్టుబడులు 2016-17 నాటికి 10 శాతానికి మాత్రమే చేరుకున్నాయి. ప్రభుత్వ పెట్టుబడుల ద్వారా ఈ మేర వృద్ధి సాధించింది. వాణిజ్య రంగ బ్యాంకు రుణాల వృద్ధి పదేళ్ల కాలంలో 2016-17 నాటికి 8 శాతానికి పడిపోయింది.

వెనకబడిన ఉద్యోగ కల్పన:



ఉద్యోగాల కల్పనలో వెనకబడింది. కార్మిక శాఖ ప్రతీ మూడు నెలలకోసారి ఎంప్లాయ్‌మెంట్ సర్వేను విడుదల చేయలేదు. ఉద్యోగావకాశాలు కల్పించినా అవి అధికారిక లెక్కల్లోకి రాలేవని ప్రభుత్వం చెబుతోంది. ఎన్ఎస్ఎస్ఓ జనవరి 30న తెలిపిన వివరాల ప్రకారం.. వార్షిక నిరుద్యోగ రేటు 2017-18లో 45 ఏళ్లలో చరిత్రలో 61 శాతానికి పెరిగిందని వివరించింది. 2018లో మిలియన్ ఉద్యోగాలు పోయాయి. జనవరిలో 5 శాతం ఉన్న నిరుద్యోగ రేటు డిసెంబర్‌లో 7.4 శాతానికి పెరిగింది.

తగ్గుముఖం పట్టిన ముడి చమురు ధరలు:



2013-14 ఆర్థిక సంవత్సరానికి గాను ద్రవ్యలోటు జీడీపీలో ఒకటి కంటే ఎక్కువ శాతం తగ్గింది. ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు తగ్గాయి. రాష్ట్రాలు మాత్రం ద్రవ్యలోటు విషయంలో నియంత్రణ పాటించాయి. ఒక వేళ ద్రవ్యలోటు పెరిగితే మాత్రం కేంద్రం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వచ్చేది. 2013 ఆర్థిక సంవత్సరంలో 4.8 శాతం, 2014లో 4.4, 2015లో 4.1 శాతం, 2016లో 3.9 శాతం, 2017లో 3.5 శాతం, 2018లో 3.5 శాతంగా ఉండింది. 2020 నాటికి జీడీపీలో ద్రవ్యలోటు 3 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మోడీ ప్రభుత్వం ద్రవ్యలోటు తగ్గించడంలో మాత్రం సఫలీకృతమైంది.



బొగ్గు ఉత్పత్తి... రవాణ పెరగాలి

సింగరేణి సీఎండీ శ్రీధర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే ఉత్పత్తితో పాటు బొగ్గు రవాణాను ఇంకా పెంచాలని, ఓబీతొలగింపు లక్ష్యాల మేరకు జరగాలని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. హైదరా బాద్ సింగరేణిభవన్‌లో శనివారం జరిగిన డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంల సమీక్షా సమావేశంలో ఆయన సుదీర్ఘసమీక్ష నిర్వహించారు. జనవరి నెలలో సగటున 40రైల్వే ర్యాకుల ద్వారా బొగ్గురవాణా చేసే అవకాశం ఉందని, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉత్పత్తితో పాటు రవా ణా పెంపుదలకు ఇంకా గట్టి కృషి జరగాలని ఆదేశించారు. కొత్త గూడెం- సత్తుపల్లి రైలుమార్గాని కి చెందిన భూసేకరణ గురించి సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి పనుల కు ఆటంకం లేకుండా నిర్మాణసంస్థకు సహకరించాలని కోరారు. డైరెక్టర్ ఈఅండ్ ఎం. శంకర్, డైరెక్టర్ ఆపరేషన్స్ చంద్రశేఖర్, డైరెక్టర్ పీపీ భాస్కరరావు, డైరెక్టర్ ఫైనాన్స్ బలరాం, ఈడి ఆల్విన్, అడ్వయిజర్ డీఎన్‌ప్రసాద్, జీఎం ఆంథోని రాజా, వై.రాజేశ్వర రెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

3.3% ద్రవ్యోల్బణంతోనే ముగింపు

• 3.4 శాతం లక్ష్యంగా పెట్టుకున్నాం • 2020-21 నాటికి 3 శాతానికి చేరుకుంటాం • ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్

న్యూఢిల్లీ: 2018-19 ఆర్థిక సంవత్సరం 3.3 శాతం ద్రవ్యోల్బణంతో ముగుస్తుందని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఏడాదికి గాను 3.4 శాతం లక్ష్యంగా పెట్టుకున్నామని, అనుకున్నదాని కంటే తక్కువ ద్రవ్యోల్బణంతో ఆర్థిక సంవత్సరాన్ని ముగి స్తామని అన్నారు. 2020-21 నాటికి ద్రవ్యోల్బణం 3 శాతానికి తగ్గించడం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిం దని, ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. గత రెండేళ్ల కాలంలో జరిగిన లోపాలు నామ మాత్రం అని, ఈ ఏడాది 3.4 శాతం ఉండాల్సి ఉండగా, 3.3 శాతం ఉందని, 3.5 శాతం కంటే తక్కువ అని, ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే ఈ ఏడాది 3.3 ద్రవ్యోల్బణంతోనే ముగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2020-21 లక్ష్యానికి 0.3 లేదా 0.4 శాతం అటుఇటుగా ఉంటుందని, దీన్ని సవరించే విషయంలో ఎలాంటి ప్రణాళికలు లేవని తెలిపారు. 2019-20 ఆర్థికసంవత్సరంలో ద్రవ్యోల్బణం 3.4 శాతం లక్ష్యంగా పెట్టుకున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. 2018-19 బడ్జెట్ అంచనాలో ప్రాథమిక లోటు రూ.48,481 కోట్లుగా ఉంది. ఇది జీడీపీలో 0.3 శాతం. సవరించిన అంచనాలో ప్రాథమిక లోటు రూ.46,828 కోట్లుగా ఉంది. ఇది జీడీపీలో 0.2 శాతం. 2020-21, 2021-22 నాటికి ప్రాథమిక లోటుగా నిల్ అవుతుందని తెలిపారు.



అమలు కత్తిమీద సామే..!


• న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవాలి • రైతు పథకంపై ఆర్థిక నిపుణులు

కోల్‌కతా: తాత్కాలిక బడ్జెట్‌లో రైతుల కోసం తీసుకొచ్చిన ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి అమలు అనేది కత్తి మీద సాము అని పలువురు నిపుణులు అంటున్నారు. ప్రధానంగా చట్టపరమైన సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు రైతులను ఇబ్బందులు పెట్టడమే అని వ్యాఖ్యానిస్తున్నారు. రైతులకు ఏడాదికి రూ.6వేల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఒక కుటుంబానికి రూ.6వేలు సరిపోతాయా..? లేదా..? అనేది మొదటి ప్రశ్న. ఇది న్యాయమైన నిర్ణయమేనా..? అమలు అనేది ప్రధాన సమస్య. ఓనర్ షిప్‌పై ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో కొన్ని న్యాయ పరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదు అని సుప్రీం కోర్టు సీనియర్ అడ్వకేట్ ఎన్‌కే పొద్దార్ అభిప్రాయ పడ్డారు.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని... పరుగులు పెట్టించాలి

• త్వరితగతిన లబ్దిదారులను గుర్తించాలి • ఇప్పటికే వ్యవసాయ శాఖ తలమునకలు • పంచాయతీ స్థాయి నుంచి కదలాలి • వితరణకు సిద్ధంగా రూ.20 వేల కోట్లు • నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ: బడ్జెట్‌లోని ఫలాలు అందరికీ చేరేలా రాష్ట్రప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ రాజీవ్‌కుమార్ సూచించారు. దీనికి సంబంధించి కేంద్రం అన్ని రాష్ట్రాలకు లేఖలను పంపించినట్టు తెలిపారు. లబ్దిదారులను వెంటనే గుర్తిస్తే బడ్జెట్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, రైతుల కోసం కేటాయించిన రూ.75,000 కోట్లు ప్రధానం అని వివరించారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం లో దేశ వ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులకు సాయం అందించేందుకు ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.20వేల కోట్లు కూడా సిద్ధంగా ఉంచిందన్నారు. ఈ పథకాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లోని రైతులను గుర్తించడంలో కొంత ఆలస్యం అవుతుందని అభిప్రాయ పడ్డారు. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యాచరణ ప్రారంభించిందన్నారు. చిన్న సన్నకారు రైతులను ఆదుకోవాలనే ఆలోచన ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో కనిపించిందని తెలిపారు. కొన్ని రాష్ట్రాలు యుద్ధ ప్రాతిపదికన ఎంపిక ప్రక్రియ చేపట్టాలని, దీని కోసం ఫిబ్రవరి 1న కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రెటరీలకు లేఖలు పంపించారని తెలిపారు. గ్రామాల్లోని చిన్న, సన్నకారు రైతుల పేరుతో జాబితా తయారు చేయాల్సిందిగా రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాలకు రాసిన లేఖలో సూచించినట్టు వివరించారు. రైతు పేరు, ఆడా..? మగా..?, అతను ఎస్సీ..? ఎస్టీ..? వంటి వివరాలు చేర్చాలని, ఈ విషయాన్ని అన్ని గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో పెట్టాలని, దీంతో త్వరగా కేంద్రం నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు పడుతాయని తెలి పారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో భూముల డిజిటలై జేషన్ ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, ఉత్తర్‌ప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాల్లో భూ రికార్డులు ముందు నుంచే ఉన్నాయని అన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన సమయంలో భూములకు సంబంధించిన రికార్డులు ప్రింట్ తీసే అవకాశం ఉంటుందని, అన్ని రాష్ట్రాల్లో ఇదే తరహా ప్రక్రియ ఉందని, అందుకే పథకాన్ని అమలు చేయడంలో ఇబ్బంది ఉండదన్నారు. ఫిబ్రవరి 1 వరకు ఏ రైతు భూమి అయితే నమోదు చేయబడుతుందో వారి పేర్లను పంపించాల్సిందిగా సూచించారు.



ఖర్చులే ద్రవ్యోల్బణానికి కారణం

• ఎన్నికల తరువాత బడ్జెటే కీలకం • క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్

న్యూఢిల్లీ: ఎన్నికలకు ముందు చేసిన ఖర్చులు ద్రవ్యోల్బణానికి దారి తీశాయని, కానీ భారత దేశానికి సంబంధించిన సార్వభౌమ రేటింగ్ ప్రొఫైల్ మాత్రం ఎన్నికల తరువాత ప్రవేశపెట్టే బడ్జెట్ ఆధారంగా నిర్ణయించబడుతుందని క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ తెలిపింది. శుక్రవారం ఆర్థికశాఖ మంత్రి 2019-20 ఆర్థికసంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టా రు. ఇందులో 5 ఎకరాలు ఉన్న రైతుకు ఏడాదికి రూ.6వేలు అందజేయడం జరుగుతుందని, దీంతో 12 కోట్ల మంది లబ్ది పొందుతారని ప్రకటించిన విషయం తెలిసిందే. ఫలితంగా ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో 0.1 శాతం ద్రవ్యోల్బణం తగ్గుతుందని భావిస్తోంది. అంటే ద్రవ్యోల్బణం 3.3 శాతం నుంచి 3.4 శాతానికి సవరించబడుతుందని ఏజెన్సీ వివరించింది. నిర్ణయించిన ఆర్థిక స్థిరీకరణ ప్రకారం... రానున్న ఆర్థిక సంవత్స రానికి జీడీపీలో ద్రవ్యలోటు 3.4 శాతానికి పెరుగుతుందని తెలిపింది. ఆసియా-పసిఫిక్ ఫిచ్ రేటింగ్స్‌కి నేతృత్వం వహిస్తున్న స్టీఫెన్ స్క్వార్ట్జ మాట్లాడుతూ... గోయల్ ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ తాను అనుకున్న విధంగానే ఉందని తెలిపారు. సార్వభౌమ రేటింగ్ ప్రొఫైల్ కోసం దీర్ఘకాలిక ఆర్థికపరమైన ట్రెండ్‌లు ఎంతో ప్రధానం అని, వీటికి సంబంధించిన గణాంకాలు ఎన్నికలు తరువాత ప్రవేశపెట్టే బడ్జెట్ ఆధారంగా నిర్ణయించడం జరుగుతుందని అన్నారు.



సోషల్ మీడియాలో బాలుడి పోస్టు... అనూహ్య స్పందన



కాలిఫోర్నియా : అమెరికాకు చెందిన డెకర్ మాథ్యూస్ అనే బాలుడు అమెరికా సోషల్ మీడియా మాధ్యమం రెడ్డిట్‌లో పోస్టు చేసిన ఓ ఫొటోకు అనూహ్యమైన స్పందన వచ్చింది. ఓ పెయింటింగ్‌తో ఉన్న తల్లి ఫొటోను రెడ్డిట్‌లో పోస్టు చేశాడు. ఇది మా అమ్మ గీసిన పెయింటింగ్. ఈ పెయిం టింగ్ ఎవరికీ నచ్చడం లేదని అంటోంది అని క్యాప్షన్ కూడా ఇచ్చాడు. వారం రోజుల తర్వాత ఈ ఫొటోకు అనూహ్యమైన స్పందన వచ్చింది. పెయింటింగ్ బావుం దంటూ 24,000 మంది మెచ్చుకున్నారు. ఈ పెయింటింగ్‌ను స్విడన్‌కు కళాకారుడు క్రిష్టోఫర్ జీట్టర్ స్ట్రాండ్ గుర్తించారు. బాలుడు పోస్టు చేసిన ఫొటోను పెయింటింగ్ వేశారు.

ఓ బాలుడి తల్లి చిత్రాన్ని గీశాను. అనే టైటిల్‌తో పెయింటింగ్‌ను పట్టుకుని ఉన్న ఫొటోను రెడ్డిట్‌లో పోస్టు చేశారు. క్రిష్టోఫర్ పోస్టు చేసిన ఈ ఫొటోను మరో జర్నలిజం చదువుతున్న మరో బాలిక పెయింటింగ్ వేసింది. రెడ్డిట్‌లో పోస్టు చేసింది. ఇలా ఒకరి ఫొటోను మరొకరు పెయింటింగ్ వేశారు. బాలుడు పోస్టు చేసిన పెయింటింగ్ పెద్ద గొలుసుకట్టుగా మారింది. బాలుడు పోస్టు చేసిన పెయింటింగ్ చిన్నగా మారి పోయింది. తన కొడుకు పోస్టు చేసిన పెయింటింగ్‌కు అనూహ్యమైన స్పందన రావడంతో తల్లి సంతోషం వ్యక్తం చేసింది. అసభ్యకరమైన కామెంట్లు చేస్తున్నవారు తన కొడుకు లాంటి వారేనని భావిస్తున్నాని, అందరికీ ధన్యవాదాలు తెలిపింది.

భట్టి ఎదుటే బాహాబాహీ

• రణరంగంగా కాంగ్రెస్ సన్మానసభ • కుర్చీలు విసిరి.. పిడిగుద్దులతో తన్నులాట • వీహెచ్, నూతి శ్రీకాంత్ వర్గీయుల మధ్య ఘర్షణ • వీహెచ్‌కు వ్యతిరేకంగా నినాదాలు • ఓబీసీ సెల్ నుంచి శ్రీకాంత్‌కు ఉద్వాసన • పార్టీ కోసం పనిచేసే నాపైనే దాడులా: ఏఐసీసీ కార్యదర్శి వీహెచ్ ఆవేదన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత భట్టి విక్రమార్క సన్మాన కార్యక్రమం రసా భాసగా మారింది. ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంత రావు, ఓబీసీ సెల్ నగర కాంగ్రెస్‌కు చెందిన నూతి శ్రీకాంత్ వర్గీయులు బాహాబాహీకి దిగారు. సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క ఎన్నిక కావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వీహెచ్‌ను అడ్డుకున్న అంబర్‌పేట నియోజక వర్గానికి చెందిన శ్రీకాంత్ వర్గీయులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడనే ఉన్న వీహెచ్ వర్గీయులు కూడా ఆందోళనకు దిగడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. సీనియర్ నేతలు గొడవలు వద్దని వారిస్తున్నా శ్రీకాంత్ వర్గీ యులు వీహెచ్‌పైకి దూసుకెళ్లారు. అదే సమయంలో ఇరువర్గాల నేతలు ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారు. పిడిగుద్దులతో పరస్పర దాడులకు పాల్ప డ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట అసెంబ్లీ టికెట్ నూతి శ్రీకాంత్‌కు రాకుండా వీహెచ్ అడ్డుకు న్నారని ఆయన అనుచరులు ఆరోపిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆ సమయంలో వీహెచ్ కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ గట్టి జవాబిచ్చారు. ప్రజాకూటమి పొత్తుల్లో భాగంగా అంబర్‌పేట సీటును అధిష్టానం తెలంగాణ జన సమితికి కేటాయించిందని, ఇందులో తన ప్రమేయం ఏమీ లేదన్నారు. పార్టీలోని కొంతమంది నాయకులు కావాలనే కొంతమందిని ప్రోత్స హించి తనకు వ్యతిరేకంగా నినాదాలు చేయిస్తున్నారని వీహెచ్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికోసం నిరంతరం తపించే సీనియర్ నాయకుడైన తనపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇదే అంశంపై టీ పీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్, మాజీ మంత్రి చిత్తరంజన్ దాసు స్పందిస్తూ.. నూతి శ్రీకాంత్‌ను పార్టీ పదవి నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తూ సీనియర్ నేత వి. హనుమంత రావుపై ఆరోపణలు చేయడమే కాకుండా ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అందరినీ కలుపుకుని ముందుకెడతా : భట్టి

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే పార్టీని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. పార్టీ ఎమ్మెల్యేలందరినీ కలుపుకుని ప్రభుత్వం చేసే తప్పిదాలను సమష్టిగా ఎండగడతామని ఆయన తెలిపారు. టీ పీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోనే సామాజిక న్యాయం ఉంటుందన్నారు. ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు మాట్లాడుతూ సీఎల్పీ పదవి గతంలో అగ్రకులానికి చెందిన వారికే ఇచ్చేవారని, ఇప్పుడలా కాకుండా బలహీన వర్గానికి చెందిన భట్టి విక్రమార్కకు రాహుల్‌గాంధీ అవకాశం ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన వివిధ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన మూడు రాష్ట్రాల్లో కూడా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారినే రాహుల్ గాంధీ ముఖ్యమంత్రులను చేశారని ఆయన వివరించారు. రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడం వల్లే పంచాయతీ ఎన్నికల్లో బీసీలు ఎక్కువ సంఖ్యలో సర్పంచ్‌లు కాలేకపోయారని వీహెచ్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పార్టీ నేతల సస్పెండ్ విషయంలో వస్తున్న విమర్శలను టీపీసీసీ గమనించాలని ఆయన హితవు పలికారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారిపైన చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయని వీహెచ్ ఆరోపించారు. భట్టికి సీఎల్పీ పదవి ఇచ్చిన రాహుల్‌గాంధీకి మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు కృతజ్ఞతలు తెలిపారు. జానాభా దామాషా ప్రకారం బీసీలకు టికెట్లు కేటాయించాలని ఎన్నికల ముందు కోరినట్లు ఆయన చెప్పారు. ఓడిన వారికి ఇన్‌చార్జీ పదవులు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్ర కమిటీ, పార్టీ కార్యవర్గంలో 40 శాతం పదవులు బీసీలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.



గౌరవ అధ్యక్ష పదవులకు కవిత గుడ్‌బై

• సమయం కేటాయించలేకే వైదొలుగుతున్నా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పలు సంఘాల గౌరవ అధ్యక్షపదవులకు ఎంపీ కల్వకుంట్ల కవిత రాజీనామా చేశారు. గౌరవ అధ్యక్షపదవుల నుండి తప్పుకొం టున్నట్లు ఆమె ప్రకటించారు. రాష్ట్రబొగ్గు గని, విద్యుత్ కార్మికసంఘం, అంగన్ వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్, గుర్తింపు పొందిన పాఠశాల యాజ యాన్యసంఘాల గౌరవ అధ్యక్ష పదవులకు కవిత శనివారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను ఆయాసంఘాల ప్రధాన కార్యదర్శులకు పంపినట్లు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయాసంఘాలకు తగిన సమయం కేటాయించ లేకపోవడం వల్లే పదవులకు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఆయాసంఘాలకు ఏ అవసరం వచ్చినా వెన్నుదన్నుగా నిలుస్తానని భరోసానిచ్చారు. రెండురోజుల క్రితం ఆర్టీసి తెలంగాణమజ్దూర్ యూనియన్ గౌరవ అధ్యక్షపదవికి మాజీమంత్రి హరీష్‌రావు రాజీనామా చేశారు.

'కొలనుపాక అభివృద్ధికి సహకరించండి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు స్వీకరించిన ఎంపీ కల్వకుంట్ల కవితను ఆలేరు ఎమ్మెల్యే గొంగడి సునీత మహేందర్‌రెడ్డి శనివారం అభినందించారు. ఈ సందర్భంగా కొలనుపాక సోమేశ్వరాలయం, జైన్‌దేవాలయం అభివృద్ధికి పురావస్తు శాఖ ద్వారా నిధులమంజూరీకి సహకరించాలని విజ్ఞప్తిచేశారు. ఈసందర్భంగా యాదాద్రి ప్రసాదాన్ని కవితకు అందజేశారు.

ఖమ్మం టీఆర్ఎస్‌లో కలకలం

• జడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత రాజీనామా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలం గాణ రాష్ట్రసమితికి చెందిన ఉమ్మడి ఖమ్మంజిల్లా జడ్పీచైర్‌పర్సన్ గడిపల్లి కవిత శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆర్‌వి కర్ణన్ కు తన రాజీనామా పత్రం అందిం చారు. గత కొంతకాలంగా టీఆర్ఎస్‌లో తనకు ప్రాధాన్యం దక్కడం లేదని ఆమె అసం తృప్తిగా ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మధిర టికెట్ టీఆర్ఎస్ నుండి ఆశించి భంగపడ్డారు. మధిరటికెట్ కోసం తీవ్రపోటీ జరగ్గా ఎంపీ పొంగు లేటి శ్రీనివాసరెడ్డి తన అనుచరుడు లింగాల కమల్‌రాజ్‌కు ఇప్పించుకున్నారు. మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అనుచరురాలిగా గుర్తింపు పొందినా, చేరిక సమయంలో ఇచ్చిన హామీలు ఎవరూ నెరవేర్చ లేదని ఆమె అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు. ఇటు పార్టీలో చేరిక సందర్భంలో తనకు ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోకపోవడం, భవిష్యత్తుపై భరోసా లభించక పోవడంతో రాజీనామా నిర్ణయానికి సిద్ధపడ్డట్లు ప్రచారం జరుగుతోంది. ఖమ్మం జిల్లా టిఆర్ఎస్ గందరగోళం, నేతల తీరుపై సీఎం కేసీఆర్ ఇప్పటికే నివేదికలు తెప్పించుకోగా, లోక్‌సభ ఎన్నికల సందర్భంలో సమీక్షించి క్రమశిక్షణపై కఠినంగానే వ్యవహరించే అవకాశాలున్నాయి.

కోర్టులో కేసు ఉండగా ఈవీఎంలు ఎలా తెరుస్తారు?

• వికారాబాద్ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
• సీఎల్పీనేత భట్టి డిమాండ్




హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈవీఎంలపై అనేక అను మానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల ఫలితాలపై కోర్టులో పిటిషన్ ఉండగా.. ఈవీ ఎంలను ఎందుకు తెరిచారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. శనివారం ఆయన గాంధీ భవన్‌లో మాజీ మంత్రులు గడ్డం ప్రసాద్, మర్రి శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ వికారాబాద్ నియోజక వర్గానికి చెందిన ఈవీఎంలను తెరవడంతో మాకున్న అనుమానాలు బలపడుతున్నాయని భట్టి పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ద్వారా సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఎన్నికలు జరిగిన మరుసటి రోజే వికారాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటి చేసిన ప్రసాద్‌కుమార్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. కోర్టులో కూడా కేసు నడుస్తోందన్నారు. కోర్టుల సమస్య పరిష్కారం కాకుండానే ఈవీఎంలను ఎలా తెరుస్తారని ఆయన నిలదీశారు. ఈసీ రావత్ ఓటు నమోదు చేసిన అధికారులను సస్పెండ్ చేసిన ఎన్నికల కమిషన్.. ఇప్పుడు కలెక్టర్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వికారాబాద్ కలెక్టర్‌పై సీఈవోకు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.

నిత్యం ప్రజల్లో ఉండే తాను ఓడిపోయానంటే నమ్మశక్యంగా లేదని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ అన్నారు. అన్ని సర్వేల్లో తాను విజయం సాధిస్తున్నట్లు వచ్చిందని, తీరా ఎన్నికల ఫలితాలు చూస్తే ఓటమి చెందానని ఆయన వివరించారు. ఈవీఎంలలో జరిగిన అక్రమాల వల్లే తాను ఓడినట్లు చెప్పారు. కోర్టులో కేసు ఉందని, అయినా జిల్లా కలెక్టర్ ఈవీఎంల విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

• ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ప్రయోజనాలు సాధిం చడంలో టీఆర్ఎస్ ఎంపీలు ఘోరంగా విఫలమయ్యారని ఏఐసీసీ అధికార ప్రతి నిధి దాసోజు శ్రవణ్‌కుమార్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్రమైన అన్యా యం జరిగిందని అన్నారు. శనివారం ఏపీ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగినా టీఆర్ఎస్ నిరసన తెలపకపోవడం విడ్డూర మన్నారు. బీజేపీకి టీఆర్ఎస్ కొమ్ము కాస్తోందన్నారు. రెండు పార్టీలు కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కనీసం జాతీయ హోదా సాధించలేక పోయారని, విభజన చట్టంలోని హామీలు అమలు చేయించడంలో విఫలమయ్యారని విమర్శించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధించలేకపోయారని అన్నారు. మిషన్ భగీరథకు కేంద్ర నిధులు పొందలేకపోయారని విమర్శించారు. రైతుల ఓట్లను కొనేందుకు మోడీ ప్రభుత్వం ఆరు వేల రూపాయలు ఇస్తామని చెబుతోందన్నారు. రైతులను అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రైతుల సమస్యల పుండుమీద కారం చల్లుతున్నారని అన్నారు. ఆదాయపు పన్ను రిబేట్ పేరుతో ఉద్యోగస్తులను మోసం చేస్తున్నారని విమర్శించారు.

రవాణా శాఖలో ప్రమోషన్లకు మోక్షం

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో ఉద్యోగం పొంది సులువుగా తెలంగాణ జిల్లాల్లో జిల్లా అధికారులుగా చెలామణి అయ్యేవారు. కానీ తెలంగాణ స్థానికత కల్గిన ఉద్యో గులు ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించి రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘన తీరును సుప్రీంకోర్టు దృష్టికి తీసికెళ్లారు. దీనిపై స్పందించిన దేశ అత్యున్నత న్యాయ స్థానం సచివాలయంలో పనిచేస్తున్న ఎస్ఓలు, సీఎస్‌లు, కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరిం టెండెంట్‌లు, స్టెనోలు, ఆర్టీవోలుగా పదోన్నతిని పొంద డాన్ని తప్పుపట్టింది.

జీఓ 246తో అక్రమ ప్రమోషన్లు

వాస్తవంగా సర్వీస్ నిబంధన ప్రకారమైతే కమిష నర్ కార్యాలయంలో అటెండర్‌గా విధుల్లో చేరిన వ్యక్తి జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరిం టెండెంట్‌గా మూడు పదోన్నతుల తర్వాత పదవీ విరమణ చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా స్వార్థంతో నాటి సమైక్యాంధ్ర ఉద్యోగులు సూపరిం టెండెంట్ తర్వాత కూడా ప్రమోషన్‌కు అవకాశం ఉండాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. వీరి ఒత్తిళ్లకు తలొగ్గిన



నాటి సమైక్య పాలకులు 2007 ఆగష్టు 30న జీవో 246ను జారీ చేశారు. ఈ జీవోద్వారా నాల్గో ప్రమోషన్‌కు కూడా వెసులుబాటు కల్పించి అక్రమాలకు సహకరించింది అప్పటి ప్రభుత్వం. దీంతో సూపరిం టండెంట్ తర్వాత అసిస్టెంట్ సెక్రెటరీగా పదోన్నతిని పొందే వీలును ఈ జీవో ద్వారా నాటి పాలకులు కల్పించారు. ఈ జీవోను అడ్డంపెట్టుకుని నాటి అక్రమార్కులు నేరుగా రవాణా శాఖలో కీలకమైన ఉప కమిషనర్‌గా పదోన్నతికి అర్హత సాధిస్తున్నారు. వాస్తవానికి ఉప రవాణా కమిషనర్ పదోన్నతిని కమిషనరేట్ కార్యాలయ ఉద్యోగులు కూడా డిమాండ్ చేయలేదు. అప్పటి సమైక్యాంధ్ర ప్రభుత్వం ఉద్యోగుల సంఖ్యను, వారి విధులను, పట్టించుకోకుండా, ఉప కమిషనర్ పోస్టుకు ఉండే బాధ్యతలను పరిగణలోకి తీసుకోకుం డానే ఏకపక్షంగా ఈ ఉత్తర్వులను జారీ చేయడంతో అక్రమాలకు తెర లేచింది. ఒక ఉద్యోగానికి ఒకటికంటే ఎక్కువ ఎక్కువ కేటగిరీలలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతిద్వారా నియామకం చేయవలసి వచ్చినపుడు సదరు ఉద్యోగుల మధ్య నిష్పత్తిని విధిగా సూచించాల్సి ఉంటుంది. కానీ ఇందుకు విరుద్ధంగా జీవో 246లో ఆర్టీవో, అసిస్టెంట్ సెక్రటరీ మధ్యుప రవాణా కమిషనర్ పోస్టును పొందేందుకు ఎలాంటి నిష్పత్తిని ప్రాతిపదికగా సూచించలేదు. రాష్ట్రంలో మొత్తం ఆర్టీవో పోస్టుల సంఖ్య కేవలం 22 మాత్రమే.

ఈ పోస్టును పదోన్న తిద్వారా చేరేందుకు మోటానర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు 340మంది, మినిస్టీరియల్ స్టాఫ్ 260 మందితో కలుపుకుని మొత్తం 600 మంది వేచి చూస్తున్నారు. అదేవిధంగా రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీ 2 పోస్టులకు పదోన్నతి పొందేవారి సంఖ్య 40లోపే ఉంది. వీటన్నింటినీ సవరించిన తెలంగాణ ప్రభుత్వం తాజాగా ఆర్టీవోలకు, అసిస్టెంట్ సెక్రటరీలకు మధ్య 24:1 నిష్పత్తిని నిర్ణయించింది. దీంతో రవాణా శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోడీ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

• బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్



నిజామాబాద్ అర్బన్, ప్రభన్యూస్ : ప్రధాని నరేంద్రమోడీ గడిచిన 5 ఏళ్ళలో ఎలాంటి అవినీతి లేకుండా పాలన అందించారని, ఆయన ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాదవ్ అన్నారు. శనివారం నగరంలోని బస్వాగార్డెన్‌లో 5 నియోజకవర్గాలలోని నాయకులతో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంమాదవ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 5 పార్లమెంట్ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టిసారించిందన్నారు.


రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు పార్లమెంట్ ఎన్ని కలకు చాలా వ్యత్యాసం ఉంటుం దన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశ ప్రజలం దరూ నరేంద్ర మోడికి మద్దతు తెలపుతున్నారన్నారు. ఈ సమావేశం లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డా.లక్ష్మణ్, నాయకులు మంత్రి శ్రీనివాసులు, ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, పల్లె గంగారెడ్డి, లోక భూపతిరెడ్డి, బండి సంజయ్, రమాదేవి, శంకర్ , భాస్కర్, వినయ్‌రెడ్డి తదితరులున్నారు.

కేంద్ర బడ్జెట్.. ఓట్ల బడ్జెట్

• టీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్రబడ్జెట్ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పేరుతో ఓట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిందని, రైతుబంధు పథకాన్ని కూడా సరిగా కాపీకొట్టలేకపోయారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు గట్టు రామచందర్ రావు, చాడ కిషన్‌రెడ్డి, టీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస యాదవ్‌లు విమర్శించారు. శనివారం తెలంగాణభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నేతలు మాట్లాడారు. ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇది తెలంగాణకు ఏమాత్రం ఉపయోగపడని బడ్జెట్ అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత ఎవరు అధికారంలోకి వచ్చేది తెలియదని, అయినా ఎన్‌డిఎ ప్రభుత్వం నిబంధనలకు తిలోదకాలిచ్చి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిందని అన్నారు. కాళేశ్వర, మిషన్ భగీరథలకు సాయం ఊసేలేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర నాయకులు గట్టురామచందర్‌రావు మాట్లాడుతూ ఇది ప్రజావ్యతిరేక బడ్జెట్ అని, బీసీలను పూర్తిగా విస్మరించారన్నారు. టీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పూర్తిగా విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. దేశంలో 700కుపైగా యూనివర్శిటీలు ఉంటే ఒక్కో యూని వర్శిటీకి నాలుగుకోట్లు కూడా సరిగా కేటాయించలేదన్నారు. నిరుద్యోగులను బడ్జెట్ నిండాముంచిందన్నారు.

జైభారత్ నేషనల్ పార్టీకి చేతి గాజుల గుర్తు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : జైభారత్ నేషనల్ పార్టీ ఎన్నికల గుర్తుగా చేతి గాజుల గుర్తు కేటాయించడంపై ఆ పార్టీ నేషనల్ ప్రెసిడెంట్ జి. చిన్నయ్యదొర హర్షం వ్యక్తం చేశారు. పార్టీ గుర్తు కేటాయించిన సంద ర్భంగా ఢిల్లీలోని ఆంధ్ర ప్రదేశ్ భవన్లో మీడి యా సమావేశం ఏర్పాటు చేసిన చిన్నయ్య దొర, ప్రతి తల్లి, చెల్లి, స్త్రీమూర్తి ఎంతో పవి త్రంగా, ఇష్టంగా ధరించే చేతి గాజుల గుర్తు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. శుక్ర వారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై స్పందిస్తూ అల్లావుద్దీన్ అద్భుతదీపం తరహాలో ఈ బడ్జెట్ ఉందన్నారు. 56 నెలల పాటు దేశ ప్రజలను విస్మరించి, దేశవిదేశాలు తిరిగిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఇంతకాలం దేశ ప్రజలు గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. ఢిల్లీ నడి వీధుల్లో రైతులు అర్ధనగ్నంగా ఆందోళన చేసినప్పుడు రైతు కష్టాలు గుర్తుకురాలేదా అని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమే తమ లక్ష్యమని వెల్లడించారు.

కేసీఆర్ పథకాలే దేశానికి ఆదర్శం

• వచ్చే ఎన్నికల్లో ఫెడరల్ ఫ్రంట్‌దే హవా: బీబీ పాటిల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన పథకాలే ఇపుడు దేశానికి ఆదర్శంగా నిలిచాయని, తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సందర్భంగా ఇది మరోసారి రుజువైందని జహీరా బాద్ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. శనివారం హైదరాబాద్ లోని క్యాంపు కార్యాల యంలో జరిగిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ఎన్నికల బడ్జెట్‌కు ఓట్లు రాలవన్నారు. కేసీఆర్ రైతులను ఆదుకునేవిధంగా సాయం చేస్తుంటే మోడీ మొక్కుబడి సాయం ప్రకటించారని, అయినా తెలంగాణ పథకాలు మోడీని ఆలోచిం ప చేయడం దేశమంతా అమలుకు పునాదిపడడం తెలంగాణకు గర్వకారణమన్నారు. జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో దక్షిణ భారతదేశంలో బీజేపీకి సీట్లు ఏమీరావని, ఫెడరల్ ఫ్రంటే దేశంలో క్రియా శీలపాత్ర పోషిస్తుందని అన్నారు.


ఓర్వలేకే ఆరోపణలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్య తనిస్తూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టిందని భాజపా నేత జి.కిషన్‌రెడ్డి అన్నారు. పేదలు, రైతుల ఆర్థికాభి వృద్ధికి జరుగు తున్న కృషిని కొంత మంది జీర్ణించుకోలేక అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతి నిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీతి, నిజాయితీతో మోడీ పాలన కొనసాగుతోందని, దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని అన్నారు. రైతుల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన కిసాన్ సమ్మాన్ యోజన పథకాన్ని రైతులు హర్షిస్తున్నారని పేర్కొ న్నారు.

జనాభా దామాషాలో రిజర్వేషన్లు

• చట్ట సభల్లో అమలు చేయాలి: ఆర్.కృష్ణయ్య
• జంతర్‌మంతర్‌లో బీసీ సంక్షేమ సంఘం ధర్నా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బీసీలకు చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆందోళనకు దిగిం ది. శనివారం జంతర్‌మంతర్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. బీసీలకు చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్వా తంత్ర్యం వచ్చి 70 ఏళ్లుగడిచినా బీసీలకు సరైన ప్రాతినిధ్య దక్కడం లేదన్నారు. అన్ని రం గాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఇప్పటి వరకు చట్టసభల్లో 14శాతం, ఉద్యోగాల్లో 9శాతం, వ్యాపార రం గాల్లో ఒక్కశాతం మాత్రమే బీసీలకు ప్రాతినిధ్యం ఉంద న్నారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు ఆ మేరకు అన్ని రంగాల్లో రిజర్వే షన్లు ఇవ్వాలని కోరా రు. లేనట్లయితే రానున్న రోజు ల్లో తమ ఉద్యమాన్ని మరిం త ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆలయాలకు స్వయంప్రతిపత్తి కావాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేవాలయాల నిర్వహణ నుండి ప్రభుత్వాలు తప్పుకొని వాటికి స్వయం ప్రతిపత్తి కల్పించాలని హిందూ ధర్మ ప్రచారకులు అభిప్రాయపడ్డారు. హిందూ దేవాలయాలపై కోర్టులకెళితే న్యాయం జరగదని హిందూ దేవాలయాలు- ప్రభుత్వ అధీనం అనే అంశంపై శనివారం జరిగిన సదస్సులో వక్తలు అభిప్రాయ పడ్డారు. శనివారం ఒక హోటల్‌లో జరిగిన సదస్సులో మోనికా రెడ్డి అధ్యక్షతన సదస్సు జరిగింది. సదస్సులో భారతీయ అధ్యక్షురాలు సత్యవతి, చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్, సుప్రీం కోర్టు న్యాయవాది సాయి దీపక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ బాధ్యత స్త్రీలపైనే ఎక్కువగా ఉందన్నారు. అలనాడు సమాజ సంక్షేమం కోసం దేవాలయాలను ఏర్పాటు చేశారని.. కానీ ఇప్పుడు వాటిని కాస్త వ్యాపార కేంద్రాలు మార్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ధర్మ సంస్థలు ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

మద్దతు ధరలపై రాజీపడొద్దు

కొనుగోలు ఏజెన్సీలకు పార్థసారథి ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలులో మద్దతు ధరల అమలుకు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి స్పష్టంచేశారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఎంఎస్‌పీ పైసా క ూడా తక్కువ కాకుండా కొనుగోలు చేయాల్సిందేనన్న ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇందుకు సంబంధించి శనివారం సచివాలయంలో కొనుగోలు సంస్థలైన మార్క్‌ఫెడ్, హాకా, సీసీఐ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాటన్ కార్పొరేషన్ ద్వారా ఇప్పటి వరకు రూ.1,329 కోట్ల విలువైన 2.45 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశామన్నారు. సంబంధిత రైతులకు చెల్లింపుల ప్రక్రియ క ూడా వేగవంతంగా జరుగుతోందన్నారు. అలాగే కందులు, మక్కలు, పెసర్లు, మినుములు, సోయాబీన్ తదితర కొనుగోళ్ళు కూడా ఎక్కడా జాప్యం లేకుండా జరుగుతున్నాయని తెలిపారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుక ు తాము సిద్ధమని స్పష్టంచేశారు. 296 కేంద్రాల ద్వారా 4.16 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను, 578 మెట్రిక్ టన్నుల మినుములను కొనుగోలు చేశామన్నారు. 46 కేంద్రాల ద్వారా 15వేల మెట్రిక్ టన్నుల సోయా, 8 కేంద్రాల ద్వారా 13వేల మెట్రిక్ టన్నుల పెసర్లు కొనుగోలు చేసినట్లు పార్థసారధి వెల్లడించారు.



శిఖా చౌదరి అరెస్ట్?

ఆస్తి కోసమే హత్య?

● చిగురుపాటి హత్యకు అదే కారణమా? ● అనుమానాలన్నీ మేనకోడలు శిఖాచౌదరిపైనే ● ఆమె పేర ఆస్తులు.. డాక్యుమెంట్లు జయరాం వద్ద? ● స్నేహితులతో కలసి హత్యకు ప్లాన్ ● అనుమానిస్తున్న పోలీసులు... ఆ కోణంలో దర్యాప్తు ● ఎక్స్‌ప్రెస్ టీవీ యజమాని జయరాం హత్య కేసులో కదులుతున్న డొంక



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎక్స్‌ప్రెస్ టీవీ యజమాని, కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్, ప్రవాస భారతీయుడు చిగురుపాటి జయరాం హత్యకు ఆర్థిక వ్యవహారాలే కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. విజయవాడలో ఇటీవల కొనుగోలు చేసి తన మేకోడలు పేర ఆ ఆస్తి బదలీ చేసిన వ్యవహారమే ఆయన హత్యకు దారితీసిందన్న సమాచారంపై నిజానిజాలు నిర్ధారించే పనిలో పోలీసులు ఉన్నారు. జయరాం హత్యకు దగ్గరి బంధువే హైదరాబాద్‌లో కుట్రపన్ని అమలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. జయరాం హత్య కేసు దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు ఆయన మేనకోడలు శిఖా చౌదరి పాత్రపై విచారణ జరుపుతున్నారు. శనివారం ఉదయం నగరానికి చేరుకున్న నందిగామ పోలీసులు మొదట జూబ్లీహిల్స్‌లోని జయరాం ఇంటివద్దకు వెళ్లి అణువణువూ పరిశీలించారు. ఆయన కార్యాలయంలోనూ తనిఖీలు నిర్వహించారు. అనంతరం గచ్చిబౌలీలోని శిఖాచౌదరి ఇంటికివెళ్లిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె ఇంటిలో సోదాలు నిర్వహించారు. జయరాం హత్యకు కారణమేమిటన్న అంశంపై దృష్టి పెట్టిన పోలీసులు వ్యక్తిగత విభేదాలు, ఆర్థికఅంశాలు, కుటుంబ కలతలు ఇతర అంశాలనూ పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థికపరమైన అంశాలే హత్యకు కారణమయ్యాయని ప్రాథమిక ఆధారాలను బట్టి భావిస్తున్నప్పటికీ పోలీసులు ఇంకా తుది నిర్ధారణకు రాలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం కొన్ని ఆస్తులను మేనకోడలపేర బదలాయించిన జయరాం ఆ డాక్యుమెంట్లను తనవద్దే ఉంచుకున్నారని, బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో నగదునూ ఆమె పేర బదలీ చేశారని తెలుస్తోంది. అయితే వాటికోసమే శిఖా హత్యకు కుట్రపన్నారని తెలుస్తోంది. మరికొన్ని ఆధారాలు లభిస్తేగానీ ఈ విషయంలో పోలీసులు ఏమీ చెప్పే అవకాశం లేదు. ప్రస్తుతం జయరాం కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, కోస్టల్ బ్యాంకు సిబ్బందిని పోలీసులు తరచి తరచి ప్రశ్నించారు. జయరాం మేనకోడలు మాధురి అలియాస్ శిఖాచౌదరిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఏపీలోని కృష్ణాజిల్లా నుంచి హైదరాబాద్ వచ్చిన నాలుగు పోలీసు బృందాలు ఆధారాలకోసం అన్వేషణ కొనసాగిస్తున్నాయి.

ఆ ఇద్దరు ఎవరు?

మరోవైపు హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లోని సీసీటీవీ ఫుటేజీని తీసుకున్నామని పోలీసులు తెలిపారు. పతంగి టోల్‌గేట్ వద్ద రికార్డైన సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా జయరాంతో పాటు మరో ఇద్దరు ప్రయాణించినట్లు తేలింది. జయరాం మృతదేహం కారు వెనుక సీట్లో ఉండగా, ముక్కు, చెవుల్లోంచి రక్తం కారిన ఆధారాలున్నాయి. కాగా శనివారం జయరాం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలోని శవాగారానికి మృతదేహాన్ని తరలించారు. జూబ్లీహిల్స్‌లోని జయరాం నివాసంతో పాటు ఆయన కార్యాలయంలోనూ పోలీసులు తనిఖీలు చేశారు. శిఖా చౌదరిని పలు కోణాల్లో విచారిస్తున్నారు. ఆమె పేరిట ఆస్తులు బద లాయించిన జయరాం.. డాక్యుమెంట్లు మాత్రం తన దగ్గరే ఉంచుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. డాక్యుమెంట్ల కోసం స్నేహితులతో కలిసి హత్యకు ప్లాన్ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్‌లో చంపి నందిగామ వద్ద రోడ్డు ప్రమాదంలో జయరాం చనిపోయినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

శిఖాచౌదరి కారు డ్రైవర్ సహా మరికొందరిని కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ప్రశ్నించినట్లు తెలుస్తోంది. హత్యకోసం కిరాయి వ్యక్తులను ఉపయోగించి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారులో లభించిన మద్యం సీసాలు జయరాం ఉపయోగించేవి కావని ఆయన కారు డ్రైవర్ చెబుతున్నాడు.

నీలిరంగులో మృతదేహం..

విషప్రయోగంపై అనుమానం


కాగా, జయరాం ఒంటిపై తీవ్రమైన గాయాలు లేకపోవడంతో ఆయనపై విష ప్రయోగం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం నీలి రంగులోకి మారడంతో పోలీసులు కుట్ర కోణాలపై ఆరా తీస్తున్నారు. రక్త నమూనాలను పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. దర్యాప్తులో భాగంగా శనివారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జయరాం ఇంటికి నందిగామ పోలీసులు వచ్చి విచారణ జరిపారు. జయరాం హత్య తర్వాత ఆయన ఇంటికి మేనకోడలు శిఖా చౌదరి వచ్చిందని, తాము అడ్డగించినా ఇంట్లోకి జొరబడి బెడ్‌రూమ్‌లోని అల్మారాను తెరిచేందుకు ప్రయత్నించిందని వాచ్‌మన్ పోలీసులకు వివరించాడు. ఆమె వెతుకుతున్న సమయంలోనే ఫోన్ రావడంతో హడావిడిగా వెళ్లిపోయారని, యత్నిస్తుండగా ఫోన్ కాల్ రావడంతో హడావుడిగా ఆమె వెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో శిఖాతో పాటు రాకేష్‌రెడ్డిని పోలీసులు విచారి స్తున్నారు. హత్య జరిగిన రోజు రాత్రి 11 గంటలకు బయటకు వెళ్లిన ఆమె రాత్రి ఒంటిగంటకు తిరిగివచ్చినట్లు గుర్తించారు. మరుసటి రోజు ఉదయం 7 గంటల ప్రాంతంలో జయరాం ఇంటికి శిఖా చౌదరి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

శిఖాచౌదరిని పెంచి పెద్దచేసి...

చదివించిన జయరాం

జయరాం హత్య కేసులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు శిఖాచౌదరి. శిఖాచౌదరి జయరాం మేనకోడలు. చిన్న చెల్లెలు సుశీల పెద్ద కుమార్తె. శిఖా చౌదరి అసలు పేరు ప ులివర్తి మాధురి. విజయవాడలో ఇంజనీరింగ్ పూర్తి చేసింది. మాధురి అలియాస్ శిఖా చౌదరి ఇంజనీరింగ్ పూర్తి చెయ్య డానికి ప్రధాన కారణం జయరాం. జయరాం చిన్న చెల్లెలు అయిన సుశీల భర్తతో విభేదాల కారణంగా చాలాకాలం నుంచి కానూరులోని తల్లిదండ్రుల వద్దే ఉండేది. దీంతో సుశీల పిల్లలు ఇద్దర్నీ జయరాం చూసుకునేవారు. వారిలో పెద్ద అమ్మాయి అయిన శిఖాచౌదరిని ఇంజనీరింగ్ చదివించగా చిన్న అమ్మాయి మనీషాను మెడిసిన్ చదివించారు. ఏడాదిన్నర క్రితం మాధురి చెల్లెలు మనీషా వివాహం అంగరంగ వైభవంగా చేశారు. అయితే మాధురి మాత్రం పెళ్లి చేసుకోలేదు. ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత కొన్నాళ్లు ఆమె హైదరాబాద్‌లోని సినీ పరిశ్రమకు చెందినవారితో సంబంధాలు పెట్టుకుంది. ఆ తర్వాత మాదాపూర్‌లో ఉన్న ఓ న్యూస్ ఛానల్‌లో కొన్నాళ్లు పనిచేసింది. అయితే జయరాం భార్య పద్మశ్రీకి చెల్లెలి కుటుంబానికి డబ్బు అంతా పెడుతున్నారని ఆవేదన ఉండేదని అంటుంటారు. ఈ నేపథ్యంలో వారిని కొన్నాళ్లపాటు కంపెనీ వ్యవహారాల్లో వేలుపెట్టనియ్యలేదు. అయితే అనూహ్య పరిణామాల నేపథ్యంలో 2015లో న్యూస్ ఛానల్ నిర్వహణపై సలహాలు ఇచ్చే పేరుతో జయరాం ఆఫీసులో కాలుపెట్టింది శిఖా చౌదరి. ఆ తర్వాత ఆమెను చానెల్ వైస్ చైర్మన్‌గా నియమించారు. వైస్ చైర్మన్‌గా ఎక్స్‌ప్రెస్ టీవీలో అడుగుపెట్టిన శిఖా చౌదరి కాల క్రమేణా అన్ని సంస్థల్లో డైరెక్టర్‌గా చోటు సంపాదించారు. ఎక్స్‌ప్రెస్ టీవీ నష్టాల్లో ఉన్నా జయరాం మాత్రం శిఖా చౌదరికి బీఎండబ్ల్యూ కారు కొనివ్వడం చర్చనీయాంశంగా మారింది.

జయరాం.. వివాదాల కేంద్రం



చిగురుపాటి జయరాం చౌదరి ప్రస్థానం అంతా వివాదాలమయమే అయినా సన్నిహితులు మాత్రం అతడు గొప్పవాడనే చెబుతున్నారు. విజయవాడలో సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగిన ఆయన అమెరికాలో కోస్టల్ కారిడార్ బ్యాంక్ ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగాడు. చెప్పుకొస్తున్నారు. ఔషధ రంగంలో మంచి పట్టున్న జయరాం 90వ దశకంలో అమెరికా వెళ్లారు. ఉన్నత విద్య ర్యాన్‌బాక్సీ కంపెనీలో భాగస్వామిగా ఉంటూ అంచలంచెలుగా ఎదిగారు. పేటెంట్ల విషయంలో గొడవలు, భాగస్వాములతో విభేదాలు, ఉద్యోగులతో వివాదాలు ఆయన్ను చుట్టుముట్టేవి. విజయవాడ కానూరుకు చెందిన జయరాం తండ్రి కృష్ణమూర్తి మత్స్యశాఖలో ఏడిగా పనిచేశారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుటుంబానికి దగ్గరి బంధువు చిగురుపాటి జయరాం. విజయవాడ మొగల్రాజపురం రెవిన్యూ కాలనీకి చెందిన పద్మశ్రీతో జయరాంకు వివాహమైన తరువాత భార్యతో కలిసి అమెరికాలో స్థిరపడ్డారు. ఫార్మా రంగంలో తిరుగులేని పట్టు సాధించారు. క్యాన్సర్, సంతానలేమి ఔషధాలు, డయాలిసిస్‌లో అవసరమయ్యే థెరపటిక్స్ వంటి పలు ఔషధాలపై ఆయనకు పేటెంట్లు ఉన్నాయి. దేశంలో ప్రముఖ ఔషధ కంపెనీతో తలెత్తిన వివాదం ఆయన జీవితాన్ని మార్చిసిందని చెప్తారు. ఓ ప్రముఖ కంపెనీలో పార్టనర్‌గా ఉన్న క్రమంలో విభేదాలు తలెత్తడంతో ఆ వివాదం కోర్టు మెట్లెక్కింది. ఆ కేసు జయరాంకు అనుకూలంగా తీర్పు రావడంతో వందల కోట్లు పారితోషికం లభించింది. అప్పటి నుంచి ఆయనకు ఎదురేలేకుండా పోయింది.

వ్యాపారాలు.. వివాదాలు

అప్పటివకు పారిశ్రామిక వర్గాల్లో తప్ప పెద్దగా ఎవరికీ తెలియని ఆయన విజయవాడకు చెందిన కోస్టల్ బ్యాంక్ టేక్ ఓవర్ సందర్భంగా ఆయన పేరు మార్మోగిపోయింది. ఆ తర్వాత బ్యాంక్ వ్యవస్థాపకులతో తలెత్తిన వివాదం చర్చకు దారితీసింది. చివరికి కేంద్ర రెవిన్యూ సర్వీస్‌లో కీలక స్థానంలో ఉన్న వ్యక్తి మధ్యవర్తిత్వం వ్యవహరించడంతో సమస్య కాస్త సద్దుమణిగింది. అటు ఫార్మా పేటెంట్‌ల విషయంలో కూడా జయరాం నిర్మొహమాటంగా వ్యవహరిస్తారని ప్రచారం. చాలా మంది ఇండస్ట్రీ పెద్దలతో పేటెంట్ వివాదాలతో వేధించేవారని చెప్పుకుంటారు. నష్టాల్లో ఉన్న పరిశ్రమలను వదిలించుకోవటంలో జయరాం సిద్ధహస్తుడని ప్రచారం. హైదరాబాద్‌లో ప్రముఖ కళ్ళజోళ్ల కంపెనీ టెక్ట్రాన్ పరిశ్రమ మూసివేయడంతో ఉద్యోగులు రోడ్డున పడ్డారు. వాళ్లు కోర్టుకు వెళ్లడంతో ఏడాది క్రితం జైలుకు వెళ్లాల్సి వచ్చింది. 2013లో జేఎస్టీ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఎక్స్‌ప్రెస్ టీవీని జయరాం ప్రారంభించారు. అందులో జయరాం, భార్య పద్మశ్రీలు భాగస్వామ్యంగా ఉన్నారు. అనూహ్యంగా 2015లో ఆయన మేనకోడలు ప ులివర్తి మాధురి అలియాస్ శిఖా చౌదరి చానెల్ వైఎస్ ప్రెసిడెంట్‌గా అడుగుపెట్టారు. మరో మేనకోడలు మనీషా ఫార్మా కంపెనీలలో డైరెక్టర్ అయ్యారు. ఆ తర్వత కాలంలో ఇద్దర్నీ జయరాంకు ఉన్న అన్ని కంపెనీలలో డైరెక్టర్లుగా నియమించారు. మేనకోడళ్లను పెద్ద పదవుల్లో కూర్చొబెట్టడంతో కుటుంబలో కలతలు చెలరేగాయి. భార్య పద్మశ్రీ వారి జోక్యాన్ని సహించలేకపోయారు. దీంతో న్యూస్ ఛానెల్‌కు సంబంధించి ఫండింగ్‌ను పద్మశ్రీ నిలిపివేశారు. దీంతో ఆ ఛానెల్ మూతపడింది. 2016లో ఛానెల్ ఒడిదుడుకుల్లో ఉన్న సమయంలో చిన్న మేనకోడలు మనీషాకి రూ.2 కోట్లు డోనేషన్ చెల్లించి ఏలూరు మెడికల్ కాలేజీలో ఎండి మెడిసిన్ సీట్ కొనుగోలు చేశారు. అదే సమయంలో శిఖాచౌదరికి ఖరీదైన బీఎండబ్ల్యూ కారు కొనిచ్చారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో ఎక్స్‌ప్రెస్ టీవీ ఉద్యోగులు లేబర్ కోర్టును ఆశ్రయించారు. విషయం కోర్టు వరకు వెళ్లడంతో ఆయన అమెరికా వెళ్లిపోయారు. నెల రోజుల క్రితం అమెరికా నుంచి వచ్చారు. గత నెల 21న జరిగిన కోస్టల్ బ్యాంక్ బోర్డ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. బ్యాంక్ ఎండీని మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. కొత్త ఎండీకి బాధ్యతలు అప్పగించి ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయారు. విజయవాడ ఎప్పుడు వచ్చినా గేట్‌వే హోటల్ 7వ అంతస్తులో కార్నర్ రూమ్‌లో జయరాం బస చేసేవారు. జనవరి 31న సాయంత్రం కూడా అలాగే కోస్టల్ బ్యాంక్ జీఎంకు ఫోన్ చేసి హోటల్‌లో రూం బుక్ చెయ్యమని ఆదేశిం చారు. విజయవాడ రాకుండానే కానరాని లోకాలకు జయరాం వెళ్లిపోయారు.

అంత్యక్రియలు ఆలస్యం...

శుక్రవారం నాడు పోస్టుమార్టం నిర్వహించిన జయరాం మృతదేహాన్ని అదే రోజు రాత్రి హైదరాబాద్‌కు తరలించారు. విదేశాల్లో ఉన్న జయరామ్ భార్య, పిల్లలు ఆదివారం ఉదయం హైదరాబాద్‌కు వస్తారని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. జయరాం భార్య, పిల్లలు వచ్చిన తర్వాతే అంత్యక్రియలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

చెల్లెలి పిల్లలను చేరదీసి....

జయరాం ఇద్దరు చెల్లెళ్లలో పెద్ద చెల్లి శశికళ గుడ్లవల్లేరుకు చెందిన వెంకటాద్రితో వివాహం జరిగింది. ఆమెకు ముగ్గురు పిల్లలు. ఆ ముగ్గురు కూడా జయరాం కంపెనీల్లో కీలక స్థానాల్లో ఉన్నారు. ఇక రెండో చెల్లెలు సుశీలకు ఇద్దరు కుమార్తెలు. సుశీల భర్తతో విభేదాల కారణంగా ఆమె భర్తకు దూరంగా వుండటంతో వారి బాగోగులు జయరాం చూసేవారు. విజయవాడ కానూరులో ఉన్న జయరాం తల్లిదండ్రులతో పాటు ఆమె పిల్లలతో కలిసి ఉండేది. రెండేళ్ల వ్యవధిలోనే జయరాం తల్లిదండ్రులు చనిపోయారు. మరోవైపు వ్యాపార రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగిన జయరాం పిల్లలు లేకపోవడతో భార్య పద్మశ్రీ చెల్లెలి కుమార్తెను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న రెండేళ్ల తర్వాత జయరాంకు ఒక కుమారుడు పుట్టాడు. 2013 వరకు ఈ కుటుంబంలో ఎలాంటి సమస్యలు లేవు. 2003 నుంచి ఆయన భారత్‌లో ఔషధ రంగంలో పెట్టుబడులు పెడుతున్నారు. హెమారస్ థెరపటిక్స్ 2003లో స్థాపించిన తర్వాత ఆయన వెనుదిరిగి చూసుకోలేదు. బయాలజీ, పాలిస్టర్స్, ఫార్మా రీసెర్చ్, ప్లాంట్ సైన్సెస్ ఇన్ఫ్రా రియల్ ఎస్టేట్, ఐటీ ఇలా అన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. 2012 తర్వాత ఆయన సొంత జిల్లాలో అడుగుపెట్టారు.

విదేశీ విద్యానిధికి దరఖాస్తులు ఆహ్వానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే పేద గిరిజన విద్యార్థులు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు తెలిపారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, దక్షిణ కొరియా దేశాల్లో ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర వృత్తివిద్య కోర్సుల్లో చేరాలనుకునే గిరిజన విద్యార్థులు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. కుటుంబ వార్షికాదాయం రూ. 5 లక్షలు మించరాదని.. జూలై 1, 2019 నాటికి 35 సంవత్సరాలు నిండరాదని తెలిపారు. విదేశీ విద్యానిధి కింద రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విషయం తెలిసిందే.

షర్మిల ఫిర్యాదుపై ఇద్దరు అరెస్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అసభ్యకర సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తనపై అసభ్యంగా పోస్టులు పెడుతున్నారంటూ వైసీపీ నాయకురాలు వైఎస్ షర్మిల నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్‌ని కలసి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దర్యాప్తు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ఇద్దర్ని అరెస్టు చేశారు. తెనాలికి చెందిన వెంకటేశ్వర్ గుంటూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంసీఏ చదువుతున్నారు. సోషల్ మీడియాలో అసభ్యకర కామెంట్లు పెట్టినట్లు ఆధారాలతో సహా దొరికాడు. మరో నిందితుడు పెద్దిశెట్టి వెంకటేశంది ప్రకాశం జిల్లా. మరికొందరిని కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు. ఓ అధికార పార్టీకి సంబంధించిన మూడు వెబ్‌సైట్లలోని పోస్టుల ఆధారంగా వీరంతా అసభ్యకర కామెంట్లు పెట్టినట్లు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు గుర్తించారు.

భర్త వివాహేతర బంధం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భార్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ: న్యాయం తరపున వాదించాల్సిన లాయరే దారి తప్పాడు. భార్య ఉండగానే మరో మహిళతో రహస్యంగా కాపురం పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య ఇద్దరినీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఈ ఘటన ఓల్డ్ రామంతాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన కృష్ణమాచారి అనే క్రిమినల్ లాయర్‌కు 2008లో వింధ్యారాణి అనే మహిళతో వివాహం అయింది. వింధ్యారాణి రాజస్థాన్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. భార్య పంపిస్తున్న డబ్బులతో జల్సాలకు అలవాటుపడిన కృష్ణమాచారి మరో మహిళతో ఓల్డ్ రామంతపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కాపురం పెట్టాడు. భర్తకు దూరంగా ఉండలేకస్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని వింధ్యారాణి నగరానికి వచ్చేసింది. గత కొద్ది రోజులుగా భర్త ప్రవర్తనలో మార్పులు గమనించిన వింధ్యా అతడిని ఫాలో అవడం ప్రారంభించారు. మరో మహిళతో అక్రమ సంబంధం ఉందని పసిగట్టిన వింధ్య.. స్థానికులు, బంధువుల సహాయంతో శనివారం వీరిద్దరూ ఇంట్లో కలిసి ఉండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇక వీరిద్దరిని స్థానికుల సహాయంతో షీ టీమ్ అధికారులకు అప్పగించారు.

'ఇన్‌స్పైర్'తో ప్రతిభకు పట్టం

ఘనంగా రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభం ● 31 జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు ● ప్రారభించిన ఎమ్మెల్యే ఆరూరి, నిట్ డైరెక్టర్ ఎన్.వి. రమణారావు

కాజీపేట, ప్రభన్యూస్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే ఇన్‌స్పైర్ మానక్ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యమని నిట్ డైరెక్టర్ ఎన్.వి.రమణారావు అన్నారు. మడికొండలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం ఘనంగా రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శనలు మధ్యాహ్నం ప్రారంభమైనాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సాంకేతిక విద్యాలయం (నిట్) డైరెక్టర్ ఎన్‌వి.రమణారావు, వర్ధన్నపేట ఎమ్మెల్యేఆరూరి రమేష్, ఎస్‌ఈఆర్టీ డైరెక్టర్ శేషు కుమారిలుహాజరైనారు. తొలుతగా విద్యార్థులచే నృత్యప్రదర్శనలు చేశారు. ఎమ్మెల్యే ఆరూరి జ్యోతి ప్రజ్వలన చేసిప్రారంభించారు. ఈసందర్భంగా నిట్ డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాడానికి ఇన్‌స్ఫేర్ మానక్ కార్యక్రమాన్ని కొత్త ఆలోచనలను, కొత్త ఆవిష్కరణలకు పునాది లాంటిదని, రూరల్ జిల్లాలో ఉండే విద్యార్థులు ప్రకృతిపై ఎక్కువ అవగాహన కలిగి ఉంటారు. విద్యార్థులకు నిట్ తరపున తమవంతు సహాయంఅందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలల్లో ముందుంచడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందని, విద్యాభివృద్ధికి చాలా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసిందని , ఉన్నత స్థానాలకు ఎదగడానికి ప్రభుత్వం కృషిచేస్తుందని విద్యార్థులు అవకాశాన్ని సద్వినీయోగం చేసుకోవాలన్నారు. మూఢనమ్మకాలను ప్రారద్రోలి విధంగా ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ శేష మాట్లాడుతూ విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచి శాస్త్రవేత్తలుగాచూడటానికి 2010లో ఇన్‌స్పైర్ కార్యక్రమాన్ని భారత ప్రభుతవం ప్రవేశపెట్టిందన్నారు. ఇన్‌స్పైర్‌ను మొదటగా గుజరాత్ రాష్ట్రంలో ప్రవేశపెట్టడం జరిగిందని ప్రతి యేటా 60 మంది విద్యార్థులను ఎంపికచేసి జాతీయ స్థాయిలో అవార్డులు అందుకుంటారన్నారు. ఆర్‌జేడీ రవీందర్ మాట్లాడుతూ ఈ పోటీలో పాల్గొనడానికి



31 జిల్లాల నుంచి 650 ఈవెట్‌లతో 700 విద్యార్థులు, గైడ్ టీచర్లు హాజరయ్యారు.. తమ ఇన్నో వేటీవ్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. 14 కమిటీల ద్వారా ఏర్పాట్లు సదుపాయాలను పర్యవేక్షిస్తున్నారు. గురుకుల పాఠశాలలో మహిళలకు, పురుషులకు వేరుగా సదుపాయాలను ఏర్పాట్లుచేశారు. బాలికల గురుకులంలో మహిళల కోసం ప్రత్యేకంగా అధికారిని నియమించారు. వైజ్ఞానిక ప్రదర్శనలు ముగిసేవరకు ఏర్పాట్లు ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిట్ ప్రొ. రాంచంద్రయ్య, కార్పోరేటర్ జోరిక రమేష్, డిఈఓ నారాయణరెడ్డి, జనగాన డీఈఓ యాదయ్య, మడికొండ పాఠశాల ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి, ఉమామహేశ్వరీ, ఎంఈఓ వీరభద్రనాయక్, సర్వోత్తమ్‌రెడ్డి, బుచ్చిబాబు,శ్యామ్ తదితరులుపాల్గొన్నారు.

రిలయన్స్ సెక్యూరిటీ మోసగాళ్లు అరెస్టు

మట్టేవాడ, ప్రభన్యూస్ : రిలయన్స్ సెక్యూరిటీ, మల్టీలెవల్ షేర్ మార్కెటింగ్ పేరిట 200 మంది డిపా జిట్ దారుల నుంచి రూ. 1.80 కోట్లు తీసుకొని మోసం చేసిన క్రిష్టియన్ కాలనీకిచెందిన అయిత అరుణ్, హన్మకొండ యాదవనగర్‌కు చెందిన కంచెర్ల రామునుబడా మోసగాళ్లను అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ వెంకట్‌రెడ్డి మీడియా ముందు ప్రవేశ పెట్టారు. శనివారం పాత్రికేయుల సమావేశంల డీసీపీ మాట్లా డుతూ వరంగల్ నగరంలోని క్రిష్టియన్ కాలనీకి చెందిన అయిత అరుణ్, హన్మకొండ యాద వనగర్‌కు చెందిన కంచెర్ల రాము వీరిద్దరు కలిసి హంట ర్‌రోడ్డులోని రిలయన్స్ సెక్యూరిటీ కార్యాలయం ఏర్పాటు చేసుకుని ఉద్యోగాల పేరిట సిబ్బందిని తీసు కొని రిలయన్స్ షేర్ మార్కెట్ పేరుతో కార్యా లయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు ఫోన్ చేసి లక్షకు 15 శాతం వడ్డీ ఇస్తామని 200 మంది వద్ద నుంచి సుమారు కోటి 80 లక్షలు డిపాజిట్ రూపంలో చేయిం చుకుని తన స్వంత ఖర్చులకు వాడు కున్నారన్నారు. ఇది మోసం చేసే కంపెనీ అని తెలవడంతో ఇందు లోప్రభుచరణ్ అనే వ్యక్తం మట్టేవాడ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు మేరకు వరంగల్ ఏసీపీ నర్సయ్య ఆధ్వర్యంలో పోలీసుల విచారణలో రిలయన్స్‌షేర్ మార్కెట్ ఫేక్ అని తెలి యడంతో అయిత అరుణ్, కంచర్లను రాజులను అరెస్టు చేసి రూ.6లక్షల నగదు,మోటార్ సైకిల్,సెల్ ఫోన్స్, గుర్తింపు కార్డులు, రశీదులు, ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనంచేసుకున్నామని, ఇంకా పూర్తి విచారణ జరగలేదని, రిలయన్స్ కంపెనీతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా..లేవా..అనే కోణంలో విచారణ జరుగుతుందని డీసీపీ పేర్కొన్నారు.

ఏ క్షణమైనా తీపికబురు!

(మొదటిపేజీ తరువాయి)

ముహూర్తం 10న ఉండొచ్చన్న చర్చ పార్టీవర్గాల్లో వినిపిస్తోంది. ఫిబ్రవరి రెండు లేదా మూడోవారంలో తెలంగాణబడ్జెట్ సమావేశాలు జరగనుండగా, విస్తరణ కసరత్తు సీఎం ఇప్పటికే పూర్తిచేశారని భావిస్తున్నారు. పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ముఖ్యులతో ఆశావహుల అంశంపై సీఎం కేసీఆర్ చర్చించడంతో పాటు నివేదికలు తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఆదివారం యాదాద్రి వెళుతున్న సీఎం కేసీఆర్, సోమవారం సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు 5నుండి కౌంట్‌డౌన్ ప్రారంభమైనట్లేనని, ఏ క్షణమైనా విస్తరణ తీపికబురు ఆశావహులకు అందవచ్చని ప్రగతిభవన్ సన్నిహితవర్గాల ద్వారా తెలిసింది.

బియ్యం నాణ్యతలో రాజీపడొద్దు

కొనుగోళ్లపై రైస్‌మిల్లర్లతో పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సంప్రదింపులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పేదలకు పంపిణీ చేసే బియ్యం కొనుగోళ్ల విషయంలో నాణ్యతపై రాజీపడొద్దని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. బియ్యం కొనుగోళ్ల కోసం రైస్‌మిల్లర్లతో శనివారం ఆయన కమిషనర్ అకున్ సభర్వాల్‌తో కలసి సంప్రదింపులు జరిపారు. ప్రజా పంపిణీకి 3.50లక్షల మెట్రిక్ టన్నులు, మధ్యాహ్న భోజనం, హాస్టల్స్‌లో సరఫరా కోసం 1.20 లక్షల మెట్రికట్ టన్నుల బియ్యం అవసరం ఉంటుంది. బియ్యం సేకరణ కోసం పౌరసరఫరాల సంస్థ టెండర్లను ఆహ్వానించింది. బియ్యాన్ని మిల్లర్ల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో శనివారం రైస్ మిల్లర్లతో వారు ధరల విషయంలో సంప్రదింపులు జరిపారు. రైస్ మిల్లర్లు దీన్ని సామాజిక బాధ్యతగా తీసుకొని ఇందులో భాగస్వాములు కావాలని మిల్లర్లకు చైర్మన్ విజ్ఞప్తి చేశారు. మిల్లర్లతో సంప్రదింపుల కంటే ముందు చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఈపాస్, ఐరిస్ ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.



ఆస్ట్రేలియాను ముంచెత్తుతున్న వరదలు

క్వీన్స్‌లాండ్ : ఈశాన్య ఆస్ట్రేలియాపై రుతుపవనాలు తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తున్నారు. కుండపోత వర్షాలతో వరదలు ముంచెత్తుతున్నాయి. పలు ప్రాంతాలను ముంపునకు గురవుతున్నాయి. మరోపక్క నిరంతరాయంగా భారీగా వర్షపాతం నమోదవుతోంది. ముంపునకు గురయిన బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇదే విధంగా ఎడతెరిపిలేని వర్షం కురిస్తే మరో 20 వేలమందిని పునరావాస కేంద్రాలక తరలించాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈశాన్య ఆస్ట్రేలియాలో ఇలాంటి వరదలను ఇదివరకెప్పుడు చూడలేదని అధికారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురవనున్నాయని హెచ్చరించారు. ఇళ్లు ముంపునకు గురవ్వకుండా ఆర్మీ కృషి చేస్తోంది. కార్లు, ఇంట్లోని సామాన్లు వరదల్లో కొట్టుకుని పోతున్నాయని అధికారులు తెలిపారు.

వేడితో విలవిల్లాడుతున్న దక్షిణ ఆస్ట్రేలియా

ఇదిలావుండగా దక్షిణ ఆస్ట్రేలియాలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. చరిత్రలో ఇదివరకెప్పుడూ చవిచూడని ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా 49.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. దక్షిణ ఐలాండ్ రాష్ట్రం టస్మానియాలో అడవులు తగలబడుతున్నాయి. ఈ వేడిమిని తట్టుకోలేక చేపలు పెద్ద సంఖ్యలో మృత్యువాతపడుతున్నాయి. ఆస్ట్రేలియా చరిత్రలోనే ఈ జనవరిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. సముద్రాల ఉష్ణోగ్రత 1 డిగ్రీ సెల్సియస్ పెరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



- అతిశీతల వాతావరణంతో దిక్కుతోచని అగ్రరాజ్యం
- ఘనీభవించిన జలపాతాలు.. నదులు.. సరస్సులు
- ధ్రువ ప్రాంతాలను మించిన చలి
- ఉత్తర, మధ్య అమెరికాలో ప్రమాద ఘంటికలు
- రికార్డు స్థాయిలో మైనస్ ఉష్ణోగ్రతలు
- కనిపించని రహదారులు.. విద్యాసంస్థలకు సెలవులు
- పలురాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితి విధింపు
- సోషల్ మీడియాలో మంచు వీడియోలు వైరల్
- గ్లోబల్ వార్మింగ్ ప్రభావమేనా?
- శాస్త్రవేత్తలు చెబుతున్నదేమిటి?

మంచుమాటున అమెరికా

అగ్రరాజ్యం గజగజ

వాషింగ్టన్ : అమెరికా గజగజ వణికిపోతోంది. ధ్రువ ప్రాంతాల్లోకన్నా ఎక్కువగా శీతలవాతావరణం ఏర్పడటంతో అగ్రరాజ్యం దిక్కుతోచని స్థితిలో చిక్కుకుపోయింది. మైనస్ 52 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఎక్కడికక్కడ మంచు గడ్డకట్టేస్తోంది. నయాగరా సహా పలు జలపాతాలు... సరస్సులు, నదులు ఘనీభవించాయి. అతిశీతల ఉష్ణోగ్రతలతో శరీరం గడ్డకట్టి 23 మంది పైగానే ప్రాణాలు కోల్పోయారు. మంచు భారీగా కురుస్తోంది. ఎముకలు కొరికే చలిగాలులు వీస్తున్నాయి. మరుగుతున్న నీటిని కిందికి పోస్తే భూమిని తాకేలోపే అవి గడ్డకడుతున్నాయి. సోడా, బీర్ బాటిళ్లు అధిక చల్లదనంతో పేలిపోతున్నాయి. నదిలోని నీరు గడ్డకట్టి ఆవిరి వెలువడుతోంది. అగ్రరాజ్యం అమెరికాలో పరిస్థితి ఇది. ఉత్తర ధ్రువం ఆర్కిటిక్ నుంచి వీస్తున్న అతిశీతల గాలులు అమెరికాలోని రాష్ట్రాలను గజగజ వణికిస్తున్నాయి. పాత రికార్డులను బ్రేక్ చేస్తూ మైనస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అమెరికాలోని 50 రాష్ట్రాలు అసాధారణ ఈ అత్యల్ప ఉష్ణోగ్రతలతో వణికిపోతున్నాయి. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రభుత్వం ప్రజలను రక్షించేందుకు ఎక్కడికక్కడ హీట్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు నిరవధికంగా సెలవులు ప్రకటించారు. ఈ పరిస్థితి ఎప్పటికి చక్కబడుతుందన్నది గట్టిగా చెప్పలేకపోతున్నారు. చరిత్రలో ఎప్పుడూ లేని ఈ పరిస్థితి గ్లోబల్ వార్మింగ్ ప్రభావమేనా అన్నదానిపై చర్చ సాగుతోంది.

ఆరోగ్యం జాగ్రత్త

ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయిలో పడిపోవడంతో జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రాణాలకు ముప్పు తప్పదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా -32 డిగ్రీలవరకు మానవ శరీరం చలిని కొద్దిసేపు తట్టుకోలగుతుంది. ఎక్కువసేపు ఆ వాతావరణంలో ఉంటే రక్తం గడ్డకట్టి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. ఇప్పుడు ఇంతకంటే ఎక్కువ స్థాయిలో శీతల గాలులు వీస్తుండటంతో ప్రమాదం ఎక్కువే. అందుకే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యులు హెచ్చరిస్తున్నారు. బయట వాతావరణం లో ఎక్కువసేపు ఉండొద్దని, ఉన్ని దుస్తులు ధరించి, చేతులు, కాళ్లు, తలకు రక్షణ ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ పది నిమిషాల కంటే ఎక్కువ సమయం బయటగడిపవద్దని సూచిస్తున్నారు. ఒకవేళ బయటే తిరిగితే శరీరంపై గాయాలవుతాయని, అది ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. శీతల వాతా వరణం కారణంగా దద్దుర్లు వస్తున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘంగా శ్వాస తీసుకోవడం మంచిదికాదని, తక్కువగా మాట్లాడాలని, ఇళ్లకే పరిమితమవ్వడం సురక్షితమని సూచిస్తున్నారు. మరోవైపు అతిశీతల వాతావరణం కారణంగా వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎక్కవమంది శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. చలిని తట్టుకోవడం చాలామందికి సాధ్యం కావడం లేదు.

చలి ఎక్కడంటే..

ముఖ్యంగా ఉత్తర మధ్య అమెరికా, తూర్పు తీర ప్రాంత రాష్ట్రాలు ధ్రువాలను తలపిస్తున్నాయి. కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా సున్నా నుంచి మైనస్ 51 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. డెట్రాయిట్, చికాగో, మిన్నెసోటా, ఇల్లినాయిస్, నార్త్ డకోటా, మిసిసిపీ, అలబామాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు. లోవా నగరంలో మైనస్ 51 ఫారెన్ హీట్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయిందని అమెరికా జాతీయ వాతావరణ సేవల విభాగం వెల్లడించింది. చికాగోలో మైనస్ 30 సెల్సియస్ (మైనస్ 22 ఫారెన్ హీట్)గా నమోదయింది. నార్త్‌డకోటాలో మైనస్ 37 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. అంటార్కిటికాలోని కొన్ని ప్రాంతాల కంటే అత్యల్ప ఉష్ణోగ్రతలు అమెరికాలో నమోదయ్యాయి. అత్యంత ప్రమాదకర పరిస్థితులకు ఈ గణాంకాలు అద్దం పడుతున్నాయి.

తీవ్రత ఎంతంటే..

ఈ తీవ్ర పరిస్థితుల కారణంగా దాదాపు 250 మిలియన్ల అమెరికన్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరిలో దాదాపు 90 మిలియన్ల మంది మైనస్ 17 డిగ్రీల ఉష్ణోగ్రత వాతావరణాన్ని చవిచూశారు. దాదాపు 20 మిలియన్ల మంది మైనస్ 28 సెల్సియస్ డిగ్రీల వాతావరణంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. న్యూఇంగ్లాండులోని గ్రేట్ లేక్ ప్రాంతంలోనూ భారీగా మంచుకురుస్తోంది. ఇల్లినాయిస్‌లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. విస్కన్‌సిన్, మిచిగాన్, ఇల్లినాయిస్, అలబామా, మిసిసిపీలలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఈ అత్యల్ప ఉష్ణోగ్రతలు ఇదివరకెప్పుడూ నమోదు కాలేదు. నార్త్ డకోటాలో ఈ వారంలో మైనస్ 54 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఇదే పరిస్థితి వారం రోజులపాటు కొనసాగే అవకాశం ఉంది.

స్తంభించిన జనజీవనం

అనూహ్య శీతల గాలులతో అమెరికాలో జనజీవనం స్తంభించిపోయింది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలకు తాత్కాలికంగా సెలవులు ప్రకటించారు. అమెరికా పోస్టల్ డిపార్టుమెంటు విభాగంపై ఈ ఉష్ణోగ్రతల ప్రభావం పడింది. దాదాపు 10 రాష్ట్రాలలో సేవలను నిలిపివేసింది. తమ సిబ్బందిని రక్షించుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. రోడ్లపై మంచు భారీగా పేరకుపోయింది. వెతికినా రోడ్లు కనిపించే పరిస్థితి లేదు. దీంతో కొన్నిచోట్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉత్తర కరోలినాలో ఓ యువజంట రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది.

విమాన సర్వీసులు రద్దు

రోడ్లు, పట్టాలపై మంచు కురవడంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. మరోవైపు శీతలగాలులు, వాతావరణ అననుకూలత, ఏమీ కనిపించకపోవడంతో విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడుతోంది. అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయిన ఒక్క బుధవారమే సుమారు 2600 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ముఖ్యంగా చికాగో నుంచి వెళ్లాల్సిన విమానాలు అధిక సంఖ్యలో రద్దయ్యాయి.

మంచు ఫలకాలు.. భారీ శబ్దాలతో భయం

భూకంపాల మాదిరిగా మంచు ప్రకంపనలు అమెరికన్లను భయపెడుతున్నాయి. భారీగా కురుస్తున్న మంచు కుప్పలుగా ఏర్పడుతోంది. ఈ భారీ మంచు పొరలు ఒకదానిని మరొకటి ఢీకొట్టుకుంటున్నాయి. దీంతో భారీగా శబ్దాల వెలువడుతున్నాయి. ఏదో వచ్చి మీద పడినట్టుగా అనిపిస్తోందని స్థానికులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నదులలో కూడా ఇదే పరిస్థితి ఉంది గడ్డకట్టిన నీరు ముక్కలుగా విడిపోతున్న సమయంలో శబ్దాలు వెలువడుతున్నాయి. ఇంట్లో ఉన్నా అనూహ్య వాతావరణంతో అమెరికన్లు హడలిపోతున్నారు.

ఆరుబయటే గడ్డకట్టి మరణాలు

అతి శీతల పరిస్థితుల కారణంగా ఇప్పటి వరకు 23 మంది మృతి చెందినట్టు అధికారిక సమాచారం. బయటకు వెళ్లనవారిలో కొందరు చలి తీవ్రతకు రక్తం గడ్డకట్టి ప్రాణాలు వదిలారు. మంచుతో వారు అలా గడ్డకట్టి బిగుసుపోయి ఉండగా అధికారులు గుర్తించారు. వీధులలో గడ్డకట్టిన పలు మృతదేహాలను అధికారులు గుర్తించారు. 18 ఏళ్ల వయసున్న ఓ విద్యార్థి చలిని తట్టుకోలేక,శరీరం గడ్డకట్టి చనిపోయాడు. విద్యార్థి పరిస్థితిని గుర్తించిన స్నేహితులు, కాలేజీ సిబ్బంది హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించారు. కానీ ప్రయోజనం లేకపోయింది.


రైతులకు నానా కష్టాలు

అమెరికా ఉత్తర మధ్య ప్రాంతంలోని రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పశువులను రక్షించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కోళ్లు, పశువుల కోసం ప్రత్యేక వసతి నిర్మించాల్సి వస్తోంది. ఇంతిటి కఠిన వాతావరణంలో కూడా పశువులకు రక్షణగా ఉండాల్సిన వస్తోందంటున్నారు. ఈ పరిస్థితుల్లో పశువులు పిల్లలకు జన్మనిస్తే బతికే అవకాశం లేదు. శీతల వాతావరణం కారణంగా పిల్లలు చనిపోతాయని చెబుతున్నారు. ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో సమయానికంటే ముందుగానే జంతువులకు పిల్లలకు జన్మనిస్తున్నాయని వెల్లడించారు. పెంపుడు జంతువులను ఇంట్లోనే ఉంచుకోవాలని జంతు హక్కుల సంస్థ పెటా ప్రజలకు విన్నవించింది.

ఎందుకిలా?

ఆర్కిటిక్ ప్రాంతం నుంచి దక్షిణ దిశవైపు బలమైన శీతల గాలులు వీస్తుండడంతో అమెరికా ఉత్తర భాగంలో ఈ పరిస్థితి ఏర్పడింది. భూగోళానికి ఉత్తర, దక్షిణ ధృవాలున్నాయి. ఉత్తర ధృవం వద్ద గాలులు అపసవ్య దిశలో వీస్తాయి. దక్షిణ ధృవం వద్ద సవ్యదిశలో తిరుగుతాయి. ఈ ధృవాలకు అవతల ఎత్తులో, అత్యల్ప పీడనాన్ని కలిగిన ప్రాంతం పోలార్ వర్టెక్స్ ఉంటుంది. స్ట్రాటోపొరలో ఈ పోలార్ వర్టెక్స్ ఉంటుంది. ఈ పొరకు దిగువన ట్రోపో ఆవరణం ఉంటుంది.

ఈ రెండు ధృవాలు మధ్య, ఎగువ ట్రోపో స్పియర్ల మధ్య కేంద్రీకృతమయ్యి ఉంటాయి.దీంతో ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా నమోదవుతాయి. అతిశీతల గాలులు వీస్తాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో సాధారణంగా గాలులు వీస్తాయి. అయితే అసాధారణ వేడి పరిస్థితుల్లో పోలార్ వర్టెక్స్‌లో భిన్నమైన పరిస్థితి ఏర్పడుతుంది. భూవాతావరణం నుంచి వేడిగాలులు పోలార్ వర్టెక్స్‌లోకి ప్రవేశించినప్పుడు అక్కడి శీతల గాలులు అసాధారణంగా ప్రవర్తిస్తాయి. గాలులు దిశను మార్చుకుంటాయి. ఈ పోలార్ వెర్టెక్స్‌లో శీతల గాలుల్లో విభజన ఏర్పడినప్పుడు అకస్మాత్తుగా ఉష్ణోగ్రతలు పడిపోతాయి. అతిశీతల వాతావరణం ఏర్పడుతుంది. ఈ గాలులు ముఖ్యంగా ఉత్తర అమెరికాతోపాటు ఉత్తర, పశ్చిమ యూరప్‌లపై ఈ ప్రభావాన్ని చూపిస్తాయి. దక్షిణదిశగా ప్రయాణించి భూవాతావరణంలోకి వస్తాయి. పోలార్ వర్టెక్స్ నుంచి అత్యంత దూరప్రాంతాలకు కూడా ఈ శీతల గాలులు వ్యాపిస్తాయి. ఉత్తరఅమెరికాపై ఈ శీతల గాలుల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ ప్రక్రియలో భాగంగానే అతిశీతల గాలులు అమెరికాలోని 48 రాష్ట్రాలను తీవ్ర ప్రభావితం చేశాయని నిపుణులు చెబుతున్నారు.



శాస్త్రవేత్తలు ఏం చెబుతున్నారు?

వాతావరణంలో మార్పులే ఈ తీవ్ర పరిస్థితులకు కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆర్కిటిక్ నుంచి వీచే శీతల గాలులు సాధారణంగా ఉత్తర ధృవం వద్ద స్థిరంగా ఉంటాయి. కానీ వేడి వాతావరణం కారణంగా బలహీనపడ్డాయి. దక్షిణ దిశగా పయనిస్తున్నాయనే మరో వాదన కూడా ఉందని చెబుతున్నారు. రెండు బలమైన శీతల గాలుల ప్రభావమే ఇదని ఉడ్స్ హోల్ రిసెర్చ్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ జెన్నిఫర్ ఫ్రాన్సిస్ వెల్లడించారు. స్ట్రాటో స్పియర్‌లో అనూహ్య వేడి వాతావరణం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ఈ వాతావరణ పరిస్థితులను ఉటకింస్తూ వాతావరణ మార్పులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సహజశైలిలో వ్యగ్యంగా స్పందించారు. 'గ్లోబల్ వార్మింగ్ వల్ల ఏం జరుగుతుంది. గ్లోబల్ వార్మింగ్ నువ్వు మాకు కావాలి. త్వరగా వెనక్కి వచ్చెయ్' అంటూ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు.



సోషల్ మీడియాలో వైరల్‌గా వీడియోలు

అతిశీతల గాలులు అమెరికన్లకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. మైనస్ ఉష్ణోగ్రతలు అమెరికన్లుకు కొత్త అనుభూతిని మిగుల్చుతున్నాయి. చుట్టూ పరిసరాలు గడ్డకట్టిపోతున్నాయి. ఇంటిపై, వీధుల్లో మంచు గుట్టలుగా పేరుకుపోతోంది. అయితే పరిస్థితి తీవ్రతను తెలియజేసే పలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరుగున్న నీటిని పాత్ర నుంచి కిందికి పడేలోగా గడ్డపోవడం, రైలు పట్టాలను మండించి వేడి ద్వారా మంచును తొలగించడం, ఓ మహిళ తన జుట్టును నీటితో తడుపుకుంటే వెంటనే గడ్డకట్టడం, నీటితో తడిసిన దుస్తులు గడ్డకట్టడం, నూడుల్స్ గడ్డకట్టడం, ఇంట్లోని టాయిలెట్ బేసిన్ పగిలిపోవడం, తలుపులు మంచుతో బిగించుకుపోవడం వంటి వీడియోలు వైరల్‌గా మారాయి. సోషల్ మీడియా మాధ్యమాలలో వివిధ పేర్లు, హ్యాష్ ట్యాగులతో వీడియోలను పోస్టు చేస్తున్నారు.

గ్లోబల్ వార్మింగ్ ప్రభావమేనా?

అమెరికాలో ఏర్పడిన అసాధారణమైన ఈ పరిస్థితులను శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. కారణాలను వెల్లడించేందుకు ఆధారాలను కూడా సేకరిస్తున్నారు. శీతల గాలులు వేగం, దిశను మార్చుకోవడం నెమ్మదిస్తున్నాయి. భూమిపై వేడి వాతావరణం కారణంగా వీలుగా, సవ్యంగా ప్రయాణించలేకపోతున్నాయి. అధిక వేగంతో వీచే వేడి గాలులు పోలార్ వర్టెక్స్‌తో ఢీకొట్టినప్పుడు ఈ శీతల గాలులు దక్షిణదిశగా పయనిస్తున్నాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో వేగంగా కరిగిపోతున్న మంచు సముద్రంలో కలుస్తోంది. ఈ మంచు గడ్డల ఉష్ణోగ్రతను సముద్రపు అడుగు భాగం శోషిస్తుంది. సముద్రపు అడుగుభాగం శోషించిన ఈ వేడి చలి వాతావరణంలోకి వస్తుంది. దీంతో ధ్రువపు ప్రాంతాల నుంచి శీతల గాలులు ఏర్పడుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అమెరికాలో ఏర్పడిన పరిస్థితులు గ్లోబల్ వార్మింగ్‌కు సంబంధం లేదని చెప్పడం లేదని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితి కేవలం అమెరికాకు మాత్రమే పరిమితం అంటున్నారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని తాము ధృవీకరింకచడం లేదని భిన్నవాదననూ వినిపిస్తున్నారు.

30 ఏళ్లలో తొలి వేడుక...

అదొక పురాతన చర్చి.. దానికి వందేళ్ల చరిత్ర.. 30ఏళ్లలో అక్కడ ఒక్క పెళ్లి కూడా జరగలేదు. ఆ చర్చి పేరు సెయింట్ మేరీ. భూలోకస్వర్గంగా పిలిచే కశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో ఉంది. 1990 తర్వాత తొలిసారి ఈ ఫిబ్రవరి 1న ఈ వేదికపై ఆస్ట్రేలియాకు చెందిన రాబర్ట్‌సన్, కేట్ హామిల్టన్ జంట ఒక్కయ్యారు. భారతీయ వస్త్రధారణలో మంచు పర్వతాల అందాల మధ్య ఈ వేడుక జరిగింది. స్థానిక మత పెద్దలు ఈ వివాహాన్ని జరిపించారు. వీనుల విందైన కాశ్మీరీ సంగీతం, రుచికరమైన వంటకాలు అతిథులకు మధుర అనుభూతిని కలిగించాయి. ఈజంట ఏడాది కిందటే ఒక్కటవ్వాలని అనుకున్నారు. కానీ, తెల్లని వాతావరణం ఉండాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. అలాంటి వేదిక కోసం దాదాపు ఆరు నెలలపాటు అన్వేషించారు. కశ్మీర్‌కు మంచు పర్వతారోహక యాత్రికులను తీసుకెళ్లే స్నేహితుడికి వారి మనసులో మాట చెప్పారు. అతడి సహాయంతో ఇన్నాళ్లకు గుల్మార్గ్‌లోని ప్రకృతి అందాల నడుమ, చారిత్రక చర్చిలో మా రెండు మనసులు ఒక్కటయ్యాయని నూతన దంపతులు వెల్లడించారు. ఒకవేళ మత పెద్దలు రాకపోతే చర్చిలో ఉంగరాలు మార్చుకోవాలని నిర్ణయించాం. కానీ అదృష్టం కొద్దీ వివాహం అద్భుతంగా జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. నా ఆరోగ్యం బాగాలేదు. అయినా ఈ వేడుకలో పాలుపంచుకోవాలని అతికష్టం మీద వెళ్లాను. ముప్పై ఏళ్లుగా అక్కడ పెళ్లి జరగలేదు. దీన్ని బ్రేక్ చేయాలని భావించి చర్చికి వెళ్లానని ఇద్దరు మతపెద్దల్లో ఒకరైన విను కౌల్ వెల్లడించారు. పర్యాటకులకు కశ్మీర్ సురక్షితమని ఈ పెళ్లి ద్వారా బయట ప్రపంచానికి తెలుస్తుందని గుల్మార్గ్‌లోని హోటల్ హైల్యాండ్స్ పార్క్ గుల్మార్గ్ మేనేజింగ్ డైరెక్టర్ ఖవిర్ జిలానీ పేర్కొన్నారు.



ఎన్డీయే బడ్జెట్ల తీరిదీ...



న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెటే అయినా జనరంజక పద్దుతో ఎన్డీయే ఎన్నికల ఏరువాకకు శ్రీకారం చుట్టింది. రైతులు, కార్మిక, మధ్యతరగతికి లబ్ధి కలిగేలా 2019-20 పద్దు ఉంది. అదే సమయంలో రక్షణ, రైల్వే, గ్రామీణ అభివృద్ధికీ పెద్దపీట వేశారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో, సంక్లిష్ట నిర్ణయాలకు తెరతీశారు. మొదటి బడ్జెట్‌లో విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరిచారు. పారిశ్రామికానికి ఊతమిచ్చేలా జైట్లీ అడుగులు వేశారు. ఆ తర్వాత రెండవ బడ్జెట్‌లో కార్పొరేట్లను ప్రసన్నం చేసుకున్నారు. మూడవ బడ్జెట్‌లో నోట్ల రద్దు దుష్పరిణామాలను తొలగించే ప్రయత్నం చేశారు. వ్యవసాయం, గ్రామీణానికి తోడ్పాటునిచ్చారు. నాల్గవ బడ్జెట్‌లో పరివర్తన భారత్ దిశగా అడుగులు వేసిన జైట్లీ, మరుసటి యేడాది మెగా ఆరోగ్య బీమాతో ప్రజల దృష్టిని ఆకర్షించారు. అన్ని రంగాలకు జవసత్వాలు ఇచ్చేందుకు గత నాలుగున్నరేళ్లలో మోడీ ప్రభుత్వం అడుగులు వేసింది. కానీ, ప్రధాన ఎన్నికల హామీ అయిన నిరుద్యోగం సమస్యకు మాత్రం పరిష్కారం చూపలేక పోయింది. విదేశీ పెట్టుబడులు వెల్లువలా వచ్చినా, దేశీయంగా ప్రైవేటు పెట్టుబడుల్లో జోష్ తగ్గింది. దాని మూలంగా ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైంది. 2014 నుంచి ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లపై సంక్షిప్త వివరణ.

2014-15
(యథాతథ స్థితి బ్రేక్)

జీడీపీ - 7.4 శాతం
ఎఫ్‌పీఐ - రూ. 2, 77, 459 కోట్లు
ఎఫ్‌డీఐ - 30, 931 మిలియన్ డాలర్లు
ఫండ్ పెట్టుబడులు - రూ. 68, 121 కోట్లు

- విదేశీ పెట్టుబడుల నిబంధనలు సడలింపు. రక్షణ, బీమా, గృహనిర్మాణ, తయారీ రంగాల్లో మరి న్ని విదేశీ పెట్టుబడులకు అవకాశం.
- సెక్యూరిటీ మార్కెట్ లావాదేవీల ఆదాయాన్ని క్యాపిటల్ గెయిన్స్‌గా పరిగణించడం. పన్నుల అంశ ంలో వ్యాపార ఆదాయంగా పరిగణించబోమని వెల్లడి
- నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ద్వారా దేశీయ యువతను ప్రతిభావంతులను చేయడం. తద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే సంకల్పం.
- ఆదాయ పన్ను పరిమితి వయోవృద్ధులకు రూ. 50వేలు పెంపు.
- నిర్మాణాత్మక ఎకో సిస్టం కోసం రూ. 10వేల కోట్ల నిధి ఏర్పాటు
- కొత్త పవర్ ప్రాజెక్టులకు పదేళ్ల పన్ను హాలిడే
- ఫుడ్‌కార్పోరేషన్ పునర్నిర్మాణం కోసం ఆహార ఉత్పత్తులకు జాతీయ మార్కెట్.

2015-16
(కార్పొరేట్ పన్ను తగ్గింపు)


జీడీపీ లక్ష్యం - 8.2 శాతం
ఎఫ్‌పీఐ - రూ. 18, 175 కోట్లు
ఎఫ్‌డీఐ - 40, 001 మిలియన్ డాలర్లు
ఫండ్ పెట్టుబడులు రూ. 67వేల కోట్లు

- కార్పొరేట్ వర్గాలకు పన్ను తగ్గింపు. 30శాతం నుంచి 25 శాతానికి కుదింపు. ఇది ఇప్పటికీ పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి రాలేదు. 2018-19 బడ్జెట్ కూడా రూ. 250 కోట్ల లోపు టర్నోవర్ కంపెనీలకు ఇదే మినహాయింపును కొనసాగించింది. 2016 బడ్జెట్‌లో ఈ పరిమితి కేవలం రూ. 50 కోట్ల టర్నోవర్‌కే ఉండేది.
- సూక్ష్మ తరహా సంస్థల అభివృద్ధికి ప్రత్యేక ఏజన్సీ పేరుతో ముద్ర బ్యాంక్ ఏర్పాటు నిర్ణయం. ఇందుకు 20 వేల కోట్లు కేటాయింపు. ప్రధాన్ మంత్రి యోజన పథకం ద్వారా మరో 3 వేల కోట్లు కార్పస్ ఫండ్ కేటాయింపు.
- బంగారంలో పొదుపు పథకానికి ప్రోత్సాహం. గోల్డ్ బాండ్లు ప్రవేశపెట్టారు.

2016-17
(వ్యవసాయం, గ్రామీణం)

జీడీపీ లక్ష్యం - 8.2 శాతం
ఎఫ్‌పీఐ - రూ. 48, 411 కోట్లు
ఎఫ్‌డీఐ - 43,478 మిలియన్ డాలర్లు
ఫండ్ పెట్టుబడులు - రూ. 59,006 కోట్లు

- గ్రామీణ భారతానికి, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత. రైతు సంక్షేమం, వ్యవసాయ రుణాలు, నీటి ప్రాజెక్టులు, గ్రామీణ అంతర్గత రోడ్లకు సింహభారం కేటాయింపులు.
- ప్రధాన మంత్రి కృషియోజన, ఫసల్ యోజన పథకాలకు శ్రీకారం. ఇందుకు వరుసగా 5,500 కోట్లు, రూ. 2,954.65 కోట్ల రూపాయలు కేటాయింపు.
- సేవా రంగం పన్నుల నుంచి అదనంగా 0.5 శాతం కృషి కల్యాణ్ యోజన కో సం వడ్డింపు. జీఎస్టీ అమలు తర్వాత దీన్ని తొలగించారు.





2017-18
(పరివర్తన, పారదర్శకత)

జీడీపీ లక్ష్యం - 7.2శాతం
ఎఫ్‌పీఐ - రూ. 1, 44, 680 కోట్లు
ఎఫ్‌డీఐ - 44, 857 మిలియన్ డాలర్లు
ఫండ్ పెట్టుబడులు - రూ. 15, 675 కోట్లు

- ఎలక్షన్ కమిషన్ సిఫార్సుల మేరకు రాజకీయ పార్టీలకు నేరుగా నగదు రూపంలో వచ్చే వ్యక్తిగత రహస్య విరాళాల పరిమితి రూ. 20 వేల నుంచి రూ. 2వేలకు కుదింపు
- రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల మధ్య ఆదాయానికి 5 శాతం పన్ను. తద్వారా వేతన జీవులకు పన్ను ఊరట.
- అధిక ఆదాయ వర్గాలపై పన్ను వడ్డింపు. రూ. 50 లక్షల నుంచి కోటి వరకు వ్యక్తిగత ఆదాయంపై 10శాతం సర్‌చార్జి వడ్డన.
- రూ. 50 కోట్లవరకు టర్నోవర్ కలిగిన కంపెనీలకు పన్ను రేటులో 5శాతం తగ్గింపు.
- రూ. 5వేల కోట్ల విదేశీ పెట్టుబడుల ఆమోదానికి సంబంధించిన ప్రమోషన్ బోర్డు విధానం తొలగింపు.

2018-19
(ఆరోగ్య బీమా)

జీడీపీ లక్ష్యం - 7.2 శాతం
ఎఫ్‌పీఐ - రూ. 1, 01, 252 కోట్లు
ఎఫ్‌డీఐ - 12, 752 మిలియన్ డాలర్లు
ఫండ్ పెట్టుబడులు - రూ. 81, 201 కోట్లు

- జాతీయ ఆరోగ్య బీమా పథకానికి శ్రీకారం. దేశవ్యాప్తంగా 10వేల కుటుంబాలు, 50 కోట్ల మంది పేదలకు లబ్ధి కలిగించేలా కొత్త పథకం. ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి ఏడాదికి 5 లక్షల రూపాయల వరకు ఆరోగ్య బీమా.
- దీర్ఘకాల మూల (షేర్లు) ధన ఆదాయంపై లక్ష దాటితే 10 శాతం పన్ను. షేర్లు, మ్యూచ్‌వల్ ఫండ్లలో పొదుపు చేసుకున్న మధ్యతరగతిపై భారం.
- పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చర్యలు. ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా ధర లభించేలా చర్యలు.

2019-20
(మధ్యంతర బడ్జెట్)

- రైతులు, కార్మికులు, మధ్యతరగతికి తాయిలం
- ఐదెకరాల లోపు వ్యవసాయభూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ. 6వేల ఆర్థికసాయం. 12 కోట్ల మందికి లబ్ధి. 75వేల కోట్లు కేటాయింపు.
- అసంఘటిత రంగ కార్మికులకు పెన్షన్ సదుపాయం. రూ. 15వేల లోపు వేతన జీవులు నెలకి రూ. 100 చెల్లిస్తే 60 ఏళ్ల తర్వాత రూ. 3వేలు పెన్షన్.
- గత నాలుగు బడ్జెట్ల నుంచి నిరీక్షిస్తున్న మధ్య తరగతికి ఈసారి మోడీ వరమిచ్చారు. ఆదాయ పన్నులో నూరు శాతం రిబేటు ప్రకటించి ఊరటనిచ్చారు. రూ.5 లక్షల వార్షికాదాయం కలిగిన వారికి లబ్ధి. పొదుపు పెట్టుబడులపైనా, స్టాండర్డ్ తగ్గింపులు రూ. 10 వేల నుంచి 50 వేలకు పెంపు.
- రక్షణ రంగానికి మూడు లక్షల కోట్లు. రైల్వేలకు ద్వితీయ ప్రాధాన్యత. గ్రామీణ రోడ్లకు పెద్దపీట.



ఎప్పటికప్పుడు... వాతావరణం

- రాష్ట్రవ్యాప్తంగా 924 కేంద్రాలు
- తెలంగాణ సీఎస్ జోషి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రజలకు చేరవేసేందుకు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ ఎంతో కృషి చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి తెలిపారు. శనివారం సచివాలయంలో వాతావరణ సమాచారాన్ని తెలిపే ఎల్‌ఈడీ డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విపత్తులు, తుపానులు, ఎండల తీవ్రత తదితర వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో 924 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు పని చేస్తున్నాయని అన్నారు. ఇందుకోసం టిఎస్‌డీపీఎస్ ప్రత్యేక మొబైల్ యాప్‌ను కూడా ఆవిష్కరించిందన్నారు.

విద్యార్థుల కోసం ఎంబసీ హాట్‌లైన్ సేవలు

న్యూఢిల్లీ/వాషింగ్టన్: అమెరికన్ ఎంబసీకి భారతదేశం శనివారం అమెరికాలో అరెస్టయిన భారతీయ విద్యార్థుల విషయంపై నూతన విధివిధానాన్ని తెలియజేసింది. ప్రస్తుత పరిస్థితిపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. నిర్బంధిత విద్యార్థుల గౌరవం మరియు శ్రేయస్సు రీత్యా భారత అధికారులకు తక్షణ అధికారం అవసరమని ఇండియన్ ఎంబసీ తెలిపింది. ఈ సంఘటనపై విదేశాంగ వ్యవహారాల ప్రతినిధి రవీశ్ కుమార్ మాట్లాడుతూ వాషింగ్టన్‌లోని రాయబార కార్యాలయం, అమెరికాలోని వివిధ కాన్సులేట్‌ల ద్వారా భారతీయ విద్యార్థులకు సహాయం అందిస్తామన్నారు. ఇప్పటికే కొంతమంది విద్యార్థులను మా అధికారులు సంప్రదించారని తెలిపారు. నకిలీ విద్యార్థి వీసాల కేసులో అరెస్టైన 129మంది భారతీయ విద్యార్థులకు సాయం చేసేందుకు అమెరికాలోని భారత ఎంబసీ 24గంటలపాటు పనిచేసే హాట్ లైన్ ఏర్పాటుచేసిందన్నారు. విద్యార్థులు వారి కుటుంబ సభ్యులకు నిరంతరం అందుబాటులోకి ఉండేందుకు ఓ నోడల్ అధికారిని కూడా నియమించామని, టెక్సాస్‌లోని డిటెన్షన్ సెంటర్‌లో ఉన్న భారతీయ విద్యార్థులను అక్కడ భారత కాన్సులేట్ అధికారులు కలిశారన్నారు. అరెస్టైన విద్యార్థులకు అన్నివిధాల సహాయం చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. అండర్‌కవర్ ఆపరేషన్‌లో భాగంగా ప్రారంభించిన ఫార్మింగ్‌టన్ వర్సిటీ నకిలీదని విద్యార్థులకు తెలియదని ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు తెలిపారు. అమెరికాలో కొన్ని వర్సిటీలు తొలిరోజునుంచే కరిక్యులర్ ప్రాక్టికల్ ట్రైనీ ప్రోగ్రామ్ నిర్వహిస్తాయని విద్యార్థులు ఆవిధంగా భావించే చేరినట్టు తెలిసిందని అట్లాంటా మైఖేల్ సోఫో తెలిపారు. వర్సిటీ సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ వర్సిటీలో విద్యార్థులను అక్రమంగా చేర్చేందుకు ప్రయత్నించిన 8మందిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు.



ఆటా బాసట : అమెరికాలో నకిలీ విద్యార్థి వీసా కేసులో అరెస్టయిన తెలుగు విద్యార్థులకు అమెరికా తెలంగాణ సంఘం(ఆటా) బాసటగా నిలిచింది. డెట్రాయిట్, బాటిల్ గ్రీక్‌లోని డిటెన్షన్ కేంద్రాల్లో ఉన్న విద్యార్థుల తరపున వాదించేందుకు చికాగో ఇమ్మిగ్రేషన్ అటార్నీలను ఆటా ఏర్పాటు చేసింది. విద్యార్థుల సమాచారం తెలుసుకుని, చర్యలు చేపట్టారు.

లంకలో 73 మంది భారతీయుల అరెస్ట్

కొలంబో: ఈ ఏడాదిలో వీసా నిబంధనలు ఉల్లంఘించిన 73మంది భారతీయులను అరెస్టు చేశామని శ్రీలంక అధికారులు శనివారం తెలిపారు. వీరిలో 49మంది భారతీయులను శనివారం మాటుగమా ఫ్యాక్టరీలో అదుపులోకి తీసుకున్నామని లంక అధికారులు వెల్లడించారు. లంక రాజధాని కొలంబోకు 60కిలోమీటర్ల దూరంలో ఈ పరిశ్రమ ఉందని ఇమిగ్రేషన్ అధికారులు తెలిపారు. వీసా నిబంధనలు ఉల్లంఘించి లంకలో నివసిస్తున్నారన్నారు. గత నెలలో 24మంది భారతీయులు ఇనీగ్రియా ఫ్యాక్టరీలో అక్రమంగా ఉద్యోగాలు చేస్తున్నట్టు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. అరెస్టుచేసిన భారతీయులను కొలంబోలోని మిరిహానాలోని ఇమిగ్రేషన్ డిటెన్షన్ సెంటర్‌కు తరలించామన్నారు. వీరిని అవసరమైన చర్యలు తీసుకున్న తరువాత భారత్‌కు తిరిగి పంపేస్తామని అధికారులు తెలిపారు.

ప్రపంచ నగరి అమరావతి

అదే నా సంకల్పం

- రాజధాని నా మానస పుత్రిక
- తెదేపా హయాంలోనే రాష్ట్రంలో ఐటీ అభివృద్ధి
- దేశం గర్వించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి
- ఎన్టీఆర్ మోడల్ స్కూల్ వార్షికోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు



చేవెళ్ల(మొయినాబాద్), ప్రభన్యూస్ : ఏపీ రాజధాని నగరం అమరావతి తన మానసపుత్రిక అని, ప్రపంచ స్థాయి ఉత్తమ నగరంగా దానిని తీర్చిదిద్దుతానని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తెలుగుదేశం హయాం లోనే హైదరాబాద్ ఐటీ సహా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని ఆయన గుర్తు చేశారు. అలాగే ఇప్పుడు అమరావతిని అభివృద్ధి చేస్తానని ఆయన చెప్పారు. రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం గండిపేటలో శనివారం ఎన్టీఆర్ మోడల్ స్కూల్ వార్షికోత్సవానికి చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి భువనేశ్వరి, ఏపీ ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విద్యనభ్యసించి దేశం, ప్రపంచం గర్వించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదని, పిల్లలకు ఎంత మంచి ఉన్నత విద్యను అందించామన్నది ముఖ్యమని, అదే తరగని ఆస్తి అని ఆయన తెలిపారు. చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలని పేద పిల్లలకు విలువలతో కూడిన ఉత్తమ విద్యనందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు అంబేద్కర్, మహాత్మగాంధీ వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారానే మొట్ట మొదటగా గురుకులాలను ప్రారంభించామని గుర్తు చేశారు. ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను యూనివర్సిటీ స్థాయిగా తీర్చిదిద్దాలని స్కూల్ ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరికి ఆయన సూచించారు. విద్యతో పాటు విలువలు నేర్పించాలన్నారు. దూర దృష్టితో ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. బోధించే విధానం గుణాత్మకంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరు నిత్య విద్యార్థిలా ఉండాలని తాను సైతం అలాగే ఉంటానని స్పష్టం చేసారు.

ప్రపంచ టాప్ 9లో అమరావతి

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.54 వేల కోట్ల విలువచేసే 34వేల ఎకరాలను రైతులు ముందుకు వచ్చి అప్పగించడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రపంచంలోని తొమ్మిది ఉత్తమ నగరాలలో అమరావతి ఒకటవుతుందని ఆయన అన్నారు.

తెదేపా హయాంలోనే ఐటీ అభివృద్ధి

తెదేపా పాలనలోనే తెలంగాణ రాష్ట్రం ఐటీ రంగంలో కొత్త పుంతలు తొక్కి అభివృద్ధి చెందిందని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 1984లో 6లక్షల కంప్యూటర్లతో టెక్నాలజీ రంగం ప్రారంభమైందని గుర్తు చేశారు. సాంకేతిక రంగం అభివృద్ధికి కృషి చేశామన్నారు. దాని ఫలితమే నేడు అన్ని రంగాల్లో ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. నాలెడ్జ్ అకాడమి, హైటెక్‌సిటి, సైబరాబాద్ నిర్మాణం తన హయాంలోనే జరిగిందని, వీటి ప్రారంభానికి బిల్ క్లింటర్ వచ్చాడని ఆయన గుర్తు చేశారు. ఐటీ కంపెనీల ప్రభంజనం కొనసాగిందని వివరించారు. 900 ఇంజనీరింగ్ కళాశాలలను నెలకొల్పానని చెప్పారు. నగరంలో ఎన్నో సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చాయన్నారు. లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయని, హైదరాబాద్ నగరం ప్రపంచ ఉత్తమ నగరాలతో పోటీ పడిందని అన్నారు.

'రోడియో' పోలీస్!!



థానె : మహారాష్ట్ర పోలీసులు ట్రాఫిక్ విధులకు తొలి రోబోను తీసుకొచ్చారు. రోడియోగా పిలవబడే ఈ రోబో పాదచారులను రోడ్డు దాటించేందుకు సేవలు అందించనుంది.

వాద్రాకు ముందస్తు బెయిల్..

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ న్యాయస్థానం వాద్రాకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 16వరకు అరెస్ట్ చేయకుండా ప్రత్యేక న్యాయమూర్తి అరవింద్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 6న ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తునకు సహకరించాలిసిందిగా వాద్రాను న్యాయమూర్తి ఆదేశించారు. లండన్‌లో 12, బ్రయాన్స్టన్ స్క్వేర్‌లో ఆస్తుల కొనుగోలులో మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. 1.9మిలియన్ పౌండ్ల విలువచేసే నగదు బదిలీ జరిగిందని ఆరోపణలున్నాయి. బెయిల్ విచారణ సందర్భంగా ఈడీ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీపీ సింగ్, న్యాయవాది నీతీశ్‌రాణా న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. వాద్రాకు లండన్‌లో 5మిలియన్లు, 4మిలియన్లు విలువచేసే రెండు ఇళ్లు, మరో 6ఫ్లాట్‌లు ఇతర ఆస్తులు ఉన్నట్టు సమాచారం అందిందని ఈడీ న్యాయస్థానానికి తెలిపింది.

సిమీపై మరో ఐదేళ్లు..

న్యూఢిల్లీ: స్టూడెంట్ ఇస్లామిక్ మూమెంట్ ఆఫ్ ఇండియా (సిమీ)పై కేంద్ర ప్రభుత్వం మరో ఐదు సంవత్సరాలుపాటు నిషేధాన్ని పొడిగించింది. చట్టవిరుద్ధ కార్యక్రమాల నిరోధక చట్టం ప్రకారం మరో ఐదేళ్లు సిమీపై నిషేధం విధించామని తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం జనవరి 31న ప్రకట న జారీ చేసింది. సిమీ దేశవిద్రోహ కార్యకలా పాలను తక్షణం అదుపు చేయలేమని, మరింత సమయం అవసరమని హోంశాఖ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికీ కొంత మంది సిమీ కార్య కర్తలు పరారీలో ఉన్నారని తెలిపారు. తొలిసారి సెప్టెంబర్ 27, 2001న నిషేధం విధించింది.

తాజాగా నిషేధం పొడిగిం చేముందు 2003, 2006, 2008, 2010, 2012, చివరిసారి ఫిబ్రవరి 1 2014లో సిమిపై నిషేధం విధించింది. 2014 నుంచి సిమి కార్యకర్తలపై 58కొత్త కేసులు నమోదయ్యాయని నిషేధపు ఆదేశాల్లో కేంద్రం తెలిపింది.





దీదీ.. ఇక దిగిపోండి!

ఆయుష్మాన్ భారత్‌కు నో చెప్పిన నాడే మీ పతనం మొదలు..

పేదల ఆరోగ్య భద్రత మీకు పట్టదు..

మోడీ..మోడీ అన్న నినాదాలతో మీకు నిద్రపట్టడం లేదు

తృణమూల్ టోల్‌బాజీ టాక్స్ నుంచి త్వరలో విముక్తి

పశ్చిమ బెంగాల్ ఎన్నికల ర్యాలీల్లో మమతపై ప్రధాని విమర్శలు

కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యూహాలకు పదును పెంచింది. బీజేపీయేతర రాష్ట్రాల్లో.. వైరి వర్గాలను చిత్తుచేసే వ్యూహాలతో ప్రధాని మోడీ ప్రచార బరిలోకి దిగారు. ఎన్నికల ర్యాలీలో భాగంగా పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపై మోడీ తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. పశ్చిమ బెంగాల్‌లోని 24 ఉత్తర పరగణ జిల్లా ఠాగూర్ నగర్, దుర్గాపూర్ బీజేపీ ఎన్నికల ర్యాలీల్లో మోడీ ప్రసంగించిన మోడీ... కేంద్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం నుంచి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తప్పుకోవడాన్ని తప్పు బట్టారు.

రాజకీయ కారణాలతో పేదలను ఆయుష్మాన్ భారత్‌కు దూరం చేయడం దారుణ మన్న మోడీ.. నాటి నుంచే ఆమె పతనం ప్రారంభమైందని జోస్యం చెప్పారు. పశ్చిమ బెంగాల్ ప్రజలకు ఆయుష్మాన్ భారత్ ద్వారా మెరుగైన వైద్యం అందింతే.. వారంతా మోడీ.. మోడీ అని తన పేరును స్మరించుకుంటారన్న భయంతోనే మమతా బెనర్జీ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని విమర్శించారు.

పేదల అభ్యున్నతిని కాంక్షించని అలాంటి కఠినమైన ప్రభుత్వం ఎక్కువ కాలం అధికారంలో ఉండబోదని అన్నారు. మరికొన్ని రోజుల్లోనే మత సీఎం పీఠాన్ని కోల్పోవడం ఖాయమన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ జనరంజకంగా ఉందని సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తుంటే ప్రతిపక్షాల నాయకులకు అది మింగుడుపడటం లేదని మండిపడ్డారు.

10 ఏళ్లలో రూ. 52 కోట్లు..
నాలుగేళ్లలో రూ.75 కోట్లు

పేద రైతుల కోసం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకాన్ని ప్రవేశ పెట్టామని.. రైతులకు మేలు చేసే అతిపెద్ద పథకం ఇదేనని వ్యాఖ్యానించారు. 2008 యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు చేసిందేం లేకపోయినా డ్రామాలతో కాలం వెల్లదీసిందన్న మోడీ.. తాము అలాంటి పనులకు పోకుండా అన్నదాత శ్రేయస్సే లక్ష్యంగా పీఎం కిసాన్‌ను అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ లాగే ఎన్నికల ముందు నాటకాలేసే అవకాశం ఉన్నా.. అలా చేయకుండా రైతులకు మేలు జరిగేలా శాశ్వత పథకాన్ని ప్రకటించామన్నారు.

పీఎం కిసాన్ పథకం ఒక ఏడాదితో ముగిసిపోయేది కాదన్న మోడీ.. అన్నదాతకు నగదు సాయం అందించేలా ఏళ్ల తరబడి ఈ పథకం సాగుతూనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న 10 ఏళ్లలో 2-3 కోట్ల మంది రైతుల కోసం రూ. 52 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తే.. తాము నూతనంగా ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం ద్వారా 12 కోట్ల మంది రైతులకు రూ. 75 కోట్ల నగదు అందు తుందని చెప్పారు.

తప్పు చేయకుంటే భయమెందుకు?

దుర్గాపూర్ ఎన్నికల ర్యాలీలోనూ ప్రధాని మోడీ.. మమతపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అవినీతిపై పోరాటం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని చూసి ప్రతిపక్ష పార్టీలకు భయం పట్టుకుందన్న మోడీ... అందుకే బద్ధ శత్రువుల్లాంటి పార్టీల నాయకులు కూడా ఒకే వేదికపై చేరి..దేశ కాపాలాదారును తొలగించాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కోల్‌కతా వేదికగా మమతా బెనర్జీ నిర్వహించిన ర్యాలీ వేదికలోని(జనవరి 19 నాటి ర్యాలీ) ఫొటోలు చూస్తే.. నాలుగేళ్లుగా ఒకరిని మరొకరు నేరుగా చూసేందుకు ఇష్టపడని వారంతా ఒకే వేదికపైకి రావడం విడ్డూరంగా ఉందని చురకలంటించారు. ఏ తప్పూ చేయకుంటే ఎందుకు భయమని మమతా బెనర్జీపై మోడీ వి మర్శించారు. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పు డు తనపై అక్రమ కేసులు బనాయించేందుకు ప్రయత్నించిందని ఆరోపించిన మోడీ.. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనూ ఢిల్లీలో 9 గంటల పాటు సీబీఐ ముందుంచారన్నారు. తానెప్పుడూ దర్యాప్తు సంస్థలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయలేదన్న మోడీ.. మరిన్ని సంస్థలతో దర్యాప్తు చేయించినా.. భయపడబోనని తెగేసి చెప్పానని గుర్తు చేశారు. కాలేజీల్లో ప్రవేశాలు, టీచర్ ఉద్యోగాల నియామక సమయంలో తృణమూల్ టోల్‌బాజీ టాక్స్ వసూలు చేస్తూ.. రాష్ట్రంలో సిండికేట్ రాజాలు రాజ్యమేలుతున్నారని మండిపడ్డారు.

ర్యాలీలో తొక్కిసలాట..

థాకూర్‌నగర్: పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాలులో జరిగిన ప్రధాని మోడీ ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. జనాలు ఎక్కువగా హాజరవ్వడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రధాని వేదిక ముందు తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. జనాలు ఎక్కువగా ఉండడంతో ఖాళీ ప్రదేశం కోసం ప్రయత్నించారు. వేదిక ముంగు భాగంలో నిషిద్ధ ప్రదేశంలోకి కుర్చీలు విసిరారు. వేదికకు అవతల కుర్చున్న వారు నిషిద్ధ ప్రదేశంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో గందరగోళం ఏర్పడింది. గందరగోల పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రధాని మోడీ ప్రయత్నించారు. ఎక్కడివారు అక్కడ కూర్చోవాలని సూచించారు. కానీ ఫలితం దక్కలేదు. గందరగోళం ఏమాత్రం తగ్గకపోవడంతో సభను అర్ధాంతరంగా ముగించాల్సి వచ్చింది. చాలా తక్కువ సమయం మాట్లాడారు. మరో కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉందని చెప్పి వెళ్లిపోయారు. ఘటనలో గాయపడ్డ మహిళలు, పిల్లలను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు





మోడీకి మెంటల్ టెన్షన్..?

అధికారం పోతుందని తెలిసినా.. మానసికంగా సిద్ధంకాలేకపోతున్నారు

దర్యాప్తు సంస్థలతో మమల్ని బెదిరిస్తున్నారు..

గుజరాత్ అల్లర్లలో మోడీ నేరస్తుడే..

అందుకే సీబీఐ విచారించింది..

ప్రధానికి మమత కౌంటర్ ఎటాక్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోడీ విమర్శలను తిప్పికొట్టారు. మరో నెల రోజుల్లో అధికా రాన్ని కోల్పోతారని తెలిసినా.. మోడీ అందుకు మానసికంగా సిద్ధం కాలేక పోతున్నారని విమర్శించారు. ఏ తప్పు చేయకుంటే మమతకు భయమెందుకన్న మోడీ ప్రశ్నకు... 2002 గుజరాత్‌లో అల్లర్ల జరిగిన మాట వాస్తవం కాదా అని కౌంటర్ ఇచ్చారు. గుజరాత్ అల్లర్ల కేసులో మోడీ నేరస్తుడు కాబట్టే.. సీబీఐ ఆయన్ని ప్రశ్నించిందని అన్నారు. మోడీది నియం తృత్వ శైలి. దర్యాప్తు సంస్థలను ఉప యోగించి ప్రతీ వారిని తన చుట్టూ తిప్పు కోవాలని చూస్తుంటారు. ఇలాంటి విషయాల్లో కేంద్రం గత నాలుగునెలల్లో దూకుడు ప్రదర్శిస్తోంది. అధికారం కోల్పోతామని తెలిసినా మోడీ అందుకు మానసికంగా సిద్ధ పడటం లేదు. ఈ విషయాన్ని చెప్పకూడదు కానీ..తప్పక చెబుతున్నా..కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కుమారుడిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదైంది. మోడీకి దేశంలో మిత్రులెవ్వరూ లేరు. తనను తానే ఫ్యాషన్ అన్నట్లుగా ఉంటారు. ఆయనకేదీ చేతగాదు. టెలిఫోన్‌లోనూ సొంతంగా మాట్లాడలేరు. అని మమత విమర్శించారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేంద్ర పథకాలను అమలు చేయడం లేదన్న మోడీ విమర్శలను తిప్పికొడుతూ.. కేంద్ర ప్రభుత్వమే తమ రాష్ట్రంపై శీతకన్ను వేసిందని.. నిధుల కేటాయింపులోనూ అలసత్వం వహిస్తోందని విమర్శించారు.

నా వంట మనిషిని కూడా ప్రశ్నించుకోండి..

ప్రతిపక్ష పార్టీల నేతలను టార్గెట్ చేసేందుకు ప్రధాని మోడీ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారని మమతా బెనర్జీ ఆరోపిం చారు.ఒకవేళ మోడీ పంపించిన అధికా రులు నన్ను అరెస్ట్ చేసినా పర్వాలేదు. నా హిందీ బాగోలేకుంటే.. వాళ్లు నన్ను అరెస్ట్ చెయ్యొచ్చు. వారికది అలవాటేగా..నేను అధికారులను తప్పుబట్టను. వారిని కేంద్రం బలవంతంగా చేస్తోంది. ఏదైనా.. చేయండి.. ఏదైనా చేయండి ప్రతిపక్షాలను ప్రజలకు దూరం చేయండి. అని నరేంద్ర మోడీ తన ఇంటి వద్ద ఉండే అధికారులకు సమన్లు ఇచ్చారు.దర్యాప్తు సంస్థలు నా ఇంటి పని మనిషిని ప్రశ్నిస్తామన్న పర్వాలేదు.. అని అంటూ మోడీకి చురకలంటించారు.శారదా.. నారదల్లో ఏమీలేదు. నారద ఒక స్టింగ్ ఆపరేషన్. శారదా చిట్ ఫండ్ స్కాంలో ప్రమేయముందంటూ మమత బెనర్జీ సన్నిహితుడు మానిక్ మజుందార్‌ను సీబీఐ ప్రశ్నించిన నేపథ్యంలో ఇలా స్పందించారు.

సీబీఐ బాస్ శుక్లా..

1983 బ్యాచ్ ఐపీఎస్‌కు పట్టం

మధ్యప్రదేశ్ డీజీపీగా సేవలందించిన రిషి

పోలీస్ బాస్‌పై ఇటీవలే కమల్ నాథ్ సర్కార్ వేటు

సీబీఐ చీఫ్ నియామకంపై ప్యానల్ ఏకపక్ష

నిర్ణయమంటూ ఖర్గే అసమ్మతి



ముక్కుసూటి అధికారి

- మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ స్వస్థలం.
- 1983 బ్యాచ్ ఐపీఎస్‌అధికారి.
- 1985లో రాయ్‌పూర్ ఏఎస్పీగా కెరీర్ ప్రారంభం.
- మధ్యప్రదేశ్ పోలీస్ శాఖలో సీఎస్పీ, ఎస్పీ, ఏఐజీ, డీఐజీ, ఐజీపీగా సేవలు.
- 2009లో బోపాల్‌లోని నార్కోటిక్ డివిజన్ లోనూ ఉద్యోగ విధులు.
- 2015 మే నుంచి 2016 జూన్ 31 వరకు మధ్యప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్‌గా పనిచేశారు.
- జులై 1,2016 న మధ్యప్రదేశ్ డీజీపీగా చార్జ్
- భారతీయ రైల్వేలో అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా కీలక బాధ్యతలు
- మధ్యప్రదేశ్ పోలీసులు అధికారికంగా ట్విట్టర్ ఖాతా నిర్వహించడానికి కృషి చేసిన తొలి డీజీపీగా శుక్లాకు గుర్తింపు
- క్రమశిక్షణకు మారుపేరు.. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలకు వెనుకాడని అధికారిగా ప్రసిద్ధి.
- ఆగస్టు 1,2016 నుంచి జులై 31,2017 మధ్య కాలంలో 10 మంది ఐపీఎస్‌లపై విచారణకు ఆదేశించారు.
- 1000 మంది పోలీస్ అధికారులకు వివిధ కేసుల్లో శిక్షలు కూడా వేశారు.
- తప్పుగా ప్రవర్తించడం, విధుల్లో నిర్లక్ష్యం వహించిన 169 మంది పోలీసులను తొలగించారు.
- ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి రాగానే శుక్లాను హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బదిలీచేసింది.

న్యూఢిల్లీ: సీబీఐ నూతన డెరెక్టర్‌గా రిషీ కుమార్ శుక్లా నియమాకమయ్యారు. రెండేళ్ల పాటు శుక్లా సీబీఐ చీఫ్‌గా కొనసాగనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని అత్యున్నత నియామకాల కమిటీ డిసెంబర్ 24, ఫిబ్రవరి 1న భేటీ తర్వాత శుక్లాను సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ, ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ ఆస్థానాల వివాదం చిలికిచిలికి గాలివానగా మారడంతో ఆ ఇద్దర్ని ఉన్నత పదవుల నుంచి ప్రభుత్వం తప్పించింది. సీబీఐ నూతన చీఫ్‌ను వెంటనే నియమిం చాలని సుప్రీంకోర్టు కేంద్రానికి అల్టిమేటం జారీ చేయడంతో శుక్లా పేరును ఖరారు చేశారు. 1984 బ్యాచ్ ఐపీఎస్ అధికారులు జావేద్ అహ్మద్,రజినీ కాంత్ మిశ్రా, ఎస్ ఎస్ దేశ్వాల్ పేర్లు వినిపించినా.. ప్రధాని మోడీ శుక్లా వైపు నిలిచినట్లు తెలుస్తోంది.

ఖర్గే అభ్యంతరం

సీబీఐ నూతన డైరెక్టర్‌గా శుక్లా పేరును ప్రతిపాదించడాన్ని అత్యున్నత స్థాయి కమిటీ సభ్యుడు మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్లా నియామకాన్ని తప్పుబడుతూ ఖర్గే కమిటీకి అసమ్మతి నోటీసు పంపారు. అవినీతి కేసులను విచారించడంలో అనుభవం లేని అధికారులను సీబీఐ డైరెక్టర్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు.

సీబీఐ నూతన డైరెక్టర్ నియామకం అత్యున్నత దర్యాప్తు సంస్థ ప్రమాణాలకుదగ్గట్టుగా లేదని విమర్శించారు. కేంద్రమంత్రి స్పందిస్తూ సీబీఐ చీఫ్ నియమక ప్రక్రియను తనకు అనుకూలంగా మార్చుకు నేందుకు ఖర్గే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

రాముడి వేషంలో రాహుల్ పోస్టర్

పాట్నా: బీహార్‌లో నేడు జరగనున్న కాంగ్రెస్ ర్యాలీకి జనసమీకరణ కోసం ఆ పార్టీ శ్రేణులు కొంతమంది తమ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని రాముడు వేషంలో రూపొందించి పోస్టర్లు ఏర్పాటుచేశారు. ఈ తరహాలో కాంగ్రెస్ ప్రచారాన్ని అధికారిక బీజేపీ, జేడీయూ రాజకీయ గిమ్మిక్కుగా, చౌకబారు రాజకీయాలుగా ఎద్దేవా చేశాయి. నేడు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బీహార్ రాజధాని పాట్నాలో పర్యటించనున్నారు. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో నిర్వహించనున్న జన్ ఆకాంక్ష ర్యాలీ రాహుల్ గాంధీ పాల్గొని పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాహుల్ పర్యటనను పురస్కరించుకుని బీహారోలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాహుల్‌గాంధీ చిత్రాన్ని శ్రీరాముడి తరహాలో పొడవైన జుట్టు, పూలదండలు, వీపుపై అమ్ములపొదితో కాంగ్రెస్ ప్రచార పోస్టరును ఏర్పాటు చేశారు. పోస్టరులో కాంగ్రెస్ అధినేతలు సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, ప్రియాంకాగాంధీతోపాటు స్థానిక నేతల ఫొటోలను పోస్టరులో పొందుపరిచారు. అధికార బీజేపీ నేతలు రామనామ జపం చేస్తుంటారు..కానీ నువ్వు రాముడిలా జీవించు, ప్రవర్తించు అంటూ రాహుల్ గాంధీ సందేశాన్ని ఇస్తున్నట్టు పోస్టరులో రాశారు.

రామమందిరంపై రాహుల్ వైఖరేంటి?

త్రిశక్తి సమ్మేళన్‌లో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా త్రిశక్తి సమ్మేళన్‌లో పాల్గొన్నారు. తెహ్రీ, హరిద్వార్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ నేతల సమావేశంలో అమిత్ షా పలు అంశాలను ప్రస్తావించారు. తాత్కాలిక బడ్జెట్‌పై విపక్షాలకు ఎందుకు అసంతృప్తి ఉన్నారు..పీయూష్ గోయల్ సభలో బడ్జెట్ ప్రవేశపెట్టినపుడు రాహుల్‌గాంధీ సీరియస్‌గా ఉన్నారు. ప్రజలు కోసం సంతోషంగా ఉండలేరా అని ప్రశ్నించారు. గత 55ఏళ్లలో కాంగ్రెస్ విధానాల వల్ల రైతులు ఇప్పటికీ అప్పుల్లో ఉన్నారని అమిత్ షా అన్నారు. బడ్జెట్‌లో పీయూష్ గోయల్ రక్షణశాఖకు పెద్ద ఎత్తున కేటాయింపులు చేపట్టారు. పదేళ్ల యూపీఏ పాలనలో సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్ సైనికులకు ఏమీ చేయలేదు..55ఏళ్ల కాంగ్రెస్ పాలనలోఒకే ర్యాంక్ ఒకే పించను కూడా ఇవ్వలేకపోయారని అమిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకోసం కేంద్రం ఒక రూపాయి కేటాయిస్తే లబ్ధిదారులకు చేరేసరికి కేవలం పదిహేనుపైసలు మిగులుతుందని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అన్నారు. ఈ అవినీతిని అరికట్టేందుకే నిధులను ప్రత్యక్ష బదిలీ చేయనున్నామని అమిత్ షా తెలిపారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంపై రాహుల్ అభిప్రాయమేంటో తెలపాలని అమిత్ షా డిమాండ్ చేశారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరుగుతుందని అమిత్ షా స్పష్టం చేశారు. అయోధ్య రామజన్మభూమిలోని వివాదరహిత భూమి సుమారు 42ఎకరాలు ఉంటుందని ఈ భూమిని దాని యజమానులైన రామజన్మభూమి న్యాస్ తదితరులకు కేంద్రం ఇవ్వాలని తలుస్తుంటే కాంగ్రెస్ ఆందోళన సృష్టిస్తుందన్నారు. రామాలయాన్ని నిర్మించాలా వద్దా అనేది కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తెలపాలని అమిత్ షా డిమాండ్ చేశారు.

అమెరికా నుంచి 73 వేల రైఫిల్స్

కొనుగోలుకు రక్షణ మంత్రి ఆమోదం

న్యూఢిల్లీ: భారత రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆయుధ సంపత్తిని మరింత ఆధునీకరించేందుకు.. అత్యాధునిక తుపాకులు కొనుగోలుకు రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. అమెరికా నుంచి 73 వేల తుపాకులు కొనుగోలు చేసేందుకు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదం తెలిపినట్లు అధికారులు వివరించారు. తుపాకుల కొనుగోలు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఈ ఆధునిక తుపాకులను చైనా సరిహద్దు వెంట 3600 కి.మీ మేర విధులు నిర్వహించే సైనికులకు అందజేయనున్నారు. ఈ రైఫిల్స్ ను ఇప్పటికే అమెరికా, యూరోపియన్ దేశాల సైన్యం, పోలీసులు అత్యవసర సమయాల్లో స్పందించేందుకు వాడుతున్నారు. మరోవారం రోజుల్లో కొనుగోలు ఒప్పందం పూర్తయ్యే అవకాశముంది. ఒప్పందం జరిగిన సంవత్సరంలోగా రైఫిల్స్ మన దేశానికి చేరతాయి. భారత బలగాలు ప్రస్తుతం వాడుతున్న ఇన్సాస్ రైఫిల్స్ స్థానంలో ఆధునిక ఆయుధాలను వాడుతారు. 2017 నుంచి ఇప్పటి వరకు భారత్ ఏడు లక్షలకు పైగా రైఫిల్స్, 44 వేల లైట్ వెయిట్ మిషన్ గన్స్ 44,600 కార్బైన్ గన్స్‌ను కొనుగోలు చేసింది.దేశీయంగా తయారుచేస్తున్న రైఫిల్స్ ప్రయోగాత్మక పరీక్షల్లో విఫలమౌతుండటంతో భారత్ ఇతర దేశాల నుంచి ఆయుధాలను కొనుగోలు చేస్తోంది. 18 నెలల క్రితం మనదేశంలోని ఇషాపూర్ రైఫిల్ ఫ్యాక్టరీలో తయారుచేసిన రైఫిల్స్ ప్రయోగాత్మక పరీక్షల్లో విఫలమవడంతో ఆర్మీ వాటిని తిరస్కరించింది.

నేటి నుంచి రంజీ ఫైనల్స్

నాగ్‌పూర్: నేటి నుంచి రంజీ ట్రోఫీ ఫైనల్ టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుం ది. ట్రోఫీ కోసం విదర్భ, సౌరాష్ట్ర జట్లు తలపడుతున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ విదర్భ ట్రోఫీని నిలబెట్టు కోవాలని భావి స్తుండగా, తమకు ఎప్పటినుంచో ఊరిస్తున్న ఈ ట్రోఫీని దక్కించు కోవా లని సౌరాష్ట్ర సర్వ శక్తులను ఒడ్డాలని భావిస్తోంది. ఈ చివరి పోరులో ప్రధాన పోటీ సౌరాష్ట్ర ఆటగాడు చటేశ్వర్ పుజారా, విదర్భ బౌలర్ ఉమేష్ యాదవ్ ల మధ్య ఉండనుంది. విదర్భ బ్యాటింగ్ లో వసీం జాఫర్ కీలక భూమిక పోషిం చనున్నాడు. 40 ఏళ్ల వయసులో ఫిట్‌నెస్‌తో ఉంటూ దేశీయ క్రికెట్‌లో ఇప్పటి వరకు 1003 పరుగులు చేశా డు. ఈ సీజన్‌లో నాలుగు సెంచరీలు చేశాడు. మరోవైపు జాఫర్‌కు దీటుగా రాణించ డానికి సౌరాష్ట్ర బ్యాట్స్ మన్ పుజారా కూడా మంచి ఫామ్‌లో ఉండటంతో ఫైన ల్ ఉత్కంఠగా సాగుతుందని అభిమాను లు ఆశిస్తున్నారు. సెమీ ఫైనల్లో విదర్భ జట్టు కేరళను ఓడించగా,





సౌరాష్ట్ర జట్టు కర్నాటకను ఓడించిఫైనల్స్‌కు చేరాయి.

జట్లు:

విదర్భ: ఫయాజ్ ఫజల్ (కెప్టెన్), సంజయ్ రామస్వామి, వసీం జాఫ ర్, అథర్వా తైడే, ఆధిత్య సార్వటే, గణేష్ సతీష్,అక్షయ్ వాడ్కర్ (వి.కీ) మోహిత్ కాలె, రజనీష్ గుర్బాని, ఉమేష్ యాద వ్, యూష్ ఠాకూర్, అక్షయ్ కార్నెవార్, లలిత్ ఎం యా దవ్, ఆధిత్య థాకరే, శ్రీకాంత్ వాగ్.

సౌరాష్ట్ర: జయదేవ్ ఉనాద్కత్ (కెప్టెన్), హార్విక్ దేసాయ్, స్నెల్ పటెల్(వి.కీ), విశాల్ జడేజా, చటేశ్వర్ పుజారా, షెల్డన్ జాక్సన్, అర్పిత్ వసవడా, ప్రేరక్ మంక డ్, కమలేష్ మాక్‌వనా, ధర్మేంద్ర సింగ్ జడేజా, చేతన్ సకారియా, చిరాగ్ జని, కిషన్ పర్మార్, హార్దిక్ రాథోడ్, శౌర్య సనందియా.

క్రీడాప్రభ

పాకిస్తాన్- దక్షిణాఫ్రికా టీ20 సిరీస్

తొలి మ్యాచ్ దక్షిణాఫ్రికాదే

6 పరుగుల తేడాతో గెలుపు



డు ప్లెస్సిస్ 78

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా ఆటగాడు డేవిడ్ మిల్లర్‌దే ఈరోజు. పాకిస్తాన్‌తో జరిగిన తొలి టీ20లో తన జట్టుకు అద్భుత విజయం అందించాడు. రెండు కీలక రనౌట్లు చేయడమేకాక, నాలుగు క్యాచ్‌లు పట్టి నలుగురు బ్యాట్స్‌మెన్ పెవిలియన్ చేరేలా చేశాడు. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. దీనితో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0 ఆధిక్యాన్ని పొందింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్తాన్ బౌలింగ్ ఎంచుకోవడంతో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 192 పరుగు లు చేసింది. ఓపెనర్ రీజా హెండ్రిక్స్ 74పరుగులు (41బంతులు, ఫోర్లు-8 సిక్స్-2) చేయగా, డు ప్లెస్సిస్ 78 పరుగులు(45బంతులు, ఫోర్లు-6 సిక్స్-4) చేసి జట్టు స్కోరులో తోడ్పడ్డా రు. పాక్ బౌలర్లలో మీడియం పేసర్ ఉస్మాన్ షిన్వారి 3 వికెట్లు పడగొట్టగా, ఇమాద్ వషీం, హసన్ అలీ, ఫహీం అష్రఫ్‌లు తలో వికెట్‌ను దక్కించుకు న్నారు. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన పాకిస్తాన్ గెలుపు అంచులవరకు చేరి పరాజయం పాలైంది. ఆట చివర్లో దక్షిణాఫ్రికా ఫీల్డర్ డేవిడ్ మిల్లర్ అద్భుతమైన త్రోలతో రెండు రనౌట్లు చేయడంతో పాక్ చతికలపడింది. కీలకమైన బాబర్ ఆజం 38(27బంతులు, ఫోర్లు-3 సిక్స్-1) వికెట్‌తో పాటు మహ్మద్ రిజ్వాన్ 2(బంతులు 2)ను కూడా రనౌట్ చేయడంలో కీలక భూమిక నిర్వహించాడు. షోయబ్ మాలిక్ 49(31బంతులు, ఫోర్లు-5, సిక్స్1), హుస్సేన్ తలత్ 40(32బంతులు, ఫోర్లు-5) దీటుగా ఆడి సఫారీ బౌలర్లను ఎదు రించినప్పటికి చివర్లో తడబ డ టంతో పాక్‌కు ఓటమి తప్పలేదు. 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 186 పరుగుల వద్ద పాక్ ఆలౌటయింది. మ్యాచ్ అనంతరం పాకిస్తాన్ కెప్టెన్ షోయబ్ మాలిక్ మాట్లాడుతూ.. గెలుపుకు రెండు బౌండరీల దూరంలో మా ఇన్నింగ్స్ ముగిసింది. మేము బాగా ఆడాము. అయితే దక్షిణాఫ్రికా అన్ని రంగాల్లో మాకంటే బాగా ఆడింది అని అన్నాడు. సఫారీల కెప్టెన్ డు ప్లెస్సిస్ మాట్లాడు తూ.. సిరీస్‌లో మిగతా రెండు మ్యాచు లు తాను ఆడటంలేదని చెప్పాడు. కొత్త కెప్టెన్‌కు ఈ గెలుపు మంచి ఉత్సాహాన్నిస్తుంది. కొత్త కెప్టెన్ పేరును ప్లెస్సిస్ వెల్ల డించలేదు. ఫిబ్రవరి 13నుంచి శ్రీలంకతో ప్రారంభ మయ్యే రెండు టెస్టుల సిరీస్ కోసం విశ్రాంతి అవసర మైన నేప థ్యంలో తాను ఆ నిర్ణయం తీసుకు న్నానని డు ప్లెస్సిస్ తెలిపాడు. రనౌట్ల తో, క్యాచులతో మ్యాచ్‌ను మలుపు తిప్పిన డేవిడ్ మిల్లర్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును దక్కించు కున్నాడు.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 192/6(20ఓవర్లు) (రీజా హెండ్రిక్స్ 74 పరుగులు, డు ప్లెస్సిస్ 78 పరుగులు, పాకిస్తాన్ బౌలింగ్: ఉస్మాన్ శిన్వారీ 3/31)

పాకిస్తాన్: 186/9(20ఓవర్లు) (బాబర్ ఆజం 38, షోయబ్ మాలిక్ 49,హుస్సెన్ తలత్ 40 దక్షిణాఫ్రికా బౌలింగ్: హెండ్రిక్స్ 2/40, క్రిస్ మోరిస్ 2/39, తాబారిజ్ షాంసి 2/33)

ఆస్ట్రేలియా- శ్రీలంక టెస్ట్ సిరీస్

లంక ఎదురీత

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా శ్రీలంక, ఆతిథ్య దేశంతో ఆడుతున్న రెండో టెస్ట్‌లో రెండో రోజున ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. ఇంకా 411 పరుగుల ట్రయల్స్‌లో ఉంది. ఉదయం ఓవర్ నైట్ స్కోరు 384/4తో తన తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా 5 వికెట్ల నష్టానికి 534 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జో బర్న్స్ 180 పరుగులు, ట్రావిస్ హెడ్ 161 పరుగులు, కుర్టిస్ పాటర్సన్ 114 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు పునాదివేశారు. శ్రీలంక బౌలర్లలో విశ్వ ఫెర్నాండో 3 వికెట్లు పడగొట్టగా, కసున్ రజిత, కరుణా రత్నే చెరొక వికెట్‌ను తీశారు.

సంక్షిప్త స్కోర్లు: ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 534/5 డిక్లేర్
శ్రీలంక తొలి ఇన్నింగ్స్: 123/3 బ్యాటింగ్



వైజాగ్‌లో ఫస్ట్ టీ20 మ్యాచ్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు భారత్‌లో పర్యటనను విశాఖపట్నంలో ఆడే టీ20తో ప్రారంభించనుంది. ఈ మ్యాచ్ బెంగళూరులో 24న జరగాల్సి ఉంది. కాని అదేరోజు అక్కడ ఏరో ఇండియా షో ఉన్న కారణంగా వేదికను విశాఖపట్నంకు మార్చుతున్నట్లు బీసీసీఐ శనివారం ఒక ప్రకటన చేసింది. కర్నాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు వేదికను మార్చుతున్నట్లు బీసీసీఐ పాలక కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్ సభ్యురాలు డయానా ఎడుల్జీ వెల్లడించారు. ఫిబ్రవరి 27న బెంగళూరులో రెండో టీ20ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆస్ట్రేలియా తన పర్యటనలో రెండు టీ20లు, ఐదు వన్డేలు భారత్‌తో ఆడనుంది. **వన్డే వేదికలు:** మార్చి 2న హైదరాబాద్‌లో తొలి వన్డే, మార్చి 5న నాగ్‌పూర్ రెండో వన్డే, మార్చి8న- రాంచిలో మూడో వన్డే, మార్చి 10న మొహాలీలో నాలుగో వన్డే, మార్చి 13న న్యూఢిల్లీలో ఐదో వన్డే

చివరి వన్డేలో గెలుపెవరిదో?

- నేడు భారత్- న్యూజిలాండ్ ఐదో వన్డే
- ధోనీ రాకతో భారత ఆటగాళ్లలో ఉత్సాహం





న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ నేటితో ముగియనున్నది. ఈ వన్డేలో గెలిచి భారత్ ఆధిక్యాన్ని 3-2కు తగ్గించాలని ఆతిథ్య జట్టు ఉవ్విళ్లూరుతోంది. సిరీస్‌ను భారత్ ఇప్పటికే కైవసం చేసుకోవడంతో.. న్యూజిలాండ్ ఈ చివరి మ్యాచ్‌ను గెలిచి త్వరలో భారత్‌తో ప్రారంభం కానున్న టీ 20 సిరీస్‌లోకి ఆత్మవిశ్వాసంతో అడుగు పెట్టాలని భావిస్తోంది.

ఉ. 7:30 నుంచి ప్రారంభం

వెల్లింగ్టన్: భారత్‌తో నాలుగో వన్డేలో పుంజు కున్న న్యూజిలాండ్ నేడు వెస్ట్‌ప్యాక్ స్టేడియంలో జరుగనున్న సిరీస్ చివరి వన్డేలో కూడా గెలుసామన్న ధీమాను వ్యక్తం చేస్తోంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ ఇప్పటికే మూడిం టిని గెలుచుకుని రబ్బర్‌ను కైవసం చేసుకుంది. నాలుగో వన్డేలో న్యూజిలాండ్ గెలిచి సిరీస్‌లో భారత్ ఆధిక్యాన్ని 3-1కు తగ్గించింది. 2014-15 నుంచి చూస్తే.. సొంత గడ్డపై దక్షిణాఫ్రికాపై రెండు వన్డేలు ఓడిన తర్వాత మళ్లీ భారత్ చేతిలో వరుసగా మూడు వన్డేలు ఓడటం ఆ జట్టు ఆత్మ విశ్వాసాన్ని ఢీలాపడేలా చేసినప్పటికి.. నాలుగో వన్డేలో విజయం సాధించి ఆత్మ విశ్వాసాన్ని పొందింది. భారత జట్టులో కోహ్లీ, ధోనీ లేకపోవ డంతో జట్టు ఓడిందన్న వాదనలు కూడా రావడం తో..ఈ వన్డేకు ధోనీ అందుబాటులోకి వచ్చాడు. ధోనీ రాకతో జట్టులో ఉత్సాహం పెరిగింది. గాయం కారణంగా గత రెండు వన్డేలకు దూరమైన ధోనీ చివరి వన్డేకు అందుబాటులోకి రావడం జట్టు ఆటగాళ్లలో మనో బలాన్ని పెంచింది. హామి ల్టన్ వన్డేలో భారత్ 92 పరుగులకే కుప్పకూలి వన్డేల్లో ఏడో అత్యల్ప స్కోరును నమోదు చేసి విమర్శలను ఎదుర్కొంది. వెల్లింగ్టన్‌లో కూడా గాలి తీవ్రత ఉండటంతో బంతి స్వింగ్ అయ్యే అవకాశాలున్నాయని పరిశీలకులు చెపుతున్నారు. న్యూజిలాండ్ టాస్ గెలిస్తే మళ్లీ బౌలింగ్‌ను ఎంచుకునే అవకాశాలున్నా యి. హామిల్టన్‌లో ఇదే పనిచేసిన కివీస్.. బౌలర్ ట్రెంట్ బోల్ట్ తన బౌలింగ్‌తో భారత్ బ్యాట్స్ మెన్ ను కుప్ప కూల్చా డు. ధోనీ జట్టు లోకి వచ్చి నప్ప టికి.. మిడి లార్డర్ పటిష్టంగా మారలే దు. కోహ్లీ లేని లోటు స్పష్టంగా కన్పిస్తోం ది. భారత జట్టు అసిస్టెంట్ కోచ్ సంజయ్ బంగర్ జట్టు లో ధోనీ చేరికపై మాట్లాడుతూ.. ధోనీ ఫిట్‌గా ఉన్నాడు. చివరి వన్డేలో ఆడనున్నాడని శనివారం మీడియా కు వెల్లడించాడు. ధోనీకి స్థానం కల్పించడానికి.. జట్టులో ఎవరిని పక్కన బెట్టేది ఇంకా తేలలేదు. హామిల్టన్ మ్యాచ్‌లో అంబ టి రాయుడు, కేదార్ జాద్, దినేష్ కార్తిక్, పూర్తిగా విఫలంకాగా, కెప్టెన్ రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు కూడా నిరాశ పర్చారు. సంజయ్ బంగర్ వీరి వైఫల్యంపై మాట్లాడుతూ.. ఈ తరహా వైఫల్యం అరుదుగా సంభవి స్తుంది. చాలాసార్లు మిడిలార్డర్ సమయా నికి తగ్గటు పుంజుకుంది. కొన్ని సార్లు విఫలమైన సందర్భాలు న్నాయి. అంతమాత్రంతో మిడిలార్డర్ ను తప్పుపట్టలేము అని అన్నాడు. ఈ వన్డే సిరీస్ ముగియగానే న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ప్రపంచ కప్ ఆడాల్సి ఉంటుంది. ఈ బలహీనతనుంచి భారత్ తప్పనిసరిగా బయటపడాల్సి ఉందని బంగర్ పేర్కొన్నాడు. నాలుగో వన్డేలో తమ బ్యాటింగ్ అత్యంత చెత్తగా ఉందని రోహిత్ శర్మ ప్రకటించడంతో ఈ సారి ఆ తప్పును పునరావృ తం కాదని అభిమానులు ఆశిస్తున్నారు. టీవీ షోలో అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురై తిరిగి జట్టులోకి వచ్చిన హార్దిక్ పాండ్యా మంచి ఆటను ప్రదర్శిస్తున్నాడు. చివరి వన్డేలో మహ్మద్ షమీ ఆడే అవకాశాలున్నాయి. షమీ వస్తే ఖలీల్ అహ్మద్ బెంచ్‌కే పరిమితం కావచ్చు.

గెలుపు ఉత్సాహంలో కివీస్

నాలుగో వన్డే విజయం ఇచ్చిన ప్రేరణతో ఉత్సాహంలో ఉన్న న్యూజిలాండ్ చివరి వన్డేలో గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ కోలిన్ మన్రో స్థానంలో వచ్చిన హెన్రీ నికోలస్ 30 పరుగులు చేసి తన సత్తా చాటాడు. రాస్ టేలర్ కూడా నికోలస్‌తో కలిసి అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు, 37(25బంతుల్లో) చేసి లక్ష్యాన్ని ఛేదించడంలో ముందున్నాడు. న్యూజి లాండ్ మరో ఓపెనర్ మార్టిన్ గుప్టిల్‌ను మిస్సయ్యే అవకాశముంది. వెన్ను గాయంతో మార్టిన్ చివరి వన్డేలో ఆడక పోవచ్చు. బౌలింగ్ విభాగంలో బోల్ట్ తన స్వింగ్‌తో దూసుకుపోతున్నాడు. మరోవైపు అతనికి తోడుగా గ్రాండొమ్మి కూడా రాణిస్తుండ టంతో న్యూజిలాండ్ బౌలింగ్ గాడిలో పడ్డట్లే కన్పిస్తోంది. నాలుగో వన్డేలో ఆల్ రౌండర్ జేమ్స్ నీశామ్, స్పిన్నర్ టాట్ ఆస్లేలు రాణించి ఒక్కో వికెట్ పడగొట్టి జట్టు గెలుపులో తోడ్పడ్డారు.

జట్లు:

భారత్: రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్, మహేంద్ర సింగ్ ధోనీ(వి.కీ), కేదార్ జాదవ్, దినేష్ కార్తిక్, విజయ్ శంకర్, శుభ్‌మన్ గిల్, యజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమీ, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ సిరాజ్, ఖలీల్ అహ్మద్, రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా.

న్యూజిలాండ్: కేన్ విలియమ్సన్(కెప్టెన్), టాడ్ ఆస్లే, ట్రెంట్ బోల్ట్, కోలిన్ డి గ్రాండొమ్మి, లాకి ఫెర్గుసన్, మార్టిన్ గుప్టిల్, మాట్ హెన్రీ, టామ్ లాథమ్(వి.కీ), కోలిన్ మన్రో, జిమ్మి నీశామ్, హెన్రీ నికోలస్, మిచెల్ సాంట్నర్, టిమ్ సౌథీ, రాస్ టేలర్.

మంధాన నెం-1



న్యూఢిల్లీ: భారత మహిళా క్రికెట్ జట్టు ఓపెనర్ స్మృతి మంధాన ఐసీసీ ప్రకటించిన తాజా ర్యాంకుల్లో అగ్ర భాగాన నిలిచింది. శనివారం ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లను విడుదల చేసింది. బ్యాటింగ్ విభాగంలో మంధాన మూడు స్థానాలు ఎగబాకి తొలి స్థానంలో నిలిచి ంది. మంధాన న్యూజిలాండ్ పర్యటనలో భారత్ జట్టు సభ్యురాలిగా మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొంది. తొలి రెండు వన్డేల్లో వరుసగా 105, 90 పరుగులు చేసి భారత్ సిరీస్ గెలవడంలో కీలక భూమిక పోషించింది. ఆస్ట్రేలియా క్రీడాకారిణులు.. ఎల్సీ పెర్రీ రెండో స్థానంలో, మెగ్ లానింగ్ మూడో స్థానంలో ఉన్నారు. భారత కెప్టెన్ మిథాలీ రాజ్ ఒక ర్యాంకు దిగజారి ఐదో ర్యాంకులో ఉంది. బౌలర్ల విభాగంలో వెటరన్ పేసర్ జులన్ గోస్వామి నాలుగో స్థానంలో ఉండగా స్పిన్నర్లు పూనం యాదవ్ ఎనిమిది, దీప్తి శర్మ తొమ్మిదో ర్యాంకుల్లో ఉన్నారు. ఆల్ రౌండర్ల జాబితాలో దీప్తి నాలుగో స్థానంలో ఉంది.

డేవిస్ కప్‌లో భారత్ ఓటమి

- ఇటలీ చేతిలో 3-1తో పరాజయం
- డబుల్స్‌లో రాణించిన బోపన్న- దివిజ్ జోడీ
- రివర్స్ సింగిల్స్‌లో నిరాశపర్చిన ప్రజ్నేష్



కోల్‌కతా: డేవిస్ కప్ వరల్డ్ ఫైనల్స్ క్వాలిఫయర్స్‌లో భారత్ ఆశలు ఆవిరయ్యాయి. ఇటలీ 3-1 తేడాతో భారత్‌ను ఓడించి టోర్నీ మాడ్రిడ్ పోటీపడే 12 క్వాలిఫయర్స్ జట్లలో చోటు సంపాదించింది. శనివారం జరిగిన డబుల్స్ పోటీలో రోహన్ బోపన్న- దివిజ్ శరణ్ జోడీ నిరాశపర్చకుండా ఇటలీ జోడీ సిమోన్ బొల్లెలీ- మాటో బెరెట్టిని జోడీని 4-6, 6-3, 6-4 తేడాతో ఓడించింది. గంటా 43 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడి పోరాడి గెలిచింది. అనంతరం 62 నిమిషాల పాటు సాగిన రివర్స్ సింగిల్స్‌లో భారత టాప్ ర్యాంక్ ఆటగాడు ప్రజ్నేష్ గుణేశ్వరన్, వరల్డ్ నెంబర్ 37 ఆండ్రియాస్ సెప్పి చేతిలో 1-6, 4-6 తేడాతో ఓడిపోయాడు. తొలి సెట్లో ప్రజ్నేష్ ప్రత్యర్థి ఆటకు బదులివ్వడంలో పూర్తిగా విఫలమయ్యాడు. రెండో సెట్లో 40 అనవసర తప్పిదాలు చేసిన ప్రజ్నేష్ ఓటమినుంచి తప్పించుకోలేక పోయాడు. శుక్రవారం జరిగిన సింగిల్స్ పోటీలో భారత్ రెండు మ్యాచ్‌లు ఓడటంతో 0-2తో వెనకబడ్డది. నేటి ఫలితాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే.. భారత్ 3-1తో ఓటమి పొందింది. వరల్డ్ నెంబర్ 19 జట్టైన భారత్ ఈ ఏడాదిలో జరిగే జోన్ గ్రూప్‌లో పోటీ పడాల్సి ఉంటుంది. ఈ ఓటమిపై భారత జట్టు నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేష్ భూపతిస్పందిస్తూ.. శుక్రవారం జరిగిన పోటీల్లో ఒక మ్యాచ్ గెలవాల్సింది. 0-2తో నిన్న ఉన్నాము. ఈరోజు రెండు మ్యాచ్‌లు గెలుస్తామనుకుని ఆశించాము. పరిస్థితులు అనుకూలించలేదు. ఇటలీ టాప్ 60 ర్యాంకు ఆటగాళ్లను రంగంలోకి దించింది. కాని భారత్ జట్టు ఆటగాళ్లలో టాప్ 100లో ఉన్న వారు లేదు అని భూపతి అన్నాడు. గెలుపు ఓటములను సమీక్షించుకుని ముందుకు సాగాల్సి ఉంటుందన్నాడు. ప్రజ్నేష్ రెండేళ్లలో 300 ర్యాంకునుంచి 102కు చేరాడు. అతనిలో మంచి ఆట దాగివుందన్నాడు. ఈ గెలుపుతో ఇటలీ, భారత్‌తో ఆడిన మ్యాచుల్లో 5-1తో ఆధిక్యంలో ఉంది. 1985లో ఇదే గ్రాస్ కోర్టు(సీఎస్‌సీ)లో భారత్ లీడ్‌లో ఉంది. నవబంర్‌లో జరిగే ఫైనల్స్‌లో ఇటలీ 12 క్వాలిఫయర్ జట్లలో ఒకటిగా బరిలోకి దిగనుంది. 2018 చాంపియన్ క్రొయేషియా, రన్నర్సప్ ఫ్రాన్స్, సెమీఫైనలిస్ట్ స్పెయిన్, యూఎస్ఏ, వైల్డ్ కార్డ్ ఎంట్రీ పొందిన గ్రేట్ బ్రిటన్, అర్జెంటీనాలతో పోటీపడనుంది. ఈ మొత్తం 18 జట్లు మూడేసి చొప్పున 6 గ్రూపులుగా విడిపోయి పోటీపడతాయి. గ్రూప్ స్థాయిలో టాప్‌గా నిలిచిన జట్లు రెండు బెస్ట్ పెర్ఫామెన్స్ చూపిన గ్రూప్ రన్నర్స్ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌లో పోటీపడతాయి. అనంతరం నాలుగు విజేత జట్లు సెమీస్‌లో పోటీపడతాయి ఫైనల్ పోటీ నవంబర్ 24న జరుగుతుంది.

72 పరుగుల ట్రయల్స్‌లో ఇంగ్లండ్



అంటిగ్వా: వెస్టిండీస్- ఇంగ్లండ్ రెండో టెస్ట్‌లో ఆతిథ్య వెస్టిండీస్ మూడోరోజు ఆట ముగిసే సమయానికి 72 పరుగుల లీడ్‌లో ఉంది. ఓవర్ నైట్ స్కోరు 30 పరుగులతో శనివారం తన తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన వెస్టిండీస్ ఆటముగిసేసమయానికి 306 పరుగులు చేసి ఆలౌటయింది. విండీస్ బ్యాట్స్‌మెన్‌లో బ్రాత్‌వైట్ 49 పరుగులు, జాన్ కాంప్‌బెల్ 47 పరుగులు, షాయ్ హోప్ 44 పరుగులు, షేన్ డోరిచ్ 31 పరుగులు, హెట్‌మెయిర్ 21 పరుగులు, బ్రావో 50 పరుగులు, జాసన్ హోల్డర్ 22 పరుగులు, డోరిచ్ 31 పరుగులు చేశారు. దీనితో విండీస్ 119 పరుగుల లీడ్‌ను పొందింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ వికెట్ కోల్పోయి 47 పరుగులు చేసి ఇంకా 72 పరుగుల ట్రయల్స్‌లో ఉంది. తొలిరోజున టాస్ గెలిచిన టాస్ గెలిచిన విండీస్ ఇంగ్లండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. జాని బెయిర్ స్టో 52, మొయిన్ అలీ 60, బెన్ ఫోక్స్ 35 పరుగులు చేయగా మిగతా బ్యాట్స్‌మెన్‌లో ఎవరూ కూడా 10 పరుగుల మార్క్‌ను అందుకోలేకపోయారు. దీనితో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 187 పరుగులకే ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు :

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 187 ఆలౌట్, రెండో ఇన్నింగ్స్ 47/1 **బ్యాటింగ్, వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** 306.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively
Interaction
For
Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
ఆదివారం 3 ఫిబ్రవరి 2019

పద్మమై విరిసిన... సాహితీ వెన్నెల!



-సిరివెన్నెల సీతారామశాస్త్రి

మహేష్ బాబుతో ఒక్కడు సినిమాను రూపొందిస్తున్న దర్శకుడు గుణశేఖర్... సీతారామశాస్త్రికి కథ చెప్పి పాట రాయమన్నారు. 'పసిడి పతకాల హారం కాదురా విజయ తీరం, ఆటనే మాటకర్థం నిను నువే గెలుచు యుద్ధం' అంటూ పాట రాసిచ్చారు సిరివెన్నెల. కథంతా రెండు వాక్యాల్లో చెప్పారంటూ ఆనందపడ్డారు గుణశేఖర్. సీతారామశాస్త్రి సాహిత్య ప్రతిభ ఏంటో చెప్పేందుకు ఈ ఒక్క సందర్భం చాలు. చక్రం సినిమాలో 'జగమంత కుటుంబం నాది' అనే పాటను గురువు గారిని బతిమాలి మరీ తీసుకున్నా... అని చెబుతారు దర్శకుడు కృష్ణవంశీ. మాటల రచయిత దర్శకుడు త్రివిక్రమ్ మాటల్లో చెప్పాలంటే తెలుగు పాట స్థాయిని పెంచిన రచయిత సిరివెన్నెల. తెలుగు పాటకు సార్థకత చేకూర్చిన శాస్త్రి గారికి పద్మశ్రీ చంద్రునికో నూలు పోగు మాత్రమే. ఇక ఆయనకైతే తెలుగు పాటే తన జీవితం. పాటతో తనకున్న అనుబంధమంతా సిరివెన్నెల సీతారామశాస్త్రి మాటల్లో ఆంధ్రప్రభ లైఫ్‌లో మీకోసం-

ముప్పై ఏళ్లుగా నేను సాగిస్తున్న సాహిత్య వ్యవసాయానికి ఫలసాయంగా... సీతారామశాస్త్రికి పద్మశ్రీ రావాలని అనేక మంది అభిమానులు కోరుకున్నారు. వాళ్ల అభిమానం, ఆకాంక్ష, ఆశీస్సుల వల్లే నాకీ పురస్కారం దక్కిందనుకుంటున్నాను. ఇదంతా మీరు నాకు ఇచ్చిందే, తిరిగి మీకే దక్కుతుంది అనుకుంటున్నాను. పరమేశ్వరుడు మనకు ఏదైనా ఇస్తే... ఇది నువ్వు ప్రసాదించిందే అని ఆయనకు చూపిస్తాం. ఆయన దాన్ని తీసుకుంటాడని కాదు... మన కృతజ్ఞత. అలా నాకు పురస్కారం రావాలని కోరుకున్న వాళ్లకే ఈ ఘనత దక్కుతుంది. నా సాహిత్య ప్రయాణంలో ఇంతమంది ప్రేమను సంపాదించుకున్నానా... అనే వినయంతో కూడిన గర్వం కొంత ఏర్పడుతోంది. పద్మశ్రీ పురస్కారం తెలుగు పాటకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఈ గౌరవం ఆత్రేయ, వేటూరి వంటి దిగ్గజ రచయితలు నాకు అందించిన ప్రసాదం. ఇన్నేళ్లుగా శ్రోతలు నాపై చూపిస్తున్న అభిమానం వల్లే ఇలాంటి గొప్ప పురస్కారాలు దక్కుతున్నాయి. పద్మశ్రీ పురస్కారం రచయితగా నాపై మరింత బాధ్యతను పెంచింది. రచయితగా పరిశ్రమ నాకు మరో జీవితాన్ని ఇచ్చింది. సినిమా పాటల రచన నాకు ఊపిరి లాంటిది.

అవ్యక్తభావమే పాట...

'సిరివెన్నెల' చిత్రంతో గీత రచయితగా నాకు జన్మనిచ్చిన దర్శకులు కళాతపస్వి విశ్వనాథ్ గారి పాదాలకు నమస్కారాలు చెప్పుకుంటున్నాను. నేను పాటలు రాయాలని నా కుటుంబ సభ్యులు కోరుకున్నారు. సిరివెన్నెల చిత్రానికి పాటలు రాసే ముందు పదిహేనేళ్లుగా సాహిత్య అనుభవం ఉంది. నా దృష్టిలో పాటంటే సరదాకో, వినోదానికో పాడుకునేది కాదు. మాటలతో వ్యక్తపరచలేని అవ్యక్త భావాన్ని పలికించేది. తియ్యని తలపులు అనే రెండు పదాలకు విడిగా అయితే అర్థం లేదు. తియ్యని అనేది రుచికి సంబంధించింది, తలపులు అనేవి చూపించలేం. కానీ ఈ రెండు పదాలు కలిపి తియ్యని తలపులు అని పలికితే ఈ రెండు మాటలకు అతీతమైన కొత్త అర్థం మనసుకు తెలుస్తుంది. అదే విధంగా మాటలు తెలపలేని, భాష మూగబోయిన చోట... పాట కొత్త భావాన్ని కలిగించాలి అనేది నేను ఇన్నాళ్లుగా నమ్మిన సిద్ధాంతం. అలా పదిహేనేళ్ల పాటు చేసిన సాహిత్య కృషి ఫలితంగానే సినిమా పరిశ్రమలోకి వచ్చాను. నా దృష్టిలో అన్ని కళల కంటే సాహిత్యం గొప్పది, సాహిత్యం కంటే నాటకం గొప్పది, నాటకం కంటే సినిమా గొప్పది. ఏ సినిమా కూడా సమాజాన్ని తప్పు దారి పట్టించేలా ఉండదు. ఒక అసాంఘిక సన్నివేశం చూపించినా దానికి కారణం కథలో ఉంటుంది. నేను వ్యక్తులను పొగిడేలా, మహిళలను కించపరిచేలా పాటలు రాయను. ఒక సమకాలీన అంశంపై పాటలు రాస్తాను. అది సంతోషం, దుఃఖం, ప్రేమ..ఇలా ఏ భావంతో కూడినదైనా కావచ్చు. సంఘటనలు, వ్యక్తులు, స్థలాల ఆధారంగా పాటలు రాయమని అడగకండి అని చెబుతుంటాను. వీటి ఆధారంగా పాట రాస్తే అవి తాత్కాలిక ప్రయోజనాలనే నెరవేరుస్తాయి. పాటకు, దానికోసం ఎంచుకునే అంశానికి సార్వజనీయత అవసరం. శోకం, హాసం, క్రోధం... ఇలాంటివి దేశ కాలమాన పరిస్థితులకు అతీతమైనవి.

దరువేయాల్సిందే..


పరిణామ క్రమంతో చూస్తే మనషులూ జంతువులే. అయితే తన మాటల ద్వారా, భావాల ద్వారా, పనుల ద్వారా జంతువుల కంటే తాను గొప్పవాడిని అని మనిషి నిరూపించుకుంటాడు. నువ్వు జంతువువా... అని చిన్న పిల్లాడిని అడిగినా...అబ్బబ్బె కాదంటాడు. అంటే తాను జంతువు కంటే గొప్పవాడిని అని తెలుసుకున్న క్రమమే మానవ విజయం. ఆ రోజుల్లో కవి అంటే పద్యం లేదా వచన కవిత్వం రాసేవారు. నాకు ఛందస్సు రాదు గనుక వీటి జోలికి వెళ్లలేదు. పద్యం, వచనం కాకుండా కొత్తగా రాసే నన్ను చూసి కాకినాడలో కొందరు డప్పు వాయించేవాడు అనేవారు. ఎందుకంటే ఏదైనా రాస్తే నేను దానికి దరువేస్తూ పాడేవాడిని. పాటకు శబ్దం కలిస్తే శ్రవణం సులువవుతుంది. అది త్వరగా గుర్తుండిపోతుంది. ఈ దశలో నన్ను మెచ్చుకున్న వాళ్లు, నొచ్చుకున్న వాళ్లూ ఉన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఆశలూ, ఆకాంక్షలు, పశ్చాత్తాపాలు, ఎదురుచూపులు...ఇలా అనేక భావోద్వేగాలు ఉంటాయి. నేను వాటి ఆధారంగానే పాట రాస్తుంటాను.

బతుకు జీవుడా అనుకున్నా...

నేను కఠినమైన భాష రాస్తుంటాను అనుకుంటారు కొందరు. మీకు అర్థంకానంత కఠినమైన భాషలో రాసేంత పాండిత్యం నాకు లేదు. నేను సంస్కృత భాషను పూర్తిగా నేర్చుకోలేదు. మా నాన్న పండితుడు. ఆయన పాడుతుంటే, మాట్లాడుతుంటే విన్నది, కొంత నేను చదువుకున్నది పాట రాసేందుకు కావాల్సిన పద సంపదను అందించింది. సిరివెన్నెల సినిమా తొలి పాట రికార్డింగ్ అయిన తర్వాత పాత్రికేయ సమావేశం ఉంటుందని విశ్వనాథ్ గారు చెప్పారు. నాకు కాళ్లూ చేతులూ వణికాయి. నాకు పాత్రికేయులంటే చాలా ఇష్టం. వాళ్లూ నాలాగే కలం జీవులు. నేను పాట రాస్తాను, వాళ్లు మాటలు రాస్తారు. ఆ మాటలు సమాజమంతా వ్యాపింపజేస్తారు. నేను రాసిన పాట విని పాత్రికేయులు ఏం అంటారో అని భయపడ్డాను. విశ్వనాథ్ గారు ఈ సమావేశంలో మాట్లాడుతూ...ఇప్పుడు మా పాటల రచయిత సీతారామశాస్త్రి పాట చదివి వినిపిస్తారు అన్నారు. నేను చదివిన తర్వాత మోగిన కరతాళ ధ్వనులు చూసి బతుకు జీవుడా అనుకున్నాను. జన్మధన్యమైంది అనిపించింది. ప్రతి పాట రాసేప్పుడు ఎంతో భయంతో బాధ్యతతో ఉంటాను. ఏం రాస్తున్నాం, ఎందుకు రాస్తున్నాం అనే స్పృహ ఉంటుంది. నా ప్రతి పాటకు పురస్కారం తీసుకుంటూనే ఉంటాను. నిర్మాతకు పాట ఇచ్చేముందు నాదైన సంతృప్తి దక్కాలి. ప్రతి రచయిత ఇలాగే ఆలోచించాలి. భుక్తి కోసం పాట రాస్తూనే సంతృప్తి ఎంత దక్కింది అనేది చూసుకోవాలి. నా మిత్రుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ...సీతారామశాస్త్రి గారు పాటలో తనదైన చొరవ తీసుకుంటారు అన్నారు. అవును ఆ చొరవ ప్రతి ఒక్కరూ తీసుకోవాలి. దర్శకుడు చెప్పినదే పాటగా రాస్తే గొప్పదనం ఏముంది. అది వాళ్లూ రాసుకోగలరు. ఆ సందర్భంలో అవ్యక్తమైన భావమేదో పదాల్లో చూపించాలి. ఆ ప్రయత్నానికి గౌరవంగా దక్కిన పురస్కారమే పద్మశ్రీ.







పాటే పంచామృతం..

పాటంటే ఇప్పటికీ నాకు భయభక్తులున్నాయి. సాధారణంగా మన గళం తప్పుడు మాటలు, చెడు మాటలే మాట్లాడుతుంది. సుశీలమైన మాటలు, క్షేమమైన మాటలు మనకు తరుచూ రావు. సభల్లో మాట్లాడేప్పుడు అందరి ముందు ఉండగా మంచి మాటలు చెబుతాం. మన గళం కొలను అయినప్పుడు ప్రతి పాట పద్మమవుతుంది... అని అల్లరి మొగుడు చిత్రంలో 'నా పాట పంచామృతం' కోసం రాశాను. 'ఈ వేళలో నీవు ఏం చేస్తుంటావు' అని నేను రాశాను. ఈ ప్రశ్న ప్రియుడు ప్రేయసి కోసమే కాదు బిడ్డ తండ్రి కోసం, తల్లి తన పిల్లల కోసం కూడా అంటుంది. ఇలాంటి భావాలు సార్వజనీనం. ఎవరికైనా అనిపించవచ్చు. అలా మీలో అనిపించే భావాలను నేను నా పాటలో రాసినప్పుడు అరే... నేను అనుకున్నదే ఆయన రాస్తున్నాడే అనుకుంటారు. అభిమానిస్తారు. నేను మీలోని నిశ్శబ్దానికి శబ్దాన్ని. జీవితంలో ప్రతి రోజూ మనకు సరికొత్తదే. దానినే నేను పాటగా ఇలా రాశాను...నిన్నైనా నేడైనా ఒకలాగే మొదలైనా... ఒకలాగే పూర్తయ్యేనా'....సాధారణమైన ఈ జీవితంలో అసాధారణ అనుభూతులెన్నో కలుగుతుంటాయి. ఎవరైనా పాట రాయండి అని అడిగితే సినిమా వరకే నా బాధ్యత అనుకోను. అందులో నేను పూర్తిగా లీనమవుతాను. వాళ్లు అడిగింది ఇస్తూనే తెర దాటి బయటకొచ్చి పాట రాస్తాను. పాట అంటే పదాల కూర్పు కాదు. పదాలకు మధ్య ఉన్న నిశ్శబ్దానికి ఇచ్చే గొంతుక. పిల్లల్ని నిద్రపుచ్చేది జోల పాట, యువతలో విప్లవాన్ని రగిలేచ్చేది జ్వాల పాట. లాలిజో లాలిజో ఊరుకో పాపాయి, గుమ్మాడీ గుమ్మాడీ నాకు నచ్చిన జోల పాటలు.

> మన గళం కొలను అయినప్పుడు ప్రతి పాట పద్మమవుతుంది... అని అల్లరి మొగుడు చిత్రంలో 'నా పాట పంచామృతం' కోసం రాశాను. 'ఈ వేళలో నీవు ఏం చేస్తుంటావు' అని నేను రాశాను. ఈ ప్రశ్న ప్రియుడు ప్రేయసి కోసమే కాదు బిడ్డ తండ్రి కోసం, తల్లి తన పిల్లల కోసం కూడా అంటుంది. ఇలాంటి భావాలు సార్వజనీనం. ఎవరికైనా అనిపించవచ్చు. అలా మీలో అనిపించే భావాలను నేను నా పాటలో రాసినప్పుడు అరే... నేను అనుకున్నదే ఆయన రాస్తున్నాడే అనుకుంటారు. అభిమానిస్తారు. నేను మీలోని నిశ్శబ్దానికి శబ్దాన్ని.

అసలైన సంపద...

సినిమా రంగం నా దృష్టిలో దేవాలయం. సినిమా పరిశ్రమ గొప్ప వ్యాపారం. సినిమా చేస్తున్న నిర్మాతలు గర్వపడాలి. ఇదొక గౌరవప్రదమైన వ్యాపారం అనుకుని సినిమాను నిర్మించాలి. పరిశ్రమలో 33 ఏళ్లుగా మీ అభిమానం పొందుతున్నాను. నేను డబ్బు కంటే వ్యక్తిత్వానికి ప్రాధాన్యత ఇస్తాను. మనుషుల హృదయాల్లో స్థానం పొందడమే అసలైన సంపద.

- రమేష్ గోపిశెట్టి

యోగా



చేతులకు చేవ భుజాలకు బలం!

కపోని భూ పర్వతాసనం!

మొదట వజ్రాసనంలో కూర్చోవాలి. ఇప్పుడు మోకాళ్లను అలాగే నేలకు ఆన్చి ఉంచి మోకాళ్లపై శరీరాన్ని పైకి లేపాలి. రెండు మోకాళ్ల మధ్య కాస్త ఎడం ఉండాలి. ముందుకు వంగి చేతులను చిత్రంలో చూపినట్టుగా మోచేతుల నుండి అరచేతుల వరకు నేలకు అనేలా ఉంచాలి. తలని రెండు చేతుల మధ్యలో నేలకు ఆనేలా ఉంచాలి. ఇప్పుడు నేలకు ఆన్చిన కాళ్లను పైకి లేపి పాదాలను, మోచేతులు అరచేతులను నేలకు అదిమిపెట్టి శరీరాన్ని పైకి లేపి ఉంచాలి. ఇలా సాధారణ శ్వాసలో అరనిముషం పాటు ఉండి తరువాత వజ్రాసనంలో రిలాక్స్ అవ్వాలి.

ప్రయోజనాలు:

* చేతులు భుజాలు బలంగా తయారవుతాయి.
* శరీరం మొత్తం బాగా సాగుతుంది.
* తలకు మొహానికి రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. దీనివలన జుట్టు ఊడటం తగ్గుతుంది.
* మొహంలో మెరుపు వస్తుంది.

గమనిక:

* భుజాలు బలహీనంగా ఉన్నవారు, మోచేతులు నొప్పిగా ఉన్నవారు చేయకూడదు. చేతుల్లో ఏభాగం బలహీనంగా ఉన్నా దీనిని చేయకపోవటం మంచిది.



-గాయత్రి
(యోగా ట్రైనర్)



అసమానతతో అట్టుడికిన కేరళ... సమానతలో ముందట!

* స్త్రీపురుష సమానత్వంపై నీతి అయోగ్ నివేదిక వెల్లడించిన నిజం
* దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ మహిళల స్థితి అధోగతే



మనదేశంలో నిరంతరం రగులుతూనే ఉండే సమస్యల్లో స్త్రీ పురుష అసమానత్వం కూడా ఒకటి. ఇటీవల కేరళ శబరిమలలో ఈ అగ్ని... మరింతగా జ్వలించడం చూశాం. గుడిలోకి మహిళలకు ప్రవేశం లేకపోవటం...రాజ్యాంగ విరుద్ధమే...అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తరువాత కూడా....అలా వెళ్లినందుకు కనకదుర్గ అనే మహిళ...అత్త చేతిలో దెబ్బలు తినాల్సి వచ్చింది. అత్తింటివారు ఆమెని ఇంట్లోకి రానివ్వలేదు. దేశానికి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టే కావచ్చు...కానీ మనిషికి అత్యున్నత న్యాయస్థానం అతని లేదా ఆమె ఆలోచనలు. ఆ విషయాన్ని అలా ఉంచితే...ఈ సమయానికి కాస్త అటుఇటుగా మనదేశంలోని నీతి అయోగ్ సంస్థ దేశంలోని భిన్న రాష్ట్రాల్లో భిన్న అంశాల్లో అభివృద్ధి ఎలా ఉందో తెలుపుతూ ఒక నివేదికని విడుదల చేసింది. అందులో....స్త్రీపురుష సమానత్వాన్ని పాటిస్తున్న రాష్ట్రాల్లో కేరళ, హిమాచల్ ప్రదేశ్ ముందువరుసలో ఉన్నాయి. సంప్రదాయాలు ఆచారాలు గృహహింస స్త్రీని ఎంతగా అణచివేస్తున్నాయో...కనకదుర్గ అంశం ప్రపంచానికి చాటింది. అలాంటి కేరళే స్త్రీ పురుష సమానత్వం ఉన్న రాష్ట్రాల్లో ముందుఉంది అంటే...ఈ విషయంలో ఇక మిగిలిన రాష్ట్రాల సంగతి చెప్పనక్కర్లేదు-



ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు... పేరుతో భిన్నదేశాల్లో 17అంశాల్లో జరుగుతున్న అభివృద్ధిని ఐక్యరాజ్యసమితి లెక్కిస్తోంది. పేదరికం, అసమానత, వాతావరణం, శాంతి, న్యాయం...ఈ అంశాలకు అనుసంధానంగా లక్ష్యాలు ఉంటాయి. ఈ లక్ష్యాలను సాధించాల్సిన సంవత్సరం 2030. ఈ క్రమంలో భారత్‌లో మొదటిసారి గత ఏడాది ఈ గణన చేశారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను పరిగణనలోకి తీసుకుని నీతి అయోగ్ ఈ నివేదికని తయారుచేసింది. ఐక్యరాజ్య సమితి ఇచ్చిన 17లక్ష్యాల్లో సమాచారం అందుబాటులో ఉన్న 13 లక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ 13 అంశాల్లోనూ కేరళ, హిమాచల ప్రదేశ్‌లు నూటికి 69 పాయింట్లు సాధించాయి. స్త్రీ పురుష సమానత విషయంలో కూడా కేరళే ముందుస్థానంలో ఉంది. గణన చేసిన 13 లక్ష్యాల్లో స్త్రీ పురుషసమాతనకే తక్కువ పాయింట్లు వచ్చాయి. 65 నుండి 99 పాయింట్లు వస్తే...అభివృద్ధిలో ముందున్నట్టుగా 50-64 మధ్యలో వస్తే కృషి జరుగుతున్నట్టుగా, 0-49 మధ్యలో పాయింట్లు వస్తే....ఆ అంశంలో అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్నట్టుగా స్కోర్లు నిర్ణయించారు. అలా చూస్తే కేరళ, సిక్కిం, అండమాన్ నికోబార్, చండీగఢ్‌లు స్త్రీ పురుష సమానత్వంలో కాస్త ముందంజలో ఉన్నాయి. 42 పాయింట్లతో ఉత్తర ప్రదేశ్ అన్నింటా వెనుకబడి ఉంది. స్త్రీ పురుషసమానత్వంలో అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత పాంత్రాల సగటుని బట్టి చూస్తే వచ్చిన పాయింట్లు 36. ఇలా చూస్తే....మనదేశంలో స్త్రీల పరిస్థితి ఎంత దారుణంగా చెప్పవచ్చు. తెలుగు రాష్ట్రాలు సైతం స్త్రీ పురుష సమానత్వం విషయంలో వెనుకబడే ఉన్నాయి. ఈ విషయంలో తెలంగాణ43 పాయింట్లు, ఆంధ్రప్రదేశ్ 44పాయింట్లతో ఉన్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల పాయింట్లు ముప్పయిలు నలభైల్లోనే ఉన్నాయి.

నివేదిక చెబుతున్న నిజాలు



▲ మనదేశంలో ప్రతి ముగ్గురుమహిళల్లో ఒకరు జీవిత భాగస్వామి చేతుల్లో హింసకు గురవుతున్నారు.

▲ ప్రతి వెయ్యిమంది మగపిల్లలకు 898మంది ఆడపిల్లలు జన్మిస్తున్నారు. 2030కి ఈ సంఖ్య 954కి చేరాల్సి ఉంది.


▲ కేవలం 32శాతం మంది మహిళలు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. వారు సగటున మగవారికంటే 30శాతం తక్కువగా సంపాదిస్తున్నారు. ఒకేరకమైన పని చేస్తున్నా మహిళలు పురుషుల సంపాదనలో 70శాతం మాత్రమే పొందుతున్నారు. కేవలం కేంద్ర పాలిత ప్రాంతమైన దాద్రా, నాగర్ హవేలీల్లో మగవారికంటే మహిళల వేతనం ఎక్కువగా ఉంది. అండమాన్ నికోబార్ దీవుల్లో స్త్రీపురుషుల వేతనాలు సమానంగా ఉన్నాయి. పుదుచ్చేరి, మధ్యప్రదేశ్, బెంగాల్‌లు ఈ విషయంలో చాలా వెనుకబడి ఉన్నాయి.

▲ సిక్కింలో గృహ హింస చాలా తక్కువగా 3.5శాతంగా ఉంది. మణిపూర్‌లో గృహహింస అత్యధికంగా 54.7శాతం ఉంది. (అయితే గృహ హింస ఎక్కువగా ఉంది...అంటే ఇక్కడ మహిళలు ఎక్కువగా బయటకు వచ్చి తమ బాధ చెప్పుకుంటున్నారని కూడా భావించవచ్చు)

▲ 63.6శాతం మంది మహిళలు మాతృత్వ సంబంధిత పథకాలకు అర్హులై ఉండి కూడా వాటిని పొందటం లేదు.

▲ భారత్‌లో గర్భం దాలుస్తున్న స్త్రీలలో సగంమంది రక్తలేమితో బాధపడుతున్నారు. దాద్రా నాగర్ హవేలిలో ఈ సంఖ్య 67.9శాతం ఉంటే...సిక్కింలో ఈ శాతం తక్కువగా ఉంది.

మహాశక్తి ఆవరణం మణిద్వీపం



బ్రహ్మలోకం కన్నా పైభాగాన ఒక లోకం ఉంది. అది కైలాసం కన్నా మిన్న. వైకుంఠం కన్నా ఉత్తమం. గోలోకం కన్నా శ్రేష్ఠం. ముల్లోకాల్లోనూ దానిని మించిన సుందరమైనది లేదు. ఇది ముల్లోకాలకూ గొడుగు వంటిది. సంసార తాపాన్ని నశింపజేస్తుంది. బ్రహ్మాండాలన్నిటికీ చల్లని నీడనిస్తుంది. అదొకద్వీపం. దానికి నాలుగు వైపులా క్షీరసాగరం ఉంది. ఆ సాగరంలో గాలికి ఉవ్వెత్తున లేచిన కెరటాలూ, రతనాల ఇసుక ప్రదేశాలూ, దక్షిణావృత శంఖాలూ, రంగు రంగుల చేపలూ ఉన్నాయి. ఆ ద్వీపానికి 25 ప్రాకారాలున్నాయి. ఇనుము, కంచు, రాగి, సీసం, ఇత్తడి, వెండి, బంగారం, వజ్రవైడూర్యాలు, ముత్యాలు ఆదిగా పలు విశేష ప్రాకారాల మధ్య భాగంలో 24 ఆవరణలున్నాయి. ఒక్కొక్క ఆవరణా కొన్ని విశేషాలను కలిగి ఉంది. ఫల పుష్పభరితమై, సువాసనలు వెదజల్లే వృక్షాలు, బంగారు రంగు పూలు, రతనాల బీజాలు గల ఫలాలు, సంతాన వృక్ష వాటిక, హరిచందన వనం, మందార వృక్షాల వనం, పారిజాత వనం, కదంబ వృక్షాలూ ఉంటాయి. ఒక ప్రాకారంలో ఎనిమిది దిక్కుల్లో ఇంద్రాది దేవతలుంటారు. పద్మరాగాల ప్రాకారంలో చతుష్షష్టి కళలూ, శక్తి స్వరూపాలై ఉంటాయి. ఇవిగాక వజ్రాల ప్రాకారం, వైడూర్య ప్రాకారం, ఇంద్రనీల మణి ప్రాకారం, ముత్యాల ప్రాకారం, మరకత ప్రాకారాలున్నాయి. మరకత ప్రాకారం భోగభాగ్యాలకు ఉనికిపట్టు. ఇక్కడ ఆరు కోణాలు గల పద్మం ఉంది. తూర్పు కోణంలో గాయత్రితో కూడిన బ్రహ్మ, నైరుతి కోణంలో సావిత్రి, విష్ణువు, వాయవ్య కోణంలో రుద్రుడు, సరస్వతి ఉంటారు. ఆగ్నేయ కోణంలో లక్ష్మీ సహితుడైన కుబేరుడు. వారుణ కోణంలో రతీమన్మథులు, ఈశాన కోణంలో వినాయకుడు కొలువై ఉంటారు. ఇంకా పగడ ప్రాకారం, రత్న ప్రాకారాలుంటాయి.

ఇతర ప్రాకారాల్లో అమృతేశ్వరి, కురుకుల్లాంబ, మార్తాండ భైరవుడు, నక్షత్ర సహిత చంద్రుడు, చిదగ్ని కుండము, శ్రీచక్ర రథము మొదలైనవి ఉంటాయి. 24వ ఆవరణలో శృంగార శక్తి సహితుడైన మన్మథుడు ఉంటాడు. దీని మధ్యలోనే చింతామణి గృహం ఉంటుంది. ఈ చింతామణి గృహానికి నాలుగు ద్వారాలుంటాయి. ఈ ద్వారాలలో ఆమ్నాయ దేవతలుంటారు. నాలుగు ద్వారాల మధ్య త్రికోణాకార మంచం మీద భువనేశ్వరుని వామాంకం మీద దేవి ఉంటుంది. ఇదంతా శ్రీనగరము. భువనేశ్వరీ దేవి నివసించు ప్రదేశమే మణి ద్వీపం. అదే శ్రీనగరము. శ్రీ అంటే లక్ష్మి, శ్రీ అంటే సంపద. శ్రీనగరమంటే లక్ష్మీ నగరమన్న మాట. అది సంపదలకు నిలయమైన నగరం. ఈ నగరానికి నాయిక ఆ పరమేశ్వరియే. అందుకే ఆమె శ్రీమన్నగర నాయిక. ఆమె పేరు తలిస్తే చాలు కోరిన కోరికలు నెరవేరుతాయి. దీనినే ఆది శంకరులు సౌందర్య లహరిలో అద్భుతంగా

సుధా సింధోర్మధ్యేసుర విటపి వాటీ పరివృతే
మణిద్వీపేనీపోపవనవతీ చింతామణిగృహే
శివాకారే మంచే పరమశివ పర్యంక నిలయాం
భజంతిత్వాం ధన్యాఃకతిచన చిదానందలహరీం అని వర్ణించారు.
తత్ర శ్రీభువనేశానీ పరాశక్తిర్విరాజితే
బ్రహ్మలోకాధికాలోకః సర్వలోకాదిభిఃపరః

> భువనేశ్వరీ
> దేవి నివసించు ప్రదేశమే
> మణిద్వీపం. అదే శ్రీనగరము. శ్రీ
> అంటే లక్ష్మి, శ్రీ అంటే సంపద. శ్రీనగర
> మంటే లక్ష్మి నగరమన్న మాట. అది
> సంపదలకు నిలయమైన నగరం. ఈ
> నగరానికి నాయిక ఆ పరమేశ్వరియే.
> అందుకే ఆమె శ్రీమన్నగర
> నాయిక.





- డాక్టర్ పులివర్తి కృష్ణమూర్తి

ఆలయాల ఆంతర్యం

సద్గురుబోధ




ఈ రోజుల్లో గుళ్లకు వెళ్లే వారిలో ఎక్కువ మంది వాటిలోని శక్తికి ఆకర్షితమై గుళ్లకు వెళ్లడం లేదు. భయంతోనో, ఆశతోనో వెళుతున్నారు. కాని అసలు గుడి స్థాపన వెనుక ఉన్న విజ్ఞానమే వేరు! ఆకాశాన్ని చూస్తే అది ఎంతో విశాలమైనదిగా గోచరిస్తుంది. కాని సూర్యుడు, నక్షత్రాలు, మిగతా గ్రహాలేకదా మనల్ని ఆకర్షించేది. అనంతంగా వ్యాపించి ఉన్న శూన్యం మనల్ని ఆకర్షిస్తుందా? రూపం లేని ఆ శూన్యంలో ఆనందాన్నిచ్చే అనుభవం ఒకటుంది. దాన్ని తెలుసుకోవడానికే గుళ్లూ గోపురాలూ స్థాపించబడ్డాయి. మీరు ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడేవి పంచేంద్రియాలే. అవే కన్ను, ముక్కు, నాలుక, చెవి, చర్మం. కానీ శూన్యాన్ని తెలుసుకోవడానికి మీ పంచేంద్రియాలు సరిపోవు.

పంచేంద్రియాలతో విశ్వాన్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ఇందుకు ఉదాహరణగా ఒక కథ. ఒక జెన్ గురువు దగ్గరికి ఒక కోతి వచ్చింది. తనను శిష్యునిగా స్వీకరిం చమని అడిగింది. 'వేరే వాళ్ల దగ్గరలేని సామర్థ్యం నా దగ్గర ఉంది. ఒకే గెంతుతో 100 చెట్లను దాటేస్తాను' అంది. ఆ కోతికి ఒక కత్తి ఇచ్చాడు గురువు. 'ఈ రోజు ఎంత దూరం వెళ్లగలవో అంతా వెళ్లి అక్కడ ఈ కత్తితో ఒక గుర్తు పెట్టి తిరిగిరా. ఆ తర్వాత నా అభిప్రాయం చెబుతాను' అన్నాడు.

ఆ పందెం తేలిక అనుకుంది కోతి. గురువును అదరగొట్టాలని అనుకుంది. మామూలు కన్న ఎక్కువ వేగంతో ఎగురుతూ వెళ్లింది. అలసట వచ్చాక, ఒక చోట ఆగి అక్కడి చెట్టు మీద కత్తితో గుర్తుపెట్టి తిరిగివచ్చింది. 'నేను గుర్తు పెట్టిన చెట్టును చూడాలంటే మీరు కొన్ని నెలల పాటు ప్రయాణం చేయాల్సి వస్తుంది' అంది కోతి. 'అక్కర్లేదు' అని జెన్ గురువు మందహాసం చేశారు. తాను కూర్చున్న చెక్క పలకను చూపించాడు. దాని మీద కోతి పెట్టిన గుర్తు కనిపించింది. బ్రహ్మాండంలో మానవుడి ప్రయాణం కూడా ఇంతే. దీనిని మించిన పయనం కోసం నిర్మించబడినవి ఈ కోవెలలు.

ఇంకా తేలికగా చెప్పాలంటే, ఏమీ లేని శూన్యం మీద విశాలమైన తివాచీ పరచి ఉందనుకుంటే, మీరు ఆ తివాచీ మీద ఉన్నారనుకోవచ్చు. ప్రత్యక్ష అనుభవం కలవారు, శక్తిభరితమైన స్థితిలో శాస్త్రీయంగా ఆ తివాచీ మీద ఏర్పరచిన రంధ్రాలే ఈ కోవెలలు. ఆ రంధ్రాల ద్వారా ఆవల ఉన్న శూన్యాన్ని, ఆ పరిమితిలేని శూన్యాన్ని అనుభూతి చెందగలరు. ఆ అంతుచిక్కని శూన్యాన్ని 'శివ' అని అంటాము. నిరాకార శూన్యం ఒక రూపం సంతరించుకున్న పుడు మొదట ఏర్పడే రూపమే లింగం. దేని నుంచి ఉద్భవించామో, ఆ శూన్యతత్త్వమైన శివతో ఏకమైపోవడానికి ప్రారంభంలో ఆలయాలు నిర్మించబడ్డాయి. మొదట్లో నిర్మించిన వేల కొలది ఆలయాలు ఏ అట్టహాసాలు లేకుండా, కేవలం లింగాలతోనే ఉండేవి. ఎవరినీ ఆకర్షించడం వాటి ధ్యేయం కాదు. కాలక్రమేణా మానవుడి ఆసక్తి మారిపోయింది. చివరకు లభించే ముక్తి కంటె వెంటనే కావలసినవి ముఖ్యంగా తోచాయి. ఆ అవసరాలకు తగ్గట్టు శక్తులను ప్రసాదించే రూపాలను సృష్టించడం ప్రారంభించారు.



ఆలయాలకు సంబంధించిన విజ్ఞానమెలా ఉపయోగించుకోవాలో తెలుసుకున్న మానవుడు శక్తికి ఒక దైవం, చదువుకు ఒక దైవం, కాపాడి రక్షించేందుకు ఒక దైవం అంటూ ఎన్నో రకాల దేవుళ్లకు ఎన్నో ఆలయాలు నిర్మించాడు. కాని ఈ రోజు గుళ్లకు వెళ్లే అధిక శాతం ప్రజలకు అక్కడ నిక్షిప్తమై ఉన్న శక్తిని గ్రహించే స్థాయి లేదు కనుక, వారు ఆ శక్తిని అనుభూతి చెందలేకపోతున్నారు. శక్తివంతమైన గుడి ఏది? మామూలు కట్టడం ఏది? అనే భేదం తెలుసుకోలేకపోతున్నారు.

మహాయోగుల వల్ల నిర్మించబడిన గొప్ప శక్తివంతమైన ఆలయాలు ఎన్నో మనదేశంలో ఆదరణ లేక పాడైపోవడం, వాటి శక్తిని మనం తెలుసుకోలేకపోవడం మన దురదృష్టం. మిమ్మల్ని ఉద్వేగపరిచే ఆల యాలు కావాలనుకుంటున్నారు. కోరికలు తీర్చే స్థలంగా ఏ కోవెల గురించి ఎక్కువగా ప్రచారం చేస్తు న్నారో, అవి ప్రసిద్ధి చెందుతున్నాయి. ప్రసిద్ధి చెందినంత మాత్రాన ఒక కోవెల శక్తివంతమైనదని చెప్పలేం. సృష్టిలో కనిపించేవన్ని శూన్యంలో విస్ఫోటనం జరిగి, దాని లోనుంచి పొంగి పొరలి వచ్చి నవేనని ఈనాటి వైజ్ఞానిక పరిశోధనలు నిరూపించాయి. శూన్యం నుంచి పుట్టినవన్నీ తిరిగి ఆ శూన్యంలో కరిగిపోతాయనే సత్యాన్ని అర్థం చేసుకోవడానికి స్థాపింపబడినవే నిజమైన ఆలయాలు.

ప్రేమాశీస్సులతో,

- సద్గురు జగ్గీవాసుదేవ్

చింతన

నిత్యదృష్టులు ఆత్మను దివ్యమైనదిగా దర్శిస్తారు



భగవద్గీత

అధ్యాయం- 13, శ్లోకం- 32

అనాదిత్వాన్నిర్గుణత్వాత్
పరమాత్మాయమవ్యయః।
శరీరస్థోపి కౌంతేయ
న కరోతి న లిప్యతే॥

తాత్పర్యం

నిత్య దృష్టి కలిగినవారు, అవ్యయమైన ఆత్మను దివ్యమైనదిగ, నిత్యమై నదిగ, త్రిగుణాతీతమైనదిగ దర్శింతురు. ఓ అర్జునా! అట్టి ఆత్మ దేహముతో సంపర్కము కలిగి యున్నను కర్మ నొనరింపదు, బద్ధము కాదు.

భాష్యం

శరీరము పుట్టుట వలన ఆత్మ జనించినట్లు మనము భావిస్తాము కాని, ఆత్మ శాశ్వతమైనది. ఆత్మ జనించదు. ఈ శరీరములో ఉన్నప్పటికీ ఆత్మ దివ్యమైనది, శాశ్వతమైనది. కాబట్టి ఆత్మ నశింప బడదు. ఆత్మ ఆనంద భరితమైనది. ఆత్మ భౌతిక కార్యాలలో పాల్గొనదు. అనగా భౌతిక శరీరముతో తాను చేయు కార్యాలు, తనను బందీ చేయవు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

శూన్యసందేహాలు


గుడిలో ఘంటానాదం చేయడంలోని అంతరార్థమేమిటి?

- వి. రామకృష్ణ, ఒంగోలు

ఆవాహనాయ దేవానాం
వారణాయచ రక్షసాం
ఘంటానాదం కరిష్యామి

అని పురాణ వచనం అనగా దేవతలను పిలవడానికి, రాక్షసులను తొలగించడానికి ఘంటానాదం చేస్తున్నామని అర్థం. గుడిలోకి వెళ్లిన భక్తులు రాక్షసులు తొలగి సకల దేవతలు తన వెంట వస్తున్నారనే ప్రతిజ్ఞ ఘంటా నాదంలో ఉంది.

స్వామి దృష్టిని మన వైపు మరల్చడం స్వామిని కరుణిం చమని ప్రార్థించడం ఘంటానాదంలోని అంతరార్థం.



- డా॥ కందాడై రామానుజాచార్య

దిన ఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచి కార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయవృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పను లలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించ లేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితు లున్నా అధిగమించ గలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/ సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లు తాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతి బంధకాలను ఎదుర్కొగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పని సరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్య తలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభవ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్యరీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

నేనెవడను?



'నేను ఎవడను' అను తలపును సదా అవలంబించి యుండుటకు ఉపాయమేమి?

ఇతర తలపులు ఎన్ని లేచినా వాటిని పూర్తి చేయుటకు ప్రయత్నించక ''అవి కలిగినది ఎవరికి'' అని విచారణ చేయవలెను. ఎన్ని తలపులు

ప్రశ్నలు-సమాధానాలు

పుడితేనేం, జాగ్రత్తగా, ఒక్కొక్క తలంపు పుట్టగానే ''ఇది ఎవరికి కలిగింది'' అని విచారించాలి. ''నాకు''అని తోస్తుంది. అప్పుడు నేనెవడనని శోధిస్తే మనస్సు తన పుట్టుక స్థానానికి మరలుతుంది. పుట్టిన తలపు కూడా అణగిపోతుంది. ఈ అభ్యాసం చేయగా చేయగా మనస్సుకు తన జన్మస్థానంలో నిలిచి ఉండే శక్తి అధికమౌతుంది. సూక్ష్మమైన మనస్సు, మెదడు, ఇంద్రియాల ద్వారా బయటికి పోవునపుడు స్థూలమైన నామరూపములు అనుభవమౌతాయి. మనస్సు స్వస్థానమైన హృదయంలో నిలకడ చెంది ఉండునపుడు నామరూపములు మరుగున పడుతున్నాయి. మనస్సును బయటకు పోనీయక హృదయాన నిలిపి ఉంచుటకే 'అహం ముఖము' లేక 'అంతర్ముఖము' అని పేరు. హృదయం నుంచి దానిని వెలుపలికి పోనిచ్చుటను 'బహిర్ముఖము' అంటారు.

ఈ విధంగా మనస్సు హృదయంలో కుదురుకుంటే అన్ని తలపులకు మూలకారణమైన 'నేను' అనేది పోయి, సదా ఉండే 'తాను' మాత్రము తెలియబడుతుంది. ఏది చేసినను ''నే''నను అహంకారము లేకయే చేయవలెను. ఆ విధముగ చేసినచో సర్వము శివస్వరూపముగ తోచును.

అనువాదం: ప్రణవానందులు

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/




సంస్కృతి

నారీ సౌందర్యానికి ప్రాధాన్యమిచ్చే
నరహరి చిత్రాలు!


తెలంగాణ చిత్రకళా వైభవం-32

పాలమూరు ప్రాంతం నుంచి వచ్చిన భవాండ్ల నరహరి తన బాల్యంలో చూసిన గ్రామీణ మహిళలను కాగితంపై కాన్వాసుపై చిత్రిక పట్టడంలో చేయి తిరిగిన చిత్రకారుడిగా, పలువురి ప్రశంసలందుకున్నారు. చాలా కాలం గ్రామీణ రైతులను, చేతి వృత్తుల వారిని, వ్యవసాయ పరికరాలను, పనిముట్లను కాగితంపై, కాన్వాసుపై పెట్టినా అనంతరం తనదైన ప్రత్యేకత పాటమరించేలా పల్లెపడుచుల బొమ్మలు వేయడం ప్రారంభించారు. అంతవరకు సాధారణ మహిళలు గోచిపెట్టుకున్న స్త్రీలు, పల్లెపడుచులు కాస్త కొత్త అందాలు సంతరించుకోసాగారు.



తంజావూరు చిత్రకళలోని శైలి అంశాలు కొన్ని అందిపుచ్చుకుని తెలంగాణ గ్రామీణ మహిళల చిత్తరువులు చిత్రించడం ప్రారంభించారు. ఈపరిణామం నరహరికి తెలియకుండానే జరిగిపోయింది. సాధనలో, కాలక్రమంలో తనలోని భావాలకు కొత్త రెక్కలు తొడగడంతో సరికొత్త రూపంలో తెలంగాణ గ్రామీణ మహిళల ఆకారాలు, కాన్వాసు, కాగితంపై తొంగి చూడసాగాయి. కేవలం మహిళలే గాక వారి చుట్టూ ఉండే వాతావరణం, సంప్రదాయాలు- పండుగలు, పబ్బాలు, ముచ్చట్లు అలా అన్నీ ఆవిష్కృతం కాసాగాయి. ఈ రకమైన వ్యక్తీకరణ, రంగుల పొందిక, స్త్రీల రూపం, వారి హావభావాలు, ముఖ్యంగా వారి కొప్పు-కొప్పును అలంకరించుకునే తీరు, ధరించే వర్ణమయ వస్త్రాలు, నగలు వాటిని కాన్వాసుపై ప్రతిబింబింప జేసే వైనం ప్రత్యేకతను చాటుతుంది. బలిష్టమైన ఆకారాలు, పిక్కలు కనిపించేలా చీరలు పైకి కట్టే వైనం, చాలా చిత్రాల్లో స్త్రీల పిరుదులు సగం కనిపించేలా చూపడంతో అది భవాండ్ల నరహరి 'ముద్ర'గా మారింది. ఈ సృజనాత్మక వ్యక్తీకరణ, సుందరీకరణ ఆయనకు గుర్తింపును తీసుకొచ్చింది. చిత్రకళారంగంలో ప్రత్యేక స్థానాన్ని కల్పించింది. తెలంగాణ గ్రామీణ ప్రాంత మహిళల బలిష్ట ఆకారాల్లోని కొంత మొరటుదనాన్ని నాజూకుగా మలిచి చూపడంలో నరహరి పూర్తిగా సఫలీకృతమయ్యారు. తెలంగాణ గ్రామీణ జీవితాన్ని చిత్రకళలోకి తర్జుమా చేసే నైపుణ్యం ప్రదర్శించి చిత్రకళా ప్రియులనెందరినో ఆకర్షించారు. మహిళలకు ప్రత్యేకమైన బతుకమ్మ-బోనాల పండుగల సందర్భంగా సహజంగా వారు అలంకరించుకునే తీరు, బతుకమ్మ-బోనాల అలంకరణ అన్నీ ఆయన చిత్రాల్లో మరింత శోభాయమానంగా కనిపిస్తాయి. మహిళల అలంకరణ ప్రియత్వాన్ని నరహరి చాలా బాగా అంది పుచ్చుకుని, దానికి తన సృజనను, నైపుణ్యాన్ని జోడించి కాన్వాసుపై పొందుపరిచారు.

నిష్కల్మషమైన గ్రామీణ సహజ సౌందర్యం ముగ్ధమనోహరంగా చిత్రిక పట్టడం అంత సులువు కాదు. కాని నరహరి దాన్ని సాధించారు. కేవలం మహిళల ఆకారాలను గీయడమే గాక నేపథ్యంలో కనిపించాల్సిన అంశాలపై అధిక శ్రద్ధ కనబరచడం కారణంగా ఆయన బొమ్మల్లో ''డెప్త్'' కనిపిస్తుంది. చిత్రకళలో ప్రధానమైన ఈ విషయం ఆయన విస్మరించలేదు. ఈ రకమైన తనదైన ప్రత్యేక శైలిలో బొమ్మలు గీయడం ప్రారంభించే ముందు ఆయన అందరు చిత్రకారుల మాదిరిగానే అసంఖ్యాక సాధారణ డ్రాయింగ్స్ వేశారు. వాటిలో నైరూప్య చిత్రాలు సైతం ఉన్నాయి. కొన్ని ఫిగరేటివ్ వేశారు. లాండ్ స్కేప్స్ గీశారు. నలుపు-తెలుపు బొమ్మలు అనేకం వేశారు. ముఖ్యంగా ప్రముఖ చిత్రకారుడు లక్ష్మాగౌడ్ బొమ్మలను, ఆయన పనితీరును స్ఫూర్తిగా తీసుకుని కృషి చేశారు. లక్ష్మాగౌడ్ డ్రాయింగ్స్ ఎంతో శక్తిమంతమైనవని నరహరి భావిస్తారు. ఆ ప్రభావంతో తాను బొమ్మలు గీశానని ఆయన నిజాయితీగా అంగీకరిస్తారు. లక్ష్మాగౌడ్ కూడా తెలంగాణ గ్రామీణ ప్రాంత వ్యక్తులను, ముఖ్యంగా రైతులను, ఆడవారిని ఎంతో నైపుణ్యంతో చిత్రిక పట్టడం, ఆ శ్రమ...శ్రమజీవుల చిత్తరువుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. సహజంగానే నరహరి ఆ డ్రాయింగ్స్ పట్ల ఎక్కువ ఆకర్షితులై ఆ మార్గంలో నడిచేందుకు సిద్ధమవడంలో ఆశ్చర్యం లేదు. నిరంతరం చేసిన ఆ సాధనలో తనదైన ''శైలి''ని ప్రకటించడంతో, బలంగా వ్యక్తీకరించడంతో ఇతరుల ప్రభావం నుంచి నరహరి బయటపడ్డారు. చూసేవారికి తన చిత్రాలు నచ్చాలి అన్న తపనతో బొమ్మలు గీయడం, కొత్తగా రంగులను, రేఖలను పలికించాలని కృత నిశ్చయంతో కుంచెను, పెన్నును కదిలించి ఆయన తెలంగాణ చిత్రకళకు కొత్త వన్నెలద్దారు. చిత్రకళలో ప్రాథమిక అంశాలు (ఫండమెంటల్స్) చాలా ముఖ్యమని, అంకిత భావం మంచి ఫలితాలనిస్తుందని, సాధన సరికొత్త తీరాలకు చేరుస్తుందని ఆయన అభిప్రాయం. ఆత్మసంతృప్తి కలిగేంత వరకు కాన్వాసుపై పనిచేస్తూ ఉండాలని కూడా ఆయన అంటారు.



నిష్కల్మషమైన గ్రామీణ సహజ సౌందర్యం ముగ్ధమనోహరంగా చిత్రిక పట్టడం అంత సులువు కాదు. కాని నరహరి దాన్ని సాధించారు. కేవలం మహిళల ఆకారాలను గీయడమే గాక నేపథ్యంలో కనిపించాల్సిన అంశాలపై అధిక శ్రద్ధ కనబరచడం కారణంగా ఆయన బొమ్మల్లో ''డెప్త్'' కనిపిస్తుంది. చిత్రకళలో ప్రధానమైన ఈ విషయం ఆయన విస్మరించలేదు.

హైదరాబాద్ ఆర్ట్ సొసైటీలో సభ్యులుగా ఉంటూ నరహరి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సహచర చిత్రకారుడు-శిల్పి జి.వై.గిరితో కలిసి అనేక ప్రదర్శనలు నిర్వహించారు. వ్యష్టి చిత్రకళా ప్రదర్శనలు, సమిష్టి చిత్రకళా ప్రదర్శనలు వివిధ నగరాలలో ఏర్పాటు చేశారు. ముంబయి, ఢిల్లీలో నరహరి చిత్రాలను అభిమానించే ఆర్ట్ కలెక్టర్స్ చాలామంది ఉన్నారు. అనేక ఆర్ట్ ఎగ్జిబిషన్స్‌లో, ఆర్ట్ ఫెయిర్స్‌లో తన చిత్రాలను ప్రదర్శించి ఆయన ప్రశంసలందుకున్నారు. చిత్రకళ ప్రేమికుల మనసులు దోచుకున్నారు. సింగపూర్ లాంటి దేశాల్లోని ఆర్ట్ ఫెయిర్స్‌లో పాల్గొని తన చిత్రాలను అక్కడి వారికి పరిచయం చేశారు. భారతదేశంలో పొద్దార్ లాంటి పారిశ్రామిక వేత్తలు, ఇతర ప్రముఖులు తన చిత్రాలను కొనుగోలు చేసి తమ నివాసాల్లో, కార్యాలయాల్లో పెట్టుకున్నారని నరహరి గర్వంగా చెబుతారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఆర్ట్ అమ్మకాలు పెరిగాయని, దాంతో అనేక గ్యాలరీలు తన చిత్రాలను ఆన్‌లైన్‌లో పెట్టాయని, వాటికి మంచి స్పందన వస్తోందని కూడా ఆయన వివరించారు.

1956 సంవత్సరంలో కల్వకుర్తిలో జన్మించిన నరహరి పాఠశాలలో చదువుతున్న రోజుల నుంచే బొమ్మలు వేయడంపై ఆసక్తిని పెంచుకుని తన చుట్టూ ఉన్న పరిసరాలను చిత్రిస్తూ ఎదిగారు. రాష్ట్రస్థాయిలోనే గాక అంతర్జాతీయ స్థాయిలోనూ బహుతులను అందుకున్నారు. భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవం సందర్భంగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తేజేందర్‌సింగ్ చేతుల మీదుగా ఉత్తమ చిత్రకారుని అవార్డును అందుకున్నారు. 1975-1981 సంవత్సరంలో హైదరాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చదివి, చిత్రకళలోని మెలకువలు తెలుసుకుని అక్కడ గోల్డ్‌మెడల్ సాధించారు. ఆ పునాదిపై ఆయన తన ప్రతిభతో అద్భుత చిత్రాలు గీశారు...గీస్తూ ఉన్నారు.

హైదరాబాద్‌లోని జాతీయ పౌష్టికాహార సంస్థలో పనిచేసి పదవీ విరమణ చేసిన నరహరి భవాండ్ల 1981లో రాష్ట్రస్థాయిలో మాస్టర్ క్రాఫ్ట్‌మన్ అవార్డు, 1999లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, 1997లో అఖిల భారత ఫైన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ ఢిల్లీ వారి అవార్డు, భారత్ కళాపరిషత్ వారి పతకం ఇట్లా అనేక అవార్డులు, పతకాలు, ప్రశంసలు అందుకుని తెలంగాణ చిత్రకళా వైభవానికి తనదైన పద్ధతిలో వైభోగం తీసుకొచ్చారు.

- ఉప్పలనరసింహం
9985781799

శాలివాహనుడెవరు?

పురాణాలలోని **(నావిష్ణుఃపృధివీపతి)** అనే సూక్తాన్ని గమనించినట్లైతే జీవులను రక్షించి పోషించడం విష్ణువు బాధ్యత అనే అర్థాన్ని సూచిస్తుంది. అలాగే రాజ్య ప్రజలను రక్షించి పోషించడం రాజుగారి బాధ్యత కనుక. సాక్షాత్తు రాజే విష్ణువు అవుతున్నాడు. దీనికి నిదర్శనమే కృష్ణాజిల్లా శ్రీకాకుళంలోని 'ఆంధ్రమహావిష్ణువు దేవాలయం' తమ జాతిని ఏకతాటిపై నడిపిస్తూ శత్రురాజుల నుండి, అనుక్షణం రక్షించిన వారి మూలపురుషునికి దేవాలయం నిర్మించి 'ఆంధ్ర మహావిష్ణువు'గా ఆంధ్రులు ఆరాధిస్తూ వచ్చారు. ఈ ఆంధ్రజాతిలోని మరోసాటిలేని మేటివీరుడు విశాల సామ్రాజ్యాధినేత అయిన గౌతమి పుత్రశాతకర్ణి చుట్టూ అలముకున్న చీకటి తెరలను తొలగించే ప్రయత్నమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశం.

ప్రాచీన కాలంలో ఈ ప్రాంతమంతా అరణ్యాలు విస్తరించి ఉండేవి. ఈ అరణ్యాలలో చిన్న చిన్న దుర్గాలను నిర్మించుకొని జీవనం సాగిస్తున్న భవర, యక్ష, నాగ, మూతిబ, పుళింద, పుండ్ర వంటి జాతులను ఉత్తరదేశం వారు **('ఆంధ్రశ్చ బహువః)** అని వ్యవహరించడం వలన ఆ తెగల వారంతా కలసి ఆంధ్రులుగా పిలువడినట్లు తెలుస్తుంది. వైదిక వాఙ్మయం ఆంధ్రులను సంచారజాతివారిగా గొప్ప విలుకాళ్లగా, సాహసవీరులుగా ప్రస్తావిస్తుంది. అంతేకాదు మహాభారతంలో, ఆంధ్రులు కౌరవ పక్షం వహించినట్లు ఉంది. ఇదే మహాభారతం దక్షిణాపథంలోని చేర-చోళ-పాండ్య రాజ వంశాలను కలిపి చెబుతుంది.

ఆంధ్రుల నివాస ప్రాంతమైన ఆంధ్ర నగరి యొక్క ప్రస్తావన గౌతమ బుద్ధుని కాలం నుండి సుప్రసిద్ధం. బుద్ధుని జాతక కథల ద్వారా ఉత్తర భారతం నుండి దక్షిణ భారతంలోని 'ఆంధ్రనగరి'కి రెండు ప్రధాన మార్గాలున్నట్లు తెలుస్తుంది. 1. శ్రావస్తి నుండి అవంతి, విదర్భ, ములక, అశ్మిక, అశ్మిక అంటే కరీంనగర్, బోధన్‌లలోని గోదావరి మంజీరనదులు కలిసే ప్రాంతమార్గం నుండి బావరి రుషిశిష్యులు బుద్ధుని దర్శనార్థం వెళ్లారు. 2. మగధ నుండి కళింగ(నేటి ఒడిస్సా)మీదగా కృష్ణానదీ ముఖద్వారం నుండి 'ఆంధ్రనగరి' అంటే ధాన్యకటకం చేరేవారు.(క్రీ.పూ.256) నాటి అశోకుని 13వ శిలాశాసనం ఆంధ్రులు రాజవిషయ అంటే మౌర్య సామ్రాజ్యంలో నివసించేవారని చెబుతుంది. (క్రీ.పూ.302)లో మౌర్య ఆస్థానానికి వచ్చిన గ్రీకు రాయబారి మెగస్తనీసు తాను వ్రాసిన 'ఇండికా' అనే పుస్తకంలో ఆంధ్రులు గొప్ప సైనిక బలం కలవారని వారికి 30 దుర్గాలు, లక్షకాల్బలం, 2000అశ్వికదళం, వెయ్యి ఏనుగులున్నాయని పేర్కొన్నాడు. ఆశ్మిక, ములక రాష్ట్రాల నుండి భట్టిప్రోలు -ధరణికోట వరకు గల ప్రాంతమంతా కలిపి 'ఆంధ్రుల నగరి'గా పేర్కొన్నాడు. మౌర్య చక్రవర్తుల దండయాత్రలలో ఆంధ్రులు పాల్గొని విజయాలను చేకూర్చి పెట్టి వారికి విశ్వాస పాత్రులగుట వలన వారికి ఆంధ్ర భృత్య అనే మాట ఏర్పడి ఉంటుంది.

ఈ ఆంధ్రులలోని శాతవాహన అనే తెగకు చెందిన 30మంది రాజులు నాలుగు వందల యాభై సంవత్సరాలు పరిపాలించినట్లు పురాణాలు అతి ఘనంగా చెబుతున్నాయి. ఈ రాజవంశీయులకు తొలినాళ్లలో కోటి లింగాల **(కరీంనగర్ జిల్లా అశ్మిక జనపద రాజధాని)** అని పరిశోధకుల అభిప్రాయం. ఆ తరువాత దండయాత్రల కారణంగా ధాన్యకటకానికి వచ్చారు. ఈ వంశస్థాపకుడు శ్రీముఖుడు ఇతడు తొలిరోజులలో మౌర్యచక్రవర్తి అశోకునికి సామంతుడిగా ఉండి తన ప్రభువు మరణానంతరం స్వతంత్రుడై క్రీ.పూ.230 నుండి క్రీ.పూ207 వరకు పరిపాలన చేసాడు. శ్రీముఖుడి తండ్రి పేరు శాతవాహనుడు. ఈపేరునే తన వంశనామంగా మలచుకొన్నాడు. శ్రీముఖుడు మహారాష్ట్రలోని కొంత భూభాగాన్ని తన స్వాధీనంలోనికి తెచ్చుకొని తన కుమారుడైన శాతకర్ణికి మహారాష్ట్ర రాజవంశానికి చెందిన రాకుమారి 'నాగనీక'తో వివాహం జరిపించాడు. ఈ వివాహ సంబంధం వలన రాజ్యం బలపడింది. సైన్యం పెరిగింది. మొదట జైనమతాన్ని అవలంబించిన శ్రీముఖుడు తరువాత వైదికమతాన్ని ఆదరించినట్లు తెలుస్తుంది. శ్రీముఖుడు మరణ సమయంలో తన కుమారుడు చిన్నవాడైనందువలన అతని తమ్ముడు కృష్ణుడు కొంతకాలం పరిపాలన చేసాడు. ఆ తరువాత శ్రీముఖుడు కుమారుడు శాతవాహన సామ్రాజ్యాధికారం చేపట్టి మాళవరాజ్యం జయించాడు. శాతవాహన రాజ్యాన్ని బలపరచి 'దక్షిణాపథపతి' అనే బిరుదు పొందాడు. ఇదే సమయంలో తూర్పున కళింగదేశాన్ని పాలిస్తున్న ఖారవేలుడు తన రాజ్య విస్తరణలో భాగంగా శాతకర్ణితో తలపడ్డాడు. ఈ యుద్ధంలో శాతకర్ణి ఖారవేలుడ్ని ఎదుర్కొని పారద్రోలినట్లు, ఖారవేలుని హాథిగుంపా శాసనం చెబుతుంది. అలాగే శాతకర్ణి భార్య 'నాగనీక' నాన్‌ఘాట్‌లో వేయించిన శాసనం శాతకర్ణి విజయాలనే కాక అతడు చేసిన యజ్ఞయాగాలను వివరిస్తుంది.





శాతకర్ణి తరువాత శాతవాహన రాజ్యాన్ని పూర్ణోత్సంగుడు, స్కందస్తంభి వంటి రాజులు కొంతకాలం పరిపాలించారు. ఆ తరువాత రెండవ శాతకర్ణి క్రీ.పూ. 152లో అధికారం చేపట్టి 96 వరకు శాతవాహన రాజ్యాన్ని శత్రుభయం లేకుండా పాలించాడు. తమ రాజ్యానికి వాయవ్య ప్రాంతములో ఉన్న శకులను, తూర్పున ఉన్న కళింగదేశాన్ని, మగధరాజ్యాన్ని జయించి, పాటలీపుత్ర రాజ్యాన్ని కొంతకాలం పరిపాలించాడు. తన బాహుబలంతో శాతవాహన వంశ కీర్తి ప్రతిష్టను మరింత పెంచాడు. ఇతని తరువాత లంబోదర, అపీలకుడు, మేఘస్వాతి, స్వాతి శాతకర్ణి, గౌరవకృష్ణ హాల శాతవాహన, మందూలక, పురిందసేన, సుందర శాతకర్ణి, చకోర శాతకర్ణి, శివస్వాతి వంటి పాలకులు పరిపాలన చేసారు.

ఆ తరువాత (78-102) శాతవాహన రాజ్యాధికారం చేపట్టిన గౌతమి పుత్ర శాతకర్ణి తన బుద్ధి బలం, క్షాత్ర తేజం ప్రదర్శించి తమ పూర్వీకులు కోల్పోయిన భూభాగాలను తిరిగి స్వాధీనపరచుకొని, అనేక దిగ్విజయ యాత్రలు చేసి ఐదుతరాలుగా తమ వంశస్థులకు జరుగుతున్న అవమానాలకు బదులు తీర్చుకొని క్రీ.శ.78లో తన పేర శాలివాహన శకం ఏర్పాటు చేసినట్లు అతని తల్లి గౌతమి బాల శ్రీదేవి వేయించిన నాశిక్ శాసనంలో పేర్కొనబడింది. అంతేకాదు క్షహరాట వంశాన్ని హతమార్చి '' క్షహరాట వంశనాశక'' అని బిరుదు పొందాడు. అలాగే గౌతమి పుత్ర శాతకర్ణికి ''ఏకబ్రాహ్మణ'' అనే ప్రశంసన ఉన్నందువలన కొందరు పండితులు శాతకర్ణి బ్రాహ్మణుడని భావించారు. అయితే ''ఏకబ్రాహ్మణ'' అనే మాట అతని కులాన్ని లేక వర్ణాన్ని సూచించేది కాదు. ఆ కాలంలో విస్తరిస్తున్న జైన, బౌద్ధమతాలను ఆనాటి పాలకులు ఆచరిస్తుంటే శాతకర్ణి మాత్రం బ్రాహ్మణ మహర్షులు ఆచరించే వైదికమతాన్ని ఆచరించిన ఏకైక మహారాజు అనే అర్థంలో ''ఏకబ్రాహ్మణ'' అనే పద ప్రయోగం జరిగింది. **(మన అమరావతి కైఫియతు-డా॥వావిలాల సుబ్బారావు)**

నాసిక్ శాసనం ప్రకారం శాతకర్ణి తన పేర శాలివాహన శకాన్ని ఏర్పాట్లు చేసినట్లు స్పష్టమౌతుంది. ఇక ఈ శాలివాహనుడు ఎవరో తెలుసుకుందాం. సోమకాంతుడి రాజధాని అయిన ముంగి పైఠణంలో సులోచనుడనే కుమ్మరి కులస్థుడు ఉన్నాడు. ఇతని భార్య ఒక కుమార్తెకు జన్మనిచ్చి మరణించడం వలన తల్లిలేని ఆ ఆడశిశువుని కంటికి రెప్పలా పెంచి పెద్దచేసాడు. సులోచనుడు, యుక్తవయస్సుకి వచ్చిన ఆమె ఒక నాగేంద్రుడి ప్రేమకు లోబడి పెళ్లికి ముందే ఒక కుమారుడికి జన్మనిస్తుంది. అపుడు ఆ పట్టణ పరిసర ప్రాంతములోని వారు ఆమె తండ్రిని నిందించడం వలన సులోచనుడు కలత చెంది ఆ తల్లి బిడ్డను వెంట బెట్టుకొని, నగరం నుండి వెలుపలికి వచ్చి నివాసం ఏర్పాట్లు చేసుకొని, ఆ బాలునికి శాలివాహనుడనే పేరు పెట్టారు. కులవృత్తిలో నైపుణ్యంగల సులోచనుడు కుండలు తయారుచేసి వాటిని విక్రయించుకొని ఆ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆ ప్రాంత మంతా జననివాసాలు పెరిగాయి. అది ఒక పల్లెగా ఏర్పడింది.

శాలివాహనుడు సాటి పిల్లల కంటే మంచి తెలివితేటలు ప్రదర్శించి ఆ పిల్లల గుంపునకు నాయకుడిగా వ్యవహరిస్తూ, తాను రాజునని, ఒకరిని మంత్రిగా చేసి మరొకరిని సేనానిగా భావిస్తూ, మిగిలిన పిల్లలందరిని సైనికులంటూ ఆటలు ఆడేవాడు. బంకమన్నుతో పెద్ద పెద్ద ఏనుగులు, గుఱ్ఱాలు, యుద్ధసామగ్రి, కత్తి, డాలు, రథములు తయారుచేసేవాడు. తొమ్మిదేళ్ల వయస్సు గల శాలివాహనుడు, ''విక్రమాదిత్యుని పైకి కత్తివిసిరినట్లు కథనం కూడా ప్రచారంలో ఉంది. అయితే ఇవి కేవలం కల్పిత కథనాలుగా అనిపించినప్పటికి ఈ కథనాలలో కొన్ని వాస్తవాలు సుస్పష్టమౌతున్నాయి. శాలివాహనుడు చిన్నతనం నుండి పరాక్రమవంతుడు, రాజ్యపాలన పట్ల మంచి విజ్ఞానం కలవాడని, కులవృత్తిలోనే కాక, యుద్ధ విద్యల లోను, యుద్ధ వ్యూహాలు పన్నుటలోను సాటిలేని నైపుణ్యం సాధించినవాడని తెలుస్తుంది. ఇదంతా తన తల్లి వీరమాత ప్రేరణ, శిక్షణ తోడై శాలివాహనుడు మహా విజేత అయ్యాడనేది సత్యం.


ఇప్పటి నిజాం రాజ్యంలోని ఔరంగాబాదునకు 28 మైళ్ల దూరంలో నైరుతి దిశలో ఉన్న పైఠణపురమునకు తొలినామం ప్రతిష్ఠానపురమని, బ్రహ్మపురి, ప్రతిష్ఠానమని, మంగిల పట్టణమని, ముంగి పైఠణమని వివిధ కాలములలో వివిధ పేర్లతో పిలువబడింది. ఈ ప్రాంతం శాలివాహన రాజులకు తొలిరాజధాని అయినందు వలన దీనిని 'శాలివాహనపురమని' కూడ వ్యవహరిస్తారు. అలాగే శాతవాహనులు కాలంలో 'ధాన్యకటకం' ఇప్పటి అమరావతి పరిసర ప్రాంతాలలో శిల్పకళలకు సాటిగా కుమ్మరి కులవృత్తికి అత్యంత ప్రాధాన్యత ఉన్నట్లు, ఆ ప్రాంతాలలో లభించిన నల్లని మెరిసే కుండ పెంకుల వలన తెలుస్తుంది.

విక్రమాదిత్యుడు, శాలివాహనుడి సాహస పరాక్రమాలను తెలుసుకొని అతనిపై యుద్ధాన్ని ప్రకటించాడు. అపుడు శాలివాహనుడు విక్రమాదిత్యుడ్ని ఎదుర్కొని ఓడించి నర్మదానది దాటే వరకు పారద్రోలాడు. ఇది ఖచ్చితంగా క్రీ.శ.78లో జరిగింది. ఆనాటి నుండే నర్మదానదికి ఉత్తరమున విక్రమార్క శకం, నర్మదా నది దక్షిణమున శాలివాహన శకం వాడుకలోకి వచ్చింది. **(ఆంధ్ర విజ్ఞానము-ఆరవ సంపుటము-ప్రసాద భూపాలుడు)** కనుక అనంతమైన కాలచక్రంలో తన పేర శకాన్ని స్థాపించిన గౌతమి పుత్ర శాతకర్ణి ఆంధ్ర క్షత్రియ కుమ్మరి చక్రవర్తే అనడంలో ఎటువంటి సందేహం లేదు. కనుకనే కుమ్మరి కులస్థులను శాలివాహనులని కూడా పిలుస్తారు.

- భీమనాథుని శ్రీనివాస్(సాయిసిద్ధార్థ)
8297594166

జైన మత వ్యాప్తిలో కళల పాత్ర

జైనమతంతో తొలిదశలో బౌద్ధమతం కంటే ఎక్కువగా వ్యాప్తి చెందింది. దీన్ని శాసనాలు, సాహిత్యాలు తెలుపుతాయి. సంస్కృతానికి బదులుగా ప్రాంతీయ భాషను మహావీరుడు, అతని అనుచరులు ఉపయోగించినందున, సామాన్య నీతి నియమాలు బోధించడం వలన, జైన మతాచార్యుల కార్య కలాపాల వలన, రాజులు జైనమతాన్ని ప్రోత్సహించడం వలన జైన మతం చాలా వ్యాప్తి చెందింది. మహావీరుడు మరణించే నాటికి జైనమతం ఒక నిర్దిష్టమైన సంఘంగా రూపుదిద్దుకుంది. జంతు బలుల స్థానంలో అహింస చోటు చేసుకుంది. జైన మత ప్రభావంతో జైనమతాన్ని స్వీకరించనివారు కూడా అహింసా సిద్ధాంతాన్ని పాటిస్తూ వచ్చారు. మహావీరుని అనుచరులు క్రమంగా ఈ మతాన్ని భారతదేశమంతటా వ్యాపింప జేశారు. జైన మతాన్ని అభివృద్ధి పరచటానికి కళలను కూడా అమితంగా ఉపయోగించుకున్నారు. కళలను ఉపయోగిస్తూ వారి సిద్ధాంతాలను ప్రజలకు చేరువ చేశారు. శిల్పకళ, చిత్రలేఖనం జైన మత సౌందర్యాన్ని చాటుతాయి. క్రీ.శ. తొలినాళ్లల్లో బౌద్ధం మాదిరిగానే జైనులు కూడా తమ మతాచార్యుల గౌరవానికి గుర్తుగా, విగ్రహాలను స్థూపాలను నిర్మించారు. మధురలో అలాంటివి అనేక పురావస్తు శాఖవారి తవ్వకాలలో బయటపడ్డాయి. జైనులు ఇరవై నాలుగు తీర్థంకరులను, తదితర దేవతలను పూజించారు. వారిలో ఋషభదేవ (ఆధినాథ) జిత్‌నాథ, సంభవనాథ, అభినందన్, సుమతి నాథ, పద్మప్రభు, సుపార్శ్వనాథ, చంద్రప్రభు, పుష్పదంత్, శీతల నాథ, శ్రేయంశ నాథ, వసుపూజ్య, విమలనాథ, అనంత నాథ, ధర్మ నాథ, శాంతినాథ, కుంతినాథ, అర నాథ, మల్లనాథ, మునిసువీరనాథ, నేమినాథ, అరిష్టనేమి, పార్శ్వనాథ, వర్థమాన మహావీర్ వంటి తీర్థంకరులు కనిపిస్తారు.



జైనులు విగ్రహారాధనను మౌర్య-శృంగకాలం నుంచి చేస్తున్నారని పండితులంటారు. మౌర్యుల కంటే ముందు నుండి జైనులలో విగ్రహారాధన ఉన్నదని పరిశోధకులు తెలుపుతారు. మగధరాజైన నందుడు కళింగ (ఒరిస్సా)పై దండయాత్ర సందర్భంలో జైన విగ్రహాన్ని పాటలీపుత్రానికి తీసుకువచ్చాడని, తర్వాత కాలంలో ఖారవేలుడు క్రీ.పూ. మొదటి శతాబ్దంలో మగధపై దండెత్తి ఆ విగ్రహాన్ని కళింగదేశానికి తెచ్చాడని 'హాథిగుంప' శాసనం స్పష్టంగా తెలుపుతున్నది. ఒరిస్సాలోని ఉదయగిరి, ఖండగిరి గుహలలో జైన శిల్పాలు కొన్ని ఉన్నాయి. పార్శ్వనాథుని జీవిత చరిత్ర ఉదయగిరి కొండవీటి 'రాణి నూరర్' గుహలో చెక్కబడ్డది. మధుర ప్రాంతంలో కూడా జైనులు విగ్రహారాధన చేశారనడానికి పురాతత్వ ఆధారాలున్నాయి. మొదటి జైన తీర్థంకరుడైన అదినాథుని విగ్రహం, సింహాసనం పైన కనిష్కుని కాలం నాటి శాసనంలో ఒకటి లభించింది. తొలి గుప్తుల కాలం నాటి సుందర జైన విగ్రహాలలో మహావీరుడు చెట్టుక్రింద యోగా సనంలో కూర్చున్న విగ్రహం ఒకటి మైసూరులో శ్రావణ బెళగోళ ప్రాంతంలో కొండ శిఖరాగ్రం పైన 21.5 మీటర్ల ఎత్తయిన బాహుబలిన్ లేదా గోమతేశ్వర నిలుచున్న విగ్రహాన్ని గంగరాజు రాచమల్లుని మంత్రియైనచాముండరాయుడు క్రీ.శ.984లో ప్రతిష్ఠించాడు. ఇది చాలా ప్రసిద్ధి పొందిన ఎత్తయిన విగ్రహం.

జైనులు 'విద్యాదేవియన్' అనే దేవతలను పూజిస్తారు. సరస్వతిని విద్యకు అధిపతిగా పూజిస్తారు. మధ్యకాలం నాటి జైన దేవాలయాలలో ముఖ్యంగా రాజస్థాన్‌లోని దిలావర్ (మౌంట్ అబు), మధ్యప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయాలలోని విద్యాదేవియన్ విగ్రహాలను మనం చూడవచ్చు. వీరేకాకుండా దిక్పాలకులను, నవగ్రహాలను, అరవై నాలుగు యోగినులను, క్షేత్రపాల, లక్ష్మి తదితర దేవతలను జైనులు పూజిస్తూండేవారు. జైన తీర్థయాత్ర స్థలంలో పార్శ్వనాథ కొండలు, పావపురి, రాజగిరి, పాలితానా, సోనాఘర్, కుందలాపూర్, బర్వని, ముక్తగిరి, రణక్‌పూర్, మౌంట్ అబు, శ్రావణ బెళగొళ మొదలైనవి ముఖ్యమైనవి. జైనమతం, బౌద్ధమతం కంటే పురాతనమైనది. ఇది భారత దేశంలో ఒక ప్రాబల్యం గల మతం కాకపోయినప్పటికి వ్యవస్థితమైన శాఖగా రూపొందింది. ఇదిసనాతన వైదిక మతానికి చాలా సన్నిహితంగా ఉండటం వల్ల, ఇతర మతాల పట్ల సహన భావంతో ఉండటం వల్ల ఈనాటికి జైనమతం మనదేశంలో అనేక ప్రాంతాలలో మనుగడ కొనసాగిస్తుంది. దీని వెనుక శిల్పం, చిత్రలేఖనం, సాహిత్యం వంటి కళలు, ప్రధాన భూమికను పోషించాయని చెప్పక తప్పదు.

- రమణ



మహేష్ బాబు



అదితీ రావ్ హైదరీ

ఘనంగా యాత్ర ప్రీ రిలీజ్ వేడుక

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన పాదయాత్ర నేపథ్యంతో తెరకెక్కిన చిత్రం యాత్ర. ఈ సినిమాను 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా నిర్మించారు. మహీ వి రాఘవ్ దర్శకత్వం వహించారు. ఈ నిర్మాణ సంస్థకు మూడో చిత్రమిది. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి పాతికేళ్ల తర్వాత తెలుగు తెరపైకి వస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్ నిర్వహించారు.

ఈ సందర్భంగా దర్శకుడు మహీ వి రాఘవ్ మాట్లాడుతూ...సినిమా అంటే సమష్టికృషి. కథ మాత్రమే నేను రాశాను. దానికి నటీనటులు, సాంకేతిక నిపుణులు కష్టం తోడయ్యింది. మమ్ముట్టి గారికి నేను రుణపడి ఉంటాను. ఇప్పుడు మీరు చూస్తున్న అభినయం ఆకట్టుకునేలా కనిపిస్తుంది అంటే అదంతా ఆయన వల్లే. ఎందరో ఎన్నో రకాలుగా వైఎస్ గారి గురించి కథలు చెప్పి ఉంటారు. దానిలో నేను విన్న వాటి నుంచి స్ఫూర్తి పొంది యాత్ర కథ సిద్ధం చేసుకున్నాను. నేను దర్శకుడు అవడానికి మా నిర్మాతలు కారణం. నేను ఏదైనా దూకాక ఆలోచిద్దాం అనుకునే తరహా. యాత్ర సన్నాహాలు పూర్తయ్యాక జగన్‌ను కలిస్తే నాన్న చేసినవే చెప్పండి చేయనివి వద్దు అన్నారు. ట్రైలర్ చూసి బాగుందన్నారు, సినిమా చూస్తారా అంటే మీ నాయకుడి సినిమా మీరు చేశారు. అని చెప్పారు. ఈ కార్యక్రమానికి కూడా ఆయన అభిమానులే అతిథులు అనుకున్నాం. అన్నారు.

నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ...యాత్ర సినిమా వైఎస్ అభిమానులకు మాత్రమే కాదు. ప్రతి కుటుంబం ఈ చిత్రాన్ని చూడాలి. వైఎస్ గారి ఆత్మ ఇందులో ఉంది. ఆయన ప్రజాసేవలో చూపించిన స్ఫూర్తి కనిపిస్తుంది. నా స్నేహితుడు సహ నిర్మాత శశి అమెరికాలో చిత్ర ప్రచారం చేసే పనిలో ఉన్నారు. ఈ సినిమా చేశామంటే కారణం సినిమాటోగ్రాఫర్ శ్యామ్ దత్. ఆయన వల్లే కథను మమ్ముట్టి గారికి వినిపించాం. చిత్రీకరణలో మమ్ముట్టి గారి సహకారం మర్చిపోలేము. ప్రతి సాంకేతిక నిపుణులు చిత్రం బాగా వచ్చేందుకు కష్టపడ్డారు. అన్నారు.

మమ్ముట్టి మాట్లాడుతూ...తెలుగు ప్రజలు వైఎస్ గారిని గుండెల్లో పెట్టుకున్నారు. అందులో ఒక్క శాతం నన్ను ఆదరిస్తే చాలు అనుకుంటాను. నేను తెలుగులో నేరుగా చేసిన మూడో చిత్రమిది. 21 ఏళ్ల తర్వాత తెలుగులో నటించాను. తెలుగు భాష నాకిష్టమైంది. ఎంతో కవితాత్మక భాష. నాకు తెలుగు అర్థమవుతుంది కానీ మాట్లాడలేను. ఈ చిత్రం కోసం తెలుగు నేర్చుకున్నాను. సంభాషణలు ముందే తెప్పించుకుని సాధన చేశాను. తప్పులుంటే సరిచేసుకున్నాను. నా మిత్రుడు శ్యామ్ దత్ వల్లే ఈ కథ విన్నాను. నటీనటులు, సాంకేతిక నిపుణుల శ్రమ వల్లే యాత్ర ఇంత గొప్పగా రూపొందింది. మా వంతు ప్రయత్నం పూర్తయింది. ఇక ప్రేక్షకుల వంతు మిగిలింది. అన్నారు.ఈ కార్యక్రమంలో సుధీర్ బాబు, దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య, నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆ బాధ తీరింది...!

ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. అందాల తార అదితీ రావ్ హైదరీ రచ్చ గెలిచి ఇంట గెలిచేందుకు ప్రయత్నిస్తోంది. తెలుగు అమ్మాయి అయిన అదితీ ముందు బాలీవుడ్, కోలీవుడ్‌లో పేరు తెచ్చుకుని...ఇటీవలే తెలుగు తెరపైకి వచ్చింది. తెలుగులో వరుస సినిమా అవకాశాలు అందుకుంటోంది. మొత్తంగా పుష్కర కాల నట ప్రయాణంలో బాలీవుడ్‌తో పాటు దక్షిణాదినీ చుట్టేసింది అందాల తార అదితీ రావ్ హైదరీ. తెలుగు, తమిళంలో వరుస సినిమాల్లో తీరిక లేకుండా ఉంది. ఇటీవలే అంతరిక్షంతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. తమిళంలో సైకో అనే చిత్రంతో పాటు ధనుష్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో నటిస్తోంది. మిగతా భాషల్లో వరుస చిత్రాలు చేస్తున్నా తెలుగు అమ్మాయిగా ఉండి ఎక్కువ తెలుగు సినిమాలు చేయలేకపోయానని బాధపడ్డానని చెప్పుకుంది అదితీ. అయితే ఇటీవల ఆ బాధ తీరిందని, సమ్మోహనం, అంతరిక్షం వంటి చిత్రాలు చేసి మన ప్రేక్షకులకు దగ్గరయ్యానని సంతోషం వ్యక్తం చేస్తోంది. అదితీ మాట్లాడుతూ...నేను తెలుగమ్మాయిని అయి ఉండి తెలుగు చిత్రాల్లో నటించలేక పోతున్నాననే బాధ గతంలో ఉండేది. గతంలోని విషయా లు ఇప్పుడు మాట్లాడుకోవడంలో అర్థం లేదు. సమ్మోహనం చిత్రంతో తెలుగులో నేరుగా నటించే అవకాశాలు వస్తున్నాయి. తొలి చిత్రంలోనే సొంతంగా డబ్బింగ్ చెప్పుకున్నాను. చిన్నప్పటి నుంచి ఇంట్లో కుటుంబ సభ్యులు తెలుగు మాట్లాడటం వింటూనే ఉన్నాను కానీ నేర్చుకునే అవకాశం రాలేదు. అని చెప్పింది.

అడల్ట్ హార్రర్ కామెడీతో

గతేడాది తమిళ తెరపైకి వచ్చిన ఇరుట్టు అరైవిల్ మురట్టు కుతు సినిమా తెలుగులోకి చీకటి గదిలో చితక్కొట్టుడు పేరుతో అనువాదమవుతోంది. ఈ చిత్రంలో అరుణ్ ఆదిత్, నిక్కీ తంబోలీ, భాగ్యశ్రీ మోతే, మిర్చీ హేమంత్ తదితరులు నటిస్తున్నారు. బ్లూ గోస్ట్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రానికి సంతోష్ పి జయకుమార్ దర్శకత్వం వహించారు. చీకటి గదిలో చితక్కొట్టుడు ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు సంతోష్ పి జయకుమార్ మాట్లాడుతూ...హార్రర్ కామెడీకి కొంత విభిన్నంగా అడల్ట్ హార్రర్ కామెడీ నేపథ్యంతో ఈ చిత్రాన్ని రూపొందించాం. సినిమా విడుదలయ్యాక తమిళనాట విమర్శలు వచ్చాయి. ఇది పద్దెనిమిది ఏళ్లు దాటిన ప్రేక్షకులకు మాత్రమే అని స్పష్టంగా చెబుతున్నాం. కుటుంబంతో కలిసి సినిమాకు రాకండి. కుటుంబంలోని వారు విడివిడిగా ఈ చిత్రాన్ని చూడొచ్చు. ఎక్కువగా జంటగా లేని యువతీ యువకులకు బాగా నచ్చుతుంది. అన్నారు. అరుణ్ అదిత్ మాట్లాడుతూ...నేను గతంలో ఎల్ 7 అనే హార్రర్ చిత్రంలో నటించాను. ఆ చిత్రం అపజయం పాలైంది. చీకటి గదిలో చితక్కొట్టుడు పెద్దలకు నచ్చే అంశాలున్న సినిమా. ఒంటరిగా చూస్తే ఎక్కువ ఆనందిస్తారు. అడల్ట్ హార్రర్ కామెడీలో కొత్త తరహా చిత్రమవుతుంది.అన్నారు. నాయిక నిక్కీ తంబోలీ మాట్లాడుతూ...ఇలాంటి కథతో సినిమా చేయాలంటే దర్శకుడికి ధైర్యం ఉండాలి. సంతోష్ పి జయకుమార్ అలాంటి ధైర్యం చేశారు. కొన్ని వర్గాల ప్రేక్షకలను ఆకట్టుకునే చిత్రమవుతుంది. అన్నారు.

ఈ చిత్రానికి సంగీతం - బాలమురళి బాలు, సినిమాటోగ్రఫీ - బల్లు, ఎడిటర్ - ప్రసన్న జీకే.



అరుణ్ ఆదిత్, నిక్కీ

అలాంటిదేమీ లేదు

ఎక్కడ మంచి పాత్రలు లభిస్తే అక్కడికి పరుగులు తీస్తుంటారు నటీనటులు. అది తమ మాతృభాషకు చెందిన సినీరంగమైనా...లేక ఇంకేదైనా భాషకు చెందిన సినీరంగమైనా పాత్ర బావుంటేనే అంగీకరిస్తుంటామని చాలామంది నటీనటులు పలు సందర్భాలలో చెప్పడం వింటున్నదే. అంతేకాదు మంచి పారితోషికం లభించినా ఇల్లు ఉండగానే దీపం చక్కబెట్టుకోవాలన్న చందాన జేబు సంతృప్తి కోసం కొన్ని పాత్రలను ఒప్పేసుకుంటుంటామని కూడా వారు అంటుంటారు. ఏదిఏమైనా తన మాతృభాషకు చెందిన కన్నడ సినీరంగానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ తనపై వస్తున్న వార్తల పట్ల రష్మిక మండన్న ప్రతిస్పందిస్తూ అలాంటిదేమీ లేదని స్పష్టంచేశారు. కన్నడంలో కిర్రాక్‌పార్టీ చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించిన ఆమె ఆ తర్వాత ఛలో చిత్రం నుంచి తెలుగులో బిజీ అయ్యారు. ఆ చిత్రంతో పాటు గీత గోవిందం చిత్రం ఆమెకెంతో పేరు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన డియర్ కామ్రేడ్‌లో నటిస్తున్న ఆమె మరోవైపు నితిన్ కథానాయకుడిగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందనున్న భీష్మ చిత్రంలో నటించనున్నారు. ఇంకోవైపు కన్నడంలో యజమాన, పొగరు చిత్రాల్లో కథానాయికగా మెరవనున్నారు. ఈ నేపథ్యంలో తన మాతృభాషకు చెందిన కన్నడ చిత్రాలను ఆమె అంగీకరించడం లేదంటూ వస్తున్న వార్తల పట్ల ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తన సొంత చిత్ర పరిశ్రమ తనపై కోపంగా ఎందుకు ఉంటుంది? అయినా ఆ విషయాన్ని తెలుసుకోవాలని నేను ఆత్రుతగా ఉన్నాను అంటూ ట్వీట్ చేశారు.



రష్మిక మండన్న

దండుపాళ్యం 4కు సెన్సార్ కష్టాలు

దండుపాళ్యం సిరీస్‌లో వస్తున్న కొత్త చిత్రం దండుపాళ్యం 4. ఈ చిత్రంలో బెనర్జీ, వెంకట్, సుమన్ రంగనాథన్, ముమైత్ ఖాన్, సంజీవ్ కుమార్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. కేటీ నాయక్ దండుపాళ్యం 4 చిత్రానికి దర్శకత్వం వహించారు. వెంకట్ నిర్మాత. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి సెన్సార్ కష్టాలు ఎదురవుతున్నాయి. ఈ చిత్రానికి సెన్సార్ ధృవీకరణ ఇచ్చేందుకు సభ్యులు



నిరాకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత వెంకట్ పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దండుపాళ్యం కథతో వస్తున్న నాలుగో చిత్రమిది. గత మూడు చిత్రాలకు సెన్సార్ ధృవీకరణ పత్రం అందించింది. కానీ ఈ సినిమాకు మాత్రం ధృవీకరణ ఇవ్వమని సభ్యులు చెబుతున్నారు. సినిమా చూసి ఏ సన్నివేశం బాగా లేదో చెప్పాలి, ఎక్కడ మ్యూట్ చేయాలో, ఏ సన్నివేశం తొలగించాలో సూచించాలి. అది మాకు ఇష్టమైతే చేస్తాం లేదంటే కథలో అదెంత ముఖ్యమో వివరిస్తాం. అంతే కానీ అసలు సినిమాకు ధృవీకరణే ఇవ్వమంటూ సెన్సార్ చెప్పడం సరికాదు. అవసరమైతే రివైజింగ్ కమిటీకి, ట్రిబ్యునల్‌కు కూడా వెళ్తాం. అన్నారు. పంపిణీదారులు ముత్యాల రాందాస్ మాట్లాడుతూ..దేశ సినీ చరిత్రలో అత్యంత అరుదుగా సినిమాకు సెన్సార్ ఇవ్వమని చెప్పారు. దండుపాళ్యం కంటే హింసాత్మక సినిమాలు ఎన్నో వస్తున్నాయి. సినిమాలో ఇబ్బందికరమైన సన్నివేశాలు తొలగించమని చెప్పే హక్కు సెన్సార్‌కు ఉంది కానీ మొత్తం సినిమానే ఆపేస్తామంటే ఒప్పుకోం. నిర్మాత వెంకట్ తరుపున మేమంతా ఉన్నాం.అన్నారు.

ఈ కార్యక్రమంలో బెనర్జీ, డీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్న సినిమాలను ఆదరించాలి

సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా 'యమ్ 6'. ఇప్పటికే నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తిచేసుకన్న ఈ చిత్రం ఫిబ్రవరి 8న ప్రేక్షకుల ముందుకువస్తోంది. ధ్రువ, అశ్విని హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి జైరామ్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ లక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ పతాకంపై విశ్వనాథ్ తన్నీరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''నటుడిని కావాలనే కోరికతో పరిశ్రమకు వచ్చాను. కొన్ని సీరియల్స్‌లో నటించా, నిర్మించాను. ఇప్పుడు నిర్మాతగా నూతన నటీనటులతో 'యమ్ 6' సినిమా తీయడం జరిగింది. ఇదొక హారర్, కామెడీ, థ్రిల్లర్ సినిమా. క్వాలిటీలో రాజీపడకుండా నిర్మించాం. దర్శకుడు జైరాం వర్మ చెప్పిన కథ నచ్చింది. ఆయనకే దర్శకత్వ బాధ్యతలు అప్పజెప్పడం జరిగింది. మా సినిమాకు కథే హీరో. అందరికీ నచ్చే కథాంశంతో తీశాం. ప్రేక్షకులు మెచ్చుతారనే నమ్మకం ఉంది. ఈ క్షణం అనే పాటను అరకు, మంగళూరులో చిత్రీకరించాం. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరిస్తేనే మా లాంటి కొత్త నిర్మాతలు మరిన్ని చిత్రాలు నిర్మించేందుకు వీలుంటుంది. త్వరలో స్వీయ దర్శకత్వంలో సినిమా ప్లాన్ చేస్తున్నాను'' అని అన్నారు. 'యమ్ 6' చిత్రానికి సంగీతం: విజయ్ బాలాజీ, ఛాయాగ్రహణం: మహ్మద్ రియాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సురేష్.



విశ్వనాథ్ తన్నీరు